www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆ ఐపీఎస్ 'బంగారం'

స్మగ్లింగ్‌లో పట్టుబడ్డ

బహుమతులతో వీడ్కోలు

పోలీసు శాఖలో చర్చ..

కూపీలాగుతున్న ఏసీబీ



అమరావతి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): 'ఎస్పీ సార్‌కు సెండాఫ్ ఉంది.. ఆఫీసర్లు క్రాస్ బెల్ట్ వేసుకుని రావాలి..' అంటూ సెట్లో చెప్పిన గొంతులే సెల్ ఫోన్లో మరో మాట చెప్పాయి. 'సార్‌కు బంగారమంటే ఇష్టం.. ఏదో ఒక గిఫ్టు తీసుకురండి' అనడంతో ఆ జిల్లాలోని పోలీసు అధికారులు కొందరు ఉలిక్కి పడ్డారు. ఎందుకంటే ఆయన తీసుకునే బహుమతుల్లో

మిగతా 3వ పేజీలో...

మంగళవారం | 13-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 299 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: చవితి మ. 2.43 తదుపరి పంచమి; నక్షత్రం: ఉత్తరాభాద్ర మ. 12.36 తదుపరి రేవతి వర్జ్యం: రా. 11.40-1.08; దుర్ముహూర్తం: ఉ. 9.04-9.50, రా. 10.20-11.09; అమృతఘడియలు: ఉ. 8.16-9.42; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.47; సూర్యాస్తమయం: 6.13 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఇంటి ఆడపడుచు అని కూడా చూడకుండా చెల్లి షర్మిలపై పార్టీ సోషల్ మీడియాను ఉసిగొల్పుతున్న జగన్ అండ్ కో మరో అడుగు ముందుకేయబోతోందా? ఇప్పటికే చెవులతో వినలేని, నోటితో అనలేని రీతిలో పేట్రేగుతున్న అనైతిక మూక మరింత అడ్డగోలుగా దాడికి దిగబోతోందా? ఈ ప్రశ్నలకు అవుననే సమాధానమే వస్తోంది. సూటిగా సుత్తి లేకుండా ప్రశ్నాస్త్రాలు సంధిస్తున్న షర్మిలకు జవాబు ఎలా చెప్పాలో తెలీక.. అనైతిక దాడిని తీవ్ర తరం చేయడంపై తాడేపల్లి ప్యాలెస్ వేదికగా వ్యూహం సిద్ధమైనట్లు తెలుస్తోంది.



చెల్లి కాదు..

చంద్రముఖి

షర్మిలపై ఆ స్థాయి వికృత దాడికి రెడీ!

- భారతి డైరెక్షన్.. సజ్జల, భార్గవ స్క్రీన్‌ప్లే?
- తాడేపల్లి వేదికగా మూకలకు శిక్షణ
- దాడి ఎక్కడ, ఎలా ఉండాలో తర్ఫీదు
- తెలంగాణలో కాంగ్రెస్‌పై షర్మిల చేసిన విమర్శలే అస్త్రాలుగా దాడికి సన్నద్ధం
- మరి నాడు జగన్‌పై బొత్స, రోజా, రజని విమర్శలు చేయలేదా?
- జగన్ వచ్చింది కాంగ్రెస్ నుంచి కాదా?
- చెల్లెలి ప్రశ్నలకు జవాబివ్వలేక మూకను ఉసిగొల్పడంపై సర్వత్రా విమర్శలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'టార్గెట్ షర్మిల'.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ఆయన మంత్రులు, వైసీపీ సోషల్ మీడియా మూక పెద్ద ఎత్తున అమలు చేస్తున్న తాజా కార్యక్రమమిది. కాసేపు ఆమె జగన్‌కు చెల్లెలన్న విషయం పక్కన పెట్టినా.. కనీసం మహిళ అన్న గౌరవం కూడా లేకుండా చెలరేగిపోతున్నారు. నిత్యం ఆమెను ఎలా విమర్శించాలో ఏకంగా తాడేపల్లి ప్యాలెస్‌లోనే శిక్షణ ఇస్తున్నారంటే.. ఎంతగా కక్ష పెంచుకున్నారో అర్థమవుతోంది. ఇప్పుడిక ఆమెను 'చంద్రముఖి'గా అభివర్ణిస్తూ మరింత ఘోరమైన రీతిలో విరుచుకుపడేందుకు ఆ మూక సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ప్రత్యేక హోదా, రైల్వే జోన్, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, విభజన హామీలు, సీపీఎస్ రద్దు, మద్య నిషేధం, భూముల కబ్జాలు, కరెంటు చార్జీల బాదుడు తదితరాలపై పీసీసీ అధ్యక్షురాలి హోదాలో షర్మిల చేస్తున్న విమర్శలు సూటిగా.. ఘాటుగా తగులుతుండడంతో జగన్ జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ అంశాలపై టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ చాలా రోజులుగా ప్రస్తావిస్తున్నా ఆయన ఎన్నడూ

మిగతా 12వ పేజీలో...

ఏంటి మీరు చేసింది?

- జగన్ పాలనలో ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా?
- ఐదేళ్లలో ఒక్కసారీ జాబ్ కేలెండర్ ఇవ్వలేదేం?
- ధర్మవరంలో తిరగబడిన విద్యార్థిలోకం
- వరుస ప్రశ్నలతో ఎమ్మెల్యే కేతిరెడ్డి ఉక్కిరిబిక్కిరి
- ఎమ్మెల్యే సమక్షంలోనే ప్రభుత్వంపై విమర్శలు
- దాంతో దిక్కుతోచక విద్యార్థినులను బయటకు పంపేసిన ఎమ్మెల్యే అనుచరులు
- సీఎం జగన్, ఎమ్మెల్యే ఫ్లకార్డులు చింపివేత



ప్లకార్డును విసిరేస్తున్న విద్యార్థినులు

ధర్మవరం, ఫిబ్రవరి 12: విద్యార్థిలోకం తిరగబడింది. వైసీపీ పాలనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆ పార్టీ ఇచ్చిన హామీలపై గట్టిగా నిలదీసింది. విద్యార్థినులు వరుస ప్రశ్నలు సంధించడంతో వైసీపీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఉక్కిరిబిక్కిరయ్యారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలోని మారుతీ రాఘవేంద్రస్వామి కల్యాణ మండపంలో

మిగతా 12వ పేజీలో...

నరసన్నపేట సభకు హాజరైన జనం.. ప్రసంగిస్తున్న లోకేశ్



2 నెలల్లో మేమొస్తాం..

తిన్నదంతా కక్కిస్తాం

ఉత్తరాంధ్రను పందికొక్కుల్లా మెక్కుతున్నారు!

- వైవీ, విజయసాయిరెడ్డిపై లోకేశ్ ఫైర్
- ఈ ప్రాంతంలో విప్లవం మొదలైంది
- జగన్ పని అయిపోయింది..
- ఇక తాడేపల్లి కొంప గేట్లు బద్దలే
- సీఎం కొత్త పథకం.. ఎమ్మెల్యేల బదిలీ
- రూ.5,400 కోట్లు ఇసుకలోనే దోపిడీ
- మద్యంపై అదనంగా జే-ట్యాక్స్
- ఐదేళ్లలో 45 వేల కోట్లు అక్రమార్జన
- వంద సంక్షేమ పథకాలు రద్దు
- రెండోరోజు 'శంఖారావం'లో లోకేశ్

జగన్ ప్రభుత్వం టీడీపీని వేధించేందుకు అన్ని శక్తులనూ వాడుకుంది. నాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం సహా 22 కేసులు పెట్టారు.

చేయని తప్పునకు చంద్రబాబును జైలుకు పంపారు. ఆయన్ను అరెస్టు చేసినప్పుడు రూ.3 వేల కోట్ల స్కిల్ కుంభకోణమని అన్నారు. తర్వాత రూ. 300 కోట్లన్నారు. ఇప్పుడు రూ.27 కోట్లు అంటున్నారు. ఆ చార్జిషీటు చూసి కోర్టు వారు ఛీ పో.. ఇది చార్జిషీటా అన్నారు. - లోకేశ్

శ్రీకాకుళం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రను వైసీపీ నేతలు వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి పందికొక్కుల్లా మెక్కేస్తున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ మండి పడ్డారు. రెండు మాసాల్లో టీడీపీ-జనసేన ప్రభుత్వం వస్తోందని.. వారు తిన్నదంతా కక్కిస్తామని హెచ్చరించారు. 'శంఖారావం' కార్యక్రమంలో భాగంగా సోమవారం రెండో రోజు శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట, శ్రీకాకుళం, ఆమదాలవలస నియోజకవర్గాల్లో జరిగిన భారీ సభల్లో ఆయన ప్రసంగించారు. 'ఉత్తరాంధ్ర ఊపే వేరు. ఉత్తరాంధ్ర అంటేనే విప్లవం. ఇప్పుడు ఆ విప్లవం

మిగతా 11వ పేజీలో...



కిలాడీ క్రీడ!

ఎన్నికల కోసమే 'ఆడుదాం ఆంధ్రా'

- గ్రామం నుంచి రాష్ట్రస్థాయి వరకు వైసీపీ కేడర్‌ను దించిన ప్రభుత్వం
- ఓడినోళ్లు గెలిచినట్లు.. గెలిచినోళ్లు ఓడినట్లు మార్పులు
- అటకెక్కిన స్టేడియాల నిర్మాణం, క్రీడాకారుల ప్రోత్సాహకాలు
- కోచ్‌ల నియామకాలూ పట్టని జగన్ ప్రభుత్వం 2
- 'ఆడుదాం'కు మాత్రం కోట్లలో ఖర్చు.. నేడు విశాఖలో ముగింపు

హార్సిలీహిల్స్ 'యాత్ర'కు బ్రేక్!

- యాత్ర-2 డైరెక్టర్‌కు హడావిడిగా 2 ఎకరాలు
- 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో కలకలం
- పెద్దల ఆదేశాలతో శరవేగంగా కదిలిన ఫైలు
- ఇప్పటికే స్థల పరిశీలన.. మిగిలింది సబ్ డివిజనే
- ఇంతలోనే బయట పెట్టిన 'ఆంధ్రజ్యోతి'
- కేటాయించవద్దంటూ విపక్షాల ఆందోళన
- దీంతో సబ్ డివిజన్ ప్రక్రియకు బ్రేకులు!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(రాయచోటి-ఆంధ్రజ్యోతి)

హార్సిలీహిల్స్ చేరిన దర్శకుడు వారణాసి మహేంద్రరెడ్డి 'యాత్ర'కు బ్రేక్ పడింది. జగన్‌ను గొప్ప వ్యక్తిత్వం ఉన్న నాయకుడిగా కీర్తిస్తూ యాత్ర-2 సినిమా తీసిన డైరెక్టర్ మహేంద్రరెడ్డికి హార్సిలీహిల్స్‌లో రెండు ఎకరాల స్థలం సంతర్పణకు ప్రయత్నించడంపై 'ఆంధ్రజ్యోతి' రాసిన కథనం కలకలం రేగింది. దీనికితోడు ఇది ఎన్నికల

మిగతా 11వ పేజీలో...



ఉద్యోగుల సంఘాల నేతలతో సమావేశమైన మంత్రుల బృందం

బకాయిలు 20 వేల కోట్లు!

ఉద్యోగులకు జగన్ సర్కారు బాకీ.. ఈ నెల, వచ్చేనెల్లో 5,500 కోట్లు చెల్లింపు

- ఇతర సమస్యల పరిష్కారం గాలికే
- ఐఆర్‌పై సీఎంతో చర్చించి నిర్ణయం
- ఉద్యోగ సంఘాలకు తేల్చి చెప్పిన మంత్రి వర్గ ఉపసంఘం సభ్యులు
- ఈ తీరుపై ఉద్యోగులు పెదవి విరుపు
- అసంపూర్తిగా ముగిసిన భేటీ
- ఉద్యమానికే ఏపీ జేఏసీ మొగ్గు
- ప్రభుత్వ తీరు దారుణం
- ఏపీజేఏసీ అమరావతి, ఇతర సంఘాల అసంతృప్తి
- విడతల్లో చెల్లిస్తాం: బొత్స

మిగిలిన సొమ్ముపై స్పష్టత కరువు

రానున్న ఎన్నికల నేపథ్యంలో మరోసారి అధికారం చేజిక్కించుకోవడానికి ఉద్యోగులపై జగన్ సర్కార్ వల విసిరింది. సమస్యల పరిష్కారానికి ఉద్యమ బాటపడుతున్న ఉద్యోగులను చర్చలకు పిలిచి 'వాయిదాల సినిమా' చూపించింది. సమస్య ఏదైనా సమాధానం ఒకటే.. ఫలానా నెలలో పరిష్కరిస్తానని చెప్పుకొచ్చింది. మాటలతో కాలయాపన చేస్తున్న ప్రభుత్వ పెద్దల ఎత్తుగడలను పసిగట్టిన ఉద్యోగులు ఉద్యమ కార్యాచరణ కొనసాగిస్తామని తేల్చి చెప్పారు.

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం ఉద్యోగులకు మరోసారి 'వాయిదాల సినిమా' చూపించింది. పెండింగ్ బకాయిలు, ఇతర సమస్యల పరిష్కారాన్ని మరోసారి వాయిదా వేసింది. సోమవారం అమరావతి సచివాలయంలో మంత్రి వర్గ ఉపసంఘం ఉద్యోగ సంఘాల

మిగతా 11వ పేజీలో...

ఉద్యోగులమా? బానిసలమా?

- ఈహెచ్ఎస్‌ను బాగుచేయరా
- ఇప్పటికీ 18 ఏళ్లనాటి సీలింగ్
- ఐదేళ్లనాటి ధరలే వర్తింపు 11
- పెరిగిపోతున్న వైద్య ఖర్చులు
- సొంత సొమ్ము చెల్లించేందుకు డీఏ, పీఆర్సీ బకాయిలు ఇవ్వరు
- డిశ్చార్జి అయ్యాక ఆ అరకొర బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాలి
- ఉద్యోగుల మండిపాటు

శెట్టిబలిజలపై చిన్నచూపు!

- ప్రాంతాలకతీతంగా 21 బీసీ కులాలకు రిజర్వేషన్ వర్తింపు
- 'గ్రేటర్ రాయలసీమ'లో శెట్టిబలిజలకు వర్తించదంటూ మెలిక
- ఆ ప్రాంతం ఎక్కడుందో అధికారులకే తెలియాలని విమర్శలు
- టీడీపీకి మద్దతు పలుకుతున్నందుకే వివక్ష అంటూ ఆగ్రహం
- బీసీ మంత్రి చెల్లుబోయిన వేణుది అదే సామాజిక వర్గం 3
- ఆయన శాఖ నుంచే తాజా ఉత్తర్వుల జారీపై మండిపాటు

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల

- 6100 పోస్టుల్లో ఎస్జీటీ 2,280, స్కూల్ అసిస్టెంట్ 2,299 3
- 4 జిల్లాల్లో 300 దాటని ఖాళీలు.. ఎస్జీటీకి బీఈడీ వారూ అర్హులే
- సంస్కరణలపై శిక్షణ కోసమే అప్రెంటిస్.. విద్యా మంత్రి ఉద్ఘాటన

ఎన్నికల కొల్లేరు

ఖర్చుల కోసం వందలాది ఎకరాల్లో అక్రమ తవ్వకాలు!

- కొడుకు ఎన్నికలకు 'ఎర్రి...' మంత్రి తాపత్రయం
- నాడు వైఎస్ హయాంలో అక్రమ చెరువుల బ్లాస్టింగ్
- ఆయన కుమారుడి పాలనలో ఇప్పుడక్కడే తవ్వకాలు
- ఎకరాకు రైతుల నుంచి రూ.50 వేల చొప్పున వసూలు
- మూడు మండలాల్లో వారం రోజులుగా ఎక్స్‌కవేటర్ల మోత
- 'ఎర్రి...' మంత్రికి ఇతర వైసీపీ ఎమ్మెల్యేలూ సాయం
- మద్దతు ఇస్తున్న ఓ ఫారెస్ట్ రేంజర్ అధికారి

ఏలూరు రూరల్ మండలం పైడిచింతలపాడులో చెరువుల తవ్వకాలు



(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

చేతి ఖర్చులు మొదలు పార్టీ, ఎన్నికల వ్యయాల దాకా, ఏ అవసరం వచ్చినా అధికార పార్టీ నాయకులకు గుర్తొచ్చేది కొల్లేరే. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో 'ఎర్రి....' మంత్రితోపాటు ముగ్గురు ప్రజాప్రతినిధులు కలసి కొల్లేరులో భారీ తవ్వకాలకు ఒడిగట్టారు. వందలాది ఎక్స్‌కవేటర్లతో విస్తృతంగా తవ్వకాలు జరిపిస్తూ, ఒక్కో రైతు నుంచి ఎకరాకు రూ. 50 వేలు చొప్పున వసూలు చేస్తున్నారు. స్థానికంగా ఓ ఫారెస్ట్ రేంజర్ సహకరిస్తుండడంతో, అధికారులను కూడా వాళ్లు మేనేజ్ చేస్తున్నారు. ఎవరెవరికి ఎంతెంత పంపాలో ఈపాటికే అదంతా చేరిపోయిందని చెబుతున్నారు. మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో బాంబులతో పేల్చేసిన అక్రమ చెరువులు ఉన్న తావుల్లోనే తిరిగి నిరాటంకంగా సాగుతున్న ఈ తవ్వకాలు కొల్లేరును గుల్ల చేస్తున్నాయి. ఏలూరు జిల్లాలోని కొల్లేరు సరస్సులో తవ్వకాలపై ఎన్ని ఆంక్షలు ఉన్నా

మిగతా 12వ పేజీలో...

ఢిల్లీ అష్ట దిగ్బంధం

- దేశ రాజధానిలో నెల రోజులపాటు 144 సెక్షన్ అమలు
- నేడు రైతుల 'చలో ఢిల్లీ' ఆందోళన నేపథ్యంలో పోలీసుల ఆంక్షలు
- భారీఎత్తున భద్రత ఏర్పాట్లు.. ఎక్కడికక్కడ బారికేడ్లు
- జాతీయ రహదారులను మూసివేసిన ఢిల్లీ పోలీసు రాష్ట్రాలు
- నగరంలోకి ట్రాక్టర్లు, ట్రక్కులు, ట్రాలీల రాకపై నిషేధం 2
- 20 వేల మంది రైతులు ఆందోళనలో పాల్గొనే అవకాశం

ఖతార్‌లో 8 మంది భారతీయుల విడుదల

- అందరూ భారత నౌకాదళ మాజీ అధికారులే
- గూఢచర్యం ఆరోపణలపై 18 నెలల క్రితం అరెస్టు
- ప్రాథమిక విచారణ అనంతరం మరణశిక్ష ఖరారు
- అనంతర పరిణామాలతో జైలు శిక్షగా మార్పు 2
- ఇప్పుడు పూర్తిగా విడుదల చేసిన ఖతార్ సర్కార్
- ఇప్పటికే స్వదేశానికి తిరిగివచ్చిన ఏడుగురు



ఈ-చాపర్ల తయారీకి మారుతీ సుజుకీ రెడీ

- డ్రోన్లకన్నా పెద్దవి.. హెలికాప్టర్ల కన్నా చిన్నవి
- 'మేకిన్ ఇండియా'లో భాగంగా ఇక్కడ తయారీపై డీజీసీఏతో సుజుకీ చర్చలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: ఒక్కసారి ఊహించుకోండి. మీరు ఆన్‌లైన్‌లో బుక్ చేయగానే.. తేలికపాటి ఎలక్ట్రిక్ ఎయిర్‌కాప్టర్ ఒకటి వచ్చి మీ ఇంటిపైన దిగుతుంది. ఎంచక్కా మీరు మెట్లెక్కి మీ మేడ మీదకు వెళ్లి అందులో ఎక్కగానే నిట్టనిలువుగా పైకి లేచి గాల్లోకి రయ్యిన దూసుకుపోతుంది. జాయ్‌గా గాల్లోనే ప్రయాణించి మీ ఆఫీసు రూఫ్‌టాప్ మీద దిగుతుంది. ఊహించుకోవడానికి ఇదేదో హాలీవుడ్ డిస్టోపియన్ సినిమాలో సీన్‌లా అనిపించొచ్చుగానీ.. ఏమో, త్వరలోనే మీ ఇంటి పైనుంచే ఈ ఎలక్ట్రిక్ ఎయిర్‌కాప్టర్ ఎగరావచ్చు! ఎందుకంటే.. దేశంలోనే అతి పెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకీ.. 'స్కై డ్రైవ్' పేరుతో ఈ తరహా ఎలక్ట్రిక్ ఎయిర్ కాప్టర్ల తయారీకి సిద్ధమైంది. ఇవి సంప్రదాయ హెలికాప్టర్లంత బరువు ఉండవు. వాటిలో సగం బరువు మాత్రమే ఉంటాయి. వాటిలాగా వీటికి ఇంధనం అక్కర్లేదు. అచ్చం డ్రోన్లలాగా బ్యాటరీ పవర్‌తో రయ్యిన దూసుకుపోతాయి. వీటిలో ముగ్గురు ప్రయాణించడానికి అవకాశం ఉంటుంది. ఇప్పుడు మనందరికీ తెలిసిన ఉబెర్, ఓలా తరహాలో.. భవిష్యత్తులో పట్టణ ప్రాంతాల్లో రవాణాకు కీలకంగా ఉపయోగపడతాయి. 2025లో జపాన్‌లో జరిగే ఒసాకా ఎక్స్‌పోలో వీటిని ప్రదర్శనకు పెట్టే అవకాశం ఉన్నట్టు సమాచారం. అయితే.. భారత్‌లోకి రావడానికి ముందు మారుతి సుజుకీ ఈ వాహనాలను అమెరికా, జపాన్ మార్కెట్లలోకి అందుబాటులోకి తేనుంది. ప్రస్తుతానికి వీటి రేంజ్ 15 కిలోమీటర్లు. అంటే ఒకసారి గాల్లోకి లేస్తే 15 కిలోమీటర్ల వరకూ వెళ్లగలవు. 2031 నాటికి 40 కిలోమీటర్లకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు సుజుకీ తెలిపింది. అలాగే.. 'మేకిన్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా వీటిని భారత్‌లోనే తయారుచేయడానికి డీజీసీఏ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్)తో సంప్రదింపులు జరుపుతున్నట్టు ఒగురా వెల్లడించింది.

లోకం తీరు



ఆడేద్దాం.. కార్యకర్తలతో..!

ఎన్నికల కోసమే 'ఆడుదాం ఆంధ్రా'

- నేడు విశాఖలో ముగింపు వేడుకలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

నాలుగున్నరేళ్ల పాటు క్రీడలను గాలికి వదిలేసిన జగన్ ప్రభుత్వం, ఇప్పుడు 'ఆడుదాం ఆంధ్రా' అంటూ హడావిడి చేస్తోంది. నిర్వహించే క్రీడలైనా క్రీడాకారులతో ఉంటున్నాయా అంటే.. అదీ లేదు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ... వైసీపీ అభిమానులు, కార్యకర్తలతోనే మొత్తం కార్యక్రమాన్ని నింపేశారు. క్రీడలు జరిగే ప్రదేశాల్లో ఎక్కడ చూసినా జగన్ బొమ్మలు, కొన్నిచోట్ల వైసీపీ రంగులు కనిపిస్తున్నాయి. పైగా ఆటల్లో ఓడిపోయిన వారిని గెలిపిస్తున్నారు... గెలిచిన వారిని ఓడిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. క్రీడాకారులకు కనీస సౌకర్యాలు లేవు. సరైన భోజన, వసతి కల్పనలో క్రీడాశాఖ విఫలమైంది. ఇదంతా చూసినవారు, కేవలం ఎన్నికల ప్రచారం కోసమే 'ఆడిస్తున్నారు' అని పెదవి విరుస్తున్నారు. నేడు విశాఖపట్నంలో ఆడుదాం ఆంధ్ర రాష్ట్ర స్థాయి ముగింపు వేడుకలు నిర్వహించనున్న నేపథ్యంలో ఈ లోటుపాట్లన్నీ చర్చనీయాంశంగా మారాయి. వాస్తవానికి, జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్రీడా బడ్జెట్‌ను తగ్గించేసింది. గత ఐదేళ్లలో కనీసం రూ.500 కోట్లు కూడా ఇచ్చిన దాఖలాలు లేవు. కానీ ఇప్పుడు క్రీడల కోసం తామేదో కష్టపడిపోతున్నట్లు కలరింగ్ ఇస్తోంది. రాష్ట్ర విభజన అనంతరం చాలావరకూ స్పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హైదరాబాద్‌కే పరిమితమైంది. నవ్యాంధ్రలో క్రీడా మైదానాల అభివృద్ధి, కోచ్‌ల నియామకాలు, క్రీడారంగ సౌకర్యాల కల్పనను గాలికి వదిలేశారు. కానీ 'ఆడుదాం ఆంధ్రా' పేరిట రూ.45కోట్ల నుంచి 50కోట్ల వరకూ ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఒక వైపు కేంద్రం ఇస్తున్న నిధులకు మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వడం లేదు. కానీ, ఈ కార్యక్రమానికి రూ.కోట్లు గుమ్మరిస్తున్నారు. ఈ నిధులను కొన్ని స్టేడియాలకు కేటాయించి ఉంటే క్రీడాకారులకు ఉపయోగపడేవి. క్రీడా సంఘాలకు ఇవ్వాల్సిన గ్రాంట్లు, ఒలింపిక్ అసోసియేషన్‌కు ఇవ్వాల్సిన బకాయిలు, గత ఏడాది గుజరాత్ జాతీయ క్రీడల్లో సత్తాచాటిన ప్లేయర్లకు ఇవ్వాల్సిన నగదు ప్రోత్సాహకాల వైపు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(శాప్) కన్నెత్తి కూడా చూడటం లేదు. అన్ని నియోజకవర్గాలకు కనీసం కోచ్‌లు ఉన్నారో లేదో సీఎం జగన్, క్రీడా మంత్రి రోజా, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డికి తెలుసా అని క్రీడాకారులు ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గానికి కనీసం ఐదు క్రీడాంశాల్లో కోచ్‌లను తీసుకోవాలని కోరుతున్నారు. శాప్‌లో కోచ్‌ల కొరత తీవ్రంగా ఉంది. అధికారంలోకి రాగానే కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని చెప్పిన జగన్ ఇప్పుడు యూటర్న్ తీసుకున్నారు. శాప్‌లోని కాంట్రాక్టు కోచ్‌లను రెగ్యులరైజ్ చేసే ప్రయత్నమే చేయడం లేదు. రాష్ట్రంలో క్రీడా రంగం అనేక సమస్యల మధ్య కొట్టుమిట్టాడుతున్నా పట్టించుకోవడం లేదు. ప్రైజ్ మనీ కూడా రూ.లక్షల్లో పెట్టి, వైసీపీ కార్యకర్తలకు, సిఫారసులు ఉన్న వారికి ఇచ్చుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. యువత ఓట్ల కోసమే 'ఆడుదాం ఆంధ్రా' అంటూ ప్రభుత్వం సరికొత్త ఆట ఆడుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, నేడు విశాఖలో ఆడుదాం ఆంధ్ర రాష్ట్రస్థాయి ముగింపు వేడుకలు నిర్వహించనున్నారు. ఇందులో సీఎం జగన్ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు. ఈ కార్యక్రమానికి భారీఎత్తున వైసీపీ శ్రేణులను తరలించనున్నారు.

మీ ఆయన ఇక రాడు.. అన్నీ నేనే చూసుకుంటా!

- నిందితుడి భార్యపై కానిస్టేబుల్ లైంగిక వేధింపులు

దాచేపల్లి, ఫిబ్రవరి 12: పల్నాడు జిల్లా దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఓ మహిళ ఆరోపించింది. పోలీసులకు, విలేకర్లకు సోమవారం తన గోడును వినిపించింది. తన భర్త దొంగతనం కేసులో పోలీస్‌స్టేషన్‌లో ఉన్నాడని.. ఓ కానిస్టేబుల్ తనింటికి వచ్చి 'మీ భర్తపై పలు కేసులు ఉన్నాయి. ఏడాది వరకు ఇంటికి రాడు. ఇక అతనితో నీకు పనిలేదు. అన్నీ నేనే చూసుకుంటా. నాకు సహకరించు' అంటూ వేధించాడని తెలిపింది. 3నెలల గర్భిణిగా ఉన్న తనకు అతని లైగింక వేధింపులతో అబార్షన్ అయ్యిందని తెలిపింది. తనకు, తన కుటుంబానికి రక్షణ కల్పించాలని వేడుకుంది. ఉన్నతాధికారులకు తెలియజేసి, చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారి చెప్పారు.

నేవీ మాజీ అధికారుల విడుదల

గూఢచర్యం ఆరోపణలతో 18 నెలల క్రితం ఖతార్‌లో 8 మంది భారతీయ అధికారుల అరెస్టు

- తొలుత మరణశిక్ష విధింపు
- తర్వాత జైలు శిక్షగా మార్పు
- ఇప్పుడు అందరి విడుదల



సోమవారం ఢిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వస్తున్న నేవీ మాజీ అధికారులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: ఖతార్‌లో జైలుశిక్ష అనుభవిస్తున్న ఎనిమిది మంది భారత నౌకాదళ మాజీ సిబ్బందిని అక్కడి ప్రభుత్వం విడుదల చేసింది. వీరిలో ఏడుగురు సోమవారం తెల్లవారుజామున స్వదేశానికి తిరిగి వచ్చారు. గూఢచర్యానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై 2022 అక్టోబరులో వీరిని ఖతార్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణ అనంతరం కోర్టు గతేడాది అక్టోబరు 26న వీరికి మరణదండన విధించింది. ఆ తర్వాత భారత ప్రభుత్వం చేసిన దౌత్య యత్నాలు ఫలించడంతో ఈ కేసులో మరోసారి విచారణ జరిపిన న్యాయస్థానం... గత డిసెంబరు 28న మరణ దండనను జైలుశిక్షగా మార్చింది. ఇప్పుడు దాన్ని కూడా సడలిస్తూ వీరిని విడుదల చేసింది. విడుదలైన వారిలో రిటైర్డ్ కెప్టెన్లు నవతేజ్ గిల్, సౌరబ్ వశిష్, రిటైర్డ్ కమాండర్లు పూర్ణేందు తివారీ, అమిత్ నాగ్‌పాల్, ఎస్‌కే గుప్తా, బీకే వర్మ, సుగుణాకర్ పాకాల(విశాఖపట్నం), రిటైర్డ్ సెయిలర్ రాగేశ్ ఉన్నారు. కమాండర్ తివారీ దోహాలోనే ఉండిపోయారు.

అతిపెద్ద దౌత్య విజయం

నేవీ మాజీ అధికారుల విడుదల భారత్‌కు దక్కిన అతిపెద్ద దౌత్య విజయంగా బీజేపీ అభివర్ణించింది. విడుదలైన అధికారుల కుటుంబాలకు కాంగ్రెస్ శుభాకాంక్షలు తెలిపింది. ఇందుకోసం కృషి చేసిన వారందరినీ ఆ పార్టీ అభినందించింది. ఖతార్‌తో చర్చల్లో జాతీయ భద్రతా సలహాదారు దోభాల్ కీలక పాత్ర పోషించారు.

చివరిదాకా గోప్యమే

ఖతార్ జైలులో ఉన్న నేవీ మాజీ అధికారులకు చివరి క్షణం వరకూ తాము విడుదల అవుతున్న విషయం తెలియదు. సామగ్రి ప్యాక్ చేసుకొని ఉదయం 9గంటల కల్లా సిద్ధంగా ఉండాలని ముందురోజు రాత్రి జైలర్లు వారికి సమాచారం ఇచ్చారు. దీంతో తమను ఎక్కడకు తరలిస్తున్నారోనని వారిలో టెన్షన్ మొదలైంది. మర్నాడు ఉదయం వారిని తొలుత రాయబార కార్యాలయానికి తీసుకెళ్లారు. అనంతరం విమానాశ్రయానికి తరలించారు. వారు ఎక్కిన ఇండిగో విమానం సోమవారం తెల్లవారుజామున 2గంటలకు ఢిల్లీలో దిగడంతో అందరూ ఒక్కసారిగా సంతోషంతో ఉక్కిరిబిక్కిరయ్యారు. 'భారత్ మాతా కీ జై' అంటూ ఢిల్లీ ఎయిర్‌పోర్టులో పెద్దపెట్టున నినాదాలు చేశారు. "మేమంతా భారత్‌కు తిరిగి రావడం చాలా సంతోషంగా ఉంది. మాతో పాటు మా కుటుంబ సభ్యులు కూడా ఈ క్షణం కోసం ఎంతోకాలంగా ఎదురు చూస్తున్నారు. ప్రధాని మోదీ వ్యక్తిగతంగా జోక్యం చేసుకోకపోతే ఇదంతా సాధ్యమయ్యేది కాదు. ఆయనకు మా కృతజ్ఞతలు' కాగా, గూఢచర్యం ఆరోపణలపై ఖతార్ కోర్టు పూర్ణేందు తివారీకి 25ఏళ్లు, మరో నలుగురికి 15 ఏళ్ల చొప్పున, ఇద్దరికి పదేళ్ల చొప్పున., రాగేశ్‌కు మూడేళ్ల జైలుశిక్ష విధించింది.

ప్రధాని మోదీ పర్యవేక్షణలోనే...: కేంద్రం

ఖతార్ జైలులో ఉన్న ఎనిమిది మంది నేవీ మాజీ అధికారులను విడిపించేందుకు భారత ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను ప్రధాని మోదీ స్వయంగా పర్యవేక్షించారని విదేశాంగ శాఖ తెలిపింది. వారి విడుదల ఆయన నాయకత్వ ప్రతిభకు, భారత్-ఖతార్ మధ్య బలమైన సంబంధాలకు నిదర్శనమని విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ క్వాత్రా పేర్కొన్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో యూఏఈ పర్యటన అనంతరం ప్రధాని మోదీ ఈ నెల 14న దోహాలో పర్యటించనున్నారని వెల్లడించారు. కాగా, ఖతార్ జైలు నుంచి విడుదలైన నేవీ మాజీ అధికారుల్లో ఒకరైన సుగుణాకర్ పాకాల విశాఖపట్నం వాసి.

పాకిస్థానీలు భారత్‌కు అతిపెద్ద సంపద



లాహోర్, ఫిబ్రవరి 12: వివాదాలకు కేంద్రం వంటి కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి మణిశంకర్ అయ్యర్ మరోసారి తీవ్ర వివాదానికి శ్రీకారం చుట్టారు. ఆదివారం పాకిస్థాన్‌లోని లాహోర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. పాక్‌ను ప్రశంసలతో ముంచెత్తారు. పాకిస్థానీలు భారత్‌కు అతి పెద్ద సంపద అని అభివర్ణించారు. కరాచీలో దౌత్యవేత్తగా పనిచేసిన కాలంలో తనను, తన భార్యను ఇక్కడి వారు ఎంతో ఆప్యాయంగా చూసుకున్నారని తెలిపారు. "మీరు(పాకిస్థానీలు) ఒక విషయం గుర్తుంచుకోవాలి. భారత్‌లో మోదీకి ఎప్పుడూ మూడింట ఒక వంతు కంటే ఎక్కువ ఓట్లు రాలేదు. దీనిని బట్టి మూడింట రెండు వంతుల మంది భారతీయులు మీవైపే ఉన్నారు" అని అయ్యర్ వ్యాఖ్యానించారు. పాకిస్థాన్‌తో చర్చలు జరిపేందుకు నిరాకరిస్తూ ప్రధాని మోదీ 'అతిపెద్ద తప్పు' చేశారని అన్నారు. "మీపై సర్జికల్ స్ట్రయిక్స్ చేసే ధైర్యం మాకుంది. కానీ, కూర్చుని చర్చించుకునే ధైర్యం మాత్రం లేదు" అని చెప్పుకొచ్చారు.

కాంగ్రెస్‌కు అశోక్ చవాన్ గుడ్ బై



ముంబై, ఫిబ్రవరి 12: సార్వత్రిక ఎన్నికల ముందు కాంగ్రెస్‌కు గట్టి షాక్ తగిలింది. మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్ సోమవారం ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. ఆయన భాజపాలో చేరే అవకాశం ఉందని సమాచారం. రాజీనామా తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటి దాకా కాంగ్రెస్ కోసం నిజాయితీగా పనిచేశానని, వ్యక్తిగత కారణాల వల్ల పార్టీని వీడుతున్నానని తెలిపారు. ఆయన 2008 నుంచి 2010 వరకు సీఎంగా పనిచేశారు. 'ఆదర్శ్ హౌసింగ్ సొసైటీ స్కాం'లో ఆయన పాత్ర ఉందన్న ఆరోపణలతో సీఎం పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. భవిష్యత్తు కార్యాచరణపై రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటానని చవాన్ చెప్పారు. ఈ విషయంపై బీజేపీ నేత దేవేంద్ర ఫడణవీస్ మాట్లాడుతూ కాంగ్రెస్‌లోని పలువురు మంచి నాయకులు బీజేపీతో టచ్‌లో ఉన్నారన్నారు. కాగా, అశోక్ చవాన్ నమ్మకద్రోహి అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు. నిన్నటి వరకు సీట్ల పంపకంపై చర్చల్లో పాల్గొన్న చవాన్ కాంగ్రెస్‌ను వీడడం ఆశ్చర్యం కలిగిస్తోందని ఉద్ధవ్ ఠాక్రే పేర్కొన్నారు.

బలపరీక్ష నెగ్గిన నితీశ్!



పట్నా, ఫిబ్రవరి 12: బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ నేతృత్వంలోని జేడీయూ-బీజేపీ సర్కారు బలపరీక్ష నెగ్గింది. సోమవారం బిహార్ అసెంబ్లీలో పలు నాటకీయ పరిణామాల మధ్య నితీశ్ ప్రభుత్వం విశ్వాస పరీక్షలో విజయం సాధించింది. తొలుత సీఎం నితీశ్‌కుమార్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌ల మధ్య మాటల యుద్ధం నడిచింది. నితీశ్ సభలో మాట్లాడుతూ.. ఆర్జేడీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆర్జేడీ ప్రభుత్వ హయాంలో భారీగా అవినీతి జరిగిందని, దానిపై తమ (ఎన్డీయే) సర్కారు దర్యాప్తు చేపడుతుందని వెల్లడించారు. 2005కు ముందు బిహార్‌లో ఆర్జేడీ ప్రభుత్వ పాలనలో శాంతిభద్రతలే లేవని, మతపరమైన హింసాత్మక ఘటనలు అనేకం జరిగాయని ఆరోపించారు. ఆర్జేడీ నేత, మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్.. నితీశ్‌పై మండిపడ్డారు. 'పల్టు కుమార్' అంటూ విమర్శలు గుప్పించిన ప్రధాని మోదీతోనే నితీశ్ చేతులు కలిపారని ధ్వజమెత్తారు. నితీశ్ మళ్లీ కూటమి మారరని మోదీ గ్యారెంటీ ఇవ్వగలరా? అని ప్రశ్నించారు. బిహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ఇవ్వడం కూడా బీజేపీ-జేడీయూ డీల్‌లో భాగమేనని ఆరోపించారు. తేజస్వీ ప్రసంగం తర్వాత ఆర్జేడీ, కాంగ్రెస్, లెఫ్ట్ ఫ్రంట్ సభ్యులు వాకౌట్ చేశారు. సభలో విశ్వాస పరీక్షకు ముందు స్పీకర్ అవధ్ బిహారీ చౌధరిపై అవిశ్వాస తీర్మానం పెట్టారు. ఆయన ఆర్జేడీ సభ్యుడు. చౌధరికి వ్యతిరేకంగా 125 మంది సభ్యులు ఓటేయడంతో ఆయన్ను స్పీకర్‌గా తొలగించారు. అనంతరం జరిగిన బలపరీక్షలో నితీశ్ ప్రభుత్వానికి అనుకూలంగా 130 ఓట్లు లభించాయి. మొత్తం 243 మంది సభ్యులున్న శాసనసభలో మెజారిటీ మార్కు 122 కాగా.. ఆర్జేడీ, కాంగ్రెస్, లెఫ్ట్ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేయడంతో జేడీయూ-బీజేపీ సర్కారుకు 130-0 ఓట్లు దక్కాయి. ఇందులో ఆర్జేడీకి చెందిన ముగ్గురు సభ్యుల ఓట్లు కూడా ఉండడం విశేషం.

కమలంలోకి కమల్‌నాథ్?

భోపాల్, ఫిబ్రవరి 12: మధ్యప్రదేశ్ మాజీ సీఎం, సీనియర్ కాంగ్రెస్ నేత కమల్‌నాథ్ బీజేపీలో చేరుతారంటూ ఊహాగానాలు వ్యాపించాయి. దాంతో ఆయనను బుజ్జగించేందుకు కాంగ్రెస్ చర్యలు ప్రారంభించిందని కూడా తెలిసింది. ఏప్రిల్ రెండో తేదీన రాష్ట్రానికి చెందిన 5 రాజ్యసభ స్థానాలు ఖాళీ కానున్నాయి. అందులో 4 బీజేపీకి చెందినవి కాగా, ఒకటి కాంగ్రెస్‌ది. బీజేపీకి చెందిన ఒక రాజ్యసభ స్థానాన్ని కమల్‌నాథ్‌కు ఇస్తారంటూ వదంతులు వ్యాపించాయి. కమల్‌నాథ్ కుమారుడు నకుల్‌నాథ్ ప్రస్తుతం మధ్యప్రదేశ్ నుంచి గెలిచిన ఏకైక కాంగ్రెస్ ఎంపీగా ఉన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఆయనను చింద్వారా నుంచి బీజేపీ తరఫున పోటీ చేసేందుకు టిక్కెట్ ఇస్తారని, కేంద్ర మంత్రివర్గంలో కూడా చోటు కల్పిస్తారని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. కమల్‌నాథ్ కాంగ్రెస్ అభ్యర్థిగా చింద్వారా నుంచి తొమ్మిదిసార్లు విజయం సాధించడం గమనార్హం. కమల్‌నాథ్‌ను బీజేపీలోకి తీసుకునేందుకు గతంలోనే ప్రయత్నాలు జరిగినా ఫలించలేదని సమాచారం. ఇటీవల మళ్లీ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ఇతర రాష్ట్ర నాయకులు చర్చలు జరిపినట్టు తెలిసింది.

చైనా హైపవర్ మైక్రోవేవ్ ఆయుధం

కదిలే ట్రక్కులోంచి ఉపయోగించే వీలు

- డ్రోన్లు, విమానాలు, శాటిలైట్లను సైతం నిర్వీర్యం చేయగలిగే సత్తా గల వెపన్!
- అందుబాటులోకి వచ్చేది కొన్నాళ్లతర్వాతే



బీజింగ్, ఫిబ్రవరి 12: కదిలే ట్రక్కు నుంచి సైతం ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఉపయోగించగలిగే అత్యంత శక్తిమంతమైన మైక్రోవేవ్ (హెచ్‌పీఎం) ఆయుధాన్ని చైనా శాస్త్రజ్ఞులు తయారుచేయగలిగారు! ఈ తరహా ఆయుధాల తయారీలో ఎదురయ్యే ఇబ్బంది.. అత్యధిక ఉష్ణోగ్రతలు. 'స్టిర్లింగ్ ఇంజన్'ల సాయంతో ఆ అడ్డంకిని కూడా వారు అధిగమించారు. మైక్రోవేవ్ వెపన్స్‌ను వినియోగించడానికి సాధారణంగా అయ్యే శక్తిలో ఐదు వంతు శక్తి చాలు దీన్ని వాడడానికి. అంతేకాదు.. నిరంతరాయంగా నాలుగు గంటలపాటు దాన్ని వినియోగించవచ్చని దాని రూపకర్తలు చెబుతున్నారు. అలాగే.. ప్రపంచంలోనే స్టిర్లింగ్ ఇంజన్ టెక్నాలజీతో పనిచేసే తొలి హెచ్‌పీఎం ఆయుధం ఇది. ఇంతకీ ఏమిటీ మైక్రోవేవ్ ఆయుధం? అంటే.. గత ఏడాది అక్టోబరులో హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్ సరిహద్దులోని వాచ్‌టవర్లపైన, సెక్యూరిటీ కెమెరాలపైన పెద్ద సంఖ్యలో డ్రోన్‌లతో దాడులు చేశారు గుర్తుందా? వాచ్‌టవర్లు కూలిపోయి, సెక్యూరిటీ కెమెరాలు ధ్వంసం కావడంతో అసలేం జరుగుతోందో తెలుసుకోవడానికే ఇజ్రాయెల్ సేనలకు చాలా సమయం పట్టింది. ఈలోగా ఉగ్రవాదులు సరిహద్దులు దాటొచ్చి నరమేధం సాగించారు. ఇలాంటి డ్రోన్ల గుంపులను సమర్థంగా ఎదుర్కొని నాశనం చేసే సత్తా కలిగిన ఆయుధాలు.. హైపవర్ మైక్రోవేవ్ వెపన్స్. ఇలాంటి డ్రోన్లు పెద్ద సంఖ్యలో దూసుకొచ్చినప్పుడు.. శక్తిమంతమైన విద్యుదయస్కాంత తరంగాలను వాటిపైకి ప్రసరింపజేయడం ద్వారా వాటిలోని ఎలక్ట్రానిక్ వ్యవస్థలు పనికిరాకుండా చేస్తాయి. దీంతో ఆ డ్రోన్లు వాటంతటవే కింద పడి పాడైపోతాయి. ఇలాంటి ఆయుధాలను అమెరికా, చైనా, రష్యా సహా పలు దేశాలు ఈ ఆయుధాలను చాలా కాలంగా అభివృద్ధి చేస్తున్నాయి. అయితే చైనా ప్రస్తుతం తయారుచేసినట్టు చెబుతున్నది డ్రోన్లనే కాక.. శత్రువుల యుద్ధవిమానాలను, ఉపగ్రహాలను సైతం నిర్వీర్యం చేయగలదని చెబుతున్నారు. అయితే.. యుద్ధరంగంలో దాన్ని ఉపయోగించడానికి ఇంకా కొంత సమయం పడుతుందని రూపకర్తలు పేర్కొన్నారు. ప్రస్తుతానికి ఈ వెపన్ ప్రాథమిక స్థాయిలోనే ఉందని, దాన్ని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు.

ట్రక్కులో పట్టేస్తుంది..

సాధారణంగా హైపవర్ మైక్రోవేవ్ ఆయుధాలు పరిమాణంలో చాలా పెద్దగా ఉంటాయి. వాటిని పనిచేయించడానికి చాలా ఎక్కువ శక్తి కావాలి. అందుకు భారీగా ఖర్చవుతుంది. కానీ, తాము అభివృద్ధి చేసిన వెపన్‌కు అంత శక్తి అవసరం లేదని.. పైగా దాన్ని సులభంగా ఒక ట్రక్కులో పెట్టి ఎక్కడికి కావాలంటే అక్కడికి తీసుకెళ్లి ఉపయోగించవచ్చని, ప్రయాణంలో కూడా ఉపయోగించవచ్చని చైనా శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. దీని తయారీకి వారు వాడిన అత్యంత అధునాతనమైన సూపర్ కండక్టింగ్ టేప్ (రెబ్కో టేప్) కూడా చైనాలో తయారైనదే. చైనా ఆ రెబ్కో టేప్ తయారు చేయడానికి కారణమెవరో తెలుసా? అమెరికా. కరోనాను ప్రపంచం మీదకు వదిలిందన్న కోపంతో 2017లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనాపై ఆంక్షలు విధించారు గుర్తుందా? అప్పుడు తనకు కలిగిన ఇబ్బందిని సవాల్‌గా తీసుకుని చైనా ఈ టెక్నాలజీని అభివృద్ధి చేసింది.

డ్రామా జీవోలు

- అట్టర్‌ఫ్లాప్ ప్రోగ్రాం 'గడప గడపకూ..'పై 4 జీవోలు
- రూ. 1319 కోట్లు మంజూరు చేసినట్టు వాటిలో వెల్లడి

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ ఓట్ల కోసం ప్రభుత్వం మరో కొత్తడ్రామాకు తెరతీసింది. ప్రభుత్వ అరాచక, దోపిడీ నిర్ణయాలు మీడియాకు తెలిసిపోతున్నాయని 2021లో జీవోల వెబ్‌సైట్ మూసేసింది. ఏపీ ఈ-గజెట్‌లో ఏవో కొన్ని అప్రాధాన్య జీవోలు అప్‌లోడ్ చేస్తూ వస్తోంది. అలా దాచుకున్న జీవోల్లో తమ పార్టీకి హానిచేయకుండా ప్రజలను ఆకర్షించే జీవోలను వెతికి మరీ ఇప్పుడు అప్‌లోడ్ చేస్తోంది. ఇందులో భాగంగానే 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం సందర్భంగా మంజూరు చేసిన పనులకు నిధులు కేటాయించినట్టుగా 2023 నవంబరులో ఇచ్చిన 4 జీవోలను తాజాగా సోమవారం వెబ్‌సైట్‌లో పెట్టింది. వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు నిర్వహించిన ఈ కార్యక్రమం అట్టర్‌ఫ్లాపైంది. జనాలు తమ ప్రశ్నలతో నాయకులను కడిగిపారేశారు. దీంతో వైసీపీ నాయకుల్లో చాలామంది సగంలోనే కార్యక్రమం ఆపేశారు. మరికొందరు మమ అనిపించేశారు. ఇంకొందరు అసలు వెళ్లనేలేదు. అట్టర్‌ఫ్లాప్ అయిన ఈ కార్యక్రమంలో వచ్చిన వినతుల కోసం ఏకంగా రూ.1319 కోట్లు మంజూరు చేసినట్టు మొత్తం 4జీవోలు ఇచ్చారు. అంటే ఆ డబ్బు పేపర్ మీదే ఉంటుంది. విడుదలై ఆయా ప్రాంతాలకు వెళ్లి అక్కడున్న సమస్యలను సరిచేయడం జరగదు. ఎప్పట్లాగే ప్రభుత్వ ఖజానాలో చిల్లిగవ్వ లేదు. గత మంగళవారం రూ.4,000కోట్ల అప్పు తెచ్చారు. ఈ మంగళవారం ఇంకో రూ.2,000కోట్ల అప్పు తెస్తున్నారు. జీతాలు, పెన్షన్లు ఇచ్చి, రోజువారీ నిర్వహణ గడవడమే కష్టంగా ఉంది. అధికారులు వాడుకునే వాహనాలకు 7నెలల నుంచి అద్దె చెల్లించడం లేదు. అదేమంటే ప్రభుత్వమే కొత్త వాహనాలు కొనాలన్న ఆలోచన చేస్తున్నదంటూ సంబంధం లేని సమాధానాలు చెప్పి తప్పించుకుంటున్నారు.

ఏపీఐఐసీ చైర్మన్‌గా జంకె వెంకటరెడ్డి

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ) చైర్మన్‌గా ప్రకాశం జిల్లా మార్కాపురం మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వెంకటరెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇప్పటివరకు ఏపీఐఐసీ చైర్మన్‌గా ఉన్న మెట్టు గోవిందరెడ్డి రానున్న ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీ చేయనున్న నేపథ్యంలో ఈ నియామకం జరిగినట్టు ఏపీఐఐసీ వర్గాలు భావిస్తున్నాయి.

ఢిల్లీ అష్ట దిగ్బంధం

- దేశ రాజధానిలో నెల రోజులు 144 సెక్షన్
- నేడు రైతుల "చలో ఢిల్లీ" నేపథ్యంలో ఆంక్షలు
- నగరంలోకి ట్రాక్టర్లు, ట్రక్కుల రాకపై నిషేధం



ఢిల్లీ, యూపీ సరిహద్దులో రోడ్డుపై కాంక్రీటుతో గోడ కడుతున్న దృశ్యం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రోడ్లపై ఇసుక సంచులు.. ముళ్ల కంచెలు, కాంక్రీట్ దిమ్మెలు.. అల్లర్ల నిరోధక బలగాలు.. ఎక్కడికక్కడ సరిహద్దుల మూసివేత.. డ్రోన్లతో నిఘా.. ప్రజలు గుమిగూడడంపై ఆంక్షలు..! ఇదీ దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుత పరిస్థితి. అన్ని పంటలకు కనీస మద్దతు ధరకు హామీనిస్తూ చట్టం తేవాలని, రుణ మాఫీ, పింఛన్లు తదితర డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ పార్లమెంటు ముట్టడికి రైతు సంఘాలు మంగళవారం "చలో ఢిల్లీ" కార్యక్రమం తలపెట్టిన నేపథ్యంలో పోలీసులు, భద్రతా దళాలు అత్యంత అప్రమత్తమయ్యాయి. నగరాన్ని అష్ట దిగ్బంధం చేశాయి. దేశ రాజధానిలో నెల రోజుల పాటు 114 సెక్షన్ అమలయ్యేలా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. యూపీ, పంజాబ్, హరియాణాతో ఉన్న సరిహద్దుల్లో జాతీయ రహదారులను పూర్తిగా మూసివేశారు. బారికేడ్లను ఏర్పాటు చేయడంతో పాటు మూడేళ్ల కిందట రైతుల సుదీర్ఘ ఆందోళనకు కేంద్రంగా మారిన సింఘూ, ఘాజీపూర్, టిక్రీల్లో భారీగా బలగాలను మోహరించారు. వాహనాలు ముందుకు కదిలితే టైర్లు పంక్చర్ అయ్యేలా రోడ్లపై మేకులు పరిచారు. ఘజియాబాద్‌తో పాటు పలుచోట్ల రోడ్లపై అడ్డంగా సిమెంటు దిమ్మెలు పెట్టి వాటి మధ్య కాంక్రీట్ మిశ్రమం నింపారు. 144 సెక్షన్ నేపథ్యంలో బహిరంగ సమావేశాల నిర్వహణ, ట్రాక్టర్లు, ట్రక్కులు, ట్రాలీల రాకను నిషేధించినట్లు ఢిల్లీ పోలీస్ కమిషనర్ సంజయ్ ఆరోరా తెలిపారు. లైసెన్స్‌డ్ తుపాకులు, మండే స్వభావం గల పదార్థాలు, కత్తులు, త్రిశూలాలు, రాడ్లు, బరిసెలను వెంట తీసుకురావొద్దని పేర్కొన్నారు. లౌడ్ స్పీకర్లపైనా ఆంక్షలు వర్తిస్తాయన్నారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ప్రధాన రోడ్లపైకి రావొద్దని సూచించారు. రైతుల ఆందోళన నేపథ్యంలో అటు రాష్ట్రాలు కూడా చర్యలు చేపట్టాయి. పంజాబ్‌తో అంబాలా వద్ద ఉన్న సరిహద్దును హరియాణా మూసివేసింది. కాగా, పంజాబ్ నుంచి ఇప్పటికే ఢిల్లీ దిశగా ట్రాక్టర్లు బయల్దేరాయి.

2,500 ట్రాక్టర్లు.. 20 వేల మంది రైతులు

వ్యవసాయోత్పత్తుల మద్దతు ధరలకు చట్టబద్ధత, లఖీంపూర్‌లో రైతులపై జరిగిన హత్యాకాండలో నిందితులను శిక్షించడం, నకిలీ ఎరువులు, విత్తనాల తయారీదారులపై కఠిన చర్యలు, ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానించడం కూడా రైతుల డిమాండ్లలో ఉన్నాయి. మంగళవారం చలో ఢిల్లీతో పాటు 16న గ్రామీణ భారత్ బంద్‌కు పిలుపునిచ్చాయి. చలో ఢిల్లీకి 2,500 ట్రాక్టర్లలో వివిధ రాష్ట్రాలకు చెందిన 20 వేల మంది రైతులు రావొచ్చని నిఘా వర్గాలు అంచనా వేశాయి. రైతు సంఘాలు 40 సార్లు సన్నాహకం కూడా చేశాయని పేర్కొన్నాయి. దక్షిణాది రాష్ట్రాల రైతులు కూడా ఢిల్లీ చేరుకునే వీలుందని భావిస్తున్నాయి.

అరెస్టులపై ఆగ్రహం

ఆలిండియా డెమోక్రటిక్ ఉమెన్స్ అసోషియేషన్, భూమి అధికార్ ఆందోళన్ కిసాన్ సంఘర్ష్ సమితి, బీకేయూ (టికాయత్) నాయకులను మధ్యప్రదేశ్ పోలీసులు అరెస్టు చేయడాన్ని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) తీవ్రంగా ఖండించింది. కాగా, పీయూష్ గోయల్, అర్జున్ ముండా, నిత్యానందరాయ్‌లతో కూడిన కేంద్ర మంత్రుల బృందం రైతు ప్రతినిధులతో చర్చలు జరపనుంది.

గత ప్రభుత్వం కంటే ఎక్కువ ఉద్యోగాలిచ్చాం..: మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: తమ పదేళ్ల పాలనలో గత ప్రభుత్వం కంటే ఒకటిన్నర రెట్లు ఎక్కువ ఉద్యోగాలిచ్చామని ప్రధాని మోదీ అన్నారు. నియామక ప్రక్రియను పారదర్శకంగా మార్చామని.. జాప్యం లేకుండా సకాలంలో ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని చెప్పారు. 'రోజ్‌గార్ మేళా'లో భాగంగా దేశవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు సాధించిన లక్షకు పైగా మందికి సోమవారం ఆయన నియామక పత్రాలను వర్చువల్‌గా అందజేశారు. ఉద్యోగ నియామకాల ప్రక్రియను జాప్యం చేస్తూ గత ప్రభుత్వం లంచగొండితనాన్ని పోషించిందని విమర్శించారు. యువతకు ఇప్పుడు సమాన అవకాశాలున్నాయని.. ప్రతిభ, కృషి ఉంటే ప్రభుత్వ ఉద్యోగం పొందవచ్చని నమ్ముతున్నారని చెప్పారు.

డిప్యూటీ సీఎంలపై 'పిల్' తిరస్కరణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: ఉప ముఖ్యమంత్రుల నియామకాన్ని సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యా (పిల్)న్ని సోమవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. దీంట్లో రాజ్యాంగ ఉల్లంఘనేమీ జరగలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఆధ్వర్యంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఉపముఖ్యమంత్రి కూడా అందరు మంత్రుల్లాంటి వారేనని, వారిని ప్రత్యేక వర్గంగా గుర్తించరని తెలిపింది. ఉపముఖ్యమంత్రులను నియమించడం మంచి సంప్రదాయమేమీ కాదని, ఇది సమానత్వం అన్న రాజ్యాంగ సూత్రానికి విరుద్ధమని పేర్కొంటూ పబ్లిక్ పొలిటికల్ పార్టీ ఈ పిల్‌ను దాఖలు చేసింది.

ఆ ఐపీఎస్ 'బంగారం'

(మొదటి పేజీ తరువాయి)

బోన్సాయ్ మొక్కలు తప్ప ఇంకేవీ ఉండవంటూ ఆ జిల్లాలో ఫొటోలతోసహా ప్రచారం బాగా జరిగింది. కానీ బదిలీ అయ్యి వేళ్లే సమయంలో మాత్రం బంగారు కానుకలు తీసుకుంటారని చెప్పడంతో తప్పక తీసుకెళ్లారు. రాష్ట్రంలో ఇటీవల పలువురు ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు బదిలీ అయిన ఎస్పీ ఒకరికి వారం రోజుల తర్వాత జిల్లా కేంద్రంలో సిబ్బంది వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన కోరి మరీ దీనిని ఏర్పాటు చేయించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఆ జిల్లాలోని పోలీసు అధికారులందరూ ఉంగరాలు, బ్రాస్‌లెట్లు, మెడలో చైను లాంటివి తీసుకెళ్లాల్సి వచ్చింది. తమ పాత బాస్‌కు బంగారు బహుమతులిచ్చిన కొందరు పోలీసులు... ఆయనతో ఫొటో దిగి ఫేస్‌బుక్‌లో ఇతర సోషల్ మీడియాలో పోస్టు చేసుకున్నారు. గమనించిన ఇతర జిల్లాల్లోని బ్యాచ్‌మెట్లు... ఇదేంటి ఇంత చిన్న గిఫ్ట్ ఇచ్చారని అడగ్గా అందులో బంగారు ఆభరణం ఉందంటూ బదులిచ్చారు. ఇంత ఖరీదైనవి వెళ్లిపోయే ఆయనకు ఇచ్చారా.? అంటూ ఆరా తీయగా, 'అందులో ఎక్కువ బహుమతులు స్మగ్లింగ్‌లో పట్టుబడినవే. ఇక్కడికి అవి ఎలా వస్తాయో సార్‌కు తెలుసు.. అందుకేనేమో ఆయనకు బంగారు బహుమతులు తీసుకురమ్మంటూ ఫోన్లో ప్రత్యేకంగా చెప్పా'రంటూ బదులిచ్చారు. ఆ నోటా.. ఈ నోటా చేరి అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఈ సమాచారం చేరింది. ఉన్నతాధికారికి తెలియడంతో 'ఇదేమి ప్రాక్టీస్.. ఎంక్వైరీ చేయండి' అన్నట్లు సమాచారం. ఆ ఎస్పీ పనితీరుపై ఆ ఉన్నతాధికారి ఏ మాత్రం సంతృప్తికరంగా లేరనే చర్చ కూడా పోలీసు వర్గాల్లో ఉంది. ఈ నేపథ్యంలో బహుమతుల వ్యవహారం ఎటు దారి తీస్తుందో అన్న ఆసక్తి పోలీసు వర్గాల్లో కనిపిస్తోంది.

కలెక్టరు బంగళాలో చోరీ

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 12: శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరు అరుణ్‌బాబు క్యాంపు కార్యాలయంలో సోమవారం చోరీ జరిగింది. కలెక్టర్ లేని సమయంలో బంగళాలోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి విలువైన ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. దర్యాప్తు చేపట్టాలని పోలీసులను కలెక్టర్ ఆదేశించారు. ఓ అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నారని తెలిసింది. చోరీ వివరాలను వెల్లడించేందుకు పోలీసులు నిరాకరించారు.

శెట్టిబలిజలపై చిన్నచూపు!

ప్రాంతాలకతీతంగా 21 బీసీ కులాలకు రిజర్వేషన్ వర్తింపు

- గ్రేటర్ రాయలసీమలో శెట్టిబలిజలకు వర్తించదంటూ మెలిక
- ఆ ప్రాంతం ఎక్కడుందో అధికారులకే తెలియాలని విమర్శలు
- టీడీపీకి మద్దతు పలుకుతున్నందుకే వివక్ష అంటూ ఆగ్రహం
- బీసీ మంత్రి చెల్లుబోయిన వేణుదీ అదే సామాజిక వర్గం
- ఆయన శాఖ నుంచే తాజా ఉత్తర్వుల జారీపై మండిపాటు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలోని కొన్ని కులాలపై వైసీపీ ప్రభుత్వం అక్కసు వెళ్లగక్కుతోంది. బలిజ, తెలగ, కాపులు అంటే మొదట్నించీ జగన్‌కు చిన్నచూపు ఉంది. గత ప్రభుత్వంలో కాపు రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో చట్టం చేసి కేంద్రానికి సిఫారసు చేస్తే దాన్ని జగన్ బహిరంగంగానే వ్యతిరేకించారు. కాపు రిజర్వేషన్లకు తాము వ్యతిరేకమని బాహాటంగా ప్రకటించారు. ఈబీసీ రిజర్వేషన్లు 10శాతం కేంద్రం ప్రకటిస్తే... అప్పటి చంద్రబాబు ప్రభుత్వం అందులో 5శాతం కాపులకు కేటాయించింది. అయితే జగన్ సర్కారు వచ్చిన వెంటనే కాపులకు ప్రత్యేకంగా కేటాయించిన రిజర్వేషన్ ఎత్తేయడంతో కాపు, బలిజ, తెలగ విద్యార్థులు, యువత విద్య, ఉపాధి అవకాశాలు కోల్పోయారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఆయా వర్గాలు జగన్ వైఖరిపై మండిపడుతున్నాయి. ఈ నేపథ్యంలో శెట్టిబలిజలపైనా జగన్ ప్రభుత్వం వివక్ష చూపుతున్నట్లు తాజాగా వెలుగు చూసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 139 బీసీ కులాలున్నాయి. వాటిలో కండ్ర కులాన్ని తొలగించడంతో 138 కులాలు జాబితాలో మిగిలాయి. అందులో 31 కులాలను కొన్ని ప్రాంతాలకు చెందినవారిని మాత్రమే బీసీలుగా గుర్తిస్తారు. అంటే ఫలానా ప్రాంతంలో ఫలానా కులం వాళ్లే బీసీలుగాను, మిగిలిన ప్రాంతంలో వారిని ఓసీలుగాను పరిగణిస్తారు. ఈ 31 కులాల్లో 10 తెలంగాణకు చెందినవి కాగా మిగిలిన 21 కులాల వారు మన రాష్ట్రంలో ఇలాంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ కులాలు ఆయా నిర్దిష్టమైన ప్రాంతాల్లో కాకుండా ఇతరచోట్ల నివసిస్తుంటే వారికి బీసీ కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు ఇబ్బంది పెడుతున్నారు. ఉదాహరణకు మున్నూరు కాపు కులస్తులు రాష్ట్రంలో పరిమితంగా ఉంటారు. తెలంగాణ నుంచి 7 మండలాలు ఏపీలోకి బదిలీ అయినప్పుడు ఆ ప్రాంతంలో మున్నూరు కాపులు ఎక్కువగా ఉన్నారని, వారంతా రిజర్వేషన్ సమస్యలు ఎదుర్కొంటున్నారని అప్పట్లో ఆందోళన చేశారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం... ఆయా ప్రాంతాలకు సంబంధం లేకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఈ 21 కులాలను ఎక్కడైనా బీసీలుగా పరిగణిస్తారని, వారికి ఎక్కడైనా కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని గతేడాది నవంబరులో ఉత్తర్వులు విడుదల చేసింది. అయితే శెట్టి బలిజలకు మాత్రం రాష్ట్రమంతా కాకుండా కొన్ని ప్రాంతాలకు మినహాయింపు ఇచ్చారు. గ్రేటర్ రాయలసీమ పరిధి వినహాయించి మిగతా రాష్ట్రమంతా బీసీలుగా కులధ్రువీకరణ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నవంబరులో విడుదల చేసిన జీవోను గోప్యంగా ఉంచి సోమవారం గెజిట్ నోటిఫికేషన్ ద్వారా వెల్లడించారు.

అక్కసు అందుకేనా...?

తూర్పుగోదావరి జిల్లాలో శెట్టి బలిజల జనాభా ఎక్కువ. మిగిలిన ప్రాంతాల్లో అంతగా లేకపోయినా కూడా వివాహాలు, వలసల ద్వారా రాష్ట్రమంతా విస్తరించి ఉన్నారు. 21 కులాలను ప్రాంతాలకు అతీతంగా బీసీలుగా గుర్తించిన సర్కారు... ఒక్క శెట్టి బలిజలకు మాత్రం గ్రేటర్ రాయలసీమ పరిధిలో వర్తించదంటూ ఉత్తర్వులు ఇవ్వడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. వాస్తవానికి బీసీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ కూడా అదే కులానికి చెందినవారు. ఇప్పుడు ఆ శాఖే ఈ రకమైన ఉత్తర్వులు ఇవ్వడంలో మతలబు ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. గోదావరి జిల్లాలు టీడీపీకి కంచుకోట అనే ప్రచారం మొదటినుంచీ ఉంది. బీసీల్లో శెట్టి బలిజలు అంటే టీడీపీ వర్గాలేననే భావనతోనే ఈ విధంగా ఉత్తర్వులిచ్చారన్న అభిప్రాయాలున్నాయి.

గ్రేటర్ రాయలసీమ ఎక్కడుంది!

బీసీల కోసం తాజాగా ఇచ్చిన ఈ ఉత్తర్వుల్లో గ్రేటర్ రాయలసీమ అని పేర్కొనడం వివాదాస్పదంగా మారింది. రాష్ట్రంలో గ్రేటర్ రాయలసీమ అంటే ఏయే ప్రాంతాలొస్తాయో ఎవరికీ తెలియదు. తెలంగాణ ఉద్యమం సమయంలో తెలంగాణ రాష్ట్రం ఇస్తే, తమకు గ్రేటర్ రాయలసీమ కావాలని రాయలసీమ ప్రాంత వాసులు డిమాండ్ చేశారు. అంతే తప్ప రాష్ట్ర ప్రభుత్వంలో గానీ, కేంద్రం దృష్టిలో గానీ గ్రేటర్ రాయలసీమ అనే పదమే లేదు. అయితే శెట్టి బలిజలను గ్రేటర్ రాయలసీమ మినహాయించి మిగిలిన ప్రాంతంలో బీసీలుగా గుర్తించాలని ఉత్తర్వులు ఇవ్వడాన్ని పలువురు ప్రశ్నిస్తున్నారు. శెట్టి బలిజల పట్ల ఎందుకంత అక్కసు అని నిలదీస్తున్నారు. 21 కులాలకు వర్తింపచేసిన జీవో తమకు గ్రేటర్ రాయలసీమలో వర్తించదన్న జగన్ సర్కారుపై శెట్టిబలిజ వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.



ఏపీ న్యాయసేవాధికార సంస్థ రూపొందించిన న్యూస్ లెటర్‌ను ఆవిష్కరిస్తున్న జస్టిస్ శేషసాయి

న్యూస్ లెటర్‌ను ఆవిష్కరించిన జస్టిస్ ఏవీ శేషసాయి

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, మండల న్యాయ సేవాధికార సంస్థలు నిర్వహించిన కార్యక్రమాలను తెలియజేస్తూ ఏపీ న్యాయసేవాధికార సంస్థ రూపొందించిన న్యూస్ లెటర్‌ను ఏపీ హైకోర్టు న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ ఏవీ శేషసాయి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో న్యాయవిజ్ఞానం పెంచడంతోపాటు ఉచిత న్యాయసహాయం అందించేందుకు మరింత కృషి చేయాలని కోరారు. సంస్థ సభ్య కార్యదర్శి బబిత, హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యదర్శి మాలతి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

52మంది గురుకుల విద్యార్థులకు అస్వస్థత

- కలుషితాహారమే కారణమన్న వైద్యులు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 12: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ఆదివారపుపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు 52మంది సోమవారం అస్వస్థతకు గురయ్యారు. గురుకుల పాఠశాలలో 450మంది వరకు విద్యార్థులు ఉన్నారు. ఆదివారం ఉదయం అల్పాహారంగా పూరి, మధ్యాహ్నం చికెన్ బిర్యానీ తీసుకున్నారు. వారిలో కొంతమందికి ఆదివారం రాత్రి వాంతులు, రక్త విరోచనాలు అయ్యాయి. సోమవారం ఉదయానికి అస్వస్థతకు గురైన వారి సంఖ్య 52కు చేరుకుంది. పీహెచ్‌సీ వైద్యులు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. వాంతులు, రక్త విరోచనాలు అవుతున్న ఐదుగురుతో పాటు మరో ముగ్గురిని అంబులెన్సులో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కలుషిత ఆహారం తినడం కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ దుర్గారావుదొర తెలిపారు.

మద్యం దుకాణాల నగదుకు లెక్కలున్నాయా?: గంటా

విశాఖపట్నం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలోని మద్యం దుకాణాల్లో కేవలం నగదు మాత్రమే తీసుకుంటున్నారు. ఆ మొత్తం ఎక్కడికి వెళుతుందో లెక్కలు ముఖ్యమంత్రి జగన్ ఏమైనా చెప్పగలరా?' అంటూ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎక్స్‌లో ప్రశ్నించారు. సోమవారం ఆయన స్పందిస్తూ... "టీ దుకాణంలో రూ.10కి కూడా డిజిటల్ పేమెంట్ తీసుకుంటున్నారు. మద్యం దుకాణాల్లో ఎందుకు అనుమతించరు. విచ్చలవిడిగా నాసిరకం మద్యం అమ్ముతూ పేదోడీని దోచుకుంటున్న సీఎంగా జగన్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారు. అమ్మ ఒడికి వేస్తున్న డబ్బులు నాన్న బుడ్డికి సరి పెడుతున్నారు. నాసిరకం మద్యంతో ఆరోగ్యం పాడు చేస్తూ 'జగనన్న సురక్ష' అని నిర్వహించడం ఆయనకే చెల్లింది" అని అన్నారు.

కలుషిత నీటితో ప్రజలు మరణిస్తున్నా చలించరా? : ఆనంద్‌బాబు

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కలుషిత నీరు తాగి ప్రజలు చనిపోతున్నా, అనారోగ్యంతో ఆసుపత్రుల పాలైనా ముఖ్యమంత్రిలో చలనం లేదని మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు ఆరోపించారు. సోమవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'జగన్ అసమర్థత, వైసీపీ ప్రభుత్వ చేతగానితనంతో రాష్ట్రంలో ఆరోగ్య విపత్తు తలెత్తింది. గుంటూరు నగరంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కలుషిత తాగునీటి సమస్యపై ముఖ్యమంత్రి తక్షణమే స్పందించాలి' అని ఆనంద్‌బాబు అన్నారు.

వైసీపీకి గుర్తింపు రద్దు చేయాలి: జవహర్

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో గెలవడం కోసం అధికారుల్ని ప్రలోభపెడుతూ అక్రమాలకు పాల్పడుతున్న వైసీపీ గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని మాజీ మంత్రి జవహర్ ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. సోమవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 'వైసీపీ నేతల్ని నమ్మి గిరీషా, చంద్రమౌళీశ్వరరెడ్డి లాంటి అధికారులు బలైపోయారు. మంత్రి పెద్దిరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి లాంటి వారి సంగతేంటి? ప్రజాస్వామ్యంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని వమ్ము చేసేలా రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్న వైసీపీ నేతల్ని ఎన్నికల్లో పోటీ చేయకుండా తిరస్కరించాలి" అని అన్నారు.

అంబేడ్కర్‌కు అవమానంపై సీఎం సమాధానం చెప్పాలి: దేవతోటి

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పులివెందుల పాత బస్టాండ్ వద్ద వైఎస్సార్ విగ్రహం పాదాల కింద అంబేడ్కర్ విగ్రహం పెట్టడాన్ని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దేవతోటి నాగరాజు ఖండించారు. వైసీపీ నేతలకు పిచ్చి పరాకాష్టకు చేరిందని మండిపడ్డారు. విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని పెట్టామని గొప్పలు చెప్పుకుంటున్న జగన్‌రెడ్డి.. తన నియోజకవర్గంలో సొంత పార్టీ నేతలు అంబేడ్కర్‌ను అవమానించడంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

సత్యవేడు శ్రీసిటీలో ఐఐఐటీ

- పీపీపీ విధానంలో ఏర్పాటు.. 42.23 ఎకరాలు కేటాయింపు

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాకు ఐఐఐటీ రాబోతుంది. తొలిసారిగా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో (పీపీపీ విధానం) ఈ ఐఐఐటీని ఏర్పాటు చేయబోతున్నారు. సత్యవేడు మండలం మల్లవారిపాలెంలో ఐఐఐటీ ఏర్పాటు కోసం 42.23 ఎకరాలను ఉన్నత విద్యాశాఖకు కేటాయిస్తూ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈ భూములు ఏపీఐఐసీ పరిధిలో ఉన్నాయి. శ్రీసిటీలో భాగంగా ఉన్న ఈ భూములను ఏపీఐఐసీ నుంచి తప్పించి ఉన్నత విద్యాశాఖకు కేటాయిస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ ఉత్తర్వులు (జీఓ-52) ఇచ్చారు. ఇప్పటి వరకు దేశంలో ఐఐఐటీలు కేంద్ర ప్రభుత్వ పరిధిలోనే ఏర్పాటయ్యాయి. అయితే, శ్రీసిటీలో ఏర్పాటుకాబోతున్న ఈ సంస్థ పబ్లిక్-ప్రైవేటు పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో రాబోతోంది. ఇందుకుగాను ఈ సంస్థకు ఎకరం భూమిని 11.75 లక్షల చొప్పున ధర నిర్ణయించి కేటాయించారు. ఈ భూమిలో 4.60 ఎకరాలు కోర్టు విచారణ పరిధిలో ఉన్నాయి. కోర్టు తీర్పు ఆధారంగా ఆ భూమిపై నిర్ణయం ఉంటుందని రెవెన్యూ శాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇదిలావుంటే ఐఐఐటీ కోసం ఎకరం భూమిని 4.70 లక్షలకు ఇవ్వాలని తిరుపతి కలెక్టర్ రెవెన్యూ శాఖకు సిఫారసు చేశారు. దీనిపై ఆంధ్రప్రదేశ్ భూ యాజమాన్య సంస్థ (ఏపీఎల్ఎంఏ)లో చర్చించి భూమి ధరపై కలెక్టర్ సిఫారసును పక్కనపెట్టింది. అక్కడ ఎకరం కనీసం 30 లక్షలపైనే ఉంటుంది. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్ విలువ మేరకు ఎకరం 11.75 లక్షల చొప్పున ధర నిర్ణయించారు.

వీరశైవ ఆగమం ప్రకారమే శ్రీశైలం మహాకుంభాభిషేకం

- హైకోర్టుకు నివేదించిన దేవదాయశాఖ

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాకుంభాభిషేకం, ఇతర కార్యక్రమాలను వీరశైవ ఆగమం ప్రకారమే నిర్వహిస్తామని దేవదాయ శాఖ సోమవారం హైకోర్టుకు నివేదించింది. ఈ వివరాలను నమోదు చేసిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం పిల్‌ను పరిష్కరించింది. శ్రీశైలంలో మహాకుంభాభిషేకం, ఇతర పవిత్ర కార్యక్రమాలను వీరశైవ ఆగమ సంప్రదాయాల ప్రకారమే నిర్వహించేలా దేవదాయశాఖ అధికారులను ఆదేశించాలని కోరుతూ అఖిల భారత వీరశైవ ధార్మి ఆగమ పరిషత్ చైర్మన్ సంగాల సాగర్ హైకోర్టులో సోమవారం అత్యవసరంగా ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిల్‌ను హైకోర్టు లంచ్‌మోషన్‌గా విచారణకు స్వీకరించింది. పిటిషనర్ తరఫున న్యాయవాది వీవీ సతీష్ వాదనలు వినిపించారు.

ఏప్రిల్ 27న 'పాలిసెట్' ప్రవేశ పరీక్ష

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్‌లలో ప్రవేశం కోసం ఏప్రిల్ 27న 'పాలీసెట్-2024' నిర్వహించనున్నట్లు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పాలిటెక్నిక్‌పై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర సాంకేతిక విద్య శిక్షణ మండలి రూపొందించిన సమాచార కరదీపిక, కరపత్రాలు, గోడ పత్రికలను సోమవారం విజయవాడలోని సాంకేతిక విద్యాశాఖ కేంద్ర కార్యాలయంలో ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు పూర్తయిన వెంటనే 'పాలిసెట్' ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 87 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియాల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, స్టడీమెటీరియల్‌ను కూడా ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు.

అప్పుల బాధతో చేనేత కార్మికుడి ఆత్మహత్య

ధర్మవరం, ఫిబ్రవరి 12: శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన చేనేత కార్మికుడు నీలూరి రామాంజనేయులు (50) అప్పుల బాధతో సోమవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రామాంజనేయులు నేసిన చీరలకు గిట్టుబాటు ధర లభించక తీవ్రంగా నష్టపోయాడు. ముడిసరుకులు, కుటుంబ అవసరాల కోసం రూ.3.50 లక్షలదాకా అప్పులు చేశాడు.

'పశ్చిమ'లో అస్పష్టత

- ఆరు చోట్ల టీడీపీ అభ్యర్థులు ఖరారు!
- జనసేనకు మూడు సీట్లు
- మిగతా స్థానాలపై కొలిక్కిరాని చర్చలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పొత్తుల విషయం తేలకపోవడంతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో టీడీపీ అభ్యర్థుల ఎంపిక కొలిక్కి రావడం లేదు. ఈ జిల్లాలో మొత్తం 15 అసెంబ్లీ సీట్లు ఉండగా.. పొత్తులో భాగంగా జనసేన ఐదు సీట్లు కోరుతోంది. ఇప్పటికి మూడు సీట్లు ఆ పార్టీకి ఖరారయ్యాయి. మిగిలిన రెండు సీట్ల వ్యవహారం తేలకపోవడంతో టీడీపీ శిబిరంలో అస్పష్టత నెలకొంది. ఈ జిల్లాలోని మూడు రిజర్వుడు నియోజకవర్గాలపై కూడా టీడీపీ నాయకత్వం ఇంకా ఒక నిర్ణయానికి రాకపోవడంతో తేలని సీట్ల సంఖ్య ఈ జిల్లాలో పెద్దదిగా కనిపిస్తోంది. ఆరు సీట్లలో- ఆచంట, తణుకు, పాలకొల్లు, దెందులూరు, ఏలూరు, ఉంగుటూరులో టీడీపీ అభ్యర్థులపై స్పష్టత వచ్చేసింది. భీమవరం, నరసాపురం, పోలవరం (ఎస్టీ) సీట్లు జనసేనకు ఇవ్వడం ఖరారైందని ఆ రెండు పార్టీల అంతరంగిక వర్గాల ద్వారా తెలుస్తోంది. జనసేనకు ఇచ్చే సీట్లన్నీ డెల్టా ప్రాంతంలోనే ఉండడంతో కొంత మార్పు కోసం ఏజెన్సీలోని పోలవరం సీటును ఆ పార్టీకి కేటాయించినట్లు చెబుతున్నారు. ఇప్పటికి ఖరారైనవిగాక ఆ పార్టీ మరో రెండు సీట్లు కోరుతోంది. తాడేపల్లిగూడెం, నిడదవోలు, కొవ్వూరు(ఎస్సీ)ల్లో రెండు ఇవ్వాలని అడుగుతోంది. టీడీపీ ఒకటి ఇస్తుందా లేక రెండూ ఇస్తుందా అన్న విషయంలో స్పష్టత రాలేదు.

ఉండిపై ఉత్కంఠ..

ఆచంటలో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, పాలకొల్లులో టీడీఎల్పీ ఉప నేత నిమ్మల రామానాయుడు, తణుకులో మాజీ ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ, ఉంగుటూరులో మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు, దెందులూరులో మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఏలూరులో బడేటి రాధాకృష్ణయ్య టీడీపీ అభ్యర్థులుగా పోటీ చేయడం ఖాయమైంది. సిటింగ్ ఎమ్మెల్యే ఉన్న ఉండి నియోజకవర్గంపై మాత్రం కొంత ఉత్కంఠ నెలకొందని అంటున్నారు. ప్రస్తుతం ఉండికి టీడీపీ ఎమ్మెల్యే మంతెన రామరాజు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అదే సీటును అక్కడి మాజీ ఎమ్మెల్యే శివరామరాజు కూడా ఆశిస్తున్నారు. గత ఎన్నికల్లో సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న శివరామరాజు తన సీటును మంతెనకు ఇచ్చి తాను నరసాపురం లోక్‌సభ స్థానంలో పోటీ చేసి ఓడిపోయారు. ఈసారి తన సీటు తనకివ్వాలని ఒత్తిడి తెస్తున్నారు. శివరామరాజును నరసాపురంలో పోటీ చేయించాలని టీడీపీ అధిష్ఠానం తొలుత అనుకుంది. ఇప్పుడా సీటును జనసేనకు ఇస్తుండడంతో ఉండిపై ఏ నిర్ణయం జరగబోతోందన్నది ఆసక్తికరంగా మారింది. కొవ్వూరు(ఎస్సీ)లో మాజీ మంత్రి కేఎస్ జవహర్‌పై స్థానిక టీడీపీ నేతల నుంచి గట్టి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దీంతో ప్రత్యామ్నాయంగా ముప్పిడి వెంకటేశ్వరరావు, ముప్పిడి రాజు, వేమగిరి వెంకట్రావు పేర్లు పరిశీలిస్తున్నారు. గోపాలపురం(ఎస్సీ) ఇన్‌చార్జి వెంకటరాజు కూడా స్థానికంగా ఒక పెద్ద వర్గం నుంచి వ్యతిరేకత చవిచూస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును అభ్యర్థిగా ఎంపిక చేయాలని ఆవర్గం కోరుతోంది. చింతలపూడి (ఎస్సీ)లో డాక్టర్ అనిల్ బొమ్మాజీ, రోషన్ మధ్య పోటీ నెలకొంది. ఇక్కడ కొత్తగా వైసీపీ సిటింగ్ ఎమ్మెల్యే ఎలీజా కూడా రేసులోకి వచ్చారు. దీంతో ఇక్కడా నిర్ణయం జరగలేదు. పోలవరం (ఎస్టీ) సీటు జనసేనకు ఒకవేళ వెళ్లకపోతే.. టీడీపీ ఇన్‌చార్జి బురగం శ్రీనివాస్‌కు అవకాశం దక్కవచ్చని అంటున్నారు.

'పశ్చిమ'లో ఖరారైన సీట్లు..

నియోజకవర్గం	అభ్యర్థి
ఏలూరు	బడేటి రాధాకృష్ణయ్య
దెందులూరు	చింతమనేని ప్రభాకర్
ఆచంట	పితాని సత్యనారాయణ
ఉంగుటూరు	గన్ని వీరాంజనేయులు
పాలకొల్లు	నిమ్మల రామానాయుడు
తణుకు	అరిమిల్లి రాధాకృష్ణ
భీమవరం	జనసేన
నరసాపురం	జనసేన
పోలవరం (ఎస్టీ)	జనసేన

టీడీపీ తరఫునా.. బీజేపీ నుంచా?

ఈ జిల్లాలో నరసాపురం వైసీపీ ఎంపీ రఘురామకృష్ణంరాజు ఈసారి టీడీపీ టికెట్‌పై పోటీ చేస్తారని మొదట అనుకున్నారు. తాజాగా టీడీపీ, బీజేపీ మధ్య మైత్రి చిగురించడంతో ఆయన ఇప్పుడు బీజేపీ తరఫున పోటీ చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఏలూరు లోక్‌సభ స్థానానికి గోపాల్ యాదవ్‌ను టీడీపీ అధిష్ఠానం గతంలో ఖరారు చేసింది. తాజా పరిణామాల్లో ఆయన పేరు వెనక్కి వెళ్లినట్లు చెబుతున్నారు. మరో అభ్యర్థి కోసం అన్వేషణ జరుగుతోంది. ఈ సీటును బీజేపీ కూడా ఆశిస్తోంది. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి ప్రయత్నం చేసుకుంటున్నారు.

కృష్ణా జలాల వివాదంపై విచారణ మార్చి 13కు వాయిదా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల వివాదానికి సంబంధించిన కేసు విచారణను సుప్రీంకోర్టు మార్చి 13కు వాయిదా వేసింది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కృష్ణా ట్రిబ్యునల్ 2 టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీవోఆర్)పై స్టే విధించాలని ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఏపీ ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా వాదనలు వినిపిస్తూ... కేసుకు సంబంధించి ప్లీడింగ్స్ పూర్తయ్యాయని, వాదనలకు మరికొంత సమయం కావాలని విజ్ఞప్తి చేశారు. దీంతో విచారణను మార్చి 13కు వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది.

క్రమబద్ధీకరణకు నోచని అగ్రి ఎంపీఈవోలు

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని వాగ్దానం చేసిన జగన్ సర్కార్.. వ్యవసాయ శాఖలోని బహుళ ప్రయోజన విస్తరణాధికారు(ఎంపీఈవో)లను విస్మరించింది. వ్యవసాయ శాఖలో 1,611 మంది ఎంపీఈవోలు దశాబ్ద కాలం నుంచి కాంట్రాక్ట్ విధానంలో పని చేస్తున్నారు. కొంత మందిని డిప్యూటేషన్‌పై ఇతర జిల్లాల్లో నియమించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఎంపీఈవోలకు వేతనాలు ఇవ్వట్లేదు. నెలకు రూ.12 వేలు మాత్రమే ఇస్తున్నారని చెప్తున్నారు. జిల్లా ఎంపిక కమిటీ ద్వారా నియమితులైన ఎంపీఈవోలు సమాన పనికి సమాన వేతనం కింద మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలని కోరుతున్నా.. ప్రభుత్వం ఆలకించడం లేదు. ఇతర ఉద్యోగుల మాదిరి వీరికి పీఆర్సీ, హెచ్ఆర్, ఈహెచ్ఎస్, ఇతర అలవెన్స్‌లు అమలు కావట్లేదు. నెలనెలా జీతాలు కూడా అందడం లేదు. పైగా ఆర్బీకేల్లో నియమించిన ఎంపీఈవోలపై అదనపు పనిభారం మోపుతున్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల

- 6100 పోస్టుల్లో ఎస్జీటీ 2,280, స్కూల్ అసిస్టెంట్ 2,299
- నాలుగు జిల్లాల్లో 300 దాటని ఖాళీలు
- ఎస్జీటీ పోస్టులకు బీఈడీ వారూ అర్హులే
- సంస్కరణలపై శిక్షణ కోసమే అప్రెంటీస్
- విద్యా మంత్రి ఉద్ఘాటన

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం ఎట్టకేలకు ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేసింది. దాదాపు ఐదేళ్లపాటు ఒక్క టీచర్ పోస్టునూ భర్తీ చేయని ప్రభుత్వం.. ఎన్నికల వేళ రాజకీయ లబ్ధిని ఆశిస్తూ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టింది. అయితే, ఎన్నికల సమయంలో భర్తీ ప్రక్రియ సజావుగా సాగుతుందా? లేదా? అనేదాంతో సంబంధం లేకుండా 'నోటిఫికేషన్ ఇచ్చేశాం' అన్న చందంగా ప్రక్రియను ప్రారంభించింది. డీఎస్సీకి సంబంధించి జీవో 11, 12లను సోమవారం పాఠశాల విద్యా శాఖ జారీచేసింది. సొసైటీల పరిధిలోని పోస్టులకు ఒక జీవో, జిల్లా పరిషత్, మండల పరిషత్, ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలల్లో పోస్టులకు మరో జీవోను విడుదల చేసింది. ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలు, మోడల్ స్కూల్స్, గిరిజన, బీసీ సంక్షేమ పాఠశాలలకు సొసైటీల పేరుతో ఉత్తర్వులు ఇచ్చింది. మొత్తంగా 6,100 పోస్టులు భర్తీ చేయబోతున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. వీటిలో సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ) పోస్టులు 2,280, స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ) 2,299, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ) 1,264 పోస్టులున్నాయి. పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ) పోస్టులు 215, ప్రిన్సిపాల్ పోస్టులు 42 ఉన్నాయి. ఇందులో టీజీటీ, పీజీటీ, ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ పోస్టులు జోనల్ పరిధిలోకి వస్తాయి. మిగతా పోస్టులను ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికగా భర్తీ చేస్తారు. జిల్లా సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో భర్తీ ప్రక్రియ జరుగుతుంది. మొత్తం 100 మార్కులకు జరిగే పరీక్షలో డీఎస్సీకి 80 శాతం, టెట్‌కు 20శాతం వెయిటేజీ ఇస్తారు. పీఈటీలకు టెట్ ఉండదు కాబట్టి టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్‌టీ)ని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. స్కూల్ అసిస్టెంట్‌లకు గ్రాడ్యుయేషన్, బీఈడీ ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఎస్జీటీలకు ఇంటర్మీడియట్, డీఎడ్ ఉండాలని తెలిపింది. అయితే, ఎస్జీటీ పోస్టులకు బీఈడీ అర్హత ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. వయోపరిమితి జనరల్ అభ్యర్థులకు 44, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 49, దివ్యాంగులకు 54గా నిర్ణయించింది. మొత్తం డీఎస్సీ పరీక్షలు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) విధానంలో జరుగుతాయని వివరించింది. డీఎస్సీ కమిటీకి జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, జేసీ వైస్ చైర్మన్‌గా, డీఈవో సభ్యకార్యదర్శిగా వ్యవహరిస్తారని తెలిపింది.

వెబ్‌సైట్ ప్రారంభం

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సోమవారం సచివాలయంలో డీఎస్సీకి సంబంధించిన వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. నోటిఫికేషన్‌కు సంబంధించిన వివరాల కోసం 9505619127, 9705655349 నంబర్లతో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేనాటికి టీచర్ పోస్టుల్లో జీరో ఖాళీలు ఉండాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇక పై ఏటా ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేస్తామని చెప్పారు. తమ హయాంలో విద్యా రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని, వాటిపై శిక్షణ ఇవ్వడం కోసమే అప్రెంటీస్ విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టామని మంత్రి తెలిపారు. ఖాళీలు ఎక్కువగా ఉన్నాయని పార్లమెంటులో కేంద్రం ప్రకటించిన విషయాన్ని ప్రస్తావించగా... కేంద్రానికి ఆ సమాచారం తాము ఇవ్వలేదన్నారు.

బీఈడీ అభ్యర్థులు అర్హులే

బీఈడీ చేసినవారు ఎస్జీటీ పోస్టులకు అర్హులు కాదని సుప్రీంకోర్టు చెప్పలేదని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్ వివరణ ఇచ్చారు. రాజస్థాన్ విషయంలో సుప్రీం తీర్పు వచ్చిందని, కానీ ఆ తర్వాత కూడా పలు రాష్ట్రాలు ఎస్జీటీ పోస్టులకు బీఈడీకి అర్హత కల్పించాయన్నారు. రాష్ట్రంలో కూడా అభ్యర్థుల వినతి మేరకు అదే విధానం అమలు చేస్తున్నామన్నారు. డీఎస్సీకి ఫిబ్రవరి 21 వరకు ఫీజులు చెల్లించవచ్చని, 22 వరకు దరఖాస్తు స్వీకరిస్తామని తెలిపారు. అభ్యర్థులు జోనల్ పోస్టులు, జిల్లా పోస్టులు రెండూ రాయొచ్చని పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ స్పష్టం చేశారు.

నాలుగో వంతు కర్నూలులోనే

ప్రభుత్వం 6100 పోస్టులకు డీఎస్సీ ప్రకటిస్తే అందులో ఒక్క ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే 1,693 పోస్టులున్నాయి. వీటిలో 1,022 ఎస్జీటీ, 550 స్కూల్ అసిస్టెంట్ పోస్టులున్నాయి. మిగిలిన జిల్లాల్లో ఒక్క ప్రకాశంలోనే 500 పోస్టులుపైబడి ఉన్నాయి. మరో నాలుగు జిల్లాల్లో 300 లోపే పోస్టులున్నాయి. శ్రీకాకుళంలో 283, విజయనగరంలో 284, కృష్ణాలో 279, కడపలో 289 పోస్టులున్నాయి. విశాఖపట్నం జిల్లాలో గిరిజన పాఠశాలలను మినహాయిస్తే జనరల్ ఎస్జీటీ పోస్టులు కేవలం 14 ఉన్నాయి. వీటిలో టీజీటీ, పీజీటీ, పీడీ, ప్రిన్సిపాల్ పోస్టులను జోనల్ ప్రాతిపదికగా భర్తీ చేస్తారు.

ఉమ్మడి జిల్లాల వారీగా వివరాలు

జిల్లా	ఎస్జీటీ	స్కూల్ అసిస్టెంట్	టీజీటీ	మొత్తం
శ్రీకాకుళం	104	130	49	283
విజయనగరం	103	97	84	284
విశాఖపట్నం	101	133	95	329
తూర్పు గోదావరి	108	182	102	392
పశ్చిమ గోదావరి	102	145	59	306
కృష్ణా	103	111	65	279
గుంటూరు	109	170	137	416
ప్రకాశం	111	299	93	503
నెల్లూరు	104	140	102	346
చిత్తూరు	101	97	139	336
కడప	105	81	103	289
అనంతపురం	107	164	115	386
కర్నూలు	1022	550	121	1693
మొత్తం	2280	2299	1264	5843

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఎన్నికలకు ముందు...

సాంకేతికంగా కాకపోయినా, 17వ లోక్‌సభ సభాకాలం ముగిసిపోయింది. త్వరలోనే ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించబోతున్నారు. ఫిబ్రవరి 10వ తారీకు శనివారం నాడు సభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన ప్రసంగం ఒక అధ్యాయం ముగింపును సూచించింది. గత అయిదు సంవత్సరాల పాలనను సమీక్షించింది. అంతే కాదు, అనంతర అధ్యాయంలో కూడా తన పరిపాలనే కొనసాగుతుందన్న ధీమా కూడా ఆయన మాటల్లో వ్యక్తమైంది.

ఇదే ప్రభుత్వం మరింత బలంతో అధికారంలోకి రానున్నదన్న అభిప్రాయం సర్వత్రా వ్యాపించి ఉన్న సానుకూల వాతావరణంలో, ఎన్నికల ప్రకటన రానున్నది. పదిహేడో లోక్‌సభ కాలంలో తన ప్రభుత్వం సాధించిన కీలక-విజయాల కింద ఆర్టికల్ 370 రద్దు, మహిళా రిజర్వేషన్ల బిల్లు, ట్రిపుల్ తలాఖ్ నిషేధం, కొత్త నేరచట్టాల రూపకల్పనలను ప్రధాని మోదీ ప్రముఖంగా పేర్కొన్నారు. దృఢ నిర్ణయాలు తీసుకోగలిగిన బలమైన ప్రభుత్వమే ఇవి సాధించగలదని ఆయన అన్నారు. వచ్చే ఎన్నికల్లో మరింత బలం తమకు సమకూరిస్తే, మరిన్ని సాహస నిర్ణయాలు తీసుకోగలనన్న సూచన కూడా ఆ మాటల వెనుక ఉన్నది.

సాధించిన విజయాల ప్రతిష్ఠ మీద మాత్రమే నరేంద్రమోదీ, ఆయన పార్టీ ఆధారపడదలచుకోలేదు. ఈ ఎన్నికల్లో శ్రీరాముడి అండదండలు తమకు పుష్కలంగా లభిస్తాయని, తాము ఆలయం నిర్మించినందుకు అవతారపురుషుడు తమకు ప్రతిఫలితం అందిస్తారని వారు గట్టి విశ్వాసంతో ఉన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ మొదటి రోజున నరేంద్రమోదీ లోక్‌సభలో ప్రవేశిస్తున్నప్పుడు ఆయన పార్టీ సభ్యులంతా 'జై శ్రీరామ్' అని ఉత్సాహంగా నినాదాలు ఇచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ తమ మత, రాజకీయ, జాతీయతా నినాదాలన్నిటినీ 'జై శ్రీరామ్'లోనే దర్శిస్తున్నట్టు అనిపించింది. లోక్‌సభ చివరి రోజున రాష్ట్రపతికి ధన్యవాదాల తీర్మానంతో పాటు, అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ఠ జరిగిన కార్యక్రమాన్ని శ్లాఘిస్తూ కూడా తీర్మానం ఆమోదం పొందింది. రామమందిర శ్లాఘ తీర్మానం చేయడం ద్వారా "భవిష్యత్ తరాలు తమ వారసత్వ విలువల గురించి గర్వపడడానికి రాజ్యాంగ బలాన్ని సమకూర్చినట్టయింద"ని ప్రధాని అన్నారు. అంతే కాదు, రామమందిర నిర్మాణం 'సరికొత్త తరహా ప్రజాపాలనకు, సంక్షేమానికి' దారితీస్తుందని ఆయన అన్నారు. రామమందిర తీర్మానం మీద మాట్లాడడానికి ప్రతిపక్షాలు ముందుకు రాకపోవడాన్ని ప్రధాని విమర్శించారు. అందరికీ అన్నిపనులూ చేయగలిగే ధైర్యం ఉండదని అన్నారు. ఎన్నికలకు ముందు పార్లమెంటు చివరి రోజు సమావేశాలు చూస్తే, ఇంతకాలం ప్రత్యేకంగా ఉన్న అనేక రంగాలు, వ్యవస్థలు అన్నీ కలగలసిపోయినట్టు అనిపించింది.

ఈ దేశానికి ఒకే రాజ్యాంగం ఉండాలన్న సుదీర్ఘకాలపు ఆకాంక్ష, ఆర్టికల్ 370 రద్దుతో నెరవేరిందని, ఈ చర్యతో జమ్మూకశ్మీర్ ప్రజలకు న్యాయం దొరికినట్టయిందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. శతాబ్దాలుగా నిరీక్షించిన పనులన్నీ ఈ సభాకాలంలో పూర్తయ్యాయని ఆయన సంతృప్తి ప్రకటించారు. ప్రజల దైనందిన జీవితాల నుంచి ప్రభుత్వం ఎంత తొందరగా నిష్క్రమిస్తే, అంతగా ప్రజాస్వామ్యం వర్ధిల్లినట్టు అని మోదీ ఈ సందర్భంగా ఒక వ్యాఖ్య చేశారు. మరి, ప్రజల వ్యక్తిగత జీవితాల్లో భాగమైన మతంలోకి ఈ ప్రభుత్వం ఎందుకింత గాఢంగా ప్రవేశిస్తోందో మాత్రం అర్థం కాదు.

ఈ విజయాలు, ప్రధానంగా ఉద్వేగ పూరిత విజయాలు, భారతీయ జనతాపార్టీకి అనుకున్నంత ఘనవిజయాన్ని అందిస్తాయా, వారు కోరుకుంటున్న 400 స్థానాల గమ్యాన్ని చేరుకుంటారా అన్నది చూడవలసి ఉన్నది. ఉద్వేగ పూరిత అంశాలకు, వాస్తవ భౌతిక సమస్యలకు మధ్య స్పర్థ ఏర్పడితే ప్రజల స్పందన ఎట్లా ఉంటుందో కూడా చూడాలి. కనీసమద్దతు ధర కోసం రైతాంగం దేశరాజధానిలో మళ్లీ మోహరించబోతున్నది, అందుకు తగ్గట్టుగా నిర్బంధచర్యలు కూడా కేంద్రం తీసుకుంటున్నది. ఒక్కొక్కరు జారుకోవడం, పొత్తులు కాక కత్తులు దూసుకోవడం, మహాబలశాలి బీజేపీని ఎదుర్కొనలేని నిస్సహాయతలో కూరుకుపోవడం, వీటి మధ్య ప్రతిపక్ష ఇండియా కూటమి అత్యంత బలహీనంగా కనపడుతున్నది కానీ, దైనందిన సమస్యల మీద పోరాటాలు నిర్మించగలిగితే బాధిత ప్రజానీకం అందుకు సిద్ధంగానే ఉన్నారు. ఎక్కడ ప్రజలు ఉద్వేగాలకు అతీతంగా ఆలోచిస్తారో అన్న భయంతో, మతతత్వ శక్తులు దేశంలో అక్కడక్కడా హింసను సృష్టించి, విభజన వాతావరణాన్ని సజీవంగా ఉంచడానికి ప్రయత్నిస్తున్నాయి.

అపార బలం ఉన్న ప్రభుత్వానికి ఏదైనా చేయగలిగిన సాహసం కూడా ఉంటుంది. ఆ ధైర్యసాహసాలతో అవినీతిని, నల్లధనాన్ని, ఆర్థిక అంతరాలను, సామాజిక హెచ్చుతగ్గులను కూలదోయడానికి ప్రయత్నించవచ్చు కదా అనిపిస్తుంది. కానీ, విపరీతమైన బలం కలిగిన ప్రభుత్వాలు తమ ప్రతాపాలను ఎప్పుడూ ప్రజల మీదనే చూపిస్తాయని చరిత్ర చెబుతోంది.

అద్వితీయ యశోధనుడు

ప్రస్తుత లోక్‌సభ చివరి సమావేశాలు ముగిశాయి. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయి. దేశ ప్రజలు మళ్లీ ఒక్కసారి తమ భవిష్యత్తును నిర్ణయించుకునే సమయం ఆసన్నమైంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వారు అనేక పార్టీల ప్రభుత్వాలను చూశారు. 1947 నుంచి ఇప్పటి వరకూ 14 మంది ప్రధానమంత్రుల పాలనా తీరును వారు గమనించారు. అందరికన్నా ఎక్కువగా జవహర్‌లాల్ నెహ్రూ ఈ దేశాన్ని పరిపాలించారు. బ్రిటిష్ వారు అధికారంలో ఉన్నప్పుడు కూడా నెహ్రూ దాదాపు ఏడాది పాటు 1946 సెప్టెంబర్ 2 నుంచి 1947 ఆగస్టు 14 వరకు ప్రధానిగా ఉన్నారు. కాని అప్పుడు ఆయన ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రధాని కాదు. కాంగ్రెస్ పార్టీలో మెజారిటీ నేతలు సర్దార్ పటేల్‌ను, ప్రధానిగా ఎన్నుకోవాలని తీర్మానించినప్పటికీ నెహ్రూ వైపు గాంధీజీ మొగ్గు చూపించారని మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ తన పుస్తకం 'ఇండియా విన్స్ ఫ్రీడమ్'లో తెలిపారు. దీని మూలంగా స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా 1947 నుంచి 1964లో చనిపోయే వరకు 17 సంవత్సరాలు నెహ్రూయే ప్రధానిగా కొనసాగారు. తాను జీవించి ఉన్నప్పుడే ఆయన ఇందిరాగాంధీని కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమించి పార్టీ, ప్రభుత్వం ఆమె చెప్పుచేతల్లో ఉండేలా చూశారు. అందుకే కేవలం 19 నెలలు పాలించిన లాల్ బహదూర్ శాస్త్రి మరణించగానే 1966లో ఆమెనే ప్రధానమంత్రిగా ఎన్నుకున్నారు. ఈ రకంగా దేశంలో వారసత్వ పాలనకు నెహ్రూనే నాంది పలికారు. ఇందిర 15 సంవత్సరాలు, ఆమె కుమారుడు రాజీవ్ గాంధీ మరో అయిదు సంవత్సరాలు పాలించారు. అంటే దాదాపు 38 సంవత్సరాలు నెహ్రూ–గాంధీ కుటుంబమే ఈ దేశాన్ని ఏలింది. యూపీఏ హయాంలో 2004 నుంచి 2014 నుంచీ మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పటికీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీయే నడిపారని, ఆమె కుమారుడు రాహుల్ కూడా పెత్తనం చలాయించారని దేశ రాజకీయాలు తెలిసిన వారందరికీ తెలుసు.



■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

తమ కుటుంబానికి చెందని మాజీ ప్రధాని పి.వి. నరసింహారావును సోనియా, ఆమె వందిమాగధులు ఎన్నో ముప్పు తిప్పలు పెట్టారు. పి.వి మరణించిన తర్వాత ఆయన భౌతిక కాయాన్ని కూడా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోకి అనుమతించలేదు. ఢిల్లీలో కూడా అంత్యక్రియలకు నోచుకోకుండా చేశారు. స్వాతంత్ర్య సమరయోధుడుగా, నిజాంకు వ్యతిరేక పోరాటం చేసిన నేతగా, ఆర్థిక సంస్కరణలతో ఈ దేశా ముఖ స్వరూపాన్ని మార్చిన మేధావిగా, సాహితీవేత్తగా, బహుభాషా కోవిదుడుగా ఈ దేశానికి పీవీ సేవలను కాంగ్రెస్ విస్మరించింది.

పి.విని అవమానించడమే కాదు, ఆయనకు ముందు చరణ్ సింగ్, ఐకే గుజ్రాల్, దేవెగౌడ ప్రభుత్వాలను ఉత్తి పుణ్యానికి పడగొట్టిన ఘనత కూడా కాంగ్రెస్‌దే సుమా! పీవీతో పాటు భారతరత్న పురస్కారాన్ని పొందిన చరణ్ సింగ్ సాధారణ నేత కాదు. గాంధీజీ ప్రేరణతో ఆయన స్వాతంత్రోద్యమంలో ప్రవేశించారు. పలుసార్లు జైలుకు వెళ్లారు. స్వాతంత్ర్య పూర్వమే యునైటెడ్ ప్రావిన్సెస్ శాసనసభ్యుడుగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి చరణ్ కృషి చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత విప్లవాత్మక భూసంస్కరణల చట్టాలను ప్రవేశపెట్టేందుకు కృషి చేశారు. 1959లో నాగపూర్ కాంగ్రెస్ సదస్సులో నెహ్రూ విధానాలను తీవ్రంగా వ్యతిరేకించారు. ఉత్తరప్రదేశ్‌లో తొలి కాంగ్రెసేతర ముఖ్యమంత్రిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారు. ఈ నేపథ్యంలో పి.వీ, చరణ్ సింగ్‌లతో పాటు మన దేశంలో హరిత విప్లవానికి కారణమైన రైతాంగ శాస్త్రవేత్త స్వామినాథన్‌కు కూడా భారత రత్న పురస్కారాన్ని అందించడం ద్వారా మోదీ ప్రభుత్వం వారి జ్ఞాపకాలను సుస్థిరం చేసిందనడంలో సందేహం లేదు.



గతంలో కాంగ్రెసేతర ప్రధానమంత్రులు సంకీర్ణ ప్రభుత్వాలను నిర్వహిస్తే, నరేంద్రమోదీ సంపూర్ణ మెజారిటీ సాధించిన ఏకైక కాంగ్రెసేతర ప్రధానమంత్రి. ప్రధానమంత్రిగా నెహ్రూ రికార్డును బద్దలు చేసేందుకు మోదీ మూడో టర్మ్ అఖండ మెజారిటీతో ఎన్నిక కాబోతున్నారు. తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 364 సీట్లు సాధిస్తే ఇప్పుడు బీజేపీ స్వయంగా ఈ రికార్డును బద్దలు చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నది.

గతంలో కాంగ్రెసేతర ప్రధానమంత్రులు సంకీర్ణ ప్రభుత్వాలను నిర్వహిస్తే, నరేంద్రమోదీ సంపూర్ణ మెజారిటీ సాధించిన ఏకైక కాంగ్రెసేతర ప్రధానమంత్రిగా చరిత్రలో నిలిచిపోయారు. 1952లో తొలి సార్వత్రిక ఎన్నికల తర్వాత ప్రధానమంత్రి అయిన నెహ్రూ 12 సంవత్సరాలు ఆ పదవిలో కొనసాగితే, నెహ్రూ రికార్డును కూడా బద్దలు చేసేందుకు మోదీ మూడో టర్మ్ కూడా ప్రజాస్వామికంగా అఖండ మెజారిటీతో ఎన్నిక కాబోతున్నారనేది ఇవాళ అందరూ అంగీకరించిన సత్యం. తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 364 సీట్లు సాధిస్తే ఇప్పుడు బీజేపీ స్వయంగా ఈ రికార్డును బద్దలు చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నది. నాడు కాంగ్రెస్‌కు ప్రతిపక్షమే లేదు కనుక అప్పటి విజయం పెద్ద గొప్పది కానే కాదు. కాని ఇప్పుడు గత పది సంవత్సరాలుగా బీజేపీని ఓడించేందుకు ప్రతిపక్షాలు సర్వశక్తులు ఒడ్డి, రకరకాల ఎజెండాలతో పోరాడుతున్నప్పటికీ వాటి ప్రయత్నాలను తుత్తునియలు చేసిన నరేంద్రమోదీదే నిజమైన విజయం అని చెప్పక తప్పదు.

ఈ విజయం సాధించేందుకు ప్రధాన కారణం— స్వాతంత్ర్యానంతరం ఆరుదశాబ్దాల పాటు గాంధీ కుటుంబ వారసులు నిర్వహించిన పాలనకూ మోదీ పాలనకూ ఉన్న తేడాను ప్రజలు గమనించడమే. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పేరుతో ప్రజల ముందుకు వెళ్లి అమలు చేస్తున్న అభివృద్ధిని, సంక్షేమ పథకాలను వివరించేందుకు ప్రభుత్వమే ముందుకు వస్తున్న తీరు దాని ఆత్మ విశ్వాసానికి నిదర్శనం. ఆర్థికంగా బలహీనంగా ఉన్న మన దేశాన్ని కరోనా మహమ్మారిని కూడా లెక్క చేయకుండా, కేవలం పది సంవత్సరాల్లో ప్రపంచంలో అయిదు అగ్ర ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా మార్చడం సామాన్యమైన విషయం కాదు. వలస వాద పాలన నుంచి భారతదేశం బయటపడినా కాంగ్రెస్ హయాంలో ఆ వలస వాద బానిస సంస్కృతినే కొనసాగించారు. మోదీ హయాంలో భారతదేశం ఒక నిజమైన స్వతంత్ర దేశంగా ఆవతరించిందనే అభిప్రాయం ఇప్పుడు ప్రపంచమంతటా నెలకొంది. వలస పాలనకు చెందిన చట్టాలను రద్దు చేయడం, రక్షణ రంగంలో ఆత్మనిర్భరత, పటిష్ఠత, కర్తవ్య పథ్‌గా రాజ్‌పథ్ మారిన తీరు, అధునాతన పార్లమెంట్ భవన నిర్మాణం, దేశమంతటా పారిశ్రామిక, రహదారి కారిడార్లు, విమానాశ్రయాలు, ఉన్నత వైద్య, విద్యా సంస్థలు ఇవన్నీ మారుతున్న భారత్‌కు సంకేతం. భారతదేశానికి నాలుగు ప్రధాన స్తంభాలైన నారీ శక్తి, యువశక్తి, పేదలు, రైతుల అభివృద్ధికి, సంక్షేమానికి మోదీ సర్కార్ చేపట్టిన చర్యలు గతంలో ఏ ప్రభుత్వమూ చేపట్టలేదు. దళితులు, ఆదివాసీలు, ఓబీసీల సంక్షేమానికి, కూడా గతంలో కంటే ఎన్నో రెట్లు మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. మోదీ హయాంలో ప్రభుత్వ రంగాన్ని దెబ్బతీశారని విమర్శిస్తున్న ప్రతిపక్షాలు 2014లో 234 ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలు ఇప్పుడు 254కు పెరిగాయని, గత పదేళ్లలో వాటి నికర లాభాలు రూ. 1.25 లక్షల కోట్లనుంచి 2.5 లక్షల కోట్లకు పెరిగాయని, ప్రభుత్వ రంగ సంస్థల నికర విలువ రూ. 9.5 లక్షల కోట్ల నుంచి రూ. 17 లక్షల కోట్లకు పెరిగిందని ఎందుకు ప్రజలకు చెప్పడం లేదు? ప్రతిపక్షాలు నిజాలు చెప్పవని, అబద్ధాలు ప్రచారాలు చేస్తాయని ప్రజలకు తెలిసినందువల్లే ఇవాళ బీజేపీ విజయానికి ఢోకా లేకుండా పోయింది.

(బీజేపీ జాతీయ కార్యదర్శి)

కులం కదిలింది.. వర్ణం నిలిచింది.. మన చరిత్ర అదేనా?

పేరులో కులాన్ని సూచించటం మనకు కొత్తకాదు. రెడ్డి, నాయుడు, శాస్త్రి, శర్మ, త్రివేది, ద్వివేది, నాడార్, రాజ్‌పుత్, మోదీ, జోషి. ఇలా ఎన్నో కుల సూచికలు మన పేర్ల వెనుక కనపడతాయి. ఇలాంటి సూచికలను పెట్టుకోవటం నామోషీగా భావించే వారి సంఖ్య చాలా తక్కువ. పిలుపులో సౌలభ్యం కోసం వ్యక్తుల పేర్లు పొట్టివి అవుతున్నాయి. అంతమేరకు కుల సూచికలు తొలగిపోతున్నాయి. ఆధునిక భావాల ప్రభావంతో కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు కుల ప్రస్తావనలు లేని పేర్లను పెడుతున్నారు. సౌలభ్యం సంగతి ఎలా ఉన్నా కుల సూచికలతో ఇబ్బంది పడని వారి సంఖ్యే మనకు ఎక్కువ. ఎందుకంటే ఆ సూచికలు ఒక స్థాయిని, హోదాని వెల్లడిస్తాయి. అగ్రకులాల విషయంలో ఇది స్పష్టంగా కనపడుతుంది. దళితులకు ఈ వెసులుబాటు చాలా చోట్ల లేదు. ముఖ్యంగా తెలుగునాట ఇది కొట్టొచ్చినట్లు కనపడుతుంది. మాల, మాదిగ, ఎరుక, దొమ్మరి.. అనే పేర్లు వింటేనే తిరస్కారాన్ని, ఏహ్యతను, చిన్నచూపుని ప్రదర్శించే సంస్కృతి నిన్నమొన్నటి వరకూ అందరిలో పాతుకుపోయింది. దీన్ని నిరసిస్తూ ఒక ధిక్కార స్వరంతో తమ పేర్ల వెనుక మాల, మాదిగ అని పెట్టుకోవటం మామూలు విషయం కాదు. కులాల పేర్లను నిర్భీతిగా అసలు పేర్ల వెనుక తగిలించుకుని సముచిత గౌరవం, హక్కుల కోసం ప్రయత్నించటం 1990ల తర్వాత బాగా పెరిగింది. సామాజిక మార్పును విభిన్న రీతిలో కోరుకోవటంగా దీన్ని పరిగణించొచ్చు. అంబేడ్కర్ రాజకీయాల ప్రభావంతో మొదలైన ఈ ధోరణి సామాజిక న్యాయ ఆందోళనల్లో కొత్త ఒరవడిని సృష్టించింది.



మన చరిత్రలో దీనికి పూర్తిగా భిన్నమైన పరిణామం ఇంకోటి ఉంది. అది సుదీర్ఘకాలం జరిగింది. ఇంకా జరుగుతూనే ఉంది. సంప్రదాయ కులాల పేర్లలోనే తమను చిన్నచూపు చూసే పరిస్థితి ఉందని భావించిన వారు ఆ పేర్ల మార్పు కోసం చాలా ప్రయత్నాలు చేశారు. ప్రభుత్వాలకు వినతిపత్రాలు, మహజర్లు సమర్పించారు. బ్రిటిషు పాలనలో అది విస్తృతంగా జరిగింది. ఆనాటి జనాభా లెక్కల సమయంలో అదొక ఉద్యమంలా సాగింది. గ్రామాల్లో వాడుకలో ఉన్న కులాల పేర్ల స్థానంలో సంస్కృత పదాలతో కూడిన కొత్త పేర్లు వచ్చాయి. గొల్ల, మంగలి, చాకలి లాంటి పేర్ల స్థానాన్ని యాదవ, నాయిబ్రాహ్మణ, రజక లాంటి పేర్లు ఆక్రమించాయి. ఇలా పేర్ల మార్పుతో మొదలై అగ్రకులాల అలవాట్లు, పద్ధతుల వైపు పరుగులెత్తటం, అందుకోసం తీవ్ర ప్రయత్నాలు చేసిన సంఘటనలు మన చరిత్రలో చాలా కనిపిస్తాయి. అదొక సుదీర్ఘ ప్రయాణం. దేశంలో ఏదో ఒకచోట నిరంతరం సాగుతూనే ఉండేది. దీన్ని ఎలా చూడాలి? దాని ప్రాధాన్యతను ఎలా అర్థంచేసుకోవాలి? దాన్ని వివరించటానికి ఉపకరించే భావనను ఏమని పిలుచుకోవచ్చు? ఈ ప్రశ్నలను ఎంతో కొంత సమగ్రంగా అర్థంచేసుకోటానికి తోడ్పడిన పరిశోధనను చేసిన వారిలో సోషల్ ఆంథ్రపాలజిస్ట్ ఎం.ఎన్.శ్రీనివాస్‌ను ప్రముఖుడిగా భావించొచ్చు. సామాజికంగా కింది స్థాయిలో ఉన్న కులాలు పైకి ఎదగటానికి చేసే ప్రయత్నాలకు ఆయన సాంస్కృటైజేషన్ (సంస్కృతీకరణ) అని పేరుపెట్టారు. దీన్ని అర్థం చేసుకోటానికి చాతుర్వర్ణ సిద్ధాంతం చాలా అడ్డంకిగా ఉందని ఎన్నో ఉదాహరణలతో వివరించారు. అసలు ధర్మశాస్త్రాల్లో వర్ణించిన విధంగా మన సమాజం ఎప్పుడూ లేదు. ఆ గ్రంథాలన్నీ అప్పటికే ఉన్నత స్థానంలో ఉన్నవారు సమాజం ఇలా ఉండాలి... అలా ఉండాలి... అని నిర్దేశిస్తూ రాసినవిగానే చరిత్రకారులు భావిస్తారు. మన ప్రాచీన గ్రంథాల్లో వాస్తవాల వర్ణన శాతం చాలా తక్కువ. వాటిని ఆధారం చేసుకుని వివిధ ప్రాంతాలను పాలించిన రాజవంశాల పేర్లనే ఇప్పటికీ కచ్చితంగా నిర్ధారించలేం. సామాజిక జీవన చిత్రాన్ని వాటి నుంచి రాబట్టం చాలా కష్టం.

సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వ భావనలు బలమైన ఆదర్శాలుగా మన ముందుకు రానంతవరకూ కులవ్యవస్థ సృష్టించిన హెచ్చుతగ్గుల భావనలకు సవాళ్లు ఎదురుకాలేదు. వాటిని ఎదుర్కొనీ కుల భావనలు మనుగడ సాగించటం అంటే అసలైన ప్రజాస్వామ్య భావాలకు మనం చాలా దూరంలో ఉన్నట్లే లెక్క. ప్రస్తుతం మనకున్నది కుల భావనలు, కుల డిమాండ్లతో నిండిన ప్రజాస్వామ్యమే!

వర్ణాలను స్థూల శ్రమ విభజనకు నిదర్శనంగా మాత్రమే పరిగణించాలని చెప్పే వారూ ఉన్నారు. అలాగే వ్యక్తి గుణకర్మలను బట్టే వర్ణాల కేటాయింపు జరిగిందని వాదించే వారి సంఖ్యా తక్కువ కాదు. గుణకర్మలను బట్టి ఒక వర్ణం వారు ఇంకో వర్ణంలోకి మారే వెసులుబాటు ఉందని బోధించే వారూ మనకు కనపడతారు. సంప్రదాయవాదులు చేసే ఈ సమర్థనల జోలికి పోకుండా మన సమాజాన్ని అర్థం చేసుకోటానికి చాతుర్వర్ణ సిద్ధాంతం ఎలా అడ్డంకిగా మారిందో ఎం.ఎన్.శ్రీనివాస్ వివరించారు. మనది సుదీర్ఘ చరిత్ర ఉన్న కుల సమాజం. కులాలు ఎప్పటి నుంచో ఉన్నాయి. కాలక్రమంలో కొత్త కులాలూ వచ్చాయి. కులాల స్థాయి, హోదాల గురించి పెనుగులాటలూ జరిగాయి. చాతుర్వర్ణ సిద్ధాంతం ప్రకారం చూస్తే ఇవేమీ కనపడవు. వర్ణ సిద్ధాంతం ప్రకారం నాలుగే కులాలు/వర్ణాలు ఉంటాయి. వీటి హోదాలు శాశ్వతం. దళితులకు ఈ సిద్ధాంత చట్రంలో స్థానం లేదు. సమాజంలోని వందలాది కులాలను పరిగణనలోకి తీసుకుంటే ఇది చాలా అసంబద్ధంగా తోస్తుంది. వర్ణ సిద్ధాంతంలో మార్పునకు అవకాశం లేదు. కులాల పరిస్థితి దీనికి భిన్నం. కుల సమాజంలో ఎన్నో మార్పులు జరిగాయి. హోదాల పెంపుదల కోసం ప్రయత్నాలు నిరంతరం సాగుతూనే ఉండేవి. ఆ ప్రయత్నంలో కులాల మధ్య వివాదాలు ముదిరితే విషయం రాజు దగ్గరికి వెళ్లేది. ఏ కులం పెద్దది, ఏ కులం చిన్నది.. అన్న దాంట్లో తుది తీర్పు రాజుదే. హిందూ రాజులే కాకుండా ముస్లిం రాజులు కూడా ఈ తీర్పులు ఇచ్చేవారు.



■ రాహుల్ కుమార్

కుల వ్యవస్థకు రెండు ప్రత్యేక లక్షణాలు ఉన్నాయి. 1) బహుళ సంస్కృతులను అంగీకరించటం. అంటే ప్రతి కులానికి కొన్ని ప్రత్యేక పద్ధతులు, సంప్రదాయాలు ఉంటాయని ఆమోదించటం అన్న మాట. 2) పై స్థాయిలో ఉన్న కులాలను కింది స్థాయి వారు అనుకరించటం రెండో లక్షణం. ఈ అనుకరణ అనేది అన్నిచోట్లా సాఫీగా జరిగిందని భావించలేం. కొన్నిచోట్ల అది హింసకు, ప్రతిఘటనకు దారితీసింది. మరికొన్ని చోట్ల అంచెలంచెలుగా మాత్రమే ఆమోదం లభించింది. తమిళనాడు రామనాడ్ జిల్లాలోని కల్లాల కులస్థులు.. ఆది ద్రవిడుల విషయంలో విధించిన నిషేధాలను చూస్తే ప్రతిఘటన ఎంత తీవ్రంగా ఉండేదో తెలుస్తుంది. 1) ఆది ద్రవిడులు బంగారం, వెండి ఆభరణాలను ధరించకూడదు. 2) మగవాళ్లు నడుముకు పైభాగాన వస్త్రాలు వేసుకోకూడదు. 3) బనియన్లు, చొక్కాలు కూడా ధరించకూడదు. 4) జుట్టు కత్తిరించుకోకూడదు. 5) మట్టి పాత్రలు మినహా వేటినీ వాడకూడదు. 6) మహిళలు జాకెట్లు ధరించకూడదు. 7) పూలు పెట్టుకోకూడదు. కుంకుమపువ్వును వాడకూడదు. 8) పురుషులు గొడుగులను వాడకూడదు. చెప్పులను వేసుకోకూడదు.

దేవతారాధన, స్త్రీపురుష సంబంధాల్లో బ్రాహ్మణ పద్ధతులను అనుసరించటం చాలా చోట్ల జరిగినా అదే ఏకైక సంస్కృతీకరణ మార్గమని చెప్పలేం. కొన్ని కులాలకు ఒకప్పుడు అమ్మ దేవతలు తప్ప పురుష దేవతలే లేరు. శివాలయాలు, రామాలయాల సంగతే తెలియదు. బ్రాహ్మణులు కొలిచే దేవుళ్లకు స్థానంలేదు. ఆ వర్గ పూజారులకూ చోటు లేదు. సంస్కృతీకరణలో భాగంగా ఈ దేవుళ్లూ, పూజారులు వచ్చారు. సంస్కృతీకరణలో చాలా చోట్ల ప్రధానపాత్ర ఆధిపత్య కులానిది. ప్రతి ప్రాంతంలోనూ ఒకటో రెండో ఆధిపత్య కులాలు (కమ్మ, రెడ్డి, వెలమ, కాపు, ఒక్కలిగ, మరాఠీ లాంటివి) ఉంటాయి. సాధారణంగా వీటి ఉనికి ఆయా ప్రాంతాలకే పరిమితమై ఉంటుంది. వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు ఆధిపత్య కులాలు ఉంటాయి. ఈ కులాల చేతుల్లో సారవంతమైన భూములు ఉంటాయి. సంఖ్యాబలం కూడా ఉంటుంది. వీళ్ల మీద ఆధారపడి వృత్తి, సేవా కులాలు మనుగడ సాగించేవి. ఈ ఆధిపత్య కులాలను అనుకరించటం సంస్కృతీకరణలో చాలా చోట్ల కనపడుతుంది.

రాజ్యాధికారం కులాల బలాబలాలను చాలా ప్రభావితం చేసింది. రాజ్యాలను పాలించిన వాళ్లల్లో ఎక్కువ మంది కింది కులాల నుంచి వచ్చిన వారే. అధికారాన్ని పొందిన తర్వాత వీళ్లని సచ్ఛూద్రులని అన్నారు. అధికారాన్ని సుస్థిరం చేసుకుని బ్రాహ్మణులను పోషించటం మొదలుపెట్టాక క్షత్రియ హోదాను సంపాదించారు. తాము ఎప్పటి నుంచో క్షత్రియులమని చెప్పటానికి కల్పిత వంశచరిత్రలను రాయించుకున్నారు. యుద్ధాలతో రాజ్య వ్యవస్థ నిరంతరం ఒడిదుడుకులకు లోనయ్యేది. కేంద్రీకృత రాజ్యాలు మనకు తక్కువ. పరస్పరం సంఘర్షించే రాజ్యాలే ఎక్కువ. ఈ పరిస్థితి నిరంతర సైన్య సమీకరణకు అనుకూలంగా ఉండేది. సొంత కులం నుంచి సాహసికులను సమీకరించుకుని పోరాడిన వారికి రాజ్యాధికారం కొన్నిసార్లు దక్కేది. దాంతో కుల సామాజిక హోదా పెరిగేది. భక్తి ఉద్యమం కూడా సంస్కృతీకరణకు చాలా దోహదం చేసింది. ఒక మనిషి గౌరవం పుట్టుక కంటే అతను చేసే పనులపై ఆధారపడి ఉంటుందని భక్తికవులు బలంగా చెప్పారు. భక్తికి కర్మకాండలు అవసరం లేదనీ ప్రచారం చేశారు. అందుకే కింది కులాల నుంచి కూడా భక్తికవులు వచ్చారు. సంస్కృతీకరణలో మరో కోణం కూడా ఉంది. కింది కులాల అలవాట్లను కూడా పై కులాల వాళ్లు స్వీకరించిన ఉదంతాలూ ఉన్నాయి. కేరళలో కొన్ని చోట్ల పితృస్వామ్యం నుంచి మాతృస్వామ్యానికి మారిన సంఘటనలు కనపడతాయి. ఇక కుల వ్యవస్థలేని గిరిజనులపై కూడా సంస్కృతీకరణ ప్రభావం పడింది. అంటే కులాలు లేని చోట్ల అవి ఏర్పడేలా చేసింది. ఇక్కడ అనుకరణ తెగల్లో కులాలకు దారితీసింది.

మన చరిత్రను నిశితంగా చూస్తే మార్పులకు నోచుకోని జడపదార్థాల్లాగా కులాలను భావించలేం. సంస్కృతీకరణ వల్ల అర్థమయ్యేది అదే. సంస్కృతీకరణ వల్ల కులాల స్థానాలు మారాయి. కుల వ్యవస్థ మాత్రం మౌలికంగా చెక్కుచెదరలేదు. మధ్యస్థాయి కులాలు పలుచోట్ల పైకి ఎగబాకినా ముఖ్యంగా దళితులకు ఆ అవకాశం సైతం దక్కలేదు. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వ భావనలు బలమైన ఆదర్శాలుగా మన ముందుకు రానంతవరకూ కులవ్యవస్థ సృష్టించిన హెచ్చుతగ్గుల భావనలకు సవాళ్లు ఎదురుకాలేదు. వాటిని ఎదుర్కొనీ కుల భావనలు మనుగడ సాగించటం అంటే అసలైన ప్రజాస్వామ్య భావాలకు మనం చాలా దూరంలో ఉన్నట్లే లెక్క. ప్రస్తుతం మనకున్నది కుల భావనలు, కుల డిమాండ్లతో నిండిన ప్రజాస్వామ్యమే!

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

గోడల్ని పెంచుతున్న 'కుల' గురుకులాలు!

1973లో నేను ఒకటో తరగతిలో ఉన్నప్పుడు మా ఊరిలో ఒక ఆధిపత్య కుల కుటుంబంలో జరిగిన బాల్యవివాహ విందు భోజనానికి మా తాతగారిని ఆహ్వానిస్తే నన్ను కూడా వెంట తీసుకెళ్లాడు మమ్మల్ని వారి ఇంటి బయట రోడ్డుపై కూర్చోబెట్టి మాకు తగలకుండా భోజనం వడ్డించారు. నా ప్రశ్నలకు జవాబిస్తూ మా తాతగారు తక్కువ కులం వారిని ఇంట్లోకి రానివ్వరు అన్నాడు. కాలచక్రం గిర్రున తిరిగింది. నేను పదవ తరగతికి వచ్చేలోపు నా సహ విద్యార్థుల ఇండ్లలో కులంతో సంబంధం లేకుండా విందులకు వెళ్లేవారం. నేను డిగ్రీ చదివే సమయానికి కులాంతర వివాహాలు జరిగాయి. ఆ పదిహేను సంవత్సరాలలో మార్పు గురించి నేడు ఆలోచిస్తే ఆ ఆలోచనలన్నీ నేను చదివిన 'జిల్లా పరిషత్ హైస్కూల్' అనే మూలం దగ్గర ఆగినవి. గ్రామీణ పాఠశాలలు గొప్ప సామాజిక విప్లవ కేంద్రాలని అర్థం చేసుకున్నాను.

మనం చూస్తున్న గురుకులాలు. అవి రాష్ట్ర స్థాయిలో టాప్ ర్యాంక్‌కు పోటీపడి ఎన్నో ఉత్తమ ఫలితాలు సాధించాయి. ప్రస్తుత తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ మహేందర్ రెడ్డి ఇక్కడి నుండి వచ్చినవారే. కాలక్రమంలో మారిన ప్రభుత్వాలు కులాలకు మతాలకు వేర్వేరు గురుకులాలను ఏర్పాటు చేశాయి. అయితే కులాల మతాల గురుకులాలను ఏ లక్ష్యాల కోసం ఏర్పాటు చేసారో, ఆ లక్ష్యాలకు భిన్నమైన ప్రతికూల ఫలితాలు రావటం ఎవరూ గుర్తించడం లేదు. విద్యావేత్తలు ఎవ్వరూ ఈ అంశంపై మాట్లాడటానికి సాహసించడం లేదు. కారణం ఇది ఒక ఓటు బ్యాంకు 'కుల' రాజకీయ సరుకుగా మారడమే.

మరోకవైపు సాంకేతిక పరిజ్ఞానం, సామాజిక మాధ్యమాలు విస్తృతంగా అందుబాటులోకి రావడంతో నిజాలకంటే అబద్ధాలే ఎక్కువగా, వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. కులచైతన్యం పేరుతో

తెలంగాణ గురుకులాల్లో విద్యార్థిని తన కులానికే పరిమితం చేస్తున్నారు. ఒక విద్యార్థి తన 'కులం' విద్యార్థులతోనే ఎక్కువ కాలం గడిపితే సామాజిక వైవిధ్యాలను ఎలా అర్థం చేసుకుంటాడు? ప్రభుత్వం ఏర్పాటు చేయతలపెట్టిన 'ఎడ్యుకేషన్ హబ్'లలో కుల గురుకులాలు వేటికవే వేర్వేరుగా ఉండాలా, లేక ఒకే గురుకులంగా ఉండాలా అనే స్పష్టత కోసం విద్య, సామాజిక రంగాలపై పరిశోధనలు చేస్తున్న మేధావులను చర్చలో విస్తృతంగా భాగస్వాములు చేయాలి.

తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా కొలువుతీరిన కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో విద్య సంక్షేమ విషయాలపై ప్రత్యేక దృష్టి పెట్టి మండల స్థాయిలో రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటుకు పూనుకోవడం ఒక మంచి అడుగు. ఈ సందర్భంలో ప్రస్తుత గురుకులాల అంతిమ లక్ష్యాల సాధనపై కూడా ఒక సమీక్ష జరగాలి.

ఇదే నేపథ్యంలో నేటి తెలంగాణ రాష్ట్రంలో జరిగిన మంథని మధుకర్, మిర్యాలగూడ ప్రణయ్, సరూర్ నగర్ నాగరాజు పరువు హత్యలను కూడా ప్రస్తావించాల్సిందే. కులాల పుట్టుక, వాటి మధ్య ఉన్న అంతరాలపై అవగాహనా కల్పించే విద్యా బోధన లోపించటమే ఈ ఘటనల వెనుక ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. సరళీకృత ఆర్థిక విధానాలతో పుంజుకున్న ప్రైవేటు రంగ విస్తరణ విద్యారంగాన్ని సైతం లాభాల సరుకుగా మార్చింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యత క్రమంగా కుచించుకుపోయింది.

హైదరాబాద్ దక్కన్ నిజాం రాజ్యం భారతదేశంలో విలీనం అయిన తర్వాత ఆధునిక విద్యాలోపం వల్ల పరిపాలనలో అనేక సమస్యలు వచ్చాయి. పరిపాలన నైపుణ్యం కలిగిన ఉద్యోగుల కొరతను తీర్చడానికి అందుబాటులో ఉన్న విద్యాసౌకర్యాలతో గ్రామీణ ప్రాంతంలోని మట్టిలో మాణిక్యాలను గుర్తించి వెలికితీయడానికి పీవీ నరసింహారావు విద్యాశాఖ మంత్రిగా ఉన్నపుడు ఒక ఆలోచన చేశారు. తర్వాత ఆయన ముఖ్యమంత్రి అయ్యాకా 1971 నవంబర్ 23న దేశంలోనే తొలిసారి నల్గొండ జిల్లా సర్వేల్ నందు గురుకుల విద్యాబోధన ఏర్పాటు చేశారు. ప్రాచీన విద్యా బోధన సంస్కృతిని ప్రతిబింబించేలా ఉపాధ్యాయులూ విద్యార్థులూ ఒకే చోట ఉంటూ, ఉచిత భోజన వసతితో కూడిన ఆ గురుకుల విద్యాలయాలే నేడు



కులసంఘాల 'ఉపాధి ఉద్యమాలు' విరివిగా పెరిగాయి. పైకి కనిపించని రీతిలో కులవైషమ్యాలు స్థిరపడుతున్నాయి. సాంకేతిక పరిజ్ఞానంతో సోదర భావం పెరగాల్సిన చోట కూడా కులాల పేరుతో వాట్సాప్ గ్రూపులు ఏర్పడి కులాల మధ్య అగాధం మరింత పెరుగుతున్నది. గ్రామాలలో అన్ని వాడలు తిరగగలం అనుకునే వారికీ అగుపించని అదృశ్యపు కులగోడలు అడ్డుతగులుతున్నాయి. ఈ దూరాల్ని కులాల వారీ గురుకులాలు ఏ మాత్రం పూరించలేకపోవడమే కాకుండా వాటిని మరింత స్థిరపడేలా చేస్తున్నాయి.

ఆధునిక విద్యావిధానం అంతిమలక్ష్యం విద్యార్థి సమగ్ర మానసిక, సామాజిక వికాసాభివృద్ధిని పెంపొందించడంగా ఉండాలి. కాని తెలంగాణ గురుకులాల్లో విద్యార్థిని తన కులానికే పరిమితం చేస్తున్నారు. ఒక విద్యార్థి 11ఏళ్ళ వయసులో ఐదవ తరగతిలో గురుకుల పాఠశాలలో చేరితే 22ఏళ్ళ వరకు, అనగా డిగ్రీ వరకు, గురుకులాల్లో చదివే అవకాశాలు ఉన్నాయి. సౌకర్యాల గురించి పక్కన పెడితే, ప్రస్తుత 'కుల' గురుకుల వ్యవస్థ ఎంతవరకు విద్యార్థి సమగ్ర వికాసాభివృద్ధికి దోహదపడుతుందన్నదే పెద్ద ప్రశ్న. విద్యార్థి జీవితంలో ఎంతో కీలక దశగా విద్యావేత్తలు గుర్తించిన కౌమార దశ అనగా టీనేజ్‌లో విద్యార్థి భవిష్యత్తు నిర్ధారణ అవుతుంది. ఆ కాలంలో ఒక విద్యార్థి తన 'కులం' విద్యార్థులతోనే ఎక్కువ కాలం గడిపితే సామాజిక వైవిధ్యాలను ఎలా అర్థం చేసుకుంటాడు? సామజిక సవాళ్ళను ఎలా ఎదుర్కోగలడు? సమాజంలో ఇతర విద్యార్థులతో పోటీ పడే అవకాశం, ఇతరుల సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకునే అవకాశం కోల్పోతాడు కదా? తన 'కులం' వారే తనకు పోటీ అనే గిరిలో చిక్కుకుపోయి, రిజర్వేషన్ పరిధి దాటలేని పరిస్థితి కల్పించబడి, విద్యార్థి సమగ్ర ఎదుగుదల కుంటుపడుతుంది. దేన్ని ఆశించి ఈ 'కుల' గురుకులాల వ్యవస్థను పటిష్ఠం చేశారో ఇప్పుడు చర్చ చేయాల్సిన అవసరం ఉంది. 'కుల' గురుకులాల్లో చదివే విద్యార్థులు 'బిస్కెట్ బ్యాచ్'గా తయారై తమ కులానికి కేటాయించిన 'పరిమిత' రిజర్వేషన్‌లోనే పోటీపడే వ్యవస్థను నిర్మించడం ఏ విధంగా సమంజసం?

ప్రభుత్వం ఏర్పాటు చేయతలపెట్టిన 'ఎడ్యుకేషన్ హబ్'లలో కుల గురుకులాలు వేటికవే వేర్వేరుగా ఉండాలా, లేక ఒకే గురుకులంగా ఉండాలా అనే స్పష్టత కోసం విద్య, సామాజిక రంగాలపై పరిశోధనలు చేస్తున్న మేధావులను చర్చలో విస్తృతంగా భాగస్వాములు చేయాలి.

నేటి గురుకులాల్లో ఒక్కోదానిలో ఒక్కో రకమైన సదుపాయాలు ఉన్నవి. ఎడ్యుకేషన్ హబ్‌లో కుల గురుకులాలు వేరువేరుగా ఉన్నట్లయితే ఒక కుల గురుకులంలో కల్పిస్తున్న సౌకర్యాలు, మరో కుల గురుకులంలో లేకపోవడం వల్ల విద్యార్థుల మధ్య అసూయా ద్వేషాలు పెంపొందడానికి కారణమౌతాయి. ఇప్పటికే మైనారిటీ గురుకులాల్లో కల్పిస్తున్న సౌకర్యాలు ఇతర గురుకులాల్లో కల్పించడం లేదనే విమర్శ ఉంది. అంతేగాకుండా వేర్వేరు శాఖల, అధికారుల పర్యవేక్షణవల్ల ఒక్కోఅధికారి తనదైన ముద్ర వేసుకోవడానికి ప్రయత్నిస్తూ చేసిన ప్రయోగాలు ఆయా అధికారులు బదిలీ కాగానే కుంటుపడి మరో కొత్త విధానానికి తెరలేపడం వల్ల గురుకుల స్ఫూర్తికి స్థానం లేకుండా పోతున్నది. ఫలితాలివ్వని ప్రయోగశాలలుగా వెక్కిరిస్తున్నాయి. గతంలో పనిచేసిన ఒక అధికారి తన అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఏకంగా ఒక ప్రవేటు సైన్యాన్నే తయారు చేసుకొని దాని ఆధారంగా రాజకీయాల్లోకి వెళ్ళి విఫలమయ్యాడు. ఈ కుల గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు నీట్, ఐఐటీ లాంటి ప్రవేశ పరీక్షల్లో తమ కులరిజర్వేషన్ పరిధి దాటి ఓపెన్ కేటగిరిలో రాణించకపోవడమే వీటి వైఫల్యానికి సజీవసాక్ష్యం.

దేశం గర్వించదగ్గ రాజనీతిజ్ఞుడు, బహుభాషాకోవిదుడు, సాహితీవేత్త, దక్షిణాదికి చెందిన మాజీ భారత ప్రధాని పీవీ నరసింహారావు కలలుగన్న గురుకుల విద్యను సాకారం చేయాలంటే ముందుగా నేటి కుల గురుకులాలను సమూలంగా ప్రక్షాళన చేయాలి. అణగారిన వర్గాల రిజర్వ్‌డ్ కోటాకు ఏ మాత్రం భంగం వాటిల్లకుండా కుల మత రహిత గురుకులాల హబ్ ఏర్పాటే వీటి సఫలతకు మేలైన మార్గం.


• మామిడి నారాయణ
సెంటర్ ఫర్ బెటర్ ఇండియా రీసెర్చ్ ఫౌండేషన్

'గద్దర్ అవార్డ్'పై రౌండ్ టేబుల్ సమావేశం

ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నంది అవార్డ్‌ను గద్దర్ అవార్డ్‌గా ప్రకటించారు. ఇది చాలా సముచిత నిర్ణయంగా మేం భావిస్తున్నాం. అలాగే సినీ ప్రముఖులు సైతం దీనిని స్వాగతించారు. భారతదేశ సాంస్కృతిక చరిత్రలో చెరగని ధృవతార గద్దర్. ఆయన చేసిన ఐదు దశాబ్దాల కృషికి ఇది సరైన గౌరవం. ఈ సందర్భంగా సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నేటి ఉదయం పది గంటలకు కవులు, కళాకారులు, మేధావులు, సినీరంగ ప్రముఖులు, ప్రజా సంఘాలను కలుపుకొని "గద్దర్ అవార్డ్–సినీ ఇండ[illegible] అవుట్ లుక్" అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నాం. పసునూరి రవీందర్ అధ్యక్షత వహించే ఈ సమావేశంలో ప్రముఖ రచయిత ప్రొ. కంచ ఐలయ్య షెపర్డ్, జేబీ రాజు, బి. నర్సింగరావు, ఎన్. శంకర్, సుద్దాల అశోక్ తేజ, పాశం యాదగిరి, గాదె ఇన్నయ్య, విమలక్క, రియాజ్, కొల్లూరి భరత్, చీమ శ్రీనివాస్, ఎం.ఎం. రహమాన్, కందుకూరి రమేష్ బాబు తదితరులు పాల్గొంటారు.

— గద్దర్ గళం

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటొపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com





మద్యం మత్తులో కాల్వలో పడి మృతిచెందిన రవి (ఫైల్) (ఇన్‌సెట్‌లో) రోడ్డుపై మద్యం తాగుతున్న ఓ కార్మికుడు

దీన్నేమందురు..?

జగన్ హామీలన్నీ నెరవేర్చారంటూ గారడీ మాటలు

అసలు సెంట్రల్‌లో కీలకమైన సమస్యే మద్యపానం

వైసీపీ వచ్చాక పెరిగిన బార్లు, వైన్ షాపులు

పోలీస్ కేసుల్లో చాలావరకు మందు తాగి కొట్టుకున్నవే..

తెల్లవారితే చాలు.. రోడ్లపైనే సురాపానం

అసలు విషయాన్ని దాచేసి వెలంపల్లి కల్లబొల్లి కబుర్లు

'సెంట్రల్'లో ఫుల్లుగా తాగేస్తున్న మందుబాబులు

కీలకమైన మద్యపాన నిషేధం మాటెత్తని వెలంపల్లి

- వాంబేకాలనీకి చెందిన చిన్నం రవి కూలి పనులు చేస్తుంటాడు. ఈనెల 3వ తేదీ ఉదయం ఇంట్లో నుంచి పనికని వెళ్లాడు. తిరిగి రాత్రి ఇంటికి రాలేదు. ఉదయం చూసేసరికి మద్యం మత్తులో సైడ్ కాల్వలో పడి మృతిచెందాడు.

- సోమయ్య.. వాంబేకాలనీలో నివాసముంటున్నాడు. గత నెల 2వ తేదీ వాంబేకాలనీలోని హిందూ శ్మశానవాటికలో ఉన్న చిమ్నీపైకెక్కి వీరంగం వేశాడు. పోలీసులు ఎన్ని ప్రయత్నాలు చేసినా కిందకు రాలేదు. చివరకు పోలీసులు మద్యం సీసాలు కొని చూపించడంతో కిందకు దిగాడు.

- గతనెల.. ప్రభుత్వ వైన్‌షాపులో పనిచేస్తున్న సేల్స్‌మెన్, సూపర్‌వైజర్లు అక్రమంగా మద్యం తరలిస్తూ నున్న రూరల్ పోలీసులకు పట్టుబడ్డారు. ప్రభుత్వ వైన్‌షాపు నుంచి మద్యం బాటిళ్లను వేరేచోట వి క్రయిస్తున్నట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇలా చెప్పుకొంటే పోతే ప్రతి పోలీస్ స్టేషన్‌లో భార్యాభర్తల మధ్య గొడవలకు మద్యమే కారణమని చాలా కేసుల్లో స్పష్టమవుతోంది.

..తాను అధికారంలోకి వస్తే దశలవారీగా మద్యపాన నిషేధం చేస్తానని, అక్కాచెల్లెమ్మల కుటుంబాల్లో చిచ్చు పెడుతున్న మద్యాన్ని ముట్టుకుంటే షాక్ కొట్టేలా చేసి స్టార్ హోటళ్లకు పరిమితం చేస్తానన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆ హామీని మరిచిపోయారు. కానీ, పశ్చిమ సిటింగ్ ఎమ్మెల్యే, వైసీపీ సెంట్రల్ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాస్ మాత్రం నియోజకవర్గంలో కీలకమైన మద్యపాన నిషేధాన్ని గాలికొదిలి.. తమ అధినేత ఎన్నికల హామీలన్నీ నెరవేర్చారని చెప్పుకొంటూ ప్రచారం చేస్తుండటాన్ని చూసి స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు.

అజిత్‌సింగ్‌నగర్ : నగరానికి శివారు ప్రాంతాలైన సెంట్రల్ నియోజకవర్గంలోని అజిత్‌సింగ్‌నగర్, న్యూ రాజరాజేశ్వరిపేట, వాంబేకాలనీ, పాయకాపురం, రాధానగర్, కండ్రిక తదితర ప్రాంతాల్లో ఎక్కువగా పేద, బడుగు, బలహీన వర్గాలవారు నివాసముంటారు. రెక్కాడితే గాని డొక్కాడని

- మిగతా 6లో



పైపుల రోడ్డు వద్ద ఉన్న వైన్‌షాపులో బారులు తీరిన మందుబాబులు

నిలువునా ముంచేశారు..



మద్యంపాన నిషేధం చేస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన జగన్ మద్యంపై వచ్చే ఆదాయాన్ని చూపించి రుణాలు మాత్రం పొందుతున్నాడు. నాసిరకమైన మద్యం అమ్ముతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నాడు.

- బొండా ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే

హామీల అమలేదీ..?



మద్యపాన నిషేధం అమలుపై వైసీపీ ప్రభుత్వం ఘోరంగా వి ఫలమైంది. సెంట్రల్ నియోజకవర్గంలో అదనపు బార్లు, వైన్ షాపులు ఏర్పాటు చేయడంతో ఎన్నో కుటుంబాలు నాశనమైపోయాయి. గొంతెత్తి ప్రశ్నించిన మహిళలపై అక్రమ కేసులు నమోదు చేశారు. మద్యంతో వచ్చే ఆదాయంపై వైసీపీ ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలపై లేదు.

- సీహెచ్ బాబూరావు, సీపీఎం నాయకుడు

వంశీ దారెటు..?

కొద్దిరోజులుగా స్తబ్దుగా ఉంటున్న గన్నవరం ఎమ్మెల్యే



గన్నవరం నియోజకవర్గంలో వైసీపీ స్తబ్దుగా ఉండటానికి కారణమేంటి..? సిటింగ్ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఎందుకు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనట్లేదు..? ఈ ఎన్నికల్లో అసలు ఆయన గన్నవరం నుంచి పోటీ చేస్తారా..? లేక టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావుకు లభిస్తున్న ప్రజాదరణను చూసి వెనక్కి జంకుతున్నారా..? గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నానీతో కలిసి సోమవారం సీఎం జగన్‌ను కలిసిన వంశీ సీటు మార్పు, నిధుల సమస్యపై చర్చించారా? అంటే.. అవుననే సమాధానాలు వైసీపీ శ్రేణుల నుంచి వస్తున్నాయి.

నియోజకవర్గంలో ప్రచారానికీ దూరం

- టీడీపీ అభ్యర్థి యార్లగడ్డకు పెరుగుతున్న ప్రజాదరణ
- వంశీ వెనకడుగు వేస్తున్నారంటూ ఊహాగానాలు
- నియోజకవర్గ మార్పు, నిధులలేమిపైనా చర్చ
- కొడాలి నానీతో కలిసి సీఎంతో వంశీ భేటీ

(విజయవాడ- ఆంధ్రజ్యోతి) : గన్నవరం నియోజకవర్గం టీడీపీకి కంచుకోట. ఆ పార్టీ ఆవిర్భావం తర్వాత 9 సార్లు ఎన్నికలు జరిగితే, 6 సార్లు గెలిపించిన చరిత్ర గన్నవరం నియోజకవర్గ ప్రజలది. మరో రెండుసార్లు స్వతంత్ర అభ్యర్థులు జయకేతనం ఎగురవేశారు. 1983 నుంచి ఎన్నికలను పరిశీలిస్తే, కాంగ్రెస్ కేవలం ఒక్కసారే విజయం సాధించింది. అలాంటి నియోజకవర్గంలో వంశీ టీడీపీ అభ్యర్థిగా గెలుపు సాధించడం పెద్ద విశేషమేమీ కాదు. 2019లో వంశీ టీడీపీ టికెట్‌పై గెలిచి వైసీపీ పంచన చేరాక ఆయన గ్రాఫ్ క్రమేణా తగ్గుతూ వచ్చింది. టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని అసభ్యంగా దూషించాక గ్రాఫ్ శరవేగంగా పడిపోవడం మొదలైంది. మరోవైపు టీడీపీ గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా యార్లగడ్డ వెంకట్రావు నియామకంతో శ్రేణుల్లో జోష్ పెరిగింది. ఈ పరిణామాలన్నింటినీ విశ్లేషించుకున్న వంశీ ఈసారి పోటీకి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్టు పలుమార్లు వైసీపీ పెద్దలకు చెబుతూ వచ్చారు. మరోవైపు వంశీ సుమారు రెండు నెలలకుపైగా నియోజకవర్గంలో ఎలాంటి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. గన్నవరం వచ్చినా కార్యాలయానికి లేదా పరామర్శలకు పరిమితమవుతున్నారు. ఈసారి వైసీపీ అభ్యర్థిగా గన్నవరం నుంచి పోటీ చేస్తారని అంతా భావిస్తున్న తరుణంలో వంశీ ధోరణి మాత్రం వేరుగా ఉంది. అసలు ఆయన పోటీ చేస్తారా, చేయరా అనే సందేహం వైసీపీ శ్రేణుల్లో కలుగుతోంది. ఈ నేపథ్యంలోనే సీఎంతో సోమవారం జరిగిన భేటీలో వంశీ సీటుపైనే ప్రధాన చర్చ జరిగినట్టు సమాచారం.


గన్నవరం కాకపోతే ఎక్కడ?

గన్నవరం నుంచి వంశీ పోటీచేయని పక్షంలో ఎక్కడి నుంచి బరిలోకి దిగుతారన్నది చర్చనీయాంశంగా మారింది. సోమవారం నాటి భేటీలో వంశీకి రెండు ఆప్షన్లు సూచించినట్లు తెలిసింది. ఒకటి పెనమలూరు నుంచి పోటీ చేయడం, రెండోది మైలవరం నియోజకవర్గానికి వెళ్లడం. ఈ రెంటిలో ఒకదాన్ని ఎంచుకోవాల్సిందిగా వైసీపీ పెద్దలు వంశీకి సూచించినట్లు తెలిసింది. దీనిపై వంశీ కూడా సానుకూలత చూపినట్లు తెలిసింది. ఏదేమైనా వారం, పది రోజుల్లో వంశీ పోటీచేసే స్థానంపై స్పష్టత రానుంది.

డబ్బు కోసమా.. భయపడుతున్నారా..?

ప్రతిసారీ ఎన్నికల ముందు నిధుల కోసం వంశీ 'పోటీ నుంచి విత్‌డ్రా' డ్రామా ఆడుతుంటారనేది నిజం. గత ఎన్నికల్లో ఆర్థిక ఇబ్బందులను సాకుగా చూపి పోటీకి విముఖత చూపిన వంశీ తాజాగా మళ్లీ అదే డ్రామా నడిపిస్తున్నారని రాజకీయ వర్గాల్లో నడుస్తున్న చర్చ. అయితే, టీడీపీ అధిష్ఠానంలా తాడేపల్లి పెద్దలు కరిగిపోరని, ఎదురు వంశీ నుంచే వసూలు చేస్తారని వైసీపీ శ్రేణులు చెబుతున్న మాట. గన్నవరంలో వంశీ రాకతో వైసీపీలో ఇద్దరు బలమైన నాయకులుగా ఉన్న యార్లగడ్డ వెంకట్రావు, దుట్టా రామచంద్రరావును పార్టీ దూరం చేసుకోవాల్సి వచ్చిందని, అలాంటిది ఎన్నికల సమయంలో వంశీ ఇలాంటి డ్రామాలు ఆడటమేమిటని వైసీపీ శ్రేణులు వ్యాఖ్యానిస్తున్నాయి. నిధుల కోసం కాకపోతే నియోజకవర్గంలో యార్లగడ్డ వెంకట్రావును చూసి వంశీ భయపడి పోటీకి వెనుకాడుతున్నారా అనే చర్చ కూడా వైసీపీ శ్రేణుల్లో నడుస్తోంది. 2014, 2019లో రెండుసార్లు టీడీపీ టికెట్‌పై వంశీ గెలుపొందారు. వరుస విజయాలతో ఆయన గన్నవరంపై పట్టు బిగించారు. ఈ పదేళ్లలో నియోజకవర్గంలో ఆయన అనుచరులు సాగించిన అవినీతికి అంతే లేదు. గత ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయిన వెంకట్రావుపై నియోజకవర్గ ప్రజల్లో సానుభూతి ఉంది. అదే సమయంలో ప్రభుత్వ వ్యతిరేకత.. వంశీ అనుచరుల అవినీతి.. వెరసి ఈసారి ఓటమి తప్పదనే భయంలో వంశీ ఉన్నారని సమాచారం. ఈ కారణంగానే ఆయన గన్నవరం నుంచి పోటీకి వెనుకాడుతున్నారని చెబుతున్నారు.

కొండలను కొల్లగొట్టారు. గుట్టలను గుల్ల చేశారు. ఇవి చాలవన్నట్టు ఇప్పుడు ప్రభుత్వ భూములపై మైనింగ్ అక్రమార్కులు కన్నేశారు. వారికి రెవెన్యూ అధికారులు జత కలిశారు. రీసర్వేలో ప్రభుత్వ భూములను గుర్తించడం.. మైనింగ్ మాఫియాకు సమాచారం అందించడం.. ఆ భూముల్లో ఎవరైనా సాగు చేస్తుంటే బెదిరించి అతితక్కువకు మైనింగ్ మాఫియాకు అమ్మేసుకునేలా భయభ్రాంతులకు గురిచేయడం రెవెన్యూ విభాగంలోని కొందరు అక్రమార్కులకు విధిగా మారింది. వాటిని అతి తక్కువ ధరకు చేజిక్కించుకున్న మైనింగ్ అక్రమార్కులు ఆ వెంటనే మట్టి తవ్వి, అమ్మి సొమ్ము చేసుకుని రూ.కోట్లలో ఆదాయం ఆర్జిస్తున్నారు. ఇలా విజయవాడ రూరల్ మండలంలోని కొత్తూరు తాడేపల్లిలో 14.04 ఎకరాల్లో మట్టి తవ్వి రూ.100 కోట్లకుపైనే వ్యాపారం చేసినట్టు అంచనా. ఈ పాపంలో భాగమైన రెవెన్యూకు రూ.10 కోట్లకుపైగా ముడుపులు ముట్టినట్టు ఆరోపణ. - ఆంధ్రజ్యోతి, విజయవాడ



సర్వే నెంబర్ 248లోని చెరువుగా ఉన్న ప్రభుత్వ భూమి 10.04 ఎకరాల్లో పెద్ద ఎత్తున గ్రావెల్ తవ్వకాలు

మట్టి దందా.. నయా పంథా..!

మైనింగ్ మాఫియాతో కలిసి రెవెన్యూ విభాగం అక్రమాలు

- ప్రభుత్వ భూములను గుర్తించి చెబుతున్న రెవెన్యూ అక్రమార్కులు
- గద్దల్లా వాలిపోతున్న మైనింగ్ మాఫియా
- కొత్తూరు తాడేపల్లిలోని 14 ఎకరాల్లో మట్టి తవ్వకాలు
- రూ.100 కోట్లకుపైగా వ్యాపారం
- అక్రమంలో రెవెన్యూ వాటా రూ.10 కోట్లు
- సాక్ష్యాలతో కలెక్టర్‌కు గ్రామస్తుల ఫిర్యాదు

అక్కడితో ఆగక.. మరో ప్రాంతానికి విస్తరణ

గ్రావెల్ వ్యాపారం మూడు పూలు, ఆరు కాయలుగా సాగటంతో విజయవాడ రూరల్ మండల రెవెన్యూ మాఫియా మరింత బరితెగించింది. కొత్తూరు తాడేపల్లిలోని సర్వే నెంబర్ 248లోని 10.04 ఎకరాలు చెరువు భూమిగా రీసర్వేలో తేలింది. ఈ భూములను కూడా ఆక్రమిత రైతులను భయపెట్టి మైనింగ్ గద్దలు చెరపట్టేలా చేసింది. ఆ భూముల్లో మాఫియా గ్రావెల్ తవ్వకాలు చేపట్టింది. కొత్తూరు తాడేపల్లిలో కలిపి 14.04 ఎకరాల్లో మైనింగ్ మాఫియా రూ.100 కోట్ల వ్యాపారం చేసినట్టు తెలుస్తోంది. మైనింగ్ మాఫియాకు సహకరించినందుకు రెవెన్యూ మాఫియాకు రూ.10 కోట్ల మేర వాటా వెళ్లినట్టు తెలుస్తోంది.

రెవెన్యూ మాఫియా 'అలెర్ట్' వాట్సాప్ గ్రూప్

మైనింగ్ మాఫియాతో ఉన్న భాగస్వామ్య వ్యాపారం కారణంగా వారిపై దాడులు జరపకుండా ఉండేందుకు స్థానిక రెవెన్యూ మాఫియా 'అలెర్ట్' అనే వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసింది. ఈ గ్రూప్ ద్వారా ప్రజల నుంచి రెవెన్యూ అధికారులకు వస్తున్న ఫిర్యాదులు, అధికారులు ఆరా తీస్తున్న సమాచారాలు, తనిఖీలకు వచ్చే అవకాశాల సమాచారం ఎప్పటికప్పుడు మైనింగ్ మాఫియాకు చేరుతోంది. ప్రభుత్వ భూములను మైనింగ్ గద్దలకు అన్యాక్రాంతం చేసిన రెవెన్యూ మాఫియాకు తమ వాటాగా వచ్చిన రూ.10 కోట్ల షేర్‌తో భారీగా ఆస్తులు సమకూర్చుకున్నట్టుగా రెవెన్యూలో చర్చనీయాంశంగా మారింది.

స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు

విజయవాడ రూరల్ మండలంలోని ప్రభుత్వ భూముల్లో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న మైనింగ్ మాఫియా ఆగడాలపై సోమవారం నిర్వహించిన స్పందనలో కలెక్టర్ ఢిల్లీరావుకు కొత్తూరు తాడేపల్లి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వుతున్న విషయాన్ని తాము గుర్తించి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినా చర్యలు తీసుకోలేదని, ఇపుడు చూస్తే ప్రభుత్వ భూములను మొత్తంగా తవ్వేశారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై సత్వరం చర్యలు చేపడతామని కలెక్టర్ ఢిల్లీరావు హామీ ఇచ్చారు.

వాగుకు విఘాతం


కొత్తూరులో ఇతర కొండగట్లపై కురిసిన వర్షం నీరు, వసంతరాయల తిప్పపై కురిసిన వర్షం నీరు.. అంతా దిగువన కొండవాగు మీదుగా ఎర్రచెరువులోకి ప్రవహిస్తోంది. ఆక్రమణల కారణంగా చాలాకాలంగా ఈ వాగు కుంచించుకుపోయింది. తాజాగా మైనింగ్ మాఫియా తవ్విన ప్రాంతంలోకి నీళ్లు వెళుతున్నాయే తప్ప ఎర్ర చెరువుకు వెళ్లటం లేదు. ఫలితంగా కొత్తూరు గ్రామ ప్రజలకు సాగునీటికి ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడింది. పశువులకు, చేపల పెంపకానికి కూడా సమస్య తలెత్తింది.

4 ఎకరాల్లో తవ్వకం..

కొత్తూరు తాడేపల్లిలోని సర్వే నెంబర్ 135లో కొండవాగు పోరంబోకు భూమి 4 ఎకరాలుంది. కొద్దికాలం కిందట జరిగిన భూముల రీ సర్వేలో ఇది ప్రభు త్వ భూమిగా తేలింది. రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. స్థానిక ఆర్ఐ ద్వారా ఈ సమా చారం మైనింగ్ మాఫియాకు చేరింది. రీ సర్వేకు ముందు ఈ భూములు కొందరు రైతుల ఆధీనంలో ఉండటంతో వారిని రెవెన్యూ అధికారులు బెదిరించి లొంగదీసుకున్నారు. మైనింగ్ మాఫియాకు తక్కువ ధరకు అమ్ముకునే స్థాయిలో బెదిరింపులకు దిగారు. ఎకరం రూ.30 లక్షల వరకు ఇచ్చేందుకు మైనింగ్ గద్దలు నిర్ణయించటంతో రైతులు ఈ భూములను వారి చేతుల్లో పెట్టారు. తాటి చెట్టంత లోతున గ్రావెల్ తవ్వకాలు ప్రారంభించారు. మట్టి అమ్మి భారీగా డబ్బు పోగేశారు.



సర్వే నెంబర్ 135లోని కొండవాగు ప్రభుత్వ భూమి 4 ఎకరాల్లో పెద్ద ఎత్తున గ్రావెల్ తవ్వకాలు



19
AWU0843640
పేరు : దుర్గారావు కొల్లి
తండ్రి పేరు: సీతారామయ్య
ఇంటి సంఖ్య : 57-6-13
వయస్సు : 53 లింగం : పురుషులు

10
AWU1430628
పేరు : నాగరాజు సిడా
తండ్రి పేరు: పాండురంగ విటల సిడా
ఇంటి సంఖ్య : 5-7/3-80
వయస్సు : 37 లింగం : పురుషులు

17
AWU2002491
పేరు : శ్రీనివాసరావు మండా
తండ్రి పేరు: కృష్ణ మూర్తి మండా
ఇంటి సంఖ్య : 53-1-134
వయస్సు : 50 లింగం : పురుషులు

వన్‌టౌన్‌లోని 40వ డివిజన్‌లో నమోదైన ఇతర ప్రాంతాల ఓటర్లు

ఎవరి ఓటు ఎటు..?

- 40వ డివిజన్‌లోని 45వ బూత్‌కు చెందిన 800 మంది పేర్లు గల్లంతు
- వారి స్థానంలో తూర్పు, పశ్చిమలోని వేరే బూత్ ఓటర్లు
- టీడీపీ నాయకుల పరిశీలనలో గుర్తింపు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని యోచన

పశ్చిమలో భారీగా ఓటర్ల బూత్ లెవల్ బదిలీలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/విద్యాధరపురం) : ఓటర్ల తుది జాబితా పరిశీలనలో అక్రమాలు భారీగా వెలుగులోకి వస్తున్నాయి. సెంట్రల్ నియోజకవర్గంలో చనిపోయిన వారి ఓట్లను తొలగించమంటే, మరో బూత్‌కు బదిలీ చేసిన ఉదంతం మరువకముందే.. పశ్చిమలో ఒక బూత్‌కు చెందిన వారి ఓట్లను మరో బూత్‌కు బదిలీ చేయటం వివాదానికి దారితీసింది. ఇప్పటికే అధికార పార్టీ కార్పొరేటర్ ఆంజనేయరెడ్డి స్కూల్ పేరుతో భారీగా బోగస్ ఓట్లు నమోదైన విషయం బయటపడింది. సోమవారం మరో సంఘటన వెలుగులోకి వచ్చింది. స్థానిక 40వ డివిజన్ పరిధిలోని 45వ నెంబర్ పోలింగ్ బూత్‌లో వందల సంఖ్యలో ఓటర్ల పేర్లు కనిపించటం లేదన్న విషయం వెలుగులోకి వచ్చింది. స్థానిక ఓటర్ల స్థానంలో విజయవాడ తూర్పు నియోజకవర్గ పరిధిలోని అశోక్‌నగర్, మాచవరానికి చెందిన ఓటర్లతో పాటు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని విద్యాధరపురానికి చెందిన ఓటర్లు పెద్ద సంఖ్యలో 45వ నెంబర్ బూత్‌లోకి వచ్చారు. టీడీపీ నాయకుల పరిశీలనలో 800కు పైగా ఇతర నియోజకవర్గాలు, బూత్‌లకు చెందినవారు బదిలీ అయ్యారని గుర్తించారు. ఒక్కసారిగా ఇన్ని ఓట్లను ఎక్కడికి బదిలీ చేశారన్న విషయం మాత్రం తెలియట్లేదు. వీటిపై జిల్లా ఎన్నికల అధికారి ఢిల్లీరావుకు ఫిర్యాదు చేయాలని భావిస్తున్నారు.



సత్కారం

డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య 60 సంవత్సరాల వృత్తి విరామ అభినందన సత్కార కార్యక్రమం సోమవారం గురునానక్ నగర్‌లోని ఓ కల్యాణ మండపంలో జరిగింది. విశిష్ట అతిథిగా సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ పాల్గొని డాక్టర్ పట్టాభిరామయ్యను ఘనంగా సత్కరించారు.

- 6లో..



సుబ్రహ్మణ్యేశ్వర దేవస్థానం, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి(ఇన్‌సెట్‌)

నేటి నుంచి సుబ్బారాయుడి కల్యాణ మహోత్సవాలు

మోపిదేవి, ఫిబ్రవరి 12 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక కళ్యాణ బ్రహ్మోత్సవాలు ఈ నెల 13వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. మాఘమాసంలో ఐదు రోజులపాటు అత్యంత వైభవంగా స్వామివారి ఉత్సవాలు నిర్వహించనున్నారు. 13వ తేదీ ఉదయం 11 గంటలకు శ్రీ స్వామివారిని పెండ్లి కుమారుడిని చేయుటతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 17వ తేదీ సుబ్రహ్మణ్య హవనం, ద్వాదశ ప్రదక్షిణలు, స్వామివారి పవళింపు సేవతో మహోత్సవాలు ముగుస్తాయి. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్‌ దీపాలతో అలంకరించారు. స్వామివారికి నిర్వహించే నిత్య పూజా కార్యక్రమాలు తాత్కాలికంగా రద్దు చేసినట్టు ఈవో ఎస్‌.ఎస్‌.చక్రధరరావు తెలిపారు.

తిరుపతమ్మకు హుండీ ఆదాయం రూ.6.37 లక్షలు

మైలవరం రూరల్‌ : బొర్రగూడెం గ్రామం తిరుపతమ్మ - గోపయ్య వార్ల దేవస్థానంలోని హుండీల ఆదాయం సోమవారం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్‌ చెలికాని వెంకట సత్యవరప్రసాద్‌, భక్తులు, హిందూ భక్తసమాజ సభ్యుల సమక్షంలో వేదాద్రి శ్రీయోగానంద లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఈవో కె.హేమలత పర్యవేక్షణలో లెక్కించగా 208 రోజులకుగాను భక్తులు కానుకలుగా రూ.6,37,003లు సమర్పించినట్టు ఆలయ ఈవో నూతక్కి వెంకట సాంబశివరావు తెలిపారు. దేవస్థానంలో భక్తులు సమర్పించిన తలనీలాలు పోగు చేసుకునే హక్కుకు ఏడాదిలో నాలుగు సార్లు నిర్వహించిన వేలం పాటలో రూ.2.18 లక్షల హెచ్చుపాటగా చౌటపల్లికు చెందిన బొజ్జా ఏడుకొండలు దక్కించుకున్నట్టు ఈవో తెలిపారు.

వైసీపీకి ఇద్దరు ప్రధాన కార్యదర్శులు బైబై

- పార్టీ పదవులతోపాటు ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా
- ఎస్సీ, బీసీలకు వెలంపల్లి అన్యాయం చేశారు
- పార్టీలో కష్టించి పని చేసేవారికి గుర్తింపు లేదు



రాజీనామా పత్రాలు చూపుతున్న అమర్‌ బాబు, పాలవాయి దాసు

చిట్టినగర్‌, ఫిబ్రవరి 12 : విజయవాడ చిట్టినగర్‌కు చెందిన ఇద్దరు వైసీపీ నాయకులు పార్టీ పదవులతోపాటు ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు సోమవారం కేఎల్‌రావు పార్కు ఎదురుగా కేటీ రోడ్డులో మీడియా సమావేశంలో వివరాలు తెలియజేశారు. 47వ డివిజన్‌కు చెందిన వైసీపీ నగర ప్రధాన కార్యదర్శి ఎనిగళ్ల అమర్‌బాబు, 46వ డివిజన్‌కు చెందిన ఎస్సీ సెల్‌ నగర ప్రధాన కార్యదర్శి పాలవాయి దాసులు తమ పదవులతోపాటు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్టీకి చేసిన సేవలను గుర్తించి విజయవాడ నగర ప్రధాన కార్యదర్శిగా పదవి ఇచ్చారన్నారు. 2019లో పశ్చిమ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు విజయానికి తన వంతు కృషి చేస్తే ఆయన తనలాంటి వారిని గుర్తించలేదన్నారు. భజన బృందాలకు నామినేట్‌ పదవులు ఇచ్చి తమకు అన్యాయం చేశారన్నారు. పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జీ షేక్‌ ఆసిఫ్‌ అవినీతిలో కూరుకుపోయిన వారికి, భజన బృందాలను చేరదిస్తూ పనిచేసే సీనియర్లను పట్టించుకోవడంలేదన్నారు. దళితులకు భద్రత లేదన్నారు. ఈ పరిణామాలకు కలత చెంది తాము పార్టీ, పదవులకు రాజీనామా చేస్తున్నట్టు చెప్పారు.

ఆడుదాం ఆంధ్రా మహిళా క్రికెట్‌ చాంప్‌ ఎన్టీఆర్‌ జిల్లా



విజయవాడ స్పోర్ట్సు, ఫిబ్రవరి 12 : విశాఖపట్నం రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రీడామైదానంలో జరిగిన ఆడుదాం-ఆంధ్రా రాష్ట్రస్థాయి మహిళల క్రికెట్‌ పోటీల్లో ఎన్టీఆర్‌ జిల్లా జట్టు ఘన విజయం సాధించినట్టు ఎన్టీఆర్‌ జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి ఆర్‌.సీజర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జట్టుకు భావన నాయకత్వం వహించగా తూర్పుగోదావరి జిల్లాపై ఘన విజయం సాధించి టైటిల్‌ను వశం చేసుకుందన్నారు. ఎన్టీఆర్‌ జిల్లా జట్టు 61 పరుగులు చేయగా, తూర్పుగోదావరి జట్టు 48 పరుగులే చేసి పరాజయం పాలైంది. మహిళా జట్టును ఎన్టీఆర్‌ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్‌ఏ.అజీజ్‌ అభినందించారు.

కిడ్నీ ప్రభావిత గ్రామాలకు తాగు నీరివ్వండి..

- 15న నీటి సత్యాగ్రహ పాదయాత్ర
- కొలికపూడి శ్రీనివాసరావు వెల్లడి



ఎ.కొండూరు, ఫిబ్రవరి 12 : రాష్ట్రంలోనే మరో ఉద్దానంగా పేరుగాంచిన ఎ.కొండూరు మండలంలో తక్షణం కృష్ణాజలాలు సరఫరా చేసి తాగునీటి సమస్య పరిష్కరించకపోతే ఈ నెల 15న నీటి సత్యాగ్రహ పాదయాత్ర చేస్తామని అమరావతి పరిరక్షణ సమితి కన్వీనర్‌ కొలికపూడి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పది రోజులుగా కిడ్నీ ప్రభావిత గ్రామాలకు కృష్ణా జలాలు నిలిచిపోవడంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చీమలపాడులో ఆయన మాట్లాడుతూ, మండలంలో తాగు నీటి సమస్యను ఈ నెల 15లోగా పరిష్కారించకపోతే నీటి సత్యాగ్రహ పాదయాత్ర చేస్తామని ప్రకటించారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత ప్రజలపైన, టీడీపీ కార్యకర్తలపైన ఉందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు గద్దె కృష్ణారెడ్డి, రమేష్‌రెడ్డి, అబ్బు, మునియ్య, డేవిడ్‌రాజ్‌, శంకర్‌, భీమా నాయక్‌, పీక్లా నాయక్‌, కిషోర్‌, దుర్గారావు, రాంప్రసాదరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర కన్వీనర్‌ దయాకర్‌

వడ్డెర్ల అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.1500 కోట్లు కేటాయించాలి

- వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్‌ దయాకర్‌

గుడివాడ, ఫిబ్రవరి 12 : రాష్ట్ర బడ్జెట్‌లో వడ్డెర్ల అభివృద్ధి, సంక్షేమానికి రూ.1500 కోట్లు నిధులను కేటాయించాలని, ప్రత్యేక రక్షణ సామాజిక చట్టాన్ని ఏర్పాటు చేయాలని వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్‌ గుంజి దయాకర్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. సోమవారం స్థానిక ఎన్జీవోస్‌ హోంలో సంఘం సభ్యులు ఉప్పుదల ఏడుకొండలు ఆధ్యక్షతన వడ్డెర వృత్తిదారుల సంఘం కృష్ణా జిల్లా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయం, చేతివృత్తులు పూర్తి దెబ్బతిన్నాయని, దీంతో లక్షలాది మంది వడ్డెర్లు ఉపాధి లేక అల్లాడుతున్నారన్నారు. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి బతకాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. గతంలో ఉన్న ఆశ్రమ పాఠశాలలను తీసివేయడంతో విద్యకు కూడా దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 90 శాతం సబ్సిడీతో వడ్డెర వృత్తిదారులకు అధునాతన యంత్రాలను అందజేసి ఉపాధి కల్పించాలని, కేజీ నుంచి పీజీ వరకు మెరుగైన విద్య, వృత్తి రీత్యా చనిపోయిన వారి కుటుంబానికి రూ.20లక్షలు నష్టపరిహారం, ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ యివ్వాలని డిమాండ్‌ చేశారు. సదస్సులో సంఘం పట్టణ గౌరవాధ్యక్షుడు తమ్మిశెట్టి లక్ష్మణరావు, వడ్డెర్లు పాల్గొన్నారు. వడ్డెర వృత్తిదారుల సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది.

స్ఫూర్తి ప్రదాత డాక్టర్‌ కామినేని పట్టాభిరామయ్య

- సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ

లబ్బీపేట, ఫిబ్రవరి 12 : వైద్య వృత్తిలో లాభాపేక్ష లేకుండా సమాజ సేవ కోసమే పనిచేసిన మహోన్నత వ్యక్తి, స్ఫూర్తి ప్రదాత డాక్టర్‌ కామినేని పట్టాభిరామయ్య అని సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ అన్నారు. 60 సంవత్సరాల వృత్తి విరామ అభినందన సత్కార కార్యక్రమం గురునానక్‌నగర్‌లోని ఎన్‌ఏసీ కళ్యాణ మండపంలో సోమవారం జరిగింది. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన ఎన్వీ రమణ మాట్లాడుతూ, డాక్టర్‌ కామినేని పట్టాభిరామయ్య మానత్వానికి నిలువెత్తు నిదర్శనంగా.. సమాజంలో అన్ని వర్గాల నుంచి గౌరవం అందుకున్నారన్నారు. నైతిక విలువలతో జీవితాన్ని సాగించిన ఆయన నుంచి ఎంతో మంది డాక్టర్లు స్ఫూర్తి పొందారన్నారు. జీవితంలో కొందరితో మాట్లాడితే ఎంతో సంతోషం కలుగుతుందని అటువంటి వ్యక్తి పట్టాభిరామయ్య అని, ఆయన అభిమానం, ఆశీస్సులతో తాను ఈ స్థాయికి వచ్చినట్టు చెప్పారు. ఆయన వైద్య వృత్తి నుంచి మాత్రమే విరామం తీసుకున్నారని, ఆలోచనలు, సమాజసేవ నుంచి కాదన్నారు. ఆయన అంకిత భావం, సేవలను ముందుతరాలకు అందించేందుకు పట్టాభి రామయ్యను పుస్తకం వ్రాయాలని ఆయనకు పెన్ను, పుస్తకం అందజేశారు. లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్‌ జయప్రకాశ్‌ నారాయణ మాట్లాడుతూ, పట్టాభిరామయ్య సంకల్పానికి, ఆలోచనకు, సేవకు వృద్ధాప్యం లేదన్నారు. ఎందరో యువ డాక్టర్లకు ఆదర్శంగా నిలిచిన ఆయన కృష్ణాజిల్లాకు, నగరానికి వన్నె తెచ్చారన్నారు. అనంతరం డాక్టర్‌ పట్టాభిరామయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావు, కార్యక్రమ కమిటీ సభ్యులు బి.ఎస్‌ కోటేశ్వరరావు, డాక్టర్లు పాల్గొన్నారు.



డాక్టర్‌ పట్టాభిరామయ్యకు పెన్ను, పుస్తకం ఇస్తున్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ

దేశానికే ఆదర్శంగా స్వచ్ఛ చల్లపల్లి

- చల్లపల్లి గ్రామాన్ని సందర్శించిన ఐఏఎస్‌ అధికారులు



చల్లపల్లి సంపద తయారీ కేంద్ర ప్రాంగణంలో డ్రై కంపోస్ట్‌ బెడ్‌ ప్రారంభించిన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌ ఎండీ గంధం చంద్రుడు, చిత్రంలో ప్రిన్సిపల్‌ సెక్రటరీ బి.రాజశేఖర్‌, కలెక్టర్‌ రాజాబాబు

చల్లపల్లి, ఫిబ్రవరి 12 : చల్లపల్లి గ్రామాన్ని దేశానికే ఆదర్శంగా.. మరో అంబికాపూర్‌గా తయారు చేయాలని ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వ పంచాయతీరాజ్‌ శాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరీ బి.రాజశేఖర్‌ ఆకాంక్షించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌ ఎండీ గంధం చంద్రుడు, జిల్లా కలెక్టర్‌ పి.రాజాబాబులతో కలిసి సోమవారం సాయంత్రం చల్లపల్లి వచ్చిన ఆయన ఘన, ద్రవ వనరుల నిర్వహణ ప్రారంభోత్సవం(ఎస్‌ఎల్‌ఆర్‌ఎం ప్రాజెక్టు)లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎక్కడైనా గ్రామంలో డంపింగ్‌ యార్డుకు స్థలం కేటాయించాలని కోరటం చూస్తున్నామనీ, కానీ చల్లపల్లిలో డంపింగ్‌ యార్డును మూసివేయటం చారిత్రక ఘట్టమనీ, డంపింగ్‌యార్డు మూసివేసిన గ్రామంగా చల్లపల్లికి గుర్తింపు లభిస్తుందన్నారు. సర్పంచ్‌ కృష్ణకుమారిని అభినందించారు. ప్రజల ఆలోచనా విధానం మారాలనీ, ఇంటి నుంచే చెత్త విభజన జరగాలన్నారు. చల్లపల్లికి నిధుల పరంగా, మౌలిక సదుపాయాల పరంగా మద్దతు ఇస్తామన్నారు. ఈ సందర్భంగా డీఆర్కే దంపతులను అభినందించారు. రెండేళ్లలో ఆంధ్రప్రదేశ్‌ను గార్బేజ్‌ ఫ్రీ రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఎన్టీఆర్‌ జిల్లాలో ఐదు గ్రామాల్లో పైలట్‌ ప్రాజెక్టుగా చేశామనీ, రెండవ విడతలో అన్ని జిల్లాల్లో కొన్ని గ్రామ పంచాయతీలను ఎంపికచేసి ఇప్పటివరకూ జరిగిన ప్రయోగాత్మక విధానాలను అనుసరింపచేయనున్నట్లు వివరించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌ ఎండీ గంధం చంద్రుడు మాట్లాడుతూ, డంపింగ్‌ యార్డు లేని గ్రామంగా చల్లపల్లి దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. జిల్లా కలెక్టర్‌ పి.రాజాబాబు మాట్లాడుతూ, వ్యర్థాల నిర్వహణ విషయాల గురించి ప్రజలకు వివరించి ఆచరించేలా వలంటీర్లు అవగాహన కల్పించాలన్నారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ, అందరి సహకారం ఉన్నప్పుడే డంపింగ్‌ యార్డు లేని చల్లపల్లి మిగతా ప్రాంతాలకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. పర్యావరణవేత్త, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌ సలహాదారు శ్రీనివాసన్‌ మాట్లాడుతూ, ఇంత పెద్దసంఖ్యలో కార్యకర్తలు స్వచ్ఛందంగా సేవలందించటం దేశంలో మరెక్కడా లేదని చెప్పారు. డాక్టర్‌ డీఆర్కే ప్రసాద్‌ మాట్లాడుతూ, చెత్త..వ్యర్థాలు లేని గ్రామంగా చల్లపల్లి మరో అంబికాపూర్‌ కావాలని ఆకాంక్షించారు. డీపీవో ఎస్‌వి.నాగేశ్వరనాయక్‌ అధ్యక్షతన జరిగిన సభలో సర్పంచ్‌ పైడిపాముల కృష్ణకుమారి, స్వచ్ఛ సారధి డాక్టర్‌ పద్మావతి, సీఈవో వీర్ల జ్యోతిబసు, ఎంపీపీ కోట విజయ రాధిక, ఈవో పివి .మాధవేంద్రరావు, అధికారులు, డ్వాక్రా, ఉద్యోగులు, స్వచ్ఛకార్యకర్తలు పాల్గొన్నారు. తొలుత స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌ సలహాదారు వేలేరు శ్రీనివాసన్‌ సూచనలతో సర్పంచ్‌ కృష్ణకుమారి, డాక్టర్‌ డీఆర్కే, డాక్టర్‌ పద్మావతిల నేతృత్వంలో స్వచ్ఛ కార్యకర్తలు, పంచాయతీ పారిశుధ్య కార్మికులు తయారుచేసిన డ్రై కంపోస్ట్‌ బెడ్‌ను, ఘన..ద్రవ వనరుల నిర్వహణలో వివిధ విభాగాలను ఐఏఎస్‌ అధికారులు, ఎమ్మెల్యే ప్రారంభించారు.

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లాలో 33007మంది విద్యార్థులు, 178 కేంద్రాలు 5 ఫ్లయింగ్‌ స్క్వాడ్‌లు
- ఎన్టీఆర్‌ జిల్లా కలెక్టర్‌ ఢిల్లీరావు

కృష్ణలంక, ఫిబ్రవరి 12 : మార్చి 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరిగే 10వ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్‌ జిల్లా కలెక్టర్‌ ఎస్‌.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై సోమవారం కలెక్టర్‌ క్యాంపు కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్‌ సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లా విద్యాశాఖ సహాయ సంచాలకులు కేఎన్‌వీ కుమార్‌ పరీక్షలకు సంబంధించిన నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు.



అధికారులతో సమావేశంలో కలెక్టర్‌ ఢిల్లీరావు

జిల్లాలో 10వ తరగతి పరీక్షలకు మొత్తం 33007 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, వీరిలో 17414 మంది బాలురు, 15593 మంది బాలికలు వున్నారని, వీరిలో రెగ్యులర్‌ విద్యార్థులు 28190 మంది అని, అలాగే ప్రైవేట్‌ విద్యార్థులు 4817 మొత్తం 33007 అని తెలిపారు. పరీక్షల నిర్వహణకు జిల్లాలో 178 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు కలెక్టర్‌ తెలిపారు. పరీక్షల నిర్వహణకు 178 చీఫ్‌ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్‌ అధికారులను, 1475 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి 12.45 వరకు జరుగుతాయన్నారు. విద్యార్థులను 8.45 గంటలకు కేంద్రాల్లోకి అనుమతిస్తామన్నారు. ఆలస్యంగా వచ్చిన వారిని అనుమతించేది లేదని స్పష్టం చేశారు. అధికారులు అప్రమత్తంగా వుండి ఎటువంటి పొరపాట్లు దొర్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పరీక్ష కేంద్రాలను ముందుగానే తనిఖీ చేయాలని, ఏమైనా లోటుపాట్లు వుంటే సరిచేసుకొని సిద్ధంగా వుంచాలన్నారు. అలాగే సమస్యాత్మక కేంద్రాలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్‌ ఎస్‌.ఢిల్లీరావు తెలిపారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తం

- జిల్లా అధికారులతో కృష్ణా కలెక్టర్‌ రాజాబాబు సమీక్ష

మచిలీపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల విధుల నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్‌ పి.రాజాబాబు అన్నారు. స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ పుహాలులో అధికారులతో కలిసి ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల విజ్ఞప్తులపై సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో 116 అర్జీలను ప్రజలు సమర్పించారు. రానున్న సాధారణ ఎన్నికలకు అధికారులంతా సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికల విధులకు హాజరయ్యే అధికారులందరికీ త్వరలో శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. ఎన్నికల విధులకు గైర్హాజరైతే తగుచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్వో చంద్రశేఖరరావు, జెడ్పీ సీఈవో జ్యోతిబసు, డీఆర్‌డీఏ పీడీ పీఎస్‌ఆర్‌ ప్రసాద్‌, జిల్లా వ్యవసాయశాఖ జేడీ ఎస్‌.పద్మావతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఎస్పీ అద్నాన్‌ నయీమ్‌ అస్మి ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. 55మంది నుంచి అర్జీలు స్వీకరించి సంబంధిత పోలీస్‌ అధికారులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

బతికే ఉన్నా..
రేషన్‌ కార్డు పునరుద్ధరించండి



మచిలీపట్నం టౌన్‌ : తాను బతికే ఉన్నానని, తన రేషన్‌ కార్డు పునరుద్ధరించాలంటూ దళితుడు సోమవారం కలెక్టరేట్‌ వద్ద మీడియాతో తన గోడు చెప్పుకున్నాడు. తాను చనిపోయాయని కార్డును తొలగించారన్నారు. తాను నివశిస్తున్న వల్లూరుపాలెం గ్రామంలో తనకు ఓటు హక్కు ఉందన్నారు. తనకు తల్లిదండ్రులు లేరని, మేనత్త పెంచి పెద్ద చేసిందన్నారు. తన రేషన్‌ కార్డును పునరుద్ధరించాలంటూ బాధితుడు కలెక్టరేట్‌ వద్ద మేనత్తతో కలిసి ప్రదర్శన నిర్వహించాడు.

నిబద్ధతతో పనిచేయాలి..

- ఏఆర్‌వోల శిక్షణలో అదనపు సీఈవో కోటేశ్వరరావు

కృష్ణలంక, ఫిబ్రవరి 12 : ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధించి అన్ని అంశాలపై పూర్తిస్థాయి అవగాహన పెంపొందించుకొని, అప్రమత్తత, నిబద్ధతతో పనిచేయాలని రాష్ట్ర అదనపు చీఫ్‌ ఎలక్టోరల్‌ ఆఫీసర్‌ పి.కోటేశ్వరరావు అన్నారు. విజయవాడలోని మేరీస్టెల్లా కాలేజీలో అసెంబ్లీ నియోజకవర్గాల అసిస్టెంట్‌ రిటర్నింగ్‌ ఆఫీసర్‌ (ఏఆర్‌వో)లకు సర్టిఫికేషన్‌ ప్రోగ్రాం జరిగింది. తూర్పు గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్‌, బాపట్ల, ప్రకాశం, ఎస్‌పీఎస్‌ నెల్లూరు జిల్లాల ఏఆర్‌వోలకు ఐదు రోజుల శిక్షణా కార్యక్రమంలో జాతీయ స్థాయి మాస్టర్‌ ట్రైనర్లు ఆశిష్‌కుమార్‌ జీనా, ఎ.ఫెలిక్స్‌ రాజా, రాజేష్‌కుమార్‌, యుక్తామిత్రాలతో పాటు ఏపీ అదనపు సీఈవో కోటేశ్వరరావు, ఎన్టీఆర్‌ జిల్లా కలెక్టర్‌ ఎస్‌.ఢిల్లీరావు, డిప్యూటీ సీఈవో ఎస్‌.మల్లిబాబు, డీఆర్‌వో వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణలో ఆర్వో, పీవోల పాత్ర చాలా కీలకమైందని, ఎన్నికల విధుల నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. తొలిదశలో ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు 118 మంది ఏఆర్‌వోలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఎన్టీఆర్‌ జిల్లా కలెక్టర్‌ ఢిల్లీరావు మాట్లాడుతూ, ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటున్న వారికి భోజన వసతి సదుపాయాలను కల్పించడం జరిగిందన్నారు. జాతీయ స్థాయి మాస్టర్‌ ట్రైనర్‌ రిసోర్స్‌పర్సన్‌ ఆశిష్‌ కుమార్‌ జీనా మాట్లాడుతూ, ప్రతి ఎన్నికలను కొత్తవిగానే భావించి ప్రతి అంశంపైనా స్పష్టమైన అవగాహనతో విధులు నిర్వర్తించడం ద్వారా ఎన్నికలను విజయవంతంగా నిర్వహించవచ్చని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న అదనపు సీఈవో కోటేశ్వరరావు

స్పందనలో118 అర్జీలు.. కలెక్టర్‌ ఢిల్లీరావు

కృష్ణలంక, ఫిబ్రవరి 12 : జిల్లాలో స్పందన కార్యక్రమంలో ప్రతి అర్జీని అర్జీదారులు పూర్తిస్థాయిలో సంతృప్తిచెందేలా పరిష్కరించాలని కలెక్టర్‌ ఎస్‌.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి స్పందన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్‌ ఢిల్లీరావు డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్‌ జి.వెంకటేశ్వర్లు, హౌసింగ్‌ పీడీ రజనీ కుమారి తదితరులతో కలిసి అర్జీలు స్వీకరించారు. మొత్తం 118 అర్జీలు రాగా.. వీటిలో రెవెన్యూ 60, ఎంఏయూడీ 6, పోలీస్‌ 11, విద్య 1, రిజిస్ట్రేషన్స్‌ అండ్‌ స్టాంప్స్‌ 2, వైద్య, ఆరోగ్యం 4, పంచాయతీరాజ్‌ 2, హౌసింగ్‌ 3, పశుసంవర్థకశాఖ 2, మార్కెటింగ్‌ 2, పౌరసరఫరాలు 9, కో-ఆపరేటివ్‌ 2, ఏపీసీపీడీసీఎల్‌ 3, ఉపాధి కల్పన 2, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం 4, సర్వే అండ్‌ సెటిల్‌మెంట్‌ 5 అర్జీలు వచ్చాయి. క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో అర్జీల పరిష్కారంపై దృష్టిసారించాలని కలెక్టర్‌ పేర్కొన్నారు.



దీన్నే మందురు..?

(5వ పేజీ తరువాయి)

వారి రోజువారీ ఆదాయం అంతంతమాత్రమే. గత టీడీపీ ప్రభుత్వంలో కూలీనాలీ చేసి ఉన్న దానిలోనే ఇంటికి వెళ్లే ముందు ఓ మద్యం సీసా కొని, కూలి డబ్బు భార్యకు ఇచ్చి తాగి పడుకునేవారు. ఉదయాన్నే పనికి వెళ్లడం, రాత్రి ఎప్పుడో తాగి ఇంటికి రావడం జరిగేది. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి వచ్చే కూలీ డబ్బు మద్యం సీసాలకే సరిపోతోంది. ఆదాయంలో సగానికి పైగా మద్యం సీసాలకే ధార పోస్తున్నారు.

పెరిగిన బార్లు, వైన్‌ షాపులు

వాస్తవానికి వైసీపీ ప్రభుత్వం వచ్చాక సెంట్రల్‌ నియోజవర్గంలో బార్లు, వైన్‌ షాపుల సంఖ్య బాగానే పెరిగింది. ఇక ప్రభుత్వ వైన్‌ షాపులు అమ్మకాల్లో బార్లతో పోటీ పడుతున్నాయి. నిబంధనల ప్రకారం వైన్‌ షాపులు ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు అమ్మకాలు సాగిస్తుండగా, బార్‌ అండ్‌ రెస్టారెంట్లు ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటల వరకు తీసి ఉంచాల్సి ఉంది. కానీ, ఎక్కడా సమయపాలన పాటించడం లేదు. తెల్లవారుజాముప 5 గంటల నుంచి అర్ధరాత్రి ఒంటిగంట వరకు అమ్మకాలు సాగిస్తున్నారు.

అసలు సమస్య వదిలి.. వెలంపల్లి గారడీ



మద్యం బాటిళ్లు చూసి శ్మశానవాటికలో చిమ్నీ నుంచి కిందకు దిగిన సోమయ్య (ఫైల్‌)

ప్రసంగాలు

ఎన్నికల ప్రచారం నేపథ్యంలో పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్‌ గారడీ ప్రసంగాలు చేస్తున్నారు. ఎన్నికల ముందు సీఎం జగన్‌ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని, మళ్లీ వైసీపీని గెలిపించాలని ప్రసంగిస్తున్నారే తప్ప.. ఆయా ఏరియాల్లో ప్రధానంగా ఉన్న మద్యపానంపై మాట కదపకపోవడాన్ని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

బాలిక మృతిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

అవనిగడ్డ, ఫిబ్రవరి 12 : మండల పరిధిలోని విశ్వనాథుని శ్రీనివాస్‌ మెమోరియల్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి బాలిక మృతిపై ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్‌ ఎం.బేబీ కుమారి, వ్యవస్థాపక కుటుంబసభ్యులు వి.వాసుదేవ జిల్లా కలెక్టర్‌, ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 6న బాలిక ఆత్మహత్య విషయంలో తమ విచారణలో పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించటంతో మనస్థాపం చెంది ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని, పోస్టుమార్టం నిర్వహించకుండానే పోలీసులు మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారని, బాలిక మృతిపై తమకు అనుమానాలు ఉన్నందున విచారణ నిర్వహించాలని వారు జిల్లా కలెక్టర్‌, ఎస్పీలను ఫిర్యాదులో కోరారు. ఈ విషయమై ఎంఈవో శివశంకర్‌రావును వివరణ కోరగా, ఫిర్యాదు విషయం తమ దృష్టికి రాలేదని, అయితే ఈనెల 6వ తేదీన బాలిక మృతి చెందిన వాస్తవమేనని తెలిపారు.

పసికందును వదిలి వెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు



అవనిగడ్డ : కళ్లు కూడా తెరవని పసికందును చర్చి వెనుక వదిలి వెళ్లిన సంఘటన అవనిగడ్డలో తీవ్ర కలకలం రేపింది. ఆదివారం రాత్రి అవనిగడ్డ 1వ వార్డులోని చర్చి వెనుక అప్పుడే పుట్టిన ఆడ శిశువును గుర్తు తెలియని వ్యక్తులు వదిలి వెళ్లారు. కొద్ది సేపటికి పాప ఏడుపు వినిపించి చర్చి ఫాదర్‌ వెంటనే శిశువును ప్రభుత్వాసుపత్రికి, ప్రథమ చికిత్స అనంతరం మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రమేష్‌ తెలిపారు.



కేశినేని చిన్ని, సౌమ్యకు హారతులు పడుతున్న మహిళలు

శూన్యాంధ్రప్రదేశ్‌గా మార్చేశారు

- సీఎం జగన్‌పై కేశినేని శివనాథ్‌ ఫైర్‌

కంచికచర్ల రూరల్‌, ఫిబ్రవరి 12 : రాష్ట్రాన్ని శూన్యాంధ్రప్రదేశ్‌ మార్చిన ఘనత వైఎస్‌ జగన్మోహన్‌ రెడ్డికే దక్కిందని సీనియర్‌ టీడీపీ నాయకుడు కేశినేని శివనాథ్‌ (చిన్ని) అన్నారు. కీసర, పెండ్యాల, వేములపల్లి, ఎస్‌.అమరవరం గ్రామాల్లో సోమవారం ఆయన నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యతో కలిసి పర్యటించారు. వారికి కీసర జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. పెండ్యాలలో భారీ మోటార్‌ బైక్‌ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సౌమ్య మాట్లాడుతూ జగన్‌ పచ్చి అబద్దాలతో ప్రజలకు మోసం చేశాడన్నారు. ఈకార్యక్రమంలో ఎర్రగాని నూకాలమ్మ, మన్నె సాత్విక, కొంగర మురళి, కుక్కల శ్రీను, ఎర్రగోర్ల రామాంజనేయులు, కలతోటి అజయ్‌, వేల్పుల వెంకట్రావ్‌, రెడ్డి నరసింహారావు, షేక్‌ దిలావర్‌, షబ్బీర్‌, ఎం.డి అలీభాష, నసిర్‌ భాష, మొక్కపాటి నరసింహారావు, భిక్షాలు, వెంకట్రావ్‌, తేలప్రోలు రమణయ్య వసంత కోటయ్య, వసంత హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	143, 152, 163
చికెన్ విత్ స్కిన్	274
చికెన్ స్కిన్‌లెస్	284

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.33

వ్యక్తిగత వికాసం- విద్య, ఉద్యోగంపై సెమినార్

లబ్బీపేట, ఫిబ్రవరి 12: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని ప్రేమిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని సైకాలజిస్టు శ్రీపతి జగదీష్ అన్నారు. నలంద కళాశాలలో రాష్ట్ర యూత్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో వ్యక్తిగత వికాసం- విద్య, ఉద్యోగం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వ్యాయామం శారీరక, మానసిక ఆరోగ్యానికి పునాదని. ప్రతి విద్యార్థి ఇతరుల పట్ల ప్రేమ, దయ, ఆదరణ, కృతజ్ఞత కలిగి ఉండాలన్నారు. గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులను అభినందించారు. అనంతరం వ్యక్తిగత వికాశం, విద్య ఉద్యోగ దీపిక పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. సైకాలజిస్టు తేజావతి, రెడ్ క్రాస్ సొసైటీ మెంబర్ రాధిక, నలంద కళాశాల ప్రిన్స్‌పాల్ ఎం.అనురాధ, యూత్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ మేనేజర్ బి.రాధిక, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్థిక బాధలతో రెస్టారెంట్ యజమాని ఆత్మహత్య

వన్‌టౌన్, ఫిబ్రవరి 12: ఆర్థిక బాధలు తాళలేక గౌతమినగర్‌కు చెందిన ఉండవల్లి మల్లిఖార్జునరావు(40) సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం కృష్ణలంక గౌతమినగర్ 2వ లైన్‌లో ఉండవల్లి మల్లిఖార్జునరావు, భార్య పద్మ, కుమారుడు, కుమార్తెలతో ఉంటున్నాడు. భార్యాభర్తలు తాడేపల్లిలో ఓ రెస్టారెంట్ నిర్వహిస్తున్నారు. వ్యాపారాభివృద్ధి నిమిత్తం మల్లిఖార్జునరావు తెలిసిన వ్యక్తుల వద్ద డబ్బులు అప్పుగా తీసుకున్నాడు. అయితే వ్యాపారం సక్రమంగా లేనందున తీసుకున్న డబ్బులకు వడ్డీలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం భార్యాభర్తలు తాడేపల్లిలోని రెస్టారెంట్‌కు వెళ్లారు. అయితే మల్లిఖార్జునరావు పని ఉందని భార్యకు చెప్పి ఇంటికి వచ్చాడు. అప్పటికే కుమార్తె, కుమారుడు స్కూల్‌కు వెళ్లారు. ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన మల్లిఖార్జునరావు ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న రెస్టారెంట్ వద్ద ఉన్న భార్య ఇంటికి వచ్చి స్థానికుల సహాయంతో భర్త మృతదేహాన్ని కిందకు దించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలం వద్దకు వెళ్లి మృతుడి కుటుంబసభ్యుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే మల్లిఖార్జునరావుకు సుమారు కోటి రూపాయలకు పైగా అప్పులు ఉన్నట్లు సమాచారం. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎన్నాళ్లీ అగచాట్లు

- నాలుగేళ్లయినా పూర్తికాని ఊర్మిళానగర్ రోడ్డు, డ్రెయిన్
- మెటీరియల్ వేసి వదిలేసిన వైనం
- దుమ్ముతో అధ్వానం

43వ డివిజన్ భవానీపురం పరిధిలోని ఊర్మిళానగర్‌లో రోడ్డు, డ్రెయిన్ విస్తరణ పనులకు గ్రహణం వీడటం లేదు. నాలుగేళ్ల క్రితం పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శంకుస్థాపన చేయగా, ఇప్పటి వరకు పూర్తి చేయాలన్న ఆలోచన, చొరవ ఎవరికీ లేకపోవడంతో ప్రజలు తీవ్ర అగచాట్లు పడుతున్నారు.

భవానీపురం, ఫిబ్రవరి 12 : 30వేల మందికి పైగా రోజూ రాకపోకలు సాగించే ఈ రోడ్డు, అంతర్గత డ్రెయిన్ల వద్ద పనులు జాప్యంతో నిత్యం దుమ్ము, ముురుగుతో అవస్థల పాలవుతున్నారు.



దుమ్ముతో అధ్వానంగా ఉన్న ఊర్మిళానగర్ రోడ్డు

అధికారుల లెక్కల ప్రకారం రూ.2.60 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు విస్తరణ, చర్చి నుంచి కనకదుర్గారెడ్డి నగర్ వరకు డ్రెయిన్ రూ. కోటితో చేయాల్సి ఉంది. ఏడాదిన్నర క్రితం పనులు ప్రారంభం కాగా ఇప్పటికీ పూర్తి కాలేదు. కొద్దికాలం కాంట్రాక్టర్ మొండికేయడం, అంతకు ముందు రోడ్ల రిపేర్లతో కాలయాపన చేశారు. తీరా ఎన్నికల సంవత్సరంలో హడావుడిగా మొక్కుబడిగా ఆక్రమణలను తొలగించకుండా డ్రెయిన్‌తో పాటు కనకదుర్గారెడ్డి నగర్ వద్ద కల్వర్టును చేపట్టారు. దీనిపై తీవ్ర విమర్శలు వచ్చినప్పటికీ అధికారి పార్టీ నాయకులు ఇళ్లు, షాపులకు ఇబ్బంది లేకుండా డ్రెయిన్‌ను అష్టవంకర్లు తిప్పేశారు. తీరా ఇప్పుడు రోడ్డు కోసం మెటీరియల్‌ను సగం వరకు వేసి వదిలేయడంతో దుమ్ము రేగుతోంది. దీంతో ప్రజలు నాలుగు నెలలు నుంచి ప్రత్యక్ష నరకాన్ని చవిచూస్తున్నారు. ఇటువైపుగా కార్పొరేటర్ రాకపోకలు సాగిస్తున్నా పనులు వేగవంతంగా జరగడం లేదు. అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ ఆడిందే ఆట పాడింది పాటగా సాగుతుండటంతో రోడ్డు పనుల్లో జాప్యం చోటుచేసుకుందన్న ఆరోపణలున్నాయి. ఇదిలా ఉండగా చర్చి నుంచి ఊర్మిళానగర్ చివరి వరకు డ్రెయిన్ ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు సగం వరకు పూర్తి చేయడంపైన విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

దుమ్ముతో ఇబ్బంది పడుతున్నాం



నాలుగేళ్ల క్రితం రోడ్డు, డ్రెయిన్లకు శంకుస్థాపన చేశారు. బీటీ రోడ్డు వేయడానికి పనులు సాగతీత వలన ప్రజలు దుమ్ముతో ఇక్కట్లు పడుతున్నారు. సగం డ్రెయిన్ కడుతున్నారు. దీని వలన ప్రజలకు ఒరిగిందేమీ ఉండదు. చివరకు డ్రెయిన్ విస్తరించాలి. రోడ్డును త్వరగా పూర్తి చేయాలి.

\- నరసింహ ప్రసాద్, స్థానికుడు

నెలాఖరులోగా రోడ్డు పూర్తి చేస్తాం

డ్రెయిన్ పనులు పూర్తయ్యే దశకు వచ్చాయని, రోడ్డును నెలాఖరులో పూర్తి చేస్తాం. మిగిలిన సగం డ్రెయిన్‌ను పూర్తి చేయడానికి టెండర్లు పిలిచాం

\- నారాయణమూర్తి, కార్పొరేషన్ ఈఈ

జగన్‌రెడ్డి దగాకోరు డైలాగులు ఆపాలి

● టీడీపీ నేతలు వీరంకి, గంజాం

విద్యాధరపురం,ఫిబ్రవరి 12: జగన్‌రెడ్డి దగాకోరు డైలాగులను ఇక ఆపాలని టీడీపీ బీసీ సాధికార సమితి ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి గౌడ్, బీసీ సెల్ అధికార ప్రతినిధి గంజాం రాఘవేంద్రలు హితవు పలికారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారిద్దరు సంయుక్తంగా మాట్లాడారు. బీసీలకు జగన్‌రెడ్డి నామమాత్రపు పదవులు ఇచ్చి పెత్తనమంతా సొంత వారి చేతుల్లో పెట్టారన్నారు. బీసీలకు ఆపార్టీలో కనీస గౌరవం లేదన్నారు. రాజధాని లేకుండా, మూడు రాజధానులు అంటూ ఒక్క ఇటుక కూడ వేయకుండా పదవీకాలం ముగించుకుంటున్న నీచ సీఎంగా జగన్ రికార్డులలోకి ఎక్కుతున్నాడన్నారు. అధికారం కోసం జగన్‌రెడ్డి ఏ గడ్డినైనా తింటాడన్నారు, ఇటువంటినాయకుడి పాలన అవసరమా అని ప్రశ్నించారు. ఎంతమందిని మార్చినా, ఎన్ని ఎత్తుగడలు వేసినా మరో 60 రోజుల తరువాత వైసీపీ కార్యాలయానికి టూ లెట్ బోర్డు తగిలించాల్సి వస్తుందని తెలిపారు.

టీడీపీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా కరీముల్లా



కరీముల్లాకు నియామక పత్రాన్ని అందజేస్తున్న శివనాథ్

విద్యాధరపురం, ఫిబ్రవరి12: టీడీపీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఎస్‌కే కరీముల్లాను పార్టీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ నియమించారు. ఈ మేరకు సోమవారం టీడీపీ సీనియర్ నాయకుడు కేశినేని శివనాథ్(చిన్ని) నియామకపత్రాన్ని కరీముల్లాకు అందజేశారు. ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కరీముల్లా కృషి చేస్తారని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కరీముల్లాకు ఆయన అభినందనలు తెలిపారు.

చందన్‌పటేల్‌కు ఇన్‌స్పైర్ మనక్ అవార్డు



చందన్‌పటేల్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

వన్‌టౌన్, ఫిబ్రవరి 12: స్థానిక కూరపాటి హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థి చందన్‌పటేల్ ఇన్‌స్పైర్ మనక్ అవార్డు గెలుచుకున్నాడు. రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో లయోలా కళాశాల ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో చందన్‌పటేల్ ప్రాజెక్ట్ కాంపిటీషన్‌లో ఫైర్ అలారమ్‌ను రూపొందించి ప్రదర్శించాడు. ప్రధానోపాధ్యాయుడు గానుగుల యుగంధరాచార్య, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు బిల్లి రమేష్, హైస్కూల్ కమిటీ కార్యదర్శి కూరపాటి నారాయణరావు, సహాయ కార్యదర్శి కూరపాటి చంటి, కమిటీ సభ్యులు శ్రీరామ్, రజిత్, అధ్యాపక బృందం తదితరులు విద్యార్థిని అభినందించారు.

కరాటే పోటీల్లో నలంద విద్యార్థులకు పతకాలు



గవర్నర్‌పేట, ఫిబ్రవరి 12: జెజె గోజూరియా కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫస్ట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తా చాటిన నలంద విద్యానికేతన్ విద్యార్థులకు సోమవారం స్కూల్ ప్రాంగణంలో అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ మాట్లాడుతూ ఆదివారం గొల్లపూడిలో జరిగిన పోటీలకు నలంద విద్యానికేతన్ నుంచి 19 మంది పోటీల్లో పాల్గొనగా 10 మంది బంగారు పతకాలను, ఆరుగురు రజత పతకాలను, ముగ్గురు కాంస్య పతకాలను దక్కించుకున్నారని వెల్లడించారు. ఈ సందర్భంగా కరాటే కోచ్ పి. శ్రీహర్షను ప్రిన్సిపాల్ అభినందించారు.

లూనా సెంటర్‌లో భవిష్యత్తుకు గ్యారెంటీ



పార్టీలోకి ఆహ్వానిస్తున్న బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 12 : స్థానిక 59వ డివిజన్ లూనా సెంటర్ ప్రాంతంలో సోమవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బొండా ఉమామహేశ్వరరావు ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ప్రవేశపెట్టనున్న వివిధ పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. నేతలు నవనీతం సాంబశివరావు, ఘంటా కృష్ణమోహన్, చల్లగాలి అనిల్ పాల్గొన్నారు.

సత్యనారాయణపురం: 33వ డివిజన్ ఇన్‌చార్జి గార్లపాటి విజయకుమార్ ఆధ్వర్యంలో సోమవారం సత్యనారాయణపురంలో బొండా ఉమా అన్న రావాలి-సెంట్రల్ గెలవాలి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బొండా సిద్ధార్థ ఇంటింటికీ వెళ్లి టీడీపీ వస్తే చేపట్టే పథకాల గురించి వివరించారు. డివిజన్ అధ్యక్షులు ఎన్. కోటేశ్వరరావు, చామర్తి రవిబాబు, చిలువేరు శ్రీను, పొట్లూరి కృష్ణప్రసాద్, వేమూరి భానుప్రకాష్, టీఎన్‌ఎస్‌ఎఫ్ సెంట్రల్ అధ్యక్షులు మనోజ్, ధనలక్ష్మి, తంగిరాల లక్ష్మి, శంకరసాయి, రామలక్ష్మి, స్థానిక టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ కూరగాయల మార్కెట్ వద్ద

వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు ఆర్.మాధవ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజీవ్‌గాంధీ హోల్‌సేల్ కూరగాయల మార్కెట్, పూలమార్కెట్‌లోని ప్రతిషాప్‌కు ఆయన తిరుగుతూ కరపత్రాన్ని పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాగానే నిత్యావసర ధరలను అదుపులోకి తీసుకొస్తామని టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు- జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌లు హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో అరికసాయి నాగబాబు, కోనేటి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

పాయకాపురం: 59వ డివిజన్‌లోని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన 100 మంది పార్టీలో చేరారు. మొగల్రాజ పురంలోని బొండా ఉమా నివాసంలో ఆయన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 61, 62 డివిజన్లకు చెందిన 50 మంది టీడీపీలో చేరారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని సెంట్రల్ టీడీపీ కార్యాలయంలో బొండా ఉమా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సాంబశివ రావు, పైడి శ్రీను, దాసరి ఉదయశ్రీ, కృష్ణమో హన్, వైకుంఠం పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతను నట్టేటముంచిన జగన్

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



చిరువ్యాపారులకు సైకిళ్లు అందజేసిన గద్దె

పటమట, ఫిబ్రవరి 12 : ఏటా జాబ్ క్యాలెండర్ ఉంటుందని ఎన్నికల ముందు ప్రకటించిన జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన ఈ నాలుగేళ్లలో ఒక్క జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయకుండా యువతను మోసం చేశారని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. అశోక్ నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం ముగ్గురు చిరువ్యాపారులకు మూడు సైకిళ్లను గద్దె అందజేశారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో అరకొరగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి చేతులు దులుపుకున్నారని అన్నారు. మెగా డీఎస్సీ నిర్వహించాలని, అభ్యర్థుల వయస్సును పెంచాలని కోరుతూ విద్యార్థి సంఘాల నాయకులు కోరుతుంటే వారిని బలవంతంగా అరెస్ట్ చేస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓట్లు వేసి టీడీపీని గెలిపించుకోవాలని, రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం చంద్రబాబు వల్లనే సాధ్యమని అన్నారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, మాదాల చిన్నతల్లి, పేరేపి ఈశ్వర్, కిలారు శ్రావణ్, చలసాని రమణ, పఠాన్ హయత్ ఖాన్, అప్పలనాయుడు, గద్దె రమేష్, బావరాజు నాని పాల్గొన్నారు.

ఆర్టీసీ సెంట్రల్ డిస్పెన్సరీలో రక్తదాన శిబిరం



రక్తదాతలను పరామర్శిస్తున్న ఎంవై దానం

బస్టేషన్, ఫిబ్రవరి 12: ఈ ఏడాది జనవరి 15 నుంచి ప్రారంభమైన రహదారి భద్రతా మాసోత్సవాన్ని పురస్కరించుకుని పండిట్ నెహ్రూ బస్టేషన్‌లోని ఆర్టీసీ సెంట్రల్ డిస్పెన్సరీలో సోమవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని జిల్లా ప్రజారవాణా అధికారి ఎంవై దానం ప్రారంభించారు. అనంతరం శిబిరంలో రక్తదాతలను ఆయన పరామర్శించి అభినందించారు. జిల్లాకు చెందిన 51 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ డాక్టర్ టీవీ రామారావు, డీసీఎం ఏ జాన్‌సుధాకర్, డీసీటీఎం బషీర్ అహ్మద్, ఉద్యోగ సంఘాల నాయకులు ప్రతినిధులు పాల్గొన్నారు.

● రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని సోమవారం తుళ్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గవర్నరుపేట-2 డిపో మేనేజర్ ఎస్ నాగభూషణం విజేతలకు బహుమతులు అందజేశారు.

మత్తు పదార్థాలను నిర్మూలిద్దాం



పోస్టర్లను ప్రదర్శిస్తున్న ఇస్లాం హింద్ సభ్యులు

ఆటోనగర్(పెనమలూరు), ఫిబ్రవరి12: మత్తు పదార్థాలను నిర్మూలించి ఉత్తమ సమాజాన్ని నిర్మిద్దామని జమాతే ఇస్లాం హింద్ నేతలు ఖలీలుల్లా, విజయవాడ నార్త్ అధ్యక్షుడు అబ్దుల్ సత్తార్, అబ్దుల్ కలాం, హబీబ్‌ఖాన్, జాహిరుద్దీన్, సిద్దిక్ భాయ్‌లు పేర్కొన్నారు. మత్తు పదార్థాల వాడకానికి వ్యతిరేకంగా రెండు వారాల పాటు జరిగే ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా సనత్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే నష్టాలను తెలిపే పోస్టర్లను ఆవిష్కరించారు. భావి తరాల భవిష్యత్తును రక్షించే గురుతర బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని పబ్లిక్ రిలేషన్స్ బాధ్యులు లతీఫ్ పేర్కొన్నారు.

ఖురాన్ కంఠస్థ పోటీలు



మాట్లాడుతున్న మహ్మద్ దావూద్

ఆటోనగర్(పెనమలూరు), ఫిబ్రవరి 12: నిత్యజీవితంలో అన్ని రకాల సమస్యల పరిష్కారానికి పవిత్ర ఖురాన్ దారి చూపుతుందని యునైటెడ్ ఫోరం ఫర్ ఖురానిక్ స్టడీస్ చైర్మన్ మొహమ్మద్ దావూద్ పేర్కొన్నారు. ఆటోనగర్ ఏటీప భవనంలో జరిగిన కార్యక్రమంలో జరిగిన 9వ ఖురాన్ కంఠస్థ పోటీల సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖురాన్ పఠనంతో చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసిన వారమవుతామని పేర్కొన్నారు. ఖురాన్ పఠనంలో విజేతలకు బహుమతులు అందించారు. ఏటీప ప్రెసిడెంట్ రాజనాల వెంకటరమణారావు(బాబ్జీ), ఎండీ అక్బర్‌బాషా, మహమ్మద్ పర్వేజ్, డాక్టర్ కాలేషావలి, అబ్దుల్ మతీన్, ఎండీ ఖలీలుల్లా, అమీన్ ఉమరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు ఇంజన్ విరాళం

భారతీనగర్, ఫిబ్రవరి 12: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని ఆటోమొబైల్ ప్రయోగశాలకు ఇసుజుమోటర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ లక్ష రూపాయల విలువ గల బిఎస్6 మోడల్ ఆటో మొబైల్ ఇంజన్‌ను కంపెనీ జనరల్ మేనేజర్ టకాషిరికుకవ సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ ఎం విజయసారధికి అందజేశారు. విభాగాధిపతులు యం. నాగరాజు, బి. శైలజా, ఎస్.వి.వి రమణ, కె.వి.ఎస్ ఫణి పాల్గొన్నారు.

భారీ వాహనాల రాకపోకలకు చెక్ పెట్టండి

● కలెక్టర్ దిల్లీరావుకు పుణ్యశీల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పుణ్యశీల

పాతరాజరాజేశ్వరి పేట, ఫిబ్రవరి 12 : కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్ వల్ల ప్రభాస్ కాలేజీ రోడ్డులో భారీ వాహనాల రాకపోకలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కలెక్టర్ ఎస్. దిల్లీరావుకు ఏపీఏడీసీ చైర్మన్, 34వ డివిజన్ కార్పొరేటర్ బండి పుణ్యశీల వివరించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో కలెక్టర్ దిల్లీరావును కలిసి వినతిపత్రం అందజేశారు. కేదారేశ్వరపేట పండ్లమార్కెట్‌లోకి వచ్చే చిన్నపాటి నుంచి భారీ వాహనాలు ప్రభాస్ కాలేజ్ రోడ్డులో రాకపోకలు చేయడం, ఆ రోడ్డులోనే కాకుండా కేదారేశ్వరపేట జీరో లైన్ నుంచి ఐదవ లైన్లలోని వీధుల్లో అనధికార పార్కింగ్‌లు చేసి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని కలెక్టర్‌కు పుణ్యశీల తెలిపారు. తక్షణమే ప్రభాస్ కాలేజీ రోడ్డులోకి పండ్ల మార్కెట్ వాహనాలను అనుమతించకుండా చర్యలు తీసుకోవాలని పుణ్యశీల కోరారు. సమస్యను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు పుణ్యశీల పేర్కొన్నారు.

పేదలకు 'కళ్లే' ట్రస్ట్ అన్నదానం



అన్నదానం చేస్తున్న లలిత కుటుంబ సభ్యులు

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 12 : కళ్లే లలిత జ్ఞాపకార్థం ప్రతి నెల 12న పేదలకు అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కళ్లే లలిత ట్రస్ట్ సభ్యులు కళ్లే జయదుర్గ, కళ్లే సీతామహాలక్ష్మి, మేఘవాణిలు తెలిపారు. సింగ్‌నగర్‌లోని కళ్లే లలిత వీధిలో సోమవారం పేదలకు అన్నదానం చేసి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళ్లే నాగేశ్వరరావు, ముప్పూరి హరీష్, ఎం.జశ్విన్, జి.ధ్రువన్‌లు ఆమెకు నివాళులర్పించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 12 : 58వ డివిజన్ తోటవారి వీధి 9వ లైన్‌లో రూ. 20 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, ఆంధ్రప్రతిక కాలనీలోని 7వ లైన్‌లో మరో రూ. 20 లక్షల వ్యయంతో రహదారి నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే మల్లాది విష్ణు భూమి పూజ చేశారు. డిప్యూటీ మేయర్ అవుతు శైలజ, తదితరులు పాల్గొన్నారు.

వీరమల్లు రాక అప్పుడే...



క్రిష్ దర్శకత్వంలో పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'హరిహర వీరమల్లు'. ఈ సినిమా చిత్రీకరణ ఆగిపోయిందంటూ కొన్ని రోజులుగా మీడియాలో వస్తున్న వార్తలకు చెక్ పెడుతూ చిత్ర నిర్మాణ సంస్థ మెగా సూర్య ప్రొడక్షన్స్ కీలకమైన అప్డేట్‌ను ఇచ్చింది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ఫిబ్రవరి 12న విడుదల చేస్తున్నట్లు సోమవారం సోషల్ మీడియాలో ప్రకటించింది. త్వరలో ప్రోమోను కూడా విడుదల చేస్తున్నట్లు అందులో తెలిపారు. అసత్యాలు నమ్మవద్దు, భారీ హంగులు, అత్యున్నత ప్రమాణాలతో సినిమాను తీర్చిదిద్దాలనే ప్రయత్నం వల్ల చిత్రీకరణకు ఎక్కువ సమయం పడుతోంది అని మేకర్స్ పేర్కొన్నారు. ఇందులో పవన్‌కు జోడీగా నిధి అగర్వాల్ నటిస్తున్నారు. ఏఎం రత్నం సమర్పణలో ఏ. దయాకర్‌రావు నిర్మిస్తున్నారు.

రుహానీ.. డైనమిక్ లుక్



వరుణ్‌తేజ్ తొలిసారిగా నటిస్తున్న బాలీవుడ్ చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో వరుణ్‌తేజ్ ఐఎఎఫ్ ఆఫీసర్‌గా నటిస్తుండగా, మానుషీ చిల్లర్ రాడార్ ఆఫీసర్‌గా కనిపిస్తారు. ఈ సినిమాకు మరో గ్లామర్ రుహానీ శర్మ. ఇందులో ఈమె ఎయిర్ ఫోర్స్ పైలెట్‌గా నటిస్తున్నారు. పాత్ర పేరు తాన్యా శర్మ. ఆమె లుక్ పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. పైలెట్ యూనిఫామ్‌లో ఆమె డైనమిక్‌గా కనిపించారు. దేశంలోని వైమానిక దళ వీరుల అలుపెరుగని పోరాటాన్ని , దేశాన్ని రక్షించడంలో వారు ఎదుర్కొనే సవాళ్లను అద్భుతంగా ఆవిష్కరించే ఈ చిత్రానికి శక్తి ప్రతాప్‌సింగ్ హడ దర్శకుడు. మార్చి ఒకటిన తెలుగు, హిందీ భాషల్లో విడుదల కానుంది. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్ రినైసన్స్ పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి.



ఇంత అద్భుతంగా నటించానా అనిపించింది

రవితేజ

'ఈగల్' చిత్రానికి ప్రేక్షకుల స్పందన చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. కాళికాదేవి ఎపిసోడ్ చూస్తుంటే నేనేనా ఇంత అద్భుతంగా నటించింది అనిపించింది' అని రవితేజ అన్నారు. ఆయన కథానాయకుడిగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన 'ఈగల్' చిత్రం సక్సెస్‌మీట్ ఇటీవలే జరిగింది. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ 'నాకు అవకాశం ఇచ్చిన రవితేజ గారికి ధన్యవాదాలు. ఆయన వల్లే ఇంత గొప్ప విజయం సాధ్యమైంది' అని చెప్పారు. నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ మాట్లాడుతూ 'రవితేజతో 'ధమాకా' తర్వాత 'ఈగల్'తో మరో బ్లాక్‌బస్టర్ కొట్టాం. కార్తీక్‌తో మరిన్ని సినిమాలు చేయబోతున్నాం' అని తెలిపారు.

పెగ్ కలిపారా?స్టఫ్ ఇచ్చారా?

తన వ్యక్తిత్వాన్ని కించపరిచేలా డిజిటల్ మీడియాలో వస్తున్న వార్తలపై దర్శకుడు హరీష్ శంకర్ 'ఈగల్' సక్సెస్‌మీట్‌లో ఘాటుగా స్పందించారు. 'నేను నిర్మాత ఇంట్లో పడి రేయింబవళ్లు తాగుతున్నానంటూ, నా షాడో ఫొటో పెట్టి ఓ వెబ్‌సైట్‌లో వార్తలు రాస్తున్నారు. నేను తాగుతుంటే మీరొచ్చి పెగ్ కలిపారా? స్టఫ్ ఇచ్చారా? మీకు నిజంగా దమ్ము ఉంటే నా ఫొటో పెట్టి ఆ వార్త రాయండి. అప్పుడు నా ప్రతిస్పందన చూద్దురు. 'ఇకపైనా ఇలానే చేస్తాం' అంటే చేసుకోండి. నా వెంట్రుక కూడా పీకలేరు' అని అన్నారు. 'నాకు గ్యాప్ వచ్చిందంటున్నారు, ఇప్పుడు ఒకేసారి ఐదు సినిమాలు చేస్తున్నా. ఇవన్నీ మీకు చెప్పి చేయాలా?, మా నాన్నలాగా



స్కూల్ ఫీజు కట్టావా? నీకు చూపించడానికి' అని ప్రశ్నించారు. రివ్యూల్లో విమర్శ కనిపిస్తే సరే గానీ అది హేళన స్థాయికి వెళ్లడం చూస్తుంటే బాధేస్తోందన్నారు. సినీ జర్నలిస్టులు కూడా ఇండస్ట్రీలో భాగమే, కానీ మనలో మనం కలహించుకోవడం వల్ల బయటివారికి లోకువవుతున్నామని గుర్తెరగాలి అని హరీష్ శంకర్ హితవు పలికారు.

ఆ సమయం వచ్చింది



అనారోగ్యం వల్ల దాదాపు ఏడాది కాలంగా సినిమా షూటింగ్స్‌కు దూరమయ్యారు సమంత. 'ఖుషి' చిత్రం పూర్తి చేశాక సినిమాలకు బ్రేక్ ఇచ్చి మయోసైటిస్ వ్యాధికి చికిత్స తీసుకుంటున్నారు. త్వరలోనే సినిమా షూటింగ్స్‌లో పాల్గొనబోతున్నట్లు సమంత సోమవారం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తెలిపారు. 'మళ్లీ సినిమా షూటింగ్స్ ఎప్పుడు మొదలుపెడతారు? అని నన్ను చాలామంది అడుగుతున్నారు. ఇక దానికి సమయం వచ్చింది. త్వరలోనే షూటింగ్స్ మొదలుపెడతాను' అని ప్రత్యేకంగా విడుదల చేసిన వీడియోలో పేర్కొన్నారు.


గామి సినిమా కోసం ఎదురుచూస్తున్నా

- నాగ్ అశ్విన్



విష్వక్‌సేన్ కథానాయకుడిగా విద్యాధర్ కాగిత దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'గామి'. ఈ సినిమా ప్రచార చిత్రాలను చూసిన ప్రముఖ దర్శకుడు నాగ్ అశ్విన్ 'గామి' చిత్రబృందంపై ప్రశంసలు కురిపించారు. ఈ చిత్రంలో హీరో మానవ స్పర్శను అనుభవించలేని అరుదైన వ్యాధితో బాధపడే అఘోరాగా కనిపించడమనే కాన్సెప్ట్‌ను ఆయన అభినందించారు. చాలా ఓపిగ్గా, ఎంతోకాలం శ్రమించి, సాధించారు, మీ సినిమా కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా అని ఇన్‌స్టాగ్రామ్‌లో నాగ్ అశ్విన్ తెలిపారు. 'గామి' మార్చి 8న థియేటర్లలో విడుదలవుతోంది.

21న గోవాలో రకుల్ వివాహం



హీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్ వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారు. తన ప్రియుడు, నిర్మాత జాకీ భగ్నానీని ఆమె పెళ్లాడనున్నారు. వివాహ ముహూర్తం నిశ్చయమైంది. ఈనెల 21న ఈ ప్రేమజంట గోవాలో ఒక్కటవబోతున్నారు. ఆహ్వాన పత్రిక సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కొద్దిమంది కుటుంబ సభ్యులు, సన్నిహితులు మాత్రమే ఈ పెళ్లికి హాజరవుతున్నారు.

16న టైటిల్ ప్రకటన



శివ కార్తికేయన్ కథానాయకుడిగా కమల్‌హాసన్, ఆర్ మహేంద్రన్‌తో కలసి ఓ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. 'ఎస్‌కే 21' అనేది వర్కింగ్ టైటిల్. ఈ చిత్రం టైటిల్ టీజర్‌ను ఈ నెల 16న విడుదల చేయనున్నట్లు మేకర్స్ సోమవారం ప్రత్యేక వీడియోను విడుదలచేసి తెలిపారు. ఈ చిత్రానికి రాజ్‌కుమార్ పెరియసామి దర్శకుడు. సాయపల్లవి కథానాయిక. సంగీతం: జీవీ ప్రకాశ్

యూత్, ఫ్యామిలీ ఆడియన్స్ ఎంజాయ్ చేస్తారు

దర్శకుడు విఐ ఆనంద్



సందీప్‌కిషన్ హీరోగా నటించిన 'ఊరు పేరు భైరవకోన' ఈ నెల 16న విడుదల కానుంది. అనిల్ సుంకర సమర్పణలో రాజేశ్ దండా ఈ చిత్రాన్ని నిర్మించారు. కావ్య థాపర్, వర్ష బొల్లమ్మ హీరోయిన్లుగా నటించగా విఐ ఆనంద్ దర్శకత్వం వహించారు. ఆయన సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చిత్ర విశేషాలు వెల్లడించారు.

- 'టైగర్' చిత్రం తర్వాత మరో సినిమా చేయాలని నేను, సందీప్ అనుకున్నాం. నా దగ్గరున్న రెండు ఐడియాల గురించి ఆయనకు చెప్పినప్పుడు 'ఊరు పేరు భైరవకోన' కథ విని చాలా ఎక్సయిట్ అయ్యాడు. ఒక ట్రెండ్ సెట్ చేసేలా ఉంటుందని ఆ కథను ఫిక్స్ చేశాం. సందీప్ ఇంతవరకూ సూపర్ నేచురల్ ఫాంటసీ జోనర్ చేయలేదు. విజువల్స్, సౌండ్ పరంగా ఒక గొప్ప అనుభూతినిచ్చే సినిమా ఇది. నిర్మాత రాజేశ్‌గారు కూడా ఈ కథ బాగుందన్నారు. మా మంచి కోరే వ్యక్తి అనిల్ సుంకర్ కూడా ఈ ప్రాజెక్ట్‌లోకి రావడంతో జర్నీ మొదలైంది.
- కర్మ సిద్ధాంతం, గురించి చెప్పే సినిమా ఇది. గరుడ పురాణంలోని కొన్ని అంశాలు తీసుకున్నాం. ముఖ్యంగా ఆత్మ ప్రయాణం గురించి గరుడ పురాణంలో వివరంగా ఉంది.
- ఈ రోజుల్లో ప్రేక్షకుల్ని థియేటర్‌కు రప్పించాలంటే కంటెంట్ బలంగా ఉండాలి. విజువల్స్ కొత్త అనుభూతి కలిగించాలి. అందుకే నిర్మాణపరంగా ఎక్కడా రాజీ పడకుండా నిర్మాత రాజేశ్‌గారు ప్రతిదీ సమకూర్చారు. సినిమాలో రెండు పెద్ద ట్విస్టులు ఉన్నాయి. ప్రతి పది నిమిషాలకు ప్రేక్షకులు ఊహించని మలుపులు కథలో ఉంటాయి. యూత్, ఫ్యామిలీతో పాటు అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా ఇది. అలాగే వెన్నెల కిశోర్ కామెడీ ట్రాక్ అలరిస్తుంది. అలాగే వైవా హర్ష పాత్ర కూడా నవ్విస్తుంది.
- చిత్ర పరిశ్రమకు వచ్చి పదేళ్ల అవుతోంది. ఇంకో మూడు చిత్రాలు ఫిల్మోగ్రఫీలో యాడ్ అయి ఉంటే బాగుండేదనిపిస్తోంది. ప్రస్తుతం నిఖిల్‌తో ఓ సినిమా చర్చల్లో ఉంది.

అందుకే 'డ్రిల్' పేరు పెట్టాం

డాక్టర్ హరనాథ్ పొలిచెర్ల



అమెరికాలో డాక్టర్‌గా పని చేస్తున్న హరనాథ్ పొలిచెర్ల హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'డ్రిల్' ఈ నెల 16న విడుదల కానుంది. కారుణ్య చౌదరి హీరోయిన్‌గా నటించారు. సినిమా విడుదల సందర్భంగా డాక్టర్ హరనాథ్ సోమవారం మీడియాతో మాట్లాడుతూ 'నాకు చిన్నప్పటి నుంచి సినిమాలంటే ఇష్టం. అమెరికాలో డాక్టర్‌గా పని చేస్తున్నాను. ఆ వృత్తిలో ఎంతో బిజీగా ఉంటాను. ఒక రోజు 'మన లక్ష్యం ఏమిటి, వెళుతున్న దారి ఏమిటి అని అనిపించింది. దాంతో నటన వైపు మళ్లాను. తెలుగులో ఎనిమిది చిత్రాలు తీశా. కన్నడంలో నటించా. చాలా రోజుల తర్వాత మళ్లీ 'డ్రిల్' చిత్రం చేశా' అని చెప్పారు. ఈ చిత్రం గురించి ఆయన మాట్లాడుతూ 'ఇదొక క్రైమ్ బేస్డ్ మూవీ. లవ్ జిహాద్ అనేది ఒక అంశం మాత్రమే. నేను పోలీస్ ఆఫీసర్‌గా నటించా. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాను. తొలి కాపీ చూసిన తర్వాత ఆ కష్టం మరిచిపోయాను. 'డ్రిల్' అనేది ఒక ఆయుధం. మా సినిమాలో హంతకుడు డ్రిల్లింగ్ మిషన్ వాడి అందరినీ చంపుతుంటాడు. ప్రేక్షకుల్లో ఆసక్తి కలిగించడం కోసం సినిమాకు 'డ్రిల్' అని టైటిల్ పెట్టాం' అన్నారు. ఇలాంటి క్రైమ్ థ్రిల్లర్స్‌కు ఫొటోగ్రఫీ, సంగీతం చాలా కీలకం అని చెబుతూ ఛాయాగ్రాహకుడు వంశీకృష్ణ, సంగీత దర్శకుడు డిఎస్ఎస్‌కె అద్భుతంగా పని చేశారని హరనాథ్ చెప్పారు.

మళ్లీ మనీషా చిత్రం!



'మాయలోడు', 'రాజేంద్రుడు గజేంద్రుడు' 'యమలీల', 'వినోదం' వంటి వినోదాత్మక చిత్రాలను ప్రేక్షకులకు అందించిన మనీషా సంస్థ అధినేత కిశోర్ రాఠి చాలా కాలం గ్యాప్ తర్వాత మళ్లీ చిత్ర నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. శ్రీహర్ష, కషిక కపూర్ హీరో హీరోయిన్లుగా ఆయన నిర్మించే 'లవ్ యువర్ ఫాదర్' చిత్రం షూటింగ్ సోమవారం మల్లారెడ్డి కాలేజీలో ప్రారంభమైంది. పవన్ కేతరాజు ఈ చిత్రానికి దర్శకుడు. హీరో శ్రీహర్ష, గాయకుడు ఎస్పీ చరణ్‌పై చిత్రీకరించిన తొలి షాట్‌కు సీఎంఆర్ గ్రూప్ ఛైర్మన్ గోపాలరెడ్డి క్లాప్ ఇవ్వగా, కామకూర శాలిని కెమెరా స్విచ్ఆన్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాతల్లో ఒకరైన మహేశ్ రాఠి మాట్లాడుతూ 'తండ్రీకొడుకుల మధ్య ఉండే బంధాన్ని, ఎమోషన్‌ను చూపించే సినిమా ఇది. మణిశర్మగారు సంగీత దర్శకత్వం వహిస్తున్నారు. మా నాన్నగారి ఆశీస్సులతో ఈ సినిమా నిర్మిస్తున్నాను' అన్నారు. మల్లారెడ్డి కాలేజ్ ప్రిన్సిపాల్ ఎ.రామస్వామి రెడ్డి మాట్లాడుతూ మా అబ్బాయి శ్రీహర్షను హీరోగా పరిచయం చేయడం ఆనందంగా ఉంది. సినిమాలో అన్ని రకాల ఎలిమెంట్స్ ఉంటాయి. వినోదాత్మకంగా కూడా ఉండే ఈ సినిమా సక్సెస్ కావాలని కోరుకుంటున్నా' అన్నారు. దర్శకుడు పవన్ కేతరాజు మాట్లాడుతూ 'ఎన్నో హిట్ చిత్రాలు అందించిన మనీషా సంస్థలో పని చేయడం ఆనందంగా ఉంది. మా నిర్మాత కిశోర్ రాఠి జీవితంలో జరిగిన ఓ సంఘటన తీసుకుని కథని తయారు చేశాం. తండ్రీ కొడుకుల ఎమోషనల్ జర్నీ ఈ సినిమా' అన్నారు. నవాబ్ షా, ప్రవీణ్, భద్రం, అంజన్ శ్రీవాస్తవ్, అమన్ వేమ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఫొటోగ్రఫీ: మణీంద్ర కుమార్, సంగీతం: మణిశర్మ, నిర్మాతలు: కిశోర్ రాఠి, హేశ్ రాఠి, అన్నపురెడ్డి సామ్రాజ్యలక్ష్మి.

ఈ గడ్డ కోసం పోరాడిన వాళ్ల కథ



'ఎంతో మంది త్యాగాలు చేస్తే మనం ఈ రోజు ప్రశాంతంగా ఉన్నాం. ముఖ్యంగా సర్దార్ వల్లభ బాయ్ పటేల్ లేకపోతే మనం ఈ రోజు ఇలా ఉండేవాళ్లం కాదు. చరిత్రను ఇలా దృశ్యరూపంలో చూపిస్తే మరింత అర్థమవుతుంది. ఈ ట్రైలర్ చూస్తే రోమాలు నిక్కబొడుచుకున్నాయి. నా శిష్యుడు సత్యనారాయణ అద్భుతంగా సినిమా తీశాడు. సుద్దాల అశోక్ తేజ రక్తంతో పాటలు రాస్తారా అనిపిస్తుంది. 'రజాకార్' చిత్రం విజయం సాధించాలి' అన్నారు సీనియర్ దర్శకుడు కె.రాఘవేంద్రరావు. యాటా సత్యనారాయణ దర్శకత్వంలో గూడూరు నారాయణరెడ్డి నిర్మించిన 'రజాకార్' చిత్రం మార్చి ఒకటిన విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. దర్శకుడు యాటా సత్యనారాయణ మాట్లాడుతూ 'ఇటువంటి సినిమాలు తీస్తున్నప్పుడు బెదిరింపు కాల్స్, నెగెటివ్ కామెంట్స్ వస్తుంటాయి. అయినా లెక్క చేయకుండా మా చరిత్ర, మా పూర్వీకుల బాధలు, త్యాగాలు, ఈ గడ్డ కోసం పోరాడిన వాళ్ల గురించి చెప్పడానికే ఈ సినిమా తీశాను. ప్రపంచంలో అణిచివేతకు గురైన ప్రతి ఒక్కరికీ 'రజాకార్' చిత్రం అంకితం. రజాకార్లు చేసిన అన్యాయాన్ని చెప్పడానికే ఈ సినిమా తీశాం' అన్నారు. 'సెప్టెంబర్ 17 ప్రాముఖ్యం గురించి చాలా మందికి తెలీదు. మళ్లీ రజాకార్లు పుట్టొద్దు. అందుకే ఆ చరిత్రను చరిత్రగానే తీశాం. ఈ సినిమా కోసం ఎంతో ఖర్చు పెట్టాం. మూడు రెట్లు బడ్జెట్ పెరిగినా, నా ఆస్తులు అమ్మి అయినా మన చరిత్రను అందరికీ చూపించాలని 'రజాకార్' చిత్రాన్ని తీశాం' అని తెలిపారు నిర్మాత గూడురు నారాయణరెడ్డి. ఇటువంటి చిత్రంలో నటించినందుకు ఆనందంగా ఉందని అనసూయ చెప్పారు. బాబీ సింహా, వేదిక, అనుష్య త్రిపాఠి, ప్రేమ, ఇంద్రజ, మకరంద్ దేశ్ పాండే తదితరులు నటించిన 'రజాకార్' చిత్రాన్ని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, మరాఠి భాషల్లో విడుదల చేస్తున్నారు.

సైరన్‌కు డేట్ ఫిక్స్



తమిళ హీరో జయం రవి కథానాయకుడిగా నటించిన చిత్రం 'సైరన్'. ఆంథోనీ భాగ్యరాజ్ దర్శకుడు. ఈనెల 23న ఈ చిత్రం విడుదలవుతోంది. గంగ ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్‌పై మహేశ్వర్ రెడ్డి మూలీ తెలుగులో విడుదల చేస్తున్నారు. కీర్తి సురేశ్, అనుపమా పరమేశ్వరన్ కథానాయికలు. ఫ్యామిలీ, కమర్షియల్ ఎలిమెంట్స్ కుదిరేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు దర్శకుడు చెప్పారు.

నవ్వించే గూఢచారి



వెన్నెల కిశోర్ హీరోగా నటించిన చిత్రం 'చారి 111'. సంయుక్తా విశ్వనాథన్ హీరోయిన్. టీజీ కీర్తికుమార్ దర్శకత్వంలో అదితీ సోనీ నిర్మించారు. మార్చి 1న విడుదలవుతోంది. సోమవారం చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. సీరియస్‌గా కనిపిస్తూ, నవ్వించే గూఢచారిగా ట్రైలర్‌లో వెన్నెల కిశోర్ అలరించారు. ఈ ట్రైలర్ జస్ట్ శాంపిల్ మాత్రమే, సినిమాలో ఇంతకు మించి వినోదం ఉంటుంది అని దర్శకుడు తెలిపారు.

హెయిర్ కేర్

జుట్టు తెల్లబడకుండా...

తెల్లబడే జుట్టును ఆపడం ఎవరి తరం కాదు. అయితే ఆ క్రమాన్ని వాయిదా పడేలా చేయవచ్చు. అదెలాగంటే...

చిన్న వయసులోనే జుట్టు తెల్లబడడమనేది జన్యువుల మీదే ఆధారపడి ఉన్నప్పటికీ, విటమిన్ బి12, బయోటిన్, విటమిన్ డి, ఇల లోపం కూడా ఈ సమస్యను పెంచుతూ ఉంటుంది. ఈ లోపాలను సరిదిద్దుకోగలిగితే, జుట్టు తెల్లబడే వేగాన్ని నెమ్మదించేలా చేయవచ్చు. గుడ్లు, చేపలు, చికెన్‌లలో విటమిన్ బి12 పుష్కలంగా ఉంటుంది కాబట్టి తరచూ వీటిని తింటూ ఉండాలి. ఒకవేళ శాకాహారులైతే ఈ విటమిన్లు కలిసి ఉండే ఫోర్టిఫైడ్ ఫుడ్స్‌ను ఎంచుకుంటూ ఉండాలి. విటమిన్ డి మోతాదును పెంచుకోవడం కోసం సప్లిమెంట్లు, పాలు, పాల ఉత్పత్తులు తీసుకోవాలి. అలాగే ఎండకు బహిర్గతమవుతూ ఉండాలి. బయోటిన్ (విటమిన్ బి7) కోసం చిలగడ దుంపలు, గుడ్లు, నట్స్, సీడ్స్ తినాలి. విటమిన్ బి6 కోసం బంగాళాదుంపలు, బఠాణీలు, అరటిపండ్లు తీసుకోవాలి. అలాగే వెంట్రుకల ఆరోగ్యం కోసం ట్రేస్ మినరల్స్ కూడా సరిపడా అందేలా చూసుకుంటూ ఉండాలి. జింక్, కాపర్, మెగ్నీషియం, సెలీనియంలు వెంట్రుకల పెరుగుదలకూ, మరమ్మత్తుకూ తోడ్పడతాయి. ధూమపానంతో వెంట్రుకలు తెల్లబడే వేగం పెరుగుతున్నట్టు పరిశోధనల్లో తేలింది. వెంట్రుకల కుదుళ్లలో పేరుకునే నికోటిన్ మెలనిన్ ఫార్మేషన్‌ను అస్తవ్యస్థం చేసి, చిన్న వయసులోనే వెంట్రుకలు తెల్లబడేలా చేస్తుంది. కాబట్టి ధూమపానానికి దూరంగా ఉండాలి. ఒత్తిడి వల్ల కూడా వెంట్రుకలు తెల్లబడతాయి. ఒత్తిడితో విడుదలయ్యే నోరిపైనెఫ్రైన్ అనే రసాయనం వెంట్రుకల కుదుళ్ల దగ్గరకు చేరుకుని పిగ్మెంటేషన్ లాస్‌కు పెంచుతుంది. దాంతో వెంట్రుకలు తెల్లబడడం మొదలుపెడతాయి. కాబట్టి ఒత్తిడిని తగ్గించే యోగా, ధ్యానం, వ్యాయామం అలవాటు చేసుకోవాలి.



వెయిట్ లాస్

బరువు తగ్గించే ఆహారం

బరువు తగ్గడం కోసం తినే ఆహార పరిమాణాన్ని తగ్గించడంతో పాటు, బరువు తగ్గించే పదార్థాలను కూడా అదనంగా తీసుకోవాలి. అవేంటంటే...

- **బ్లాక్ కరెంట్స్:** వీటిలో విటమిన్ సి, పొటాషియం పుష్కలంగా ఉంటుంది. క్యాలరీలు, కొవ్వులు కూడా తక్కువే! కాబట్టి బరువు తగ్గాలనుకునేవాళ్లు బ్లాక్ కరెంట్స్‌ను తరచూ తింటూ ఉండాలి.
- **అంజీర్:** ఫైబర్, పొటాషియం, మెగ్నీషియం ఎక్కువగా చక్కెర తక్కువగా ఉండే అంజీర్ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. పైగా వీటిలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువ కాబట్టి మధుమేహులు సైతం ఈ పండ్లను నిరభ్యంతరంగా తినవచ్చు.
- **ప్రూన్స్:** వీటిలో పొటాషియం, ఫైబర్ ఎక్కువ. దీన్లో ఉండే షుగర్ ఆల్కహాల్ అయిన సార్బిటాల్ మలబద్ధకాన్ని వదిలిస్తుంది. వీటిలో కూడా గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువే కాబట్టి బరువు తగ్గాలనుకునే మధుమేహులు వీటిని నిస్సందేహంగా ఎంచుకోవచ్చు.
- **ఎండు ద్రాక్ష:** వీటిలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువ కాబట్టి రక్తంలో చక్కెరలు వెంటనే పెరగవు. అయితే వీటిలో క్యాలరీలు ఎక్కువ కాబట్టి పరిమితంగా తినాలి.
- **అప్రికాట్స్:** వీటిలో పీచు, విటమిన్ ఎ ఎక్కువ. వీటిలో ఖర్జూరాల కంటే తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుంది. కాబట్టి బరువు తగ్గాలనుకునేవాళ్లు వీటిని తింటూ ఉండాలి.



బ్లడ్ ప్రెషర్

రక్తపోటు అదుపు తప్పితే?

అధిక రక్తపోటుకు సైలెంట్ కిల్లర్ అని పేరు. నిశ్శబ్దంగా అంతర్గత అవయవాలను నాశనం చేసే ఈ రుగ్మతను వీలైనంత త్వరగా కనిపెట్టి, మందులతో అదుపులో పెట్టుకోవడం అవసరం. లేదంటే అధిక రక్తపోటుతో ఎన్నో ఆరోగ్య సమస్యలు మొదలవుతాయి.

గుండెకు చేటు

హైపర్‌టెన్షన్‌తో గుండె మీద భారం పడుతుంది. బలంగా రక్తాన్ని సరఫరా చేయవలసి రావడం మూలంగా గుండె కండరాలు మందంగా మారతాయి. ఫలితంగా హార్ట్ ఫెయిల్యూర్ అవకాశాలు పెరుగుతాయి. నిరంతర ఒత్తిడి మూలంగా రక్తనాళాలు దెబ్బతిని, అథెరోస్క్లెరోసిస్ తలెత్తుతుంది. ఫలితంగా గుండెపోటుకు గురయ్యే పరిస్థితి నెలకొంటుంది.

మెదడుకు నష్టం

సెరెబ్రోవ్యాస్క్యులర్ ఆరోగ్యం మీద కూడా హైపర్‌టెన్షన్ ప్రభావం చూపిస్తుంది. పెరిగిన రక్తపోటు వల్ల మెదడులోని సూక్ష్మ రక్తనాళాలు దెబ్బతిని స్ట్రోక్ అవకాశాలు పెరుగుతాయి. అలాగే వ్యాస్క్యులర్ ఎడీమా తలెత్తి జ్ఞాపకశక్తి కుంటుపడుతుంది.

మూత్రపిండాల మీద ప్రభావం

రక్తపోటును నియంత్రించడంలో మూత్రపిండాలు కీలక పాత్ర పోషిస్తాయి. అయితే రక్తపోటు అదుపు తప్పితే, మూత్రపిండాల పనితీరు దెబ్బతింటుంది. క్రానిక్ కిడ్నీ డిసీజ్‌కు దారి తీసి, వ్యర్థాలను వడకట్టలేని పరిస్థితి తలెత్తి, ఎలక్ట్రొలైట్ సంతులనం దెబ్బతింటుంది.

కంటి చూపు తగ్గుతుంది

అధిక రక్తపోటు కళ్లలోని సూక్ష్మ రక్తనాళాలను దెబ్బ తీస్తుంది. ఫలితంగా హైపర్‌టెన్సివ్ రెటినోపతి తలెత్తి చూపు సమస్యలు మొదలవుతాయి. చికిత్స అందించకపోతే, ఆ సమస్య క్రమేపీ శాశ్వత అంధత్వానికి దారి తీస్తుంది.

పెరిఫెరల్ ఆర్టీరియల్ డిసీజ్

అధిక రక్తపోటు అథెరోస్క్లెరోసిస్‌కు దారి తీస్తుంది. ప్లేక్ పేరుకుపోవడం మూలంగా ధమనులు ఇరుకుగా, గట్టిగా మారిపోయే పరిస్థితి ఇది. ఈ సమస్యతో కరొనరీ ఆర్టరీలతో పాటు చేతులు, కాళ్లలోకి ప్రయాణించే ధమనులు కూడా దెబ్బతిని పెరిఫెరల్ ఆర్టీరియల్ డిసీజ్ మొదలవుతుంది. అవయవాలకు రక్తసరఫరా తగ్గడం వల్ల నొప్పి మొదలవుతుంది. అలాగే గాయాలు మానే వేగం నెమ్మదిస్తుంది. ఇన్‌ఫెక్షన్ సోకే అవకాశాలు పెరుగుతాయి.





కోలన్ కేర్

పెద్ద పేగు సమస్యల లక్షణాలను తేలికగానే కనిపెట్టవచ్చు. కానీ మలవిసర్జనతో ముడిపడి ఉన్న ఈ సమస్యల గురించి లోలోపలే మథన పడడం వినహా త్వరపడి వైద్యులను సంప్రతించే వాళ్లు తక్కువే! కానీ నిర్లక్ష్యం చేస్తే, కేన్సర్‌గా పరిణమించే పెద్ద పేగు సమస్యలను కొలనోస్కోపీతో ముందుగానే కనిపెట్టి, చికిత్సతో సరిదిద్దుకోవాలంటున్నారు వైద్యులు.

పెద్ద పేగు పదిలంగా...

పోషకాలను శోషించుకుని, విసర్జకాలను శరీరం నుంచి బయటకు పంపించే పెద్ద పేగులో పాలిప్స్ తలెత్తవచ్చు. పూతకు గురి కావచ్చు. మలద్వారం దగ్గర పైల్స్, ఫిషర్స్ లాంటి ఇబ్బందులు కూడా మొదలు కావచ్చు. ఈ సమస్యలను నిర్లక్ష్యం చేస్తే, అవి కేన్సర్‌గా కూడా మారవచ్చు. కాబట్టి ఈ సమస్యల్లో తలెత్తే లక్షణాలను గమనిస్తూ ఉండడం అవసరం.



పెద్ద పేగు కేన్సర్

పెద్ద పేగుల్లో చిన్న చిన్న బుడిపెలు ఏర్పడుతూ ఉంటాయి. ఇవి కాలక్రమేణా కేన్సర్‌గా మారతాయి. ఇలా కేన్సర్‌గా మారకముందే ఆ పాలిప్స్‌ను తొలగిస్తే, కోలన్ కేన్సర్ నుంచి తప్పించుకోవచ్చు. అయితే ఈ పాలిప్స్ ఉనికికి సంబంధించి ఎలాంటి లక్షణాలూ బహిర్గతం కాకపోవచ్చు. కాబట్టి 55 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కొలనోస్కోపీ పరీక్ష చేయించుకుని పాలిప్స్ లేవని నిర్ధారించుకోవాలి. ఒకవేళ ఉంటే, వాటిని తొలగించుకోవాలి. 30 ఏళ్ల క్రితం ప్రపంచవ్యాప్తంగా అన్ని కేన్సర్లలో కోలన్ కేన్సర్ మొదటి స్థానంలో ఉండేది. ఇప్పుడది ఎనిమిదవ స్థానానికి పడిపోయింది. పెద్దపేగులోని పాలిప్స్‌ను కొలనోస్కోపీతో ముందుగానే కనిపెట్టి వాటిని తొలగించడమే అందుకు కారణం. కాబట్టి కనీసం 55 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ పెద్ద పేగు కేన్సర్ నుంచి రక్షణ కోసం కొలనోస్కోపీ పరీక్ష చేయించుకోవాలి. పరీక్షలో పాలిప్స్ లేవని నిర్ధారణ అయితే, ఐదేళ్లకు మరోసారి పరీక్ష చేసుకోవాలి. ఒకవేళ ఆ పరీక్షలో కూడా పాలిప్స్ లేవని నిర్ధారణ అయితే ఆ తర్వాత పరీక్ష చేయించుకోవలసిన అవసరం లేదు.

- **చికిత్స ఇలా:** కేన్సర్ దశను కనిపెట్టడం చికిత్సలో కీలకం. పక్కలకు పాకకుండా ఒక ప్రదేశానికే పరిమితమైన మొదటి దశలో సర్జరీ చేసి, కేన్సర్ సోకిన భాగాన్ని తొలగిస్తారు. తొలగించిన భాగాన్ని పరీక్షించినప్పుడు, జీన్ మ్యుటేషన్స్ ఉన్నట్టు నిర్ధారణ అయితే, వాళ్లకు మాత్రమే కీమోథెరపీ అవసరమవుంది. వ్యాధి లింఫ్ నోడ్స్‌కు కూడా పాకితే అది రెండు, మూడవ దశ కోలన్ కేన్సర్‌గా వైద్యులు నిర్ధారిస్తారు. పెద్దపేగు కేన్సర్ కాలేయానికి పాకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. నాల్గవ దశలో ఇలా జరుగుతూ ఉంటుంది. ఇలా కాలేయానికి పాకినప్పటికీ ఆ కేన్సర్‌ను సైతం నిర్మూలించే సమర్థమైన చికిత్సలు ఇప్పుడు అందుబాటులోకొచ్చాయి. సర్జరీ, కీమోథెరపీలతో పాటు అదనంగా అందించే టార్గెటెడ్ ఇమ్యునోథెరపీ వల్ల సమర్థమైన ఫలితాలను సాధించవచ్చు. ఈ చికిత్సతో లైఫ్ ఎక్స్‌పెక్టెన్సీ 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువకు పెరుగుతోంది. కాబట్టి కోలన్ కేన్సర్‌కు భయపడవలసిన అవసరం లేదు.

45, 50 ఏళ్లు దాటిన వాళ్లు, బోవెల్ హ్యాబిట్స్‌లో మార్పు కనిపిస్తే అప్రమత్తం కావాలి. మలబద్ధకం ఉన్నవాళ్లకు అకస్మాత్తుగా సాధారణ విసర్జన జరుగుతున్నా, సాధారణ విసర్జన జరుగుతున్న వాళ్లలో అకస్మాత్తుగా మలబద్ధకం తలెత్తినా... ఇలా మలవిసర్జన క్రమం తప్పి, బోవెల్ హ్యాబిట్స్‌లో తలెత్తే మార్పులను వైద్యుల దృష్టికి తీసుకువెళ్లాలి. అలాగే మలంలో రక్తం పడుతున్నా, అకారణంగా బరువు తగ్గినా, అనీమియా తలెత్తినా కోలన్ కేన్సర్ ఉందేమోనని అనుమానించి కొలనోస్కోపీ చేయించుకోవాలి. కచ్చితంగా కోలన్ కేన్సర్ సోకి ఉండకపోయినా, ఇతరత్రా సమస్యలు ఏవైనా ఉన్నా అవన్నీ ఈ పరీక్షతో బయటపడతాయి.


పేగులో పూత

దీన్నే ఇన్‌ఫ్లమేటరీ బోవెల్ డిసీజ్ అంటారు. దీనికి అల్సరేటివ్ కొలైటిస్, క్రోన్స్ డిసీజ్ అనే మరో రెండు పేర్లు కూడా ఉన్నాయి. 30 ఏళ్ల క్రితం మన దేశంలో ఈ సమస్య ఎంతో తక్కువగా ఉండేది. కానీ ఇప్పుడు ఈ సమస్య విపరీతంగా పెరుగుతోంది. ప్రాసెస్ చేసిన పదార్థాలతో కూడిన వెస్టర్న్ డైట్ పేగులో పూతకు ప్రధాన కారణం. అలాగే కొంతమందికి జన్యుపరమైన లోపాలు ఉంటాయి. ఈ లోపాలకు తోడు పర్యావరణ ప్రభావాలు కూడా తోడైతే పేగు పూత వచ్చే అవకాశాలు మరింత ఎక్కువగా ఉంటాయి. ఆటో ఇమ్యూన్ డిజార్డర్ మూలంగా తలెత్తే ఈ పేగు పూత కొద్ది రోజుల పాటు మందులు వాడితే తగ్గే సమస్య కాదు. మధుమేహం లాగే ఇదొక తీవ్ర ఆరోగ్య సమస్య. ఈ సమస్యకు జీవిత కాలం మందులు వాడక తప్పదు. లేదంటే పూత పెరిగి, ఇన్‌ఫెక్షన్లు పెరిగి, పేగుకు రంధ్రం పడే అవకాశం ఉంటుంది. పేగు, పోషకాలను శోషించుకునే సామర్థ్యాన్ని కూడా కోల్పోతుంది. కాబట్టి శరీరం బలహీనపడి, పలు రకాల ఇన్‌ఫెక్షన్లు సోకే అవకాశాలు కూడా పెరుగుతాయి. దీర్ఘకాలంలో ఇదే సమస్య కేన్సర్‌గా మారే అవకాశాలు 25 నుంచి 30% ఎక్కువ.

- **లక్షణాలు ఇవే:** మలవిసర్జన క్రమం తప్పడం, పలుచని విరోచనాలు, మలంలో రక్తం, పొట్టలో నొప్పి, విరోచనాన్ని ఆపుకోలేకపోవడం, బరువు తగ్గడం ప్రధాన లక్షణాలు. సాధారణంగా 15, 20, 30, 40 వయస్కుల్లో ఈ సమస్య ఎక్కువ. పైగా ఇది మలవిసర్జనకు సంబంధించిన సమస్య కాబట్టి నలుగురితో పంచుకోడానికి ఇబ్బంది పడుతూ, జీవనశైలి దెబ్బతిని, మానసిక కుంగుబాటుకు కూడా లోనవుతారు.
- **చికిత్స సులువే:** పూత ఏర్పడిన ప్రదేశం మీద చికిత్స ఆధారపడి ఉంటుంది. పెద్ద, చిన్న రెండు పేగుల్లో ఉందా? పెద్ద పేగులో ఎడమ వైపు ఉందా లేక కుడి వైపు ఉందా లేక పేగు మొత్తం వ్యాపించిందా? వ్యాధి ఎంత తీవ్రంగా ఉంది అనే అంశాల ఆధారంగా వైద్యులు తగిన చికిత్సను ఎంచుకుంటారు. స్వల్ప పూతకు నోటి మాత్రలతో సమస్య మధ్యస్థంగా ఉంటే మందులు, ఇంజెక్షన్లతో, పూత తీవ్రంగా ఉండి, పేగుకు రంధ్రం పడే అవకాశాలుంటే, సర్జరీ చేసి ఆ పేగు భాగాన్ని తొలగించవలసి ఉంటుంది. పేగు పూత ఒకసారి మొదలైన తర్వాత చికిత్స తీసుకుంటూనే క్రమం తప్పక వైద్యులను కలుస్తూ, పూత పరిస్థితిని గమనించుకుంటూ, తగినట్టు చికిత్సను మార్చుకుంటూ ఉండాలి.
- **నివారణ ఉంది:** వంశపారంపర్యంగా జన్యుపరమైన లోపాల వల్ల వచ్చే పేగు పూతను నియంత్రించలేకపోయినా, ఆహారపుటలవాట్ల వల్ల వచ్చే ఈ సమస్యను ఆ పదార్థాలకు దూరంగా ఉండడం ద్వారా నియంత్రించుకోవచ్చు. కాబట్టి ప్రాసెస్డ్ ఫుడ్స్ మానేయాలి. కొందర్లో జన్యు పరివర్తన జరిగి ఉండవచ్చు. అలాంటి వాళ్లు ప్రాసెస్డ్ ఫుడ్స్ తినడం వల్ల ఈ సమస్య ప్రేరేపితం కావచ్చు. కాబట్టి ఆహారపుటలవాట్ల పట్ల జాగ్రత్తగా వ్యవహరిస్తూ, లక్షణాలు తలెత్తిన వెంటనే వైద్యులను కలిస్తే పేగు పూతను సమర్థంగా అదుపులోకి తెచ్చుకోవచ్చు.

ఏది సహజం - ఏది అసహజం

కొందరికి రోజులో ఒకసారి మలవిసర్జన జరిగితే, ఇంకొందరికి రెండుసార్లు జరగవచ్చు. కొందరికి మూడు రోజులకోసారి లేదా ఐదు రోజులకోసారి మలవిసర్జన జరుగుతూ ఉండవచ్చు. మలవిసర్జన సమయంలో ఇబ్బందికి లోను కాకుండా, సాఫీగా జరుగుతున్నంత కాలం ఈ అలవాట్లను ఆరోగ్యకరమైనవిగానే భావించాలి. ఇలా వ్యక్తుల్లో మలవిసర్జన వ్యవధులు భిన్నంగా ఉండడం కూడా సహజమే! అయితే ఈ ప్యాటర్న్ మారకుండా అలాగే కొనసాగుతున్నంత వరకూ భయపడవలసిన అవసరం లేదు. అలా కాకుండా ఈ బోవెల్ హ్యాబిట్ ప్యాటర్న్‌లో అకస్మాత్తుగా మార్పులు చోటు చేసుకుంటే వెంటనే అప్రమత్తమై వైద్యులను కలవాలి.



మొలల సమస్య

అస్తవ్యస్థమైన ఆహారపుటలవాట్లు, తగినన్ని నీళ్లు తాగకపోవడం, మలబద్ధకం మొలలు, ఫిషర్‌లకు ప్రధాన కారణాలు. మలద్వారం దగ్గర వాపు, నొప్పి, రక్తస్రావం, అసౌకర్యం ఉన్నప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులకు చూపించుకోవాలి. మొలల సమస్య ఉన్నప్పుడు అన్నిటికంటే ప్రధానంగా పెద్ద పేగు కేన్సర్ లేదని నిర్ధారించుకోవడంతో పాటు, మొలలు, ఫిషర్‌లు ఏ దశలో ఉన్నాయనేది కూడా తెలుసుకోవాలి. ఆ గ్రేడ్‌ల మీద చికిత్స ఆధారపడి ఉంటుంది. చికిత్స తర్వాత ఈ సమస్యలు తిరగబెట్టకుండా పీచు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి. నీళ్లు ఎక్కువగా తాగుతూ ఉండాలి.

డాక్టర్ నవీన్ పోలవరపు,
చీఫ్ ట్రాన్స్‌ప్లాంట్ హెపటాలజిస్ట్ అండ్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్,
యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీ,
హైదరాబాద్.



ఎమోషనల్ ఈటింగ్

మనసు బాగోకపోతే ఆహారం మీదకు మనసు మళ్లదు. కానీ కొందరికి ఇలాంటప్పుడే ఆహారం మీద వ్యామోహం పెరుగుతుంది. దీన్నే ఎమోషనల్ ఈటింగ్ అంటారు.



తిండితో తృప్తి

తినడం వల్ల మెదడులోని రివార్డ్ సిస్టమ్ ప్రేరేపితమై సంతృప్తికరమైన భావనకు లోనవుతాం. కాబట్టి భావోద్వేగాలకు లోనయినప్పుడు కొందరు ఆహారంతో ఆ భావనల నుంచి బయడపడుతూ ఉంటారు. తినడం వల్ల మెదడులో డోపమైన్ అనే హ్యాపీ హార్మోన్ రిలీజ్ అవుతుంది. దాంతో తెలియకుండా మనం మన భావోద్వేగాలకూ, ఆహారానికీ ముడిపెట్టేసుకుంటాం! పైగా అన్ని వేళలా, అన్ని చోట్లా తేలికగా అందుబాటులో ఉంటుంది కాబట్టి ఆహారంతో సంతృప్తి పొందడం అలవాటు చేసుకుంటాం! ఇలా తినే పదార్థాలన్నీ సాధారణంగా చక్కెర, పిండిపదార్థాలు, కొవ్వులతో నిండి ఉంటూ ఉంటాయి. దాంతో శరీరంలో క్యాలరీలు పెరిగిపోయి, ఒబేసిటీ, తత్ఫలితంగా మధుమేహం, అధిక రక్తపోటు లాంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. పైగా ఇలాంటి ఎమోషనల్ ఈటింగ్ అలవాటు వల్ల అందుకు దారితీసిన పరిస్థితులతో పోరాడే మెలకువలను, వ్యూహాలను అలవరుచుకోవడం మానేస్తాం.

అది నిజమైన ఆకలేనా?

పని ఒత్తిడి, ఆర్థికపరమైన ఆందోళనలు, ఆరోగ్య సమస్యలు, అనుబంధాల సమస్యలు మొదలైన ఎన్నో రకాల బాహ్య అంశాలు ఎమోషనల్ ఈటింగ్‌ను ప్రేరేపిస్తాయి. ఇవే కాకుండా తనెలాంటి భావనకు లోనవుతున్నానో స్వతఃసిద్ధంగా గ్రహించలేని వ్యక్తులు, భావోద్వేగాలను వ్యక్తీకరించలేని వ్యక్తులు, భావోద్వేగాలను నియంత్రణలో పెట్టుకోలేని వాళ్లు ఎమోషనల్ ఈటింగ్ బారిన పడుతూ ఉంటారు. ఈ అలవాటు క్రమేపీ ఒక వ్యసనంగా కూడా మారుతుంది. సమస్య నుంచి బయట పడడం కోసం ఎంత ఎక్కువ ఆహారం తింటూ ఉంటే, అంతే ఎక్కువగా ఎమోషనల్ ఈటింగ్‌కు అలవాటు పడిపోతూ ఉంటారు. అయితే కొన్నిసార్లు ఎమోషనల్ ఈటింగ్‌కూ, భౌతికపరమైన ఆకలికీ వ్యత్యాసాన్ని కూడా గ్రహించలేని పరిస్థితి తలెత్తుతుంది. ఈ రెండింటి మధ్యా తేడాను కనిపెట్టడం కష్టంగా మారుతుంది. కొందర్లో ఈ రెండూ ఉంటాయి. అలాంటప్పుడు రెండింటి మధ్యా తేడాను తెలుసుకోవడానికి ఈ చిట్కాలు పాటించవచ్చు.

ఫిజికల్ హంగర్

- ఈ ఆకలి క్రమేపీ పెరుగుతుంది
- తినడం మొదలుపెట్టిన కొద్ది సేపటికి ఆకలి తీరిన భావన కలుగుతుంది.
- తిరిగి తర్వాతి భోజనం వరకూ ఆహారం మీదకు మనసు మళ్లదు

ఎమోషనల్ ఈటింగ్

- హఠాత్తుగా మొదలవుతుంది
- తింటున్నప్పటికీ సంతృప్తి కలగదు. ఇంకా తినాలనే కోరికను నియంత్రించుకోలేరు
- కంఫర్ట్ కోసం, స్వాంతన కోసం తినాలనిపిస్తుంది

ఇలా నియంత్రించవచ్చు

- ఆహారం మీద వ్యామోహం పెరిగడానికి కారణమైన భావోద్వేగాలను ప్రేరేపించే అంశాలను ఎవరికి వారు తెలుసుకోవాలి. ఈ ప్యాటర్న్‌ను కనిపెట్టడం కోసం ఫుడ్, ఎమోషన్ డైరీని నిర్వహించాలి.
- వ్యతిరేక భావాలతో సానుకూలంగా వ్యవహరించగలగడం కోసం వ్యాయామం, ధ్యానం చేయడం లేదా స్నేహితులు, కుటుంబసభ్యులతో వాటిని పంచుకోవడం అలవాటు చేసుకోవాలి.
- ఎందుకు తింటున్నాం, ఏం తింటున్నాం అనే దాని మీద దృష్టి పెట్టాలి.
- ఎమోషనల్ ఈటింగ్‌లో భాగంగా ఐస్‌క్రీమ్, చాక్లెట్స్‌కు బదులుగా పండ్లు, కీరా, సెలరీ స్టిక్స్ లాంటి ఆరోగ్యకరమైన స్నాక్స్‌ను తినడం అలవాటు చేసుకుంటే క్యాలరీలు తగ్గి బరువు పెరగకుండా ఉంటారు.
- ఎమోషనల్ ఈటింగ్ సమస్య పదే పదే వేధిస్తూ ఉంటే, మానసిక నిపుణుల సహాయం తీసుకోవాలి. అలాగే ఎమోషనల్ ఈటింగ్ పర్యవసానంగా తలెత్తే అధిక బరువు, మధుమేహాలను తగ్గించుకోవడం కోసం ఎండోక్రైనాలజిస్టులను కలవాలి.

డాక్టర్ శ్రీ నగేష్
కన్సల్టెంట్ ఎండోక్రైనాలజిస్ట్ అండ్ డయాబెటాలజిస్ట్,
శ్రీ నగేష్ డయాబెటిస్ అండ్ ఎండోక్రైన్ క్లినిక్,
హైదరాబాద్.



ఫిట్‌నెస్

ఇది కూడా వ్యాయామమే!

వ్యాయామం కోసం జిమ్‌కే వెళ్లవలసిన అవసరం లేదు. కొన్ని అలవాట్లను అలవరుచుకోవడం ద్వారా వ్యాయామ ఫలాన్ని పొందవచ్చు. అవేంటంటే....

నడక: నడకతో ఎన్నో ఆరోగ్య ఫలాలను పొందవచ్చు. నడకతో గుండె వేగం పెరగడంతో పాటు, క్యాలరీలు కూడా ఖర్చవుతాయి. క్రమం తప్పకుండా నడవడం వల్ల అధిక రక్తపోటు అదుపులోకొస్తుంది. అలాగే మధుమేహం, రక్తపోటులు నియంత్రణలో ఉంటాయి. బరువు కూడా తగ్గుతారు.

డాన్స్: ఫిట్‌గా ఉండడం కోసం డాన్స్‌ను కూడా ఎంచుకోవచ్చు. క్యాలరీలు ఖర్చు చేయడానికీ, బరువు తగ్గడానికి ఇదొక అద్భుతమైన ప్రత్యామ్నాయం. డాన్స్‌తో కండరాలు బలపడతాయి, నమ్యత పెరుగుతుంది. సంతులనం, రక్తసరఫరా, మానసికోల్లాసాలు కూడా పెరుగుతాయి.

మెట్లు ఎక్కండి: అదే పనిగా మెట్లు ఎక్కడం కీళ్లకు హానికరమే! కానీ అవకాశం దొరికినప్పుడు చకచకా మెట్లు ఎక్కడానికి సందేహించకండి. మెట్లు ఎక్కడం వల్ల రక్తప్రసరణ పెరుగుతుంది. గుండె వేగం పెరుగుతుంది. కండరాలు బలపడతాయి. బరువు తగ్గుతారు.

క్రీడలు ఆడొచ్చు: బ్యాడ్మింటన్, వాలీబాల్, సైక్లింగ్ లాంటి క్రీడలు కూడా శరీరానికి సరిపడా వ్యాయామాన్ని అందిస్తాయి. ప్రతి రోజూ ఈ క్రీడల్లో పాల్గొనడం వల్ల రక్తంలోని కొలెస్ట్రాల్ అదుపులో ఉంటుంది. రక్తపోటు కూడా పెరగకుండా ఉంటుంది. కండరాలు బలపడతాయి. రక్త ప్రసరణ పెరిగి శరీరం చురుగ్గా ఉంటుంది.

ఇంట్లోనే వ్యాయామం: ఎక్సర్‌సైజ్ మ్యాట్ నేల మీద వేసుకుని తేలికపాటి వ్యాయామాలు చేయవచ్చు. కార్డియో, బర్పీస్ లేదా స్కిప్పింగ్ లాంటివి ప్రాక్టీస్ చేయవచ్చు. ఫ్లోర్ ఎక్సర్‌సైజ్‌ల్లో భాగంగా యాబ్స్, క్రంచెస్, ప్లాంక్స్ లాంటివి చేయవచ్చు. ఇంటి పట్టున వ్యాయామంచేయడం వల్ల జిమ్ ఖర్చు, సమయం ఆదా అవుతాయి.



బిజినెస్

విజయవాడ ● మంగళవారం 13 ఫిబ్రవరి 2024

వాల్యుయేషన్‌లో ప్రైవేట్ సత్తా

హురున్ ఇండియా-యాక్సిస్ బ్యాంక్ నివేదిక వెల్లడి



హైదరాబాద్: వాల్యుయేషన్‌లో దేశీయ ప్రైవేట్ కంపెనీలు దూసుకుపోతున్నాయి. గత ఏడాది అక్టోబరు నాటికి రూ.6,700 కోట్ల కంటే ఎక్కువ విలువ (వాల్యుయేషన్) ఉన్న ప్రైవేట్ కంపెనీలు మన దేశంలో 500 వరకు ఉన్నట్టు హురున్ ఇండియా-యాక్సిస్ బ్యాంక్ 2023 నివేదిక వెల్లడించింది. ఈ టాప్-500 ప్రైవేట్ కంపెనీల జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్ వరుసగా మూడో ఏడాదీ అగ్రస్థానంలో నిలిచింది. గత ఏడాది అక్టోబరు నాటికి ఈ జాబితాలోని కంపెనీల మార్కెట్ విలువ 2.8 లక్షల కోట్ల డాలర్లకు (సుమారు రూ.231 లక్షల కోట్లు) చేరింది. ఇది గత ఏడాది దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 71 శాతానికి సమానం. సౌదీ అరేబియా, స్విట్జర్లాండ్, సింగపూర్ జీడీపీల కంటే కూడా.. గత ఏడాది భారత్‌లోని అగ్రశ్రేణి 500 ప్రైవేట్ కంపెనీల వాల్యుయేషన్ ఎక్కువగా ఉన్నట్టు ఆ నివేదిక పేర్కొంది. ప్రభుత్వ రంగ కంపెనీలతో పాటు దేశంలోని విదేశీ కంపెనీలను మినహాయించి ఈ నివేదికను రూపొందించారు.

వరుసగా మూడో ఏడాది టాప్‌లో రిలయన్స్

దేశంలో అత్యంత విలువైన కంపెనీలపరంగా చూస్తే గత ఏడాది అక్టోబరు నాటికి రూ.15.65 లక్షల కోట్లతో రిలయన్స్ ఇండస్ట్రీస్ వరుసగా మూడో ఏడాదీ అగ్రస్థానంలో నిలిచింది. రూ.12.4 లక్షల కోట్లతో టీసీఎస్, రూ.11.3 లక్షల కోట్లతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. గత ఏడాది రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి వేరు పడిన జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ 28వ స్థానంలో నిలిచింది. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, కోటక్ మహీంద్రా బ్యాంక్ మళ్లీ టాప్-10లో స్థానం సంపాదించాయి.

70 లక్షల కొలువులు

ఈ టాప్-500 ప్రైవేట్ కంపెనీలు ఉద్యోగాల కల్పనలోనూ ముందున్నాయి. ఒక్కో కంపెనీలో సగటున 15,211 మంది పని చేస్తున్నారు. ఈ 500 కంపెనీలు మొత్తాన్ని తీసుకుంటే వీటిల్లో పని చేస్తున్న ఉద్యోగుల సంఖ్య 70 లక్షల మంది వరకు ఉంటుందని నివేదిక తెలిపింది. ఇందులో 437 కంపెనీల డైరెక్టర్ల బోర్డుల్లో మహిళలకు స్థానం ఉంది. మరో 179 కంపెనీల పాలన, నిర్వహణ పగ్గాలు ప్రమోటర్లకు బదులు వృత్తి నిపుణులైన సీఈఓల చేతుల్లో ఉంది.

నివేదికలో ఇతర ప్రధానాంశాలు

- గత ఏడాది ఈ టాప్-500 కంపెనీల నికర లాభం రూ.6.8 లక్షల కోట్లు
- రూ.74,088 కోట్లతో అత్యధిక నికర లాభం సాధించిన కంపెనీగా రిలయన్స్ ఇండస్ట్రీస్
- 2023లో ఈ కంపెనీల సగటు అమ్మకాలు రూ.19,396 కోట్లు
- టాటా గ్రూప్‌లోని 15 కంపెనీల మార్కెట్ విలువ రూ.23,49,683 కోట్లు
- 2022తో పోలిస్తే జాబితా నుంచి 61 కంపెనీలు ఔట్
- 2023లో అత్యధికంగా రూ.2,92,319 కోట్ల వాల్యుయేషన్ పెంచుకున్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్
- 500 కంపెనీల జాబితాలో అత్యధికంగా ఆర్థిక సేవల నుంచి 76 కంపెనీలు
- ముంబై నుంచి అత్యధికంగా 156 కంపెనీలకు చోటు
- టాప్-10 అన్‌లిస్టెడ్ కంపెనీల్లో మేఘా ఇంజనీరింగ్‌కు మూడో స్థానం
- 2023లో రూ.4 లక్షల కోట్ల విలువ కోల్పోయిన స్టార్టప్‌లు
- అదానీ గ్రూప్‌లోని ఎనిమిది కంపెనీల విలువ రూ.9.9 లక్షల కోట్లు
- జాబితాలోని 44 శాతం కంపెనీలు సేవలు, 56 శాతం కంపెనీలు వస్తూత్పత్తి కంపెనీలు.

హైదరాబాద్ కంపెనీల హవా

హురున్ ఇండియా-యాక్సిస్ బ్యాంక్ జాబితాలో 29 హైదరాబాద్ కంపెనీలకు చోటు లభించింది. 2022తో పోలిస్తే ఒక కంపెనీ తగ్గింది. అయితే విలువపరంగా ఈ కంపెనీల మార్కెట్ విలువ గత ఏడాది 18 శాతం పెరిగి రూ.5,93,718 కోట్లకు చేరింది. రూ.6,700 కోట్ల కంటే ఎక్కువ విలువైన కంపెనీల జాబితాలో హైదరాబాద్ గత ఏడాది ఆరో స్థానంలో నిలిచింది. రూ.90,350 కోట్లతో దివీస్ ల్యాబ్ హైదరాబాద్ కంపెనీల్లో అగ్రస్థానంలో నిలిచింది. తర్వాత రూ.84,150 కోట్లతో డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్, రూ.67,500 కోట్లతో మేఘా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి.

విలువ పరంగా టాప్-10
హైదరాబాద్ కంపెనీలు

కంపెనీ	విలువ
దివీస్ ల్యాబ్స్	రూ.90,350 కోట్లు
డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్	రూ.84,150 కోట్లు
మేఘా ఇంజనీరింగ్	రూ.67,500 కోట్లు
అరబిందో ఫార్మా	రూ.50,470 కోట్లు
హెటిరో ల్యాబ్స్	రూ.24,100 కోట్లు
లారస్ ల్యాబ్స్	రూ.19,464 కోట్లు
సైయెంట్	రూ.17,600 కోట్లు
ఎంఎస్ఎన్ ల్యాబ్స్	రూ.17,500 కోట్లు
కిమ్స్ హాస్పిటల్స్	రూ.15,190 కోట్లు
దక్కన్ ఫైన్ కెమికల్స్	రూ.15,400 కోట్లు
సువెన్ ఫార్మా	రూ.14,360 కోట్లు
నాట్కో ఫార్మా	రూ.14,240 కోట్లు

భారత్‌లో టాప్ బిజినెస్ స్కూల్ ఐఎస్‌బీ

అంతర్జాతీయంగా 31వ ర్యాంకింగ్

హైదరాబాద్: దేశంలోని బిజినెస్ స్కూల్స్‌లో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) అగ్రస్థానంలో నిలిచింది. ఫైనాన్షియల్ టైమ్స్ (ఎఫ్‌టీ) గ్లోబల్ ఎంబీఏ ర్యాంకింగ్ 2024 విడుదల చేసిన నివేదికలో ఈ విషయం వెల్లడించింది. కాగా ప్రపంచంలోని అగ్రశ్రేణి బిజినెస్ స్కూల్స్‌లో ఐఎస్‌బీ 31వ ర్యాంకింగ్‌ను దక్కించుకుంది. గత ఏడాది ఐఎస్‌బీ 39వ స్థానంలో ఉండగా ఈసారి ఏకంగా 31 స్థానానికి దూసుకుపోయింది. మరోవైపు ఆసియాలోని టాప్ బీ స్కూల్స్‌లో 6 నుంచి 5వ స్థానానికి చేరుకుంది. రీసెర్చ్‌పరంగా భారత్‌లో నంబర్‌వన్ ర్యాంకింగ్‌ను దక్కించుకోగా అంతర్జాతీయంగా 52వ స్థానంలో నిలిచింది.

స్పైస్‌జెట్‌లో 1,350 మంది ఔట్ !

న్యూఢిల్లీ: విమానయాన రంగంలోనూ కొలువుల కోత ప్రారంభమైంది. లో బడ్జెట్ క్యారియర్ స్పైస్‌జెట్ 1,000 నుంచి 1,350 మంది ఉద్యోగులపై వేటు వేసేందుకు సిద్ధమవుతోంది. ఎంతమందిని ఇంటికి పంపించాలనే విషయంపై ఈ వారంలోనే నిర్ణయం తీసుకుంటామని స్పైస్‌జెట్ అధికార వర్గాలు చెప్పాయి. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడాలంటే కొంత మంది ఉద్యోగులను ఇంటికి పంపించక తప్పదని స్పైస్‌జెట్‌కు చెందిన అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ తీసివేతలతో ఏటా కనీసం రూ.100 కోట్లు ఆదా అవుతాయని కంపెనీ భావిస్తోంది.

డిసెంబరు పారిశ్రామికోత్పత్తి 3.8 శాతం

న్యూఢిల్లీ: గనులు, విద్యుదుత్పత్తి రంగాల్లో ఉత్పత్తి తగ్గడంతో దేశంలో పారిశ్రామికోత్పత్తి గత ఏడాది డిసెంబరు నెలలో మందగించి 3.8 శాతంగా నమోదైంది. పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) ఆధారితంగా మదింపు చేసే పరిశ్రమల ఉత్పత్తి 2022 డిసెంబరులో 5.1 శాతం ఉంది. అయితే ఏప్రిల్-డిసెంబరు నెలల మధ్య కాలంలో మాత్రం ముందు ఏడాదితో పోల్చితే ఐఐపీ వృద్ధి రేటు 5.5 శాతం నుంచి 6.1 శాతానికి పెరిగింది.

పేటీఎంపై పునరాలోచన లేదు

ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్



న్యూఢిల్లీ: పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై (పీపీబీఎల్) తీసుకున్న చర్య విషయంలో పునఃసమీక్షించే అవకాశం లేనేలేదని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం చేశారు. అన్ని కోణాల నుంచి ఎంతో ఆలోచించిన తర్వాతనే ఆ నిర్ణయం తీసుకున్నామని ఆయన చెప్పారు. ఆర్‌బీఐ ఏ ఫిన్‌టెక్ కంపెనీకి వ్యతిరేకం కాదని, ఆ రంగానికి మద్దతు ఇవ్వడంతో పాటు అది వేగంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన సహకారం అందిస్తుందని ఆయన అన్నారు. అదే సమయంలో డిపాజిటర్లు, కస్టమర్ల ప్రయోజనాలు కాపాడడం తమ ప్రధాన బాధ్యత అని దాస్ గుర్తు చేశారు. ఏ సంస్థ అయినా నియంత్రణలను పదేపదే ఉల్లంఘిస్తూ, ఎన్నిసార్లు హెచ్చరించినా తన వైఖరి మార్చుకోని సందర్భంలో మాత్రమే ఆర్‌బీఐ చర్యలకు పాల్పడుతుందని దాస్ స్పష్టం చేశారు. అన్ని కోణాల నుంచి పేటీఎం వ్యవహారాన్ని సమగ్రంగా పరిశీలించిన అనంతరం మాత్రమే తాము చర్య తీసుకున్నట్టు తెలిపారు. ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డు 606వ సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఫిబ్రవరి 29వ తేదీ నుంచి పీపీబీఎల్ ఎలాంటి డిపాజిట్లు స్వీకరించరాదని, కస్టమర్ ఖాతాలు, వ్యాలెట్లు, ఫాస్టాగ్‌లలో టాప్ అప్‌లు చేయరాదని ఆదేశిస్తూ గత నెల 31వ తేదీన ఆర్‌బీఐ నిషేధం విధించింది. పేటీఎంకు ఎన్నో సార్లు నిబంధనల ఉల్లంఘన విషయంలో హెచ్చరికలు చేశామని, అయినా అదే స్థితి కొనసాగుతూ ఉండడంతో చర్యకు పాల్పడక తప్పలేదని ఆ ప్రకటనలో స్పష్టంగా తెలియచేసింది. దీనిపై విలేకరుల ప్రశ్నలకు స్పందిస్తూ ఆ నిర్ణయానికి ఎలాంటి సడలింపులు ఇచ్చే అవకాశం ప్రస్తుతానికి లేదని అన్నారు.

త్వరలో ఎఫ్ఏక్యూల జారీ: తమ నిర్ణయం వల్ల అసౌకర్యానికి గురవుతున్న డిపాజిటర్లు, కస్టమర్లు, వ్యాలెట్ యూజర్లు, ఫాస్టాగ్ హోల్డర్లకు గల సందేహాలు తీర్చడం లక్ష్యంగా త్వరలో ఎఫ్ఏక్యూలు జారీ చేయనున్నట్టు దాస్ స్పష్టం చేశారు. కస్టమర్ల ప్రయోజనాలన్నింటినీ ఈ ఎఫ్ఏక్యూలలో పరిగణనలోకి తీసుకుంటామన్నారు. కస్టమర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదన్నదే ఆర్‌బీఐ వైఖరి అని ఆయన చెప్పారు. అందుకే ఆ ఎఫ్ఏక్యూల్లో అన్ని రకాల వివరణలు ఉంటాయని ఆర్‌బీఐ గవర్నర్ దాస్ అన్నారు.

లాభాల స్వీకారంతో మార్కెట్ డౌన్

న్యూఢిల్లీ/ముంబై: ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన మిశ్రమ సంకేతాలతో పాటు మెటల్, బ్యాంకింగ్ షేర్లలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకారానికి దిగడంతో సోమవారం ఈక్విటీ మార్కెట్ నష్టాల్లోకి జారుకుంది. ట్రేడింగ్ ప్రారంభంలో అప్‌ట్రెండ్‌లో పురోగమిస్తూ 71,756.58 పాయింట్ల ఇంట్రాడే గరిష్ఠ స్థాయిని తాకిన సెన్సెక్స్ లాభాల స్వీకారంతో 70,922.57 పాయింట్ల ఇంట్రాడే కనిష్ఠ స్థాయి వరకు కూడా దిగజారింది. చివరికి 523 పాయింట్ల నష్టంతో 771072.49 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని షేర్లలో 22 నష్టాల్లోనే ముగిశాయి. నిఫ్టీ కూడా 166.45 పాయింట్ల నష్టంతో 21,616.05 వద్ద క్లోజైంది.

బుల్లిష్ సెంటిమెంట్ డౌన్: నిఫ్టీ అవర్లీ (గంట గంటకు పరిస్థితిని తెలియచేసే) చార్టుల్లో కన్సాలిడేషన్ బ్రేక్‌డౌన్ కావడం మార్కెట్లో గూడుకట్టుకున్న నిరాశావాద వైఖరికి నిదర్శనమని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ టెక్నికల్ అనలిస్ట్ రూపక్ డే అన్నారు. అలాగే డెయిలీ చార్టుల్లో లోయర్ టాప్ ఏర్పడడం కూడా బుల్లిష్ సెంటిమెంట్ దిగజారిందనేందుకు సంకేతమని చెప్పారు.

చల్లారిన ధరల మంట

జనవరిలో ద్రవ్యోల్బణం 5.1% ● 3 నెలల కనిష్ఠం

న్యూఢిల్లీ: సగటు జీవికి ధరల మంట నుంచి జనవరిలో కొంత ఉపశమనం లభించింది. జనవరి నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.1 శాతంగా నమోదైంది. ఇది మూడు నెలల కనిష్ఠస్థాయి. కూరగాయలు, పళ్లు, ఇతర ఆహార వస్తువుల ధరలు అదుపులోకి రావడం ఇందుకు దోహదపడింది. గత ఏడాది అక్టోబరులో 4.9 శాతానికి దిగివచ్చిన తర్వాత రిటైల్ ద్రవ్యోల్బణం పెరుగుతూ డిసెంబరులో 5.69 శాతానికి చేరింది. కేంద్ర గణాంకాల కార్యాలయం విడుదల చేసిన వివరాల ప్రకారం జనవరి నెలలో ఆహార ద్రవ్యోల్బణం డిసెంబరుతో పోల్చితే 9.53 శాతం నుంచి 8.3 శాతానికి దిగివచ్చింది. ప్రాంతాలవారీగా చూసినట్టయితే పట్టణ ప్రాంతాల్లో ధరల కాటు అధికంగా 9.02 శాతం ఉండగా గ్రామీణ ప్రాంతాల్లో 7.91 శాతం ఉంది. గత ఏడాది జనవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం 6 శాతం ఉంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,960 ▲	57,710 ▲	77,000 ▲
ముంబై	62,301 ▼	57,067 ▼	71,140 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



12వ తేదీ			
హైదరాబాద్	545	విజయవాడ	533
13వ తేదీ		విశాఖపట్నం	555
చిత్తూరు	588	వరంగల్	547
గోదావరి	533	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	124	గోదావరి	129
వరంగల్	124	విజయవాడ	129
కరీంనగర్	124	గుంటూరు	129
మహబూబ్‌నగర్	124	ఒంగోలు	129
కర్నూలు	124	చిత్తూరు	133
విశాఖపట్నం	122		

స్పోర్ట్స్



రోడ్డు ప్రమాదంలో స్టార్ అథ్లెట్ కెల్విన్ దుర్మరణం

నైరోబీ: మారథాన్‌లో ప్రపంచ రికార్డు సృష్టించిన కెన్యా అథ్లెట్ కెల్విన్ కిప్టమ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆదివారం వెస్టన్ కెన్యాలో జరిగిన ఈ దుర్ఘటనలో 24 ఏళ్ల కెల్విన్‌తో పాటు కోచ్ హకిజిమన కూడా మరణించాడు. అలాగే వారితో ప్రయాణించిన యువతి తీవ్ర గాయాలతో చికిత్స పొందుతోంది. ప్రమాద సమయంలో కారును కెల్విన్ నడుపుతున్నాడని, అతివేగం కారణంగానే వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొందని పోలీసులు తెలిపారు. గతేడాది అక్టోబరులో జరిగిన షికాగో మారథాన్ (35 కి.మీ)లో 2:00:35 సె. టైమింగ్‌తో కెల్విన్ చరిత్ర సృష్టించాడు. ఈ క్రమంలో తన దేశానికే చెందిన ఎలియుడ్ కిప్చోగె (2:01:09) నెలకొల్పిన రికార్డును అధిగమించడం విశేషం. అలాగే ఇది తన ప్రొఫెషనల్ కెరీర్‌లో మూడో రేసు మాత్రమే. త్వరలో జరగబోయే పారిస్ ఒలింపిక్స్‌లోనూ కెల్విన్ స్వర్ణం సాధించగలడని భావించినా.. అంతలోనే ఈ ఘోర ప్రమాదం జరగడంతో క్రీడాలోకం దిగ్భ్రాంతికి లోనైంది.

ఆంధ్ర-యూపీ రంజీ డ్రా

విజయనగరం: ఆంధ్రప్రదేశ్-ఉత్తరప్రదేశ్ జట్ల మధ్య జరిగిన రంజీ మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆటకు ఆఖరి రోజైన సోమవారం ఓవర్‌నైట్ స్కోరు 271/5తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆంధ్ర 429/9 స్కోరు చేసింది. రికీ భుయ్ (129), రషీద్ (85), నితీష్ కుమార్ (53 నాటౌట్) రాణించారు. సౌరభ్ కుమార్ 5 వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఆంధ్ర 261 పరుగులు చేయగా.. యూపీ 198 రన్స్‌కు ఆలౌటైంది. మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కించుకొన్న ఆంధ్రకు 3 పాయింట్లు, యూపీకి ఒక పాయింట్ లభించాయి. గ్రూప్-బిలో ఆడిన ఆరు మ్యాచ్‌ల నుంచి 3 విజయాలతో 25 పాయింట్లు సాధించిన ఆంధ్ర పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో ఉంది.

15 స్థానాలు కిందికి...

ఫిఫా ర్యాంకుల్లో మన స్థానం 117

న్యూఢిల్లీ: ఆసియా కప్‌లో పేలవ ప్రదర్శన.. భారత ఫుట్‌బాల్ జట్టు ర్యాంకింగ్స్‌ను తీవ్రంగా ప్రభావితం చేసింది. తాజాగా విడుదల చేసిన ఫిఫా ర్యాంకుల జాబితాలో భారత్ 15 స్థానాలు దిగజారి 117వ స్థానంలో నిలిచింది. 2017 తర్వాత టీమిండియా ర్యాంక్ ఇంతగా పతనం కావడం ఇదే తొలిసారి. ఆసియాకప్ లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచుల్లోనూ భారత్ ఓటములను చవిచూసింది. అంతేకాకుండా ఒక్క గోల్ కూడా నమోదు చేయలేదు. దీంతో మొత్తం 35.57 పాయింట్లను కోల్పోవాల్సి వచ్చింది.

నిరుడు ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరపున ధనాధన్ బ్యాటింగ్‌తో దేశవ్యాప్తంగా క్రేజ్ దక్కించుకున్న తిలక్ వర్మ అంతర్జాతీయ క్రికెట్‌లోనూ సత్తా చాటుతున్నాడు. దేశం తరపున టెస్టు క్రికెట్ ఆడేందుకు ఉవ్విళ్లూరుతున్నానని, అదే జరిగితే తన కల సాకారం అయినట్టేనని చెబుతున్న తిలక్ వర్మ ప్రస్తుతం రంజీల్లో బిజీగా ఉన్నాడు. అవమానకర రీతిలో ప్లేట్ స్థాయికి దిగజారిన హైదరాబాద్‌ను తన కెప్టెన్సీలో మళ్లీ ఎలిట్ స్థాయికి తీసుకెళ్లిన తిలక్.. జట్టుకు రంజీ ట్రోఫీని సైతం అందిస్తానని ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపాడు. తిలక్ ఇంకా ఏమన్నాడో అతని మాటల్లోనే తెలుసుకుందాం..



ఆ అవకాశం కోసం శ్రమిస్తా!

తిలక్ వర్మ

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి-హైదరాబాద్)

ఎందరో దిగ్గజ క్రికెటర్లు ప్రాతినిధ్యం వహించిన హైదరాబాద్ జట్టు రంజీ ట్రోఫీ ఎలిట్ గ్రూప్‌లో స్థానం కోల్పోయినప్పుడు నాతో పాటు జట్టులోని అందరం తీవ్ర నిరాశకు లోనయ్యాం. ప్లేట్ గ్రూప్‌లోని జట్లతో ఏ విధంగా ఆడాలనే దానిపై రంజీ ట్రోఫీ ప్రారంభానికి ముందు చర్చించుకున్నాం. కేవలం విజయాలు సాధిస్తే సరిపోదు, ప్రతి మ్యాచ్‌లోనూ మన జట్టులో వచ్చిన మార్పును ప్రస్ఫుటంగా తెలియజేయాలనుకున్నాం. దీనిని ఒక సవాల్‌గా తీసుకొని బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ మూడింట్లోనూ మా అత్యుత్తమ ఆటను ప్రదర్శించాం. ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ 2-3 రోజుల్లోనే విజయం సాధించాం. రంజీ ప్లేట్ గ్రూప్ ఫైనల్లో గెలిచాక హైదరాబాద్ కథ మారనుంది. జట్టుకు రంజీ ట్రోఫీని అందించేదాకా విశ్రమించను.

టెస్టులు ఆడేందుకు ఎదురు చూస్తున్నా..

రెడ్‌బాల్ ఫార్మాట్ అంటే బాగా ఇష్టం. ఇందులో రాణించడంతోనే నాకు టీ20, వన్డే ఫార్మాట్లలో అవకాశాలు దక్కాయి. రెడ్‌బాల్ ఫార్మాట్‌లో ప్రస్తుతం మంచి స్కోర్లు సాధిస్తున్నా. ఇలాగే నిలకడగా రాణిస్తే త్వరలో భారత టెస్టు జట్టులోను స్థానం లభించవచ్చు. వైట్ జెర్సీ వేసుకునేందుకు ఆత్రుతగా ఎదురు చూస్తున్నా. టెస్టు జట్టులో అవకాశం వస్తే నాకల సాకారమైనట్టే. ఆ అవకాశం వచ్చే వరకు తీవ్రంగా శ్రమిస్తా.

ముంబై ఫార్ములా..

వేలాది మంది అభిమానుల కోలాహలం నడుమ, కిక్కిరిసిన స్టేడియాల్లో, ఐపీఎల్ మ్యాచుల్లో ఆడడం భిన్నమైన అనుభూతి. అలాంటి సమయాల్లో ఒత్తిడికి లోనుకాకుండా ఎలా ఆడాలో ముంబై ఇండియన్స్ డ్రెస్సింగ్ రూమ్‌లో పాఠాలు నేర్చుకున్నా. ఆటలో జట్టు క్లిష్టమైన పరిస్థితిలో ఉన్నప్పుడు సమష్టిగా ఎలాంటి వ్యూహాలు అమలు చేయాలి, ప్రత్యర్థిపై ఎలా పైచేయి సాధించాలనే విషయాల్లో నేను గడించిన అనుభవాన్ని ఇప్పుడు హైదరాబాద్ జట్టుకు ఉపయోగిస్తున్నా. అవి సత్ఫలితాలను ఇస్తున్నాయి.

సీనియర్ల మద్దతు అమోఘం

సీనియర్లతో కలిసి టీమిండియా, ఐపీఎల్‌లోని ముంబై ఇండియన్స్ జట్ల డ్రెస్సింగ్ రూమ్‌ను పంచుకోవడం నా జీవితంలోని మధురమైన ఘట్టాల్లో ఒకటి. ఆటలో కఠినమైన పరిస్థితులు ఎదురైనప్పుడు సీనియర్లు ఇచ్చిన సలహాలు, సూచనలు అమోఘం. ఐపీఎల్‌లో ఆడుతున్నప్పుడు కొందరు విదేశీ ప్లేయర్లు కూడా బాగా ప్రోత్సహించారు.

బ్రెజిల్‌కు షాక్

అర్జెంటీనాకు ఒలింపిక్ బెర్త్



కారకాస్: డిఫెండింగ్ చాంపియన్ బ్రెజిల్ ఫుట్‌బాల్ జట్టు ఈ ఏడాది పారిస్‌లో జరిగే ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంలో విఫలమైంది. చివరి నాలుగు ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన ఈ టీమ్‌ను అర్జెంటీనా దెబ్బకొట్టింది. దక్షిణ అమెరికా క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో బ్రెజిల్‌ను 1-0తో ఓడించింది. దీంతో అర్జెంటీనాకు పారిస్ బెర్త్ దక్కగా.. టోక్యో గేమ్స్‌లో స్వర్ణం సాధించిన బ్రెజిల్ ఇంటిముఖం పట్టింది. అండర్-23 విభాగాలకు చెందిన ఫుట్‌బాల్ జట్లే ఒలింపిక్స్‌లో పాల్గొంటాయి. 2004 తర్వాత తొలిసారి బ్రెజిల్ సాకర్ టీమ్ లేకుండా ఒలింపిక్స్ జరుగనున్నాయి. అటు 2004, 2008 ఈవెంట్స్‌లో అర్జెంటీనా స్వర్ణాలు సాధించింది.

రాజ్‌కోట్ చేరిన ఇంగ్లండ్ జట్టు

రాజ్‌కోట్: రెండో టెస్టు ముగిశాక సుదీర్ఘ విరామం లభించడంతో ఇంగ్లండ్ జట్టు అబుధాబికి వెళ్లింది. వారం రోజులపాటు అక్కడి తమ శిబిరంలో సేద తీరడంతో పాటు క్రికెటర్లు గోల్ఫ్ సైతం ఆడారు. అయితే ఈనెల 15 నుంచి జరిగే మూడో టెస్టు కోసం స్టోక్స్ సేన తిరిగి భారత్‌లో అడుగుపెట్టింది. సోమవారం సాయంత్రం వీరంతా రాజ్‌కోట్‌కు చేరుకున్నారు. అలాగే మంగళవారం నుంచి ఇక్కడి ఎస్‌సీఏ స్టేడియంలో సాధన ఆరంభించనుంది.

విరాట్ దూరం కావడం సిరీస్‌కే అవమానం



కేప్‌టౌన్: విరాట్ కోహ్లీ దూరం కావడంతో.. ఇంగ్లండ్ టెస్టు సిరీస్ గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆ జట్టు మాజీ పేసర్ స్టువర్ట్ బ్రాడ్ అభిప్రాయపడ్డాడు. ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా భారత్, ఇంగ్లండ్ మధ్య తొలి రెండు మ్యాచ్‌లు ఎంతో రసవత్తరంగా జరిగాయన్నాడు. 'ఈ రెండుజట్ల మధ్య నేను చూసిన సిరీస్‌ల్లో ఇదే ఎంతో పోటాపోటీగా సాగుతోంది. రెండో టెస్టులో నెగ్గిన భారత్ సిరీస్ సమం చేసినా.. ఇంగ్లండ్ దూకుడైన ఆటతో అదరగొడుతోంది. కానీ, ఈసారి కోహ్లీ లేకపోవడం సిరీస్, క్రికెట్‌కు అవమానమ'ని బ్రాడ్ అన్నాడు.

మూడో టెస్టుకు రాహుల్ దూరం



దేవ్‌దత్‌కు చోటు



రాజ్‌కోట్: ఇంగ్లండ్‌తో మూడో టెస్టు ఆరంభానికి ముందే భారత జట్టుకు ఝలక్ తగిలింది. స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ మోకాలి గాయంతో ఈ మ్యాచ్‌కు కూడా దూరమయ్యాడు. అతడి స్థానంలో తొలిసారిగా దేవ్‌దత్ పడిక్కళ్‌ను జట్టులోకి తీసుకున్నారు. రాహుల్ తొడ కండరాల నొప్పితో రెండో టెస్టులోనూ ఆడలేకపోయాడు. ఇటీవల మిగిలిన మూడు టెస్టుల కోసం ప్రకటించిన జట్టులో రాహుల్ పేరును చేర్చినా.. అతడి ఫిట్‌నెస్ బట్టి నిర్ణయం తీసుకుంటామని సెలెక్టర్లు తెలిపారు. దీనికి తగ్గట్టుగానే ఫిట్‌నెస్ టెస్టులో రాహుల్ విఫలమైనట్టు బోర్డు మెడికల్ టీమ్ తెలిపింది. వారం తర్వాత రాహుల్‌కు మరోసారి పరీక్ష నిర్వహిస్తారు. కోహ్లీ వ్యక్తిగత కారణాలతో సిరీస్‌కు దూరమవగా.. తాజాగా రాహుల్ గైర్హాజరీ ప్రభావం బ్యాటింగ్ ఆర్డర్‌పై పడనుంది. ఇక, తొడకండరాల నొప్పితోనే బాధపడుతున్న ఆల్‌రౌండర్ జడేజా ఫిట్‌నెస్ విషయంలోనూ స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుత రంజీ ట్రోఫీలో కర్ణాటక బ్యాటర్ పడిక్కళ్ పరుగుల వరద పారిస్తున్నాడు. తానాడిన నాలుగు మ్యాచుల్లో 3 సెంచరీలతో అతను 556 పరుగులు సాధించడం విశేషం.

భరత్ స్థానంలో ధ్రువ్?: ఇంగ్లండ్‌తో జరిగిన రెండు టెస్టుల్లో విఫలమైన వికెట్ కీపర్ కేఎస్ భరత్‌పై వేటు పడేలా ఉంది. ఈనెల 15 నుంచి రాజ్‌కోట్‌లో జరిగే మూడో టెస్టులో అతడి స్థానంలో ధ్రువ్ జురెల్‌కు బెర్త్ దక్కవచ్చు. కారు ప్రమాదంతో రిషభ్ పంత్ జట్టుకు దూరమైనప్పటి నుంచి భరత్ కీపర్‌గా కొనసాగుతున్నాడు. అయితే కీపింగ్ విషయంలో తను చురుగ్గానే ఉంటున్నా బ్యాటింగ్ వైఫల్యం మేనేజ్‌మెంట్‌కు ఆందోళన కలిగిస్తోంది. ఆడిన ఏడు టెస్టుల్లో కనీసం అర్ధసెంచరీ సాధించలేకపోగా సగటు 20.09గా ఉంది. దీంతో యువ కీపర్ జురెల్‌ను ప్రోత్సహించే అవకాశం ఎక్కువగా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.





పతకంపైనే గురి

బరిలో భారత పురుషులు, మహిళల జట్లు
నేటినుంచి ఆసియా టీమ్ బ్యాడ్మింటన్

షా ఆలమ్ (మలేసియా): బ్యాడ్మింటన్ ఆసియా టీమ్ చాంపియన్‌షిప్ మంగళవారం ఇక్కడ మొదలవనుంది. పారిస్ ఒలింపిక్స్‌కు కీలకమైన పాయింట్లు లభించనుండడంతో టాప్ స్టార్లంతా ఈ టోర్నీ బరిలో దిగుతున్నారు. ఈ టోర్నీలో 2016, 2018లో కాంస్యాలు గెలిచిన భారత పురుషుల జట్టు.. ఈసారి పతకం రంగు మార్చాలన్న పట్టుదలతో ఉంది. హెచ్ఎస్ ప్రణయ్ సారథ్యంలోని లక్ష్యసేన్, కిడాంబి శ్రీకాంత్, డబుల్స్ స్టార్లు సాత్విక్, చిరాగ్ తదితరులతో కూడిన భారత జట్టు గ్రూప్ 'ఎ'లో బలమైన చైనా, హాంకాంగ్ జట్లతో తలపడనుంది. ఇప్పటిదాకా పతకమే సాధించని భారత మహిళల బృందం.. ఈసారైనా ఆ లోటును భర్తీ చేయాలన్న లక్ష్యంతో ఉంది. పీవీ సింధు ఆధ్వర్యంలో భారత మహిళల జట్టు గ్రూప్ 'డబ్ల్యూ'లో తలపడుతోంది. ఈ గ్రూపులో భారత్, చైనా మాత్రమే ఉండడంతో.. మనకు ఇప్పటికే నాకౌట్ బెర్త్ ఖాయమైంది. సింగిల్స్‌లో సింధుతో పాటు అన్మోల్, తన్వీ శర్మ, అష్మిత, డబుల్స్‌లో గాయత్రి/ట్రీసా, అశ్విని/తనీషా ఆడనున్నారు. గాయంతో గతేడాది అక్టోబరు నుంచి ఆటకు దూరంగా ఉన్న సింధు ఈ టోర్నీ ద్వారా ఫామ్‌లోకి రావాలనుకుంటోంది. బుధవారం జరిగే తొలి పోరులో హాంకాంగ్‌తో భారత పురుషుల జట్టు.. చైనాతో సింధు బృందం తలపడతాయి.

ఐసీసీ అండర్-19జట్టులో ఉదయ్, సచిన్

బెనోని (సౌతాఫ్రికా): ఐసీసీ అండర్-19 వరల్డ్‌కప్ జట్టులో నలుగురు భారత ఆటగాళ్లకు చోటు దక్కింది. సోమవారం ప్రకటించిన టీమ్ ఆఫ్ టోర్నీలో టీమిండియా కెప్టెన్ ఉదయ్ సహరన్, సచిన్ దాస్‌తోపాటు ముషీర్ ఖాన్, స్పిన్నర్ సౌమీ పాండేలు స్థానం సంపాదించారు. ప్రపంచకప్ విజేతగా నిలిచిన ఆస్ట్రేలియా జట్టు కెప్టెన్ హగ్ వీబ్జెన్‌ను ఐసీసీ ప్యానెల్ ఈ టీమ్‌కు కూడా సారథిగా ఎంపిక చేసింది. టోర్నీలో అదరగొట్టిన సౌతాఫ్రికా పేసర్ క్వెనా మఫాకాకు కూడా చోటు లభించింది.



నామినేషన్లు వేసిన వైసీపీ రాజ్యసభ అభ్యర్థులు

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల్లో రాష్ట్రం నుంచి ఖాళీ అయినా మూడు స్థానాలకూ వైసీపీ అభ్యర్థులుగా వైవీ సుబ్బారెడ్డి, మేడా రఘునాథరెడ్డి, గొల్ల బాబూరావు నామినేషన్లు దాఖలు చేశారు. వాస్తవానికి ఈనెల 14 లేదా 15వ తేదీన నామినేషన్లు వేయాలని భావించారు. అయితే రెండు మూడు రోజుల ముందే ఆగమేఘాలపై వైసీపీ నేతలు నామినేషన్లు దాఖలు చేయడం చర్చనీయాంశమయింది. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సోమవారం రాజ్యసభ అభ్యర్థులు వైవీ సుబ్బారెడ్డి, మేడా రఘునాథరెడ్డి, గొల్ల బాబూరావుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి భేటీ అయ్యారు. వారికి పార్టీ తరఫున బీ ఫారాలను అందజేశారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వైసీపీ అభ్యర్థులు నేరుగా వెలగపూడి సచివాలయానికి చేరుకున్నారు. రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. అనంతరం అసెంబ్లీ ప్రాంగణంలో వారు మీడియాతో మాట్లాడారు. చరిత్రలో ఏనాడూ లేనివిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారిని జగన్ రాజ్యసభ మెట్లెక్కిస్తున్నారని వైవీ అన్నారు. సమసమాజ స్థాపన కోసం తమను జగన్ ఎంతవరకైనా తీసుకువెళతారని గొల్ల బాబూరావు చెప్పారు. తనను రాజ్యసభకు పంపుతున్నందుకు జగన్‌కు మేడా ధన్యవాదాలు చెప్పారు.

స్పీకర్ ఎదుట హాజరుకాని వైసీపీ ఎమ్మెల్యేలు

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి, మేకపాటి చంద్రశేఖరరెడ్డి పార్టీ ఫిరాయింపు అభియోగాన్ని ఎదుర్కొంటున్నారు. సోమవారం వారు స్పీకర్ ఎదుట హాజరై... అభియోగాలపై తమ అభిప్రాయాలను చెప్పాల్సి ఉంది. అయితే ఇప్పటికే వారు తమకు రెండు వారాలు సమయం కావాలని స్పీకర్‌కు లేఖ రాసినందున సోమవారం ఆ ముగ్గురూ స్పీకర్ ఎదుట హాజరు కాలేదు. కాగా మరో వైసీపీ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి ఈనెల 8న స్పీకర్ ఎదుట హాజరైన విషయం తెలిసిందే. కాగా... ఈ నెల 8న రావాలంటూ స్పీకర్ ఆదేశాలను అందుకున్న టీడీపీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేశ్, మద్దాలి గిరి, కరణం బలరామకృష్ణమూర్తి, వల్లభనేని వంశీ కూడా హాజరు కాలేదు. దీంతో వారికీ నోటీసులు ఇస్తారని అసెంబ్లీ వర్గాలు వెల్లడించాయి.

వై నాట్ 175 వెనుక భారీ కుట్ర

- అభ్యర్థులతో పాటు ఓటర్ల నియోజకవర్గాల్లోనూ మార్పులు ఆశ్చర్యకరం: పురందేశ్వరి



అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): విద్వేషం... విధ్వంసం... అరాచకం... నియంతృత్వం మినహా వైసీపీ పాలనలో ఇంకేమీ లేవని, రాష్ట్ర బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి విమర్శించారు. కేసులు, అరెస్టులు, అణచివేతలతో ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్న అధికార పార్టీకి ఎన్నికల ముందు అసలు భయం మొదలైందన్నారు. విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో 'ప్రజా పోరు' కార్యక్రమం కోసం జరిగిన సమావేశానికి హాజరైన ఆమె మాట్లాడుతూ... 'ఓటర్ల జాబితాలో అక్రమాలు కేవలం తిరుపతికి మాత్రమే పరిమితం అయ్యాయని అనుకుంటే పొరపాటు. తిరుపతి నుంచి విశాఖపట్నం వరకూ మా పార్టీ ఆధారాలతో సహా ఇచ్చిన ఫిర్యాదుతో స్పందించిన ఎన్నికల కమిషన్ ఇప్పటి వరకూ ఐఏఎస్, పోలీసు అధికారులపై చర్య తీసుకుంది. మరింత లోతుగా విచారణ జరిపించి సూత్రధారులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యమంత్రి జగన్ పదే పదే 'వై నాట్ 175' అనడం వెనుక భారీ కుట్ర ఉంది. అభ్యర్థులను నియోజకవర్గాలు మార్చుతున్న వైసీపీ అక్కడి ఓటర్లను సైతం వేల సంఖ్యలో మార్చడం ఆశ్చర్యకరం. గుంటూరులో పోటీ చేయబోతున్న మంత్రి విడుదల రజినీ పాత నియోజకవర్గం చిలకలూరిపేటలో అనుచరులు, ఓటర్లు పది వేల మందికి పైగా ఇక్కడ కొత్తగా ఓటర్లుగా నమోదు చేయించుకున్నారు' అని ఆరోపించారు. ప్రకాశం, చిత్తూరు జిల్లాల నుంచి బీజేపీలో చేరిన పారిశ్రామిక వేత్తలకు కండువా కప్పి పురందేశ్వరి ఆహ్వానించారు.

2 నెలల్లో మేమొస్తాం..
తిన్నదంతా కక్కిస్తాం



శ్రీకాకుళంలో జరిగిన సభకు హాజరైన జనం. (ఇన్‌సెట్‌లో)ఆముదాలవలసలో ఆరు గ్యారంటీల బ్యాగ్‌ను చూపిస్తున్న లోకేశ్, ఎంపీ రామ్మోహన్ నాయుడు

(మొదటి పేజీ తరువాయి)

మొదలైంది' అని తెలిపారు. రామతీర్థంలో శ్రీరాముడి విగ్రహం తల నరికిన వారి ఆచూకీ ఇప్పటివరకు లేదని.. టీడీపీ వస్తే నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు. వంశధార, తోటపల్లితో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేస్తామన్నారు. 'తాడేపల్లి కొంప గేట్లు బద్దలయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. సిక్కోలులో ఈరోజు అందరూ సింహాల్లా కనిపిస్తున్నారు. అరసవల్లి సూర్యదేవాలయం ఉన్న పుణ్యభూమి ఇది' అని పేర్కొన్నారు. ఇంకా ఏమన్నారంటే..

ఏదీ హోదా..?

జగన్‌రెడ్డి పని అయిపోయింది. ఈ మాట వారి సొంత పార్టీ ఎంపీలే చెబుతున్నారు. 25 మంది ఎంపీలను గెలిపిస్తే ప్రత్యేక హోదా తీసుకొస్తామన్నారు. కానీ ప్రధానిని ఏనాడైనా అడిగారా? 31 మంది ఎంపీలను (లోక్‌సభ, రాజ్యసభ) ఇస్తే కేసుల మాఫీ కోసం రాష్ట్ర ప్రయోజనాలను ఢిల్లీలో తాకట్టుపెట్టారు. సొంత పార్టీ ఎంపీలే 'బైబై జగన్' అనేస్తున్నారు. అధికారంలోకి వస్తే వారంలోగా సీపీఎస్ రద్దు చేస్తానని జగన్ మాటిచ్చాడు. నాలుగేళ్ల పది మాసాలైంది. ఉద్యోగులు కూడా వైసీపీకి బైబై అనేస్తున్నారు. జగన్‌రెడ్డి ఇటీవలే కొత్త స్కీం తీసుకొచ్చాడు. అదే ఎమ్మెల్యేల బదిలీ పథకం. మన ఇంటి చెత్త పక్కన ఇంట్లో వేస్తే బంగారం అవుతుందా? పక్క నియోజకవర్గంలో చెల్లని వైసీపీ ఎమ్మెల్యే మన నియోజకవర్గంలో చెల్లుతారా? సొంత ఎమ్మెల్యేలే వైసీపీని వీడి పారిపోతున్నారు.

అన్నం తినడం మానేసి..

ఇసుక టీడీపీ పాలనలో ఉచితంగా ఉస్తే.. ఇప్పుడు ట్రాక్టర్ రూ.5వేలకు పెంచేశారు. జగన్ అన్నం తినడం మానేసి ఇసుకను తినడమే పనిగా పెట్టుకున్నారు. రోజుకు రూ.3 కోట్లు, ఏడాదికి రూ.1,080 కోట్లు, ఐదేళ్లలో రూ.5,400 కోట్లు దోచేస్తున్నారు. మరో రెండు మాసాలు ఓపికపట్టండి. టీడీపీ-జనసేన ప్రభుత్వం వచ్చాక ఇసుక ధరలు తగ్గిస్తాం. జగన్‌రెడ్డి కటింగ్, ఫిట్టింగ్ మాస్టర్. రూ.10 ఇచ్చేందుకు బ్లూబటన్ నొక్కి.. ఆ తర్వాత ఎర్ర బటన్ నొక్కి రూ.100 చొప్పున ప్రజల నుంచి కాజేస్తున్నాడు. మద్యం క్వార్టర్ బాటిల్‌పై రూ.25 జే ట్యాక్స్ కట్టించుకుంటున్నాడు. ఇది నేరుగా జగన్ జేబులోకే వెళ్తోంది. మద్యం ద్వారానే ఏడాదికి రూ.9 వేల కోట్ల చొప్పున ఐదేళ్ల కాలంలో రూ.45 వేల కోట్లు దోచుకున్నాడు. జగన్ గొప్ప కటింగ్ మాస్టర్ కూడా. అన్న క్యాంటీన్లు, ప్రమాద బీమా కట్.. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ కట్.. 6 లక్షల మందికి పింఛన్ కట్, డ్రిప్ ఇరిగేషన్ కట్.. ఇలా వంద సంక్షేమ కార్యక్రమాలను రద్దుచేసేశాడు.

చర్చకు సిద్ధమా?

మైడియర్ జగన్.. నువ్వే టైం చెప్పి, డేట్ ఫిక్స్ చేయి. మీ అవినీతిపై, మాపై ఆరోపణలపై చర్చకు సిద్ధం.. నువ్వు సిద్ధమా? చట్టాలను ఉల్లంఘించినవారి పేర్లను రెడ్‌బుక్‌లో రాశాం. దీనికి డిమాండ్ బాగా పెరిగిపోయింది. దీనిపై కేసు కూడా పెట్టారు. మా తాత, మా నాన్నలా మంచిపేరు వస్తుందో లేదో నాకు తెలియదు. చెడ్డపేరైతే తీసుకురాను. వైసీపీకి వలంటీర్లు ఉంటే టీడీపీకి 60 లక్షల మంది కార్యకర్తలు ఉన్నారు. టీడీపీ ఆఫీసు చుట్టూ కాదు.. ప్రజల చుట్టూ తిరిగితే నేను స్వయంగా వచ్చి నామినేటెడ్ పోస్టులు ఇస్తా. రూ.5 కోసం వైసీపీ పేటీఎం బ్యాచ్ సోషల్ మీడియా ద్వారా ఎంతటి దారుణాలకైనా తెగబడుతోంది. టీడీపీ-జనసేన అధికారంలోకి వస్తే ఇప్పుడున్న సంక్షేమ పథకాలు ఆపేస్తారని వలంటీర్ల ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. సంక్షేమ పథకాలు ఆపేది లేదు. ఆ తప్పుడు ప్రచారం నమ్మవద్దు.

మూడు ముక్కలాట..

ఉత్తరాంధ్రకు పట్టిన శని జగన్. మూడు రాజధానులంటూ మూడు ముక్కలాట ఆడుతున్నాడు. ఈ ప్రాంతానికి ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాలేదు. తాను మాత్రం రూ.500 కోట్లతో విశాఖలో ప్యాలెస్ కట్టుకున్నాడు. రైల్వే జోన్‌కు అవసరమైన భూమి కూడా ఇవ్వలేదు. టీడీపీ అధికారంలోకి వస్తే స్టీల్ ప్యాక్టరీని ప్రైవేటుపరం కానివ్వం. అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసి కాపాడతాం.

పిన్ని తాళిబొట్టు తెంపింది..?

బాబాయిని చంపింది ఎవరు..? పిన్ని తాళి బొట్టు తెంపింది ఎవరో రాష్ట్రంలో ప్రజలందరికీ తెలుసు. వివేకానందరెడ్డిని హత్య చేయించింది జగన్‌రెడ్డే. జగనాసుర రక్త చరిత్ర. మనపై నింద వేశారు. ఈ కేసులో అవినాశ్‌రెడ్డి నిందితుడిగా ఉన్నాడు. రేపోమాపో జగన్ కూడా ఏ-1గా చేరుతున్నారు. ఎన్నికల ముందు కోడికత్తి డ్రామా ఆడి మనపై నెట్టారు. ఆర్మీలో సిక్కోలు వాసులు పెద్ద ఎత్తున ఉంటారు. నేను ఢిల్లీ వెళ్తే అక్కడ బాడీగార్డులంతా సిక్కోలు వాసులే. తాము రిటైరయ్యాక తమ కోసం శ్రీకాకుళం జిల్లాలో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వారు కోరారు. వారు కోరినట్లే చేస్తాం.

తమ్మినేని, అప్పలరాజు పోటీ

అవినీతిలో స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రి అప్పలరాజు పోటీపడుతున్నారు. టీడీపీ హయాంలో ఆమదాలవలస నియోజకవర్గాన్ని రూ.1,600 కోట్లతో అభివృద్ధి చేశాం. ఆ తర్వాత దమ్మాబుస్సు (తమ్మినేని)ని ఎమ్మెల్యేగా గెలిపించారు. ఈయన ఈ ఐదేళ్లలో రూ.వెయ్యి కోట్లు సంపాదించుకున్నాడు. కొడుకు పెళ్లి కోసం రూ.1.3 కోట్లు వసూలు చేశాడు. ఇసుకలో రూ.300 కోట్లు దోచుకున్నాడు. వలంటీర్, అంగన్వాడీ, షిఫ్ ఆపరేటర్ పోస్టులు డబ్బులు ఇచ్చినవారికే అమ్ముకున్నాడు. మైన్స్ పేరిట వందల ఎకరాలను కొడుకు పేరుపై రాయించుకున్నాడు. టీడీపీ వచ్చాక విచారణ వేసి ప్రజలకు అప్పగిస్తాం. తనకు రాజకీయ భిక్ష పెట్టింది ఎన్టీఆర్ అని తమ్మినేని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. మరి అదే ఎన్టీఆర్ కుమారైను అసెంబ్లీలో అవమానిస్తే నువ్వు చేసిందేంటి..? మంత్రి ధర్మాన ప్రసాదరావు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ల ఇంటి పేరులోనే ధర్మం ఉంది. వారి చేసేవన్నీ అధర్మ పనులే.



నంబరు ప్లేటు లేని కారులో పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్

'పెందుర్తి ఎమ్మెల్యే' ....అదే ఆయన కారు నంబరు!

విశాఖపట్నం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆయన బాధ్యత కలిగిన ఎమ్మెల్యే. కానీ అధికారం తలకెక్కడంతో రవాణా శాఖ నిబంధనలు తనకు వర్తించవన్నట్టు వ్యవహరిస్తున్నారు. పెందుర్తి వైసీపీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ సోమవారం సాయంత్రం విశాఖ జిల్లా కలెక్టర్‌ను కలవడానికి వచ్చారు. ఆయన కారుకు నంబరు ప్లేటు లేదు. ఆ స్థానంలో 'పెందుర్తి ఎమ్మెల్యే' అనే బోర్డు ఉంది. కారుకు ముందు, వెనుక కూడా అలాగే ఉంది. చట్టాలు చేసే వాటిని గౌరవించకపోతే ఇక సామాన్య ప్రజలకు ఏమి సందేశం ఇస్తున్నట్టు? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

సజావుగా ఎన్నికలు

- ఈసీ నిబంధనలు పాటించండి: సీఈవో మీనా

విశాఖపట్నం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణపై అధికారులకు పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని, అందుకే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) ముఖేష్‌కుమార్ మీనా చెప్పారు. సోమవారం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లోగల లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల ఏఈఆర్‌వో (అసిస్టెంట్ ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్)లకు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈసీ మార్గదర్శకాలు, సూచనలు పాటిస్తూ ముందుకువెళ్లాలని సూచించారు. ఇందుకోసం 1,000 మందికి శిక్షణ ఇస్తామన్నారు. తొలివిడతలో విశాఖ, విజయవాడ, తిరుపతిలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. నెలాఖరుకల్లా అందరికీ శిక్షణ ఇస్తామన్నారు.

అప్పనంగా అప్పగించేస్తారా?

- హార్సిలీ హిల్స్‌లో 'యాత్ర' దర్శకునికి కేటాయింపులపై రామకృష్ణ విమర్శ

అమరావతి(ఆంధ్రజ్యోతి), అనంతపురం, ఫిబ్రవరి 12: గత ప్రభుత్వం క్రీడా శిక్షణ కేంద్రం ఏర్పాటు కోసం కేటాయించిన స్థలాన్ని సినీ దర్శకుడు మహి వీ రాఘవకు అప్పనంగా అప్పగించడం సరికాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ అన్నారు. "దర్శకుడు మహి 'యాత్ర 2' పేరుతో తనకు సొంత డబ్బా కొట్టాడని హార్సిలీ హిల్స్‌లో రూ.20 కోట్ల భూవిని సీఎం జగన్ ఎలా కట్టబెడతారు? భూ కేటాయింపులను తక్షణమే ఉపసంహరించుకోవాలి" అని ఆయన సోమవారం డిమాండ్ చేశారు. కాగా, ఆయన అనంతపురంలో మీడియాతో మాట్లాడుతూ, 'బీజేపీ రాజకీయాలపై ఈ నెల 20న విజయవాడలో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో సదస్సు ఏర్పాటు చేస్తాం' అని తెలిపారు.

బకాయిలు 20 వేల కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

నేతలతో సమావేశమైంది. ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు సుమారు రూ.20 వేల కోట్లని తేల్చి చెప్పింది. అయితే, వీటిలో రూ.5,500 కోట్లను ఈ నెలాఖరు, లేదా మార్చి 31 నాటికి చెల్లిస్తామని తేల్చి చెప్పింది. అదేసమయంలో ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు ఏమేమున్నాయనే వివరాలను వెల్లడించింది. అయితే, వీటిని పూర్తిగా ఇప్పుడు చెల్లించడం సాధ్యం కాదని తేల్చేసింది. కాగా, ఉద్యోగులు కోరుతున్న ఐఆర్‌ను మాత్రం సీఎం జగన్‌తో చర్చించి మరోసారి చెబుతామని మంత్రుల కమిటీ తప్పించుకుంది. 2023 కన్నా ముందు నియామకం పొందిన వారికి కూడా ఓపీఎస్ వర్తింపజేయాలని ఉద్యోగ సంఘాలు అడగ్గా చర్చించి చెబుతామని మంత్రులు పేర్కొన్నారు. దీంతో ఉద్యోగ సంఘాల నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశం యథావిధిగా జరిగిందని, కొత్తదనం ఏమీ లేదని కాకపోతే తమకు ప్రభుత్వం ఎంత బకాయిలు చెల్లించాల్సి ఉందో చెప్పించామని ఉద్యోగ సంఘాలు పేర్కొన్నాయి. ఈ సమావేశంలో మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఏపీ జేఏసీ చైర్మన్ బండి శ్రీనివాసరావు, సెక్రటరీ జనరల్ హృదయరాజు, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు. అనంతరం మంత్రి బొత్స ఉద్యోగ సంఘాల నేతలు మీడియాతో మాట్లాడారు.

బకాయిలు రూ.20 వేల కోట్లు: బొప్పరాజు

మంత్రివర్గ ఉప సంఘం జరిపిన చర్చల్లో కొత్త దనం లేదని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. ఉద్యోగులకు ప్రభుత్వం రూ.20 వేల కోట్ల మేరకు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. వీటిలో కొంత మొత్తాన్ని మార్చి 31, జూన్‌లో చెల్లిస్తామన్నారని తెలిపారు. ఐఆర్‌పై చర్చించి సమాచారం ఇస్తామన్నారని చెప్పారు. 2003లోపు నోటిఫికేషన్ ద్వారా సీపీఎస్‌లో ఉన్న ఉద్యోగులకు ఓపీఎస్ ఇవ్వాలని అడిగితే.. పరిశీలిస్తామని మంత్రుల కమిటీ చెప్పిందన్నారు. జీపీఎఫ్ బకాయిలు రూ.940 కోట్లలో రూ.60 కోట్లు క్లాస్ ఫోర్ ఉద్యోగులకు చెల్లించినట్టు తెలిపారని బొప్పరాజు వివరించారు. మిగిలిన డబ్బులు మార్చి 31న చెల్లిస్తామని చెప్పారన్నారు. ఏపీజీఎల్ఐ బకాయిలు రూ.313 కోట్లు అప్‌లోడ్ అయ్యాయని, మరో రూ.200 కోట్లు అప్‌లోడ్ కావాల్సి ఉందని చెప్పారు. టీఏ, డీఏ బకాయిలు పోలీసువారికి ఇతర ఉద్యోగులకు కలిపి రూ.274 కోట్లు చెల్లించాల్సి ఉందని, పోలీసులకు చెల్లిస్తామని చెప్పారని మిగిలిన ఉద్యోగులకు మార్చికి వాయిదా వేశారని అన్నారు. సరెండర్ లీవులు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలు మొత్తం రూ.2,250 కోట్లు ఉన్నాయని తెలిపారు. జూన్ నాటికి కొంత మొత్తం చెల్లిస్తామని చెప్పారన్నారు. 2020, 2021 సంవత్సరం సరండర్ లీవులు రూ.300 కోట్లు మార్చి నెలాఖరునాటికి చెల్లిస్తామని చెప్పారన్నారు. సీపీఎస్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న రూ.2,800 కోట్లు వారి ఖాతాల్లో మార్చిలో జమ చేస్తామని చెప్పినట్టు తెలిపారు. ఎంతెంత బకాయిలు చెల్లించాలో సాధించామన్నారు.

ఉద్యమం కొనసాగిస్తాం: బండి

మంత్రుల కమిటీతో జరిగిన సమావేశం నిరుత్సాహ పరిచిందని ఏపీ జేఏసీ చైర్మన్ బండి శ్రీనివాసరావు అన్నారు. తాము ప్రకటించిన ఉద్యమ కార్యాచరణ ఈ నెల 14 నుంచి యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. మధ్యంతర భృతి విషయంలో ప్రభుత్వం స్పందించలేదన్నారు. 14న నల్లబ్యాడ్జీలతో మొదలయ్యే తమ ఆందోళన 27న 'చలో విజయవాడ'తో ముగుస్తుందని తెలిపారు.

మధ్యంతర భృతిపై చర్చించాం
- వెంకట్రామిరెడ్డి

మంత్రుల కమిటీ సమావేశంలో డీఏ బకాయిలు, మధ్యంతర భృతి, 2003 కన్నా ముందు నియమితులైన సీపీఎస్ ఉద్యోగులకు ఓపీఎస్ అంశాలపై ఎక్కువ చర్చ జరిగిందని సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి తెలిపారు. రూ.5,500 కోట్ల మేర బకాయిలను మార్చి 31 నాటికి చెల్లిస్తామని చెప్పిందన్నారు. మధ్యంతర భృతిపై సీఎంతో చర్చించి చెబుతామని మంత్రుల కమిటీ చెప్పిందన్నారు. పీఆర్సీ బకాయిలపై గతంలోనే షెడ్యూల్ ఇచ్చారన్నారు.

ఉద్యోగులమా బానిసలమా?

- ఈహెచ్ఎస్‌ను బాగుచేయరా
- హెల్త్‌కార్డులపై జగన్ వైఖరిని తీవ్రంగా తప్పుబడుతున్న ఉద్యోగులు

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులందరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో తీసుకు వచ్చిన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్(ఈహెచ్ఎస్). అయితే, ఇది ఇప్పటికీ 18 ఏళ్ల నాటి సీలింగ్ రేట్లతో నడుస్తోంది. 18 ఏళ్లలో వైద్యం ఖర్చులు ఎంత పెరిగాయో తెలిసిందే. అలాగే, వైద్య చికిత్సల ప్యాకేజీలను చంద్రబాబు హయాంలో(2018) పెంచారు. అప్పటి నుంచి ఈనాటి వరకు వైసీపీ ప్రభుత్వం తిరిగి దానివైపు చూడలేదు. ముఖ్యంగా కరోనా సమయంలో ఉద్యోగులు ప్రభుత్వం నుంచి సాయమందక, ఖరీదైన వైద్య ఖర్చులు భరించలేక, సరైన వైద్యమందక ప్రాణాలు కోల్పోయారు. కోవిడ్ సమయంలో చికిత్స ఖర్చుల కోసం తీసుకున్న రుణాలకు ఉద్యోగులు ఇంకా ఈఎంఐలు కడుతున్నారు. డిశ్చార్జి అయ్యాక ప్రభుత్వం ఇచ్చే అరకొర బిల్లుల కోసం ఆర్థికశాఖ చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఉద్యోగులమా? బానిసలమా? అర్థం కావట్లేదని, హెల్త్‌కార్డులు అప్‌డేట్ చేయడం చిన్నపనే అయినప్పటికీ ప్రభుత్వం తమను బానిసలుగా చూస్తున్నందునే ఆ పని చేయడం లేదని మండిపడ్డారు.



మీడియాతో మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

2005 సీలింగ్.. 2018 నాటి ప్యాకేజీలు

2005 నుంచి ఉద్యోగులు రాతపూర్వక ఫైళ్ల నుంచి కంప్యూటర్ ఫైళ్లు, ఇప్పుడు ఈ-ఆఫీస్ ఫైళ్ల వరకు వచ్చారు. కానీ, వారి ఈహెచ్ఎస్ సీలింగ్‌లో మాత్రం ఎలాంటి అప్‌డేట్ లేదు. ఉద్యోగులకు ఈహెచ్ఎస్ స్కీమ్ కింద 2005లో గరిష్ఠంగా రూ.2 లక్షల సీలింగ్ నిర్ణయించింది. ఇప్పటి వరకు అదే సీలింగ్ కొనసాగుతోంది. అలాగే, 2018లో వివిధ చికిత్సల ధరలు(ప్యాకేజీ) పెంచారు. అవి కూడా అలానే కొనసాగుతున్నాయి. ఉదాహరణకు, నార్మల్ డెలివరీ అయినా, సిజేరియన్ అయినా ఈ ప్యాకేజీలో ఇచ్చేది రూ.19,000 మాత్రమే. కానీ, బయట సాధారణ ఆస్పత్రుల్లో డెలివరీ ప్యాకేజీలు రూ.50,000పైనే ఉన్నాయి. ప్రస్తుతం బైపాస్ సర్జరీలు, స్టంట్ వేయడం కామన్ అయిపోయాయి. స్టంట్ వేసినందుకు ఆస్పత్రి ఫీజు ఎంత వేసినా సరే ప్రభుత్వం మాత్రం రూ.35,000 మాత్రమే ఇస్తోంది. మిగిలిన అన్ని చికిత్సలకు కూడా ప్రభుత్వం ఇచ్చేది అరకొరే.

వాటా ఎగ్గొడుతున్న ప్రభుత్వం

ఈహెచ్ఎస్ పథకం కోసం గజిటెడ్ ఉద్యోగుల వేతనం నుంచి రూ.300, నాన్ గజిటెడ్ ఉద్యోగుల వేతనం నుంచి రూ.225 కట్ చేస్తున్నారు. ఇవి మొత్తం ఏడాదికి రూ.140 కోట్లు అవుతున్నాయి. ఇంతేమొత్తంలో ప్రభుత్వం తన వాటా కలపాలి. దీంతో ఈహెచ్ఎస్ స్కీమ్ కింద రూ.280 కోట్ల నిధులు జమ కావాలి. కానీ, ఉద్యోగులకు మెడికల్ రీయింబర్స్‌మెంట్, క్యాష్‌లెస్ ద్వారా ఈ పథకం కింద అందుతున్న ప్రయోజనాలు పరిశీలిస్తే ప్రభుత్వం తన వాటా కలపకుండా ఎగ్గొడుతున్నట్టు అర్థమవుతోంది. 2022-23లో క్యాష్‌లెస్ కింద ప్రభుత్వం రూ.130 కోట్లు ఇచ్చింది. రీయింబర్స్‌మెంట్ కింద రూ.20 కోట్లు ఇచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా క్యాష్‌లెస్ కింద రూ.130 కోట్లు, రీయింబర్స్‌మెంట్ కింద రూ.25 కోట్లు ఇచ్చింది. దీని ప్రకారం ఉద్యోగుల జీతాల్లో నుంచి కట్ చేస్తున్న రూ.140 కోట్లనే ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ప్రభుత్వ వాటాగా రావాల్సిన రూ.140 కోట్లను ఉద్యోగుల కోసం ఉపయోగించడం లేదు. పోనీ ఉద్యోగులు సొంత డబ్బులతో కట్టుకుందామన్నా డీఏ, పీఆర్సీ బకాయిలు, సరెండర్ లీవులు, ఈఎల్స్, ఇతర బిల్లులన్నీ పెండింగ్‌లో ఉన్నాయి.

అప్పుడు రిటైర్మెంట్.. ఇప్పుడు జీఎల్ఐ

ఉద్యోగులకి డబ్బులిచ్చే ఏ అంశాన్నుంచైనా ప్రభుత్వం తెలివిగా పక్కకు తప్పుకొంటోంది. రిటైర్ అవుతున్న ఉద్యోగులకు ప్రయోజనాల రూపంలో డబ్బులివ్వాల్సి వస్తోందని రిటైర్మెంట్ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచారు. ఇప్పుడు ఏపీజీఎల్ఐ క్లెయిమ్‌లు పెరిగిపోవడంతో వాటిని తీసుకోవడమే ఆపేశారు. ఈ క్లెయిమ్‌లు స్వీకరించడానికి ఒక ఆన్‌లైన్ యాప్ డెవలప్ చేస్తున్నామంటూ 8 నెలలుగా కాలయాపన చేస్తోంది. క్లెయిమ్‌లు తీసుకుంటే ఉద్యోగులకు డబ్బు చెల్లించాల్సి వస్తుంది.

6 లక్షల మందినీ చూసుకోలేరా

రాష్ట్రంలో ఈహెచ్ఎస్ వర్తించే ఉద్యోగులు 5 నుంచి 6 లక్షల వరకు ఉన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం మెరుగైన పాలసీ రూపొందించడం లేదు. మెరుగైన పాలసీ కోసం వేతనం నుంచి రూ.1000 అయినా ఇవ్వడానికి ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారు. ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఇప్పుడు సగటున ఉద్యోగుల వేతనాల్లో నుంచి రూ.250 కట్ చేస్తుంటేనే రూ.280 కోట్ల ఫండ్ జమ అవుతోంది. అలాంటిది రూ.1000 కట్ చేస్తే రూ.1000 కోట్లకు పైగా నిధులు జమ అవుతాయని, దీంతో మెరుగైన పాలసీ తమకు అందివ్వొచ్చని ఉద్యోగులు చెబుతున్నారు.

ఈ నెల.. వచ్చే నెల!: బొత్స

ఉద్యోగ సంఘాలతో జరిగిన చర్చల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలపై దృష్టి పెట్టినట్టు మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. 2, 3 అంశాలపై సమయం కావాలని అడిగామన్నారు. ఈ నెల, వచ్చే నెలలో రూ.5,500 కోట్ల బకాయిలు విడుదల చేస్తామని తెలిపారు. త్వరతిగతిన పీఆర్సీ ప్రకటించాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఉద్యోగ సంఘాలు మధ్యంతర భృతి కోరాయని దానిపై పరిశీలిస్తున్నామని, సీఎంతో చర్చించి చెబుతామని అన్నారు. తహసీల్దార్ రమణయ్య కుటుంబాన్ని ఆదుకుంటామని, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించామని తెలిపారు. రమణయ్య కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని మంత్రి చెప్పారు.

తొండి చేసి.. తప్పించుకుని!

ఉద్యోగుల బకాయిల విషయంలో జగన్ సర్కారు తొండి చేసి, తప్పించేసుకుంది. ఈ ఐదేళ్లలో బకాయిలు రూ.20 వేల కోట్లు అని తేల్చిన ప్రభుత్వం.. వీటిని పూర్తిగా చెల్లించకుండా.. కేవలం రూ.5,500 కోట్లను విదిలిస్తామని చెప్పడం ద్వారా ఉద్యోగులకు తొండి చేసింది. అదేసమయంలో నిధుల భారం నుంచి తప్పించేసుకుంది. రూ.5,500 కోట్లు కూడా ఈ నెల కొంత, మార్చి నెలాఖరు వరకు కొంత అని సాగదీసింది. మరి మిగిలిన సొమ్ములు ఎప్పుడు చెల్లిస్తారన్న ప్రశ్నకు ఈ ప్రభుత్వం వద్ద సమాధానం లేదు. ఎందుకంటే.. మార్చి, ఏప్రిల్ మాసాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. మే నాటికి కొత్త ప్రభుత్వం ఏర్పడుతుంది. దీంతో ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిల భారం కొత్త ప్రభుత్వంపైనే పడనుంది. దీంతో ఈ చెల్లింపులు మరింత ఆలస్యం కావడం ఖాయం.

హార్సిలీహిల్స్ 'యాత్ర'కు బ్రేక్!

(మొదటి పేజీ తరువాయి)

సమయం కూడా కావడం, ఈ వ్యవహారంపై ప్రతిపక్షాలు భగ్గుమనడంతో అధికారులు ధైర్యంగా ముందుకెళ్లలేకపోతున్నారని సమాచారం. ఒకరకంగా అడకత్తెరలో పోకచెక్క పరిస్థితిని అధికారులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో భూమిని సబ్ డివిజన్ చేసి మహేంద్రరెడ్డి కోరుకున్న స్థలం ఇచ్చే ప్రక్రియకు బ్రేక్ పడినట్టు సమాచారం. అసలేం జరిగిందంటే.. ఆంధ్రా ఊటీ హార్సిలీహిల్స్‌లో స్థలం పొందాలనుకున్న యాత్ర-2 డైరెక్టర్ మహేంద్రరెడ్డి కలలను వైఎస్ జగన్ ప్రభుత్వం సాకారం చేయాలనుకుంది. నిబంధనలతో పనిలేకుండా అత్యంత విలువైన రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించేందుకు సాక్షాత్తూ ప్రభుత్వంలోని పెద్దలే రంగంలోకి దిగారు. దీంతో భూకేటాయింపు ప్రక్రియ శరవేగంగా జరగడం మొదలైంది. పైస్థాయి అధికారుల ఆదేశాలతో కలెక్టర్, కలెక్టర్ ఆదేశాలతో స్థానిక రెవెన్యూ అధికారులు కదిలారు. మదనపల్లె ఆర్డీవో హరిప్రసాద్ స్వయంగా యాత్ర-2 డైరెక్టర్ మహేంద్రరెడ్డి కోరుకున్న స్థలాన్ని పరిశీలించారు. అయితే ఇక్కడే చిక్కుముడులు పడ్డాయి. మహేంద్రరెడ్డికి కేటాయించాలని చూస్తున్న కోటావూరు గ్రామ పరిధిలోని సర్వేనెంబరు 571/1లో 3.74 ఎకరాల భూమి ఉంది. 2018లో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో క్రీడా శిక్షణా కేంద్రం ఏర్పాటుకు శాప్‌కు దీనిని కేటాయించింది. క్రీడాశిక్షణా కేంద్రం అభివృద్ధికి రూ.3.20 కోట్లు కేటాయించింది. రూ.1.60 కోట్లు వ్యయం చేసి ఆ స్థలం చుట్టూ ప్రహరీగోడను కూడా నిర్మించారు. ఇప్పుడు ఈ స్థలం ఉన్న ఫలంగా మహేంద్రరెడ్డికి కేటాయించడం కుదరదు. దీంతో తొలుత 3.74 ఎకరాల స్థలంలో రెండు ఎకరాలను పర్యాటకశాఖకు బదలాయించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. దర్శకుడు మహేంద్రరెడ్డికి ధారాదత్తం చేయాలని చూస్తున్న స్థలం ప్రస్తుతానికి సబ్ డివిజన్ కాలేదని సమాచారం.

ఆర్డీవో చేతిలో అధికారం...

హార్సిలీహిల్స్‌లో మొత్తం 103 ఎకరాల స్థలం ఉంది. ఇందులో ఏపీ టూరిజం, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, రైల్వే, శానిటోరియం, బిల్డింగ్ సొసైటీ, సీడీసీఎంఎస్ తదితర 16 శాఖలకు పలుమార్లు భూములను కేటాయించారు. నిబంధనల ప్రకారం హార్సిలీహిల్స్‌పై ఎటువంటి చిన్న నిర్మాణాలు చేపట్టాలన్నా, ఇతరులకు సెంటు భూమి కేటాయించాలన్నా టౌన్‌షిప్ కమిటీకి మాత్రమే అధికారాలు ఉంటాయి. టౌన్‌షిప్ కమిటీ అధ్యక్షుడిగా మదనపల్లె ఆర్డీవో ఉంటారు. ఎంపీడీవో, తహసీల్దార్‌లతో పాటు కొండ మీద భూములు ఉన్న వివిధ శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారు. టౌన్‌షిప్ కమిటీలో తీర్మానించాక భూముల కేటాయింపు కానీ, నిర్మాణ పనులుకానీ చేయాల్సి ఉంటుంది. టౌన్‌షిప్ కమిటీ చైర్మన్‌గా ఆర్డీవోకు ప్రత్యేక అధికారాలు ఉంటాయి. శాప్‌కు చెందిన భూమిలో విఎసీ స్టూడియో నిర్మాణానికి కేటాయించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు, కలెక్టర్ ఉత్తర్వులు ఉన్నందున హార్సిలీ హిల్స్ టౌన్‌షిప్ కమిటీ చైర్మన్‌గా ఆర్డీవో ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అయితే ఇందుకు కమిటీలో తీర్మానం తప్పనిసరి.

రాచమార్గం కాదని.. అడ్డదారిలో..

హార్సిలీహిల్స్‌పైన ఎవరికైనా స్థలం కేటాయించాలంటే.. అనేక నిబంధనలు పాటించాలి. ఈ నేపథ్యంలో.. ప్రొసీజర్ ప్రకారం వెళితే ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉంటుందని, ఆ స్థలాన్ని సబ్‌డివిజన్ చేసి పర్యాటక శాఖకు కేటాయించి.. అటునుంచి యాత్ర దర్శకునికి కట్టబెట్టేందుకు ప్రభుత్వ పెద్దలు ఎత్తుగడ వేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయం వెలుగులోకి రావడంతో ప్రస్తుతానికి మహేంద్రరెడ్డికి భూకేటాయింపు విషయం అటకెక్కినట్లు తెలుస్తోంది. ఎన్నికలు దగ్గరలో ఉండడంతో ఈ విషయమై అధికారుల పరిస్థితి అడకత్తెరలో చిక్కుకున్నట్లు ఉంది. ఏదైనా తొందర పడి నిబంధనలను పక్కన పెట్టి ఏమైనా చేస్తే తమ పరిస్థితి ఏంటనే భయం అధికారుల్లో కనిపిస్తోంది. దీంతో ఈ విషయమై అధికారులు ఎవరూ నోరు మెదపడం లేదు. ఏం అడిగినా మాకు తెలియదు.. దయ ఉంచి మమ్మల్ని అడగవద్దు అనే సమాధానం ఇస్తున్నారు.

చెల్లి కాదు.. చంద్రముఖి!

(మొదటి పేజీ తరువాయి)

లెక్కచేయలేదు. కానీ షర్మిల పదునైన మాటలు జనంలోకి బాగా చొచ్చుకుపోతున్నాయన్న దుగ్ధతో.. ఆమెను కించపరిచే విషయంలో అథమ స్థాయికి దిగజారుతున్నారు. తీవ్రస్థాయిలో వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు.

అంచలంచెలుగా..

ముప్పేట దాడి చేయడం ద్వారా షర్మిలను కట్టడి చేయాలని జగన్ అండ్ కో తొలి రోజు నుంచీ విశ్వ ప్రయత్నం చేస్తోంది. చంద్రబాబు ప్రయోగించిన అస్త్రం అంటూ మొదలైన దాడి.. ఆ తర్వాత అథమ స్థాయికి చేరడం చకచకా జరిగిపోయింది. తొలుత ఆమె కులం, వ్యక్తిత్వాలపై దాడులు చేయించారు. పుంఖానుపుంఖాలుగా అసభ్య పోస్టులు పెట్టించారు. ఆమె బ్రాహ్మణుడైన అనిల్‌కుమార్‌ను పెళ్లి చేసుకున్నందున.. ఆమె ఎంత మాత్రం వైఎస్ షర్మిలారెడ్డి కాదు.. మొరుసుపల్లి షర్మిలా శాస్త్రి అంటూ హోరెత్తించారు.

ఒక దశలో ఆమె వైఎస్‌కే పుట్టిందా అన్న దారుణమైన కామెంట్లతో తల్లి విజయలక్ష్మి కుంగిపోయే రీతిలో పోస్టులు పెట్టారు. అటు సోషల్ మీడియా, ఇటు వైసీపీ నేతలు ఎంతలా విరుచుకుపడుతున్నా షర్మిల ఏ మాత్రం లెక్కచేయకుండా వారి తీరును ఎండగడుతూ వచ్చారు. రాష్ట్రాధినేతగా ఐదేళ్లలో రాష్ట్రానికేం చేశావంటూ జగన్‌పై తన ప్రశ్నల దాడిని మరింత పెంచారు. మరోవైపు నీచమైన రీతిలో సాగుతున్న పోస్టులపై విమర్శలు చెలరేగడంతో జగన్ అండ్ కో రూటు మార్చింది. ఇప్పుడు ఆమెను 'చంద్రముఖి'లా అభివర్ణించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఆమెపై ఏ విధంగా దాడి చేయాలనే దానిపై ఏకంగా తాడేపల్లి ప్యాలెస్ వేదికగానే శిక్షణ ఇస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఏ రోజు ఎవరు ఏం మాట్లాడాలో, ఎలాంటి పోస్టులు పెట్టాలో అంశాలవారీగా అక్కడ తర్ఫీదు ఇస్తున్నట్లు సమాచారం. తాజా వ్యూహం ప్రకారం.. తెలంగాణలో వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలిగా ఉన్నప్పుడు షర్మిల కాంగ్రెస్‌పై చేసిన విమర్శలను తెరపైకి తెచ్చి, 'గంగ.. చంద్రముఖిగా మారిందంటూ' వికృత ప్రచారం చేసేందుకు సిద్ధమవుతున్నారు. మొన్నటి దాకా తెలంగాణలో కాంగ్రెస్‌పై ఆమె చేసిన విమర్శల క్లిప్పింగ్‌లు, వీడియోలను తెరపైకి తెస్తూ 'చంద్రముఖి' పేరిట విరుచుకుపడాలన్నది వారి వ్యూహం. తెలంగాణలో అన్ని మాటలు అని, ఆంధ్రకు వచ్చి ఇప్పుడు అదే పార్టీ పగ్గాలు చేపట్టి, ఇలా మాట్లాడుతున్నారంటూ ఎదురుదాడి చేయాలన్నది వారి ఆలోచన. 'చంద్రముఖి' పేరిట మొదలెట్టనున్న దాడి.. జగన్ సతీమణి భారతీ రెడ్డి డైరెక్షన్‌లోనే సాగనున్నట్లు షర్మిల భావిస్తున్నారని సమాచారం. భారతి డైరెక్షన్‌లో పురుడు పోసుకున్న ఈ వికృత ఆలోచనకు, సకల శాఖా మంత్రి సజ్జల, ఆయన కుమారుడు, వైసీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ భార్గవ స్క్రీన్‌ప్లే ఇచ్చి జనంలోకి వదలనున్నారని తన సన్నిహితుల వద్ద ఆమె ఆవేదన వ్యక్తంచేసినట్టు తెలిసింది.

మరి నాడు వారంతా అన్నదో...?

సహజంగా ఏ రాజకీయ పార్టీలో ఉంటే.. ఆ పార్టీ వైఖరికి అనుగుణంగా నేతలు మాట్లాడడం సహజం. ఇప్పుడు జగన్ వద్ద ఉన్న కొందరు మంత్రులు గతంలో వైఎస్‌ను, జగన్‌ను, విజయలక్ష్మిని విమర్శించినవారేనని రాజకీయ వర్గాలు గుర్తుచేస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్ర శాసనసభలో.. నాటి మంత్రి-పీసీసీ అధ్యక్షుడు, ఇప్పుడు జగన్ కేబినెట్‌లో మంత్రిగా ఉన్న బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. రాజశేఖర్‌రెడ్డి మరణించగానే జగన్ సీఎం పదవి కావాలని పట్టుబట్టారని.. తన బిడ్డకు ఆ పదవి కట్టబెట్టాలని సోనియాగాంధీని విజయలక్ష్మి కూడా వేడుకున్నారని.. వారసత్వంగా ఇవ్వడానికి ఇదేమైనా రాచరికమా అని నిలదీశారు. అలాగే రోజా టీడీపీలో ఉన్నప్పుడు నాటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. విడదల రజని కూడా టీడీపీలో ఉండగా.. జగన్‌ను రాక్షసుడితో పోలుస్తూ మాట్లాడారు. ఈ ముగ్గురికీ జగన్ తన కేబినెట్‌లో చోటు కల్పించడం గమనార్హం. తనపై తీవ్ర విమర్శలు చేసినవారిని పిలిచి పార్టీలో, ప్రభుత్వంలో చేర్చుకున్న జగన్.. సొంత చెల్లెలు తన కోసం చేసిన త్యాగాలను ఉద్దేశపూర్వకంగా విస్మరించి దాడులకు ఉసిగొల్పుతుండటంపై రాజకీయ విశ్లేషకులు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. అక్రమాస్తుల కేసులో ఆయన 16 నెలలు జైలులో ఉన్నప్పుడు.. వైసీపీని నిలబెట్టేందుకు షర్మిల ఊతకర్రగా మారారని.. పాదయాత్ర చేశారని.. విస్తృతంగా ఎన్నికల ప్రచారంలో కూడా పాల్గొన్నారని గుర్తుచేస్తున్నారు. చెల్లెలిని కించపరిచేలా సొంత నేతలు మాట్లాడుతుంటే.. సీఎం హోదాలో ఉన్న జగన్ నిలువరించకపోగా.. మరింత ఉసిగొల్పడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాదు.. జగన్ కూడా గతంలో కాంగ్రెస్‌లో ఉన్నవారే. కడప ఎంపీగానూ గెలిచారు. ఆ పార్టీకి మద్దతుగానూ మాట్లాడారు.

చెల్లికి భద్రత ఇవ్వకుండా..

రాష్ట్రంలో ఆడబిడ్డలకు అన్యాయం జరిగితే.. గన్ కంటే ముందు జగన్ వస్తాడంటూ మంత్రి ఆర్కే రోజా అసెంబ్లీలో ముఖ్యమంత్రిని ప్రశంసల్లో ముంచెత్తారు. కానీ షర్మిల తన ప్రాణాలకే హాని ఉందని మొరపెట్టుకున్నా.. జగన్ స్పందించలేదు. సర్వత్రా విమర్శలు రావడం, ఆమె కోర్టుకు వెళ్తారన్న అనుమానంతో నామ్‌కే వాస్తేగా 2+2 భద్రతను తాజాగా కల్పించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ షర్మిలపై ఈగవాలినా తానే కారణమని ప్రజలు భావిస్తారన్న భయంతోనే తూతూ మంత్రంగా రక్షణ కల్పించారని రాజకీయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.



సీఎం రేవంత్‌ను కలిసిన షర్మిల

హైదరాబాద్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. సోమవారం రేవంత్ నివాసంలో వారిద్దరు భేటీ అయ్యారు. ఈ భేటీ మర్యాద పూర్వకమే అయినా.. తెలుగు రాష్ట్రాల్లోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు వారి మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది. ఇదిలావుండగా... సినీ హీరో అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్‌రెడ్డి అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో ముఖ్యమంత్రిని కలిశారు. బీఆర్ఎస్ నుంచి నాగార్జున సాగర్ టిక్కెట్టును ఆశించిన ఆయన.. రేవంత్ రెడ్డిని కలవడం చర్చనీయాంశంగా మారింది.

ఏంటి మీరు చేసింది?



ఎమ్మెల్యే ప్లకార్డును చించివేస్తున్న విద్యార్థి, సదస్సుకు హాజరైన విద్యార్థినులు

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం 'విద్యార్థుల ప్రగతి మన జగనన్నతోనే సాధ్యం' పేరుతో సదస్సు నిర్వహించారు. అంతకుముందు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థినులతో పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి హాజరైన సదస్సు ప్రారంభం కాగానే విద్యార్థినులు ఒక్కొక్కరుగా ప్రసంగించడం మొదలుపెట్టారు. వైసీపీ ప్రభుత్వం, ఎమ్మెల్యేపై విమర్శలు గుప్పించారు. 'విద్యార్థులకు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకొంటున్నారే తప్ప.. మీరు చేసిందేముంది? నిరుద్యోగులకు ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా? ఏటా జాబ్ కేలెండర్ ఇస్తామన్నారు.. ఐదేళ్లు పూర్తి కావస్తున్నా ఒక్కసారైనా ఇచ్చారా?' అని నిలదీశారు. తోటి విద్యార్థినులు సైతం చప్పట్లతో మద్దతు పలకడంతో వైసీపీ నాయకుల మొహాలు తెల్లబోయాయి. పరిస్థితి చేయి దాటిపోతోందని గ్రహించిన ఎమ్మెల్యే అనుచరులు.. విద్యార్థినుల ప్రసంగాలను నిలుపుదల చేయించి, వారిని బయటకు పంపించేశారు. దీంతో ఆగ్రహించిన కొందరు విద్యార్థినులు అక్కడే ప్లకార్డులు చింపివేశారు. మరికొందరు చేతిలో ఉన్న ప్లకార్డులను విసిరికొట్టి, అక్కడినుంచి వెళ్లిపోయారు. ఈ పరిణామంతో సదస్సును అర్ధంతరంగా ముగించారు. చదువుకోవడానికి కళాశాలలకు వెళ్లిన తమ పిల్లలను సదస్సుకు తీసుకెళ్లడమేంటని తల్లిదండ్రులు మండిపడ్డారు. పిల్లలను ఎర్రటి ఎండలో తిప్పుతూ ఇబ్బంది పెడతారా అంటూ కళాశాలల యాజమాన్యాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎన్నికల కొల్లేరు

(మొదటి పేజీ తరువాయి)

అధికార పార్టీ నాయకులకు పట్టడం లేదు. కొల్లేరు అభయారణ్యంలో తవ్వకాలు, చేపలు, రొయ్యల చెరువులు చేపట్టకూడదన్న సుప్రీం కోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తున్నారు. నిషేధిత 5వ కాంటూరులో వందలాది ఎకరాలను ఎక్స్‌కవేటర్లతో తవ్వేస్తున్నారు. బయట వ్యక్తులు లోపలకు వెళ్లకుండా, లోపలి వ్యవహారాలను బయటకు పొక్కనీకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఫలితంగా దాదాపు వారంరోజుల నుంచి జిల్లాలోని మూడు మండలాల పరిధిలోని పైడిచింతపాడు, మల్లవరం, లక్ష్మీపురం, చెట్టున్నపాడు, కొల్లేటి కోట తదితర గ్రామాల్లో భారీ తవ్వకాలు జరుగుతున్నాయి.

ఇదీ నేపథ్యం...

ఇటీవలే 'ఎర్రి...' మంత్రి తన కుమారుడికి పార్లమెంటు అభ్యర్థిత్వాన్ని ఖాయం చేయించుకున్నారు. ఎన్నికల ఖర్చు కోసం ఇప్పటినుంచే రెండు చేతులా సంపాదించేందుకుగాను కొల్లేరుపై కన్నేశారు. అక్రమ తవ్వకాలకు తెర తీసిన కారణం ఇదేనని చెబుతున్నారు. తవ్వకాలు చేపట్టిన ప్రతి మండలంలోనూ ఒక్కో రైతు నుంచి ఎకరాకు రూ. 50 వేలు వసూలు చేసిన నేతలు, ఇప్పటికే కోట్లాది రూపాయలు దండుకున్నారు. భీమడోలు మండలంలో 300 హెక్టార్లలో, ఏలూరు రూరల్ మండలంలో 220 హెక్టార్లు, మరో మండలంలో మరికొన్ని హెక్టార్లలో..ఇలా వందలాది ఎకరాల కొల్లేరు భూములను ఎడాపెడా తవ్వేస్తున్నారు. తమ అక్రమ తవ్వకాలపై కలెక్టర్, ప్రిన్సిపల్ సెక్రటరీలకు సమాచారం అందకుండా జాగ్రత్తలు పడుతున్నారు. తొలుత రెండు గ్రామాల్లో చడీచప్పుడు కాకుండా మొదలైన తవ్వకాలు...క్రమేణా ఇతర గ్రామాలకూ చేరాయి.

బ్లాస్టింగ్ చేసిన చెరువుల్లో...

అప్పటి సీఎం వైఎస్ హయాంలో కొల్లేరులోని ఆక్రమిత చెరువులను బాంబులతో పేల్చేశారు. తదనంతరకాలంలో ఆయన కుమారుడు వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చింది మొదలు కొల్లేరు అక్రమ తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. పరోక్షంగా, ప్రత్యక్షంగా అధికార పార్టీ నాయకులే తవ్వకాలు నడిపిస్తున్నారని సమాచారం. అప్పట్లో బ్లాస్టింగ్ జరిపిన భూముల్లోనే 'ఎర్రి...' మంత్రి ప్రస్తుతం తవ్వకాలు చేయిస్తుండటం గమనార్హం. వాస్తవానికి ఈ తవ్వకాలకు 2019 నాటి ఎన్నికల సమయంలోనే బీజం పడింది. అప్పట్లో అభ్యర్థులుగా బరిలో ఉన్న పలువురు నాయకులు రైతులకు కొల్లేరుపై హామీలు ఇచ్చారు. ఆయా భూముల్లో తిరిగి తవ్వకాలు జరిపించి ఆక్వా కల్చర్‌ను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. అప్పట్లో బ్లాస్టింగ్ జరిగిన తావులను తిరిగి చెరువులుగా అభివృద్ధి చేయిస్తామని రైతులకు నమ్మబలికారు. ఆశ కొద్దీ కొల్లేరు లంక గ్రామాల ప్రజలు గంపగుత్తగా తమ ఓట్లన్నీ వైసీపీకి వేశారు. గడిచిన నాలుగున్నరేళ్లుగా తవ్వకాలకు ముహూర్తం కుదరలేదు. దీంతో హామీలు పొందిన రైతుల నుంచి వ్యతిరేకత మొదలైంది. కొద్ది కాలంగా ఆ వ్యతిరేకత కాస్తా ఆగ్రహంగా మారడంతో దాదాపు ఆరు నెలలు క్రితం తవ్వకాలను మొదలుపెట్టారు. ఒక్కో ఎకరానికి రేటు కట్టి మరీ వసూళ్లు చేసుకున్నారు. వాస్తవానికి సంబంధిత భూముల్లో కొన్ని పట్టా భూములున్నా, అందులో వ్యవసాయానికి మినహా చేపల, రొయ్యల చెరువులు సాగు చేయడానికి వీల్లేదని అప్పట్లోనే సుప్రీం కోర్టు ఆదేశించింది. అయినా సరే అవే భూముల్లో ప్రస్తుతం యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. అందులో భాగంగానే లక్ష్మీపురంలోని 300 ఎకరాలు, పైడిచింతపాడులో 150, మల్లవరంలో మరో 100 ఎకరాల్లో తవ్వకాలు జరుగుతున్నాయి.

అధికారుల ఆమ్యామ్యా...

కొల్లేరులో అక్రమ తవ్వకాలపై అధికారులకు సమాచారమున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. దాదాపు వారం నుంచి జరుగుతున్న తవ్వకాలకు సాక్షాత్తు అటవీశాఖలోని ఓ ఫారెస్ట్ రేంజర్ సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. ప్రస్తుతం భీమడోలు మండలంలోని పలు గ్రామాలతోపాటు పైడిచింతపాడులో పలు ఎక్స్‌కవేటర్లు రోడ్లపైనే తిరుగుతున్నా, ఏ ఒక్క అధికారి కూడా ఆయా వాహనాల వ్యవహారాలపై ఆరా తీయడంలేదు. అటవీశాఖకు చెంది, పదేళ్లుగా కొల్లేరు రేంజర్‌లో పనిచేస్తోన్న ఓ అధికారి... తనకున్న రాజకీయ పలుకుబడితో నిజాయితీగా పనిచేసే ఇతర అధికారులను బదిలీ చేయిస్తున్నారు. ఆయన బదిలీపై ఏ శాఖకు, ఏ ప్రాంతానికి వెళ్లినా, తిరిగి కొల్లేరులోనే పోస్టింగు వేయించుకుంటూ అక్కడ పూర్తి ఆధిపత్యం చెలాయిస్తున్నారు. అధికారులను మేనేజ్ చేయడం నుంచి రైతుల నుంచి వసూళ్ల కార్యక్రమం వరకు ఆయన ప్రమేయం ఉందని విశ్వసనీయ సమాచారం. స్థాయిని బట్టి ఒక్కో అధికారికి ముట్టజెప్పాల్సిన ఆమ్యామ్యాలను ఆయనే దగ్గరుండి పంపకాలు చేయించారని సమాచారం. అక్రమ తవ్వకాలు జరుగుతున్న ఊళ్లల్లోకి కొత్త వ్యక్తులు ఎవరు వెళ్లినా, సమాచారం చేరవేసేలా పకడ్బందీ ఏర్పాట్లు చేసుకున్నారు. తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలకు ముందే కాపలా ఏర్పాటు చేసుకున్నారు. కొత్త వారు వస్తే తిరిగి ప్రాణాలతో వెనక్కు వెళ్లడం అక్కడ అసాధ్యమని చెబుతున్నారు.



చేవెళ్లలో పట్టుబడిన గంజాయి, నిందితులు

రూ.46 లక్షల విలువైన 173 కిలోల

గంజాయి పట్టివేత

- మహేశ్వరం, చేవెళ్లలో స్వాధీనం
- ఐదుగురి అరెస్టు, పరారీలో మరో ఆరుగురు

మహేశ్వరం/చేవెళ్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, చేవెళ్ల ప్రాంతాల్లో గంజాయి ముఠాలు పట్టుబడ్డాయి. ఆ ముఠాల నుంచి రూ.46లక్షల విలువైన 173కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మహేశ్వరం పోలీసులు ఆదివారం శ్రీశైలం-హైదరాబాద్ రహదారిపై 109 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.30లక్షలు ఉంటుందని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి సోమవారం తెలిపారు. ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా నుంచి మెదక్ జిల్లాకు ఆటోలో గంజాయిని తరలిస్తుండగా మహేశ్వరం గేటు వద్ద గంజాయిని పట్టుకున్నట్టు తెలిపారు. ఆటోలో ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపూర్ మండలం తుమ్మలచెరువుకు చెందిన సోమ రాకేశ్ రెడ్డి, తాటి చంటిబాబును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఇదే కేసులో తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కోర లోకేశ్, మెదక్ జిల్లాకు చెందిన బాణావత్ రాహుల్ పరారీలో ఉన్నారని తెలిపారు. లోకేష్, రాహుల్ గంజాయి వ్యాపారం చేస్తుంటారని, రాకేశ్‌రెడ్డి, చంటిబాబు మధ్యవర్తులుగా ఉంటూ ఆటోలో గంజాయి తరలిస్తారన్నారు. మరో ఘటనలో సోమవారం చేవెళ్లలో పోలీసులు గంజాయి ముఠా నుంచి రూ.16 లక్షల విలువైన 64కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన చిత్ర కైలాస్‌మోహితే, నౌనాథ్ గణ్పత్‌చౌహాన్, మాధన్ బాలసాహెబ్‌బయస్, రాజేష్ సుభాష్‌మొహితే, రేఖ, మనోజ్ సింగ్వీ, లాము పాలాలీ గంజాయిని ఒడిశాలోని బ్రహ్మపూర్ నుంచి తెచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తుంటారు. మహారాష్ట్రలో ఎక్కువ ధరకు గంజాయి అమ్మేందుకు నగరం నుంచి బయల్దేరారు. ఈ క్రమంలో చేవెళ్లలోని శంకర్‌పల్లి చౌరస్తాలో మహారాష్ట్రకు వెళ్లే లారీల కోసం ఎదురుచూస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు చౌరస్తాకు చేరుకొని గంజాయితో ముగ్గురు పట్టుకోగా నలుగురు పారిపోయారు. వారి నుంచి 64కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. చిత్రకైలాస్, నౌనాథ్ గణ్పత్, మాధన్‌లను రిమాండ్‌కు తరలించారు.

నెల్లూరులో సీమ మంత్రి దోపిడీ

- క్వార్ట్జ్ కొండలను మింగేస్తున్న 'పెద్ద' నేత
- 2 నెలల్లోనే రూ.150 కోట్లు అక్రమార్జన
- రోజూ చెన్నైకి తెల్లరాయి తరలించి సొమ్ము
- ఇంతకుముందే సైదాపురంపై పెద్ద గద్దల పాగా
- లీజుదారులను బెదిరించి వైసీపీ నేతల దోపిడీ
- అందరూ కలసి రోజూ 5-7 కోట్లు జేబులోకి

(నెల్లూరు-ఆంధ్రజ్యోతి)

రాయలసీమకు చెందిన ఓ 'పెద్ద' మంత్రి చూపు నెల్లూరు జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలోని సైదాపురం మీద పడింది. ఈ ప్రాంతంలో నిక్షిప్తమై ఉన్న క్వార్ట్జ్(తెల్లరాయి) కోట్లు కురిపిస్తోందన్న విషయం తెలుసుకున్న ఆయన నిమిషం కూడా ఆగలేకపోయారు. వెంటనే తన మందీ మార్బలాన్ని సైదాపురం మండలం జోగుపల్లి, తలుపూరు ప్రాంతాల్లో దించేశారు. ఆ పరిసర ప్రాంతాలను వారు జల్లెడపట్టి తెల్లరాయి నిక్షిప్తమై ఉన్న మూడు క్వారీలను స్వాధీనం చేసుకున్నారు. రేయింబవళ్లు భారీ యంత్రాలతో కుల్లబొడిచేస్తూ ప్రజా సంపదను ఎడాపెడా దోచుకొంటున్నారు. ప్రభుత్వానికి పైసా కట్టకుండా, రోజూ కోట్ల రూపాయలను కొల్లగొట్టేస్తున్నారు. చాలా సులభంగా సంపాదించే మార్గం అనుకున్నారేమో కానీ వైసీపీకి చెందిన ఘరానా నాయకులు ఇంతకుముందే సైదాపురం మండలంపై పడి కొండలు, గుట్టలను కరిగించేస్తున్నారు. అసలైన లీజుదారులను బెదిరించి తరిమేశారు. నెల్లూరు జిల్లాకు చెందిన వైసీపీ నాయకులు తాడేపల్లికి కప్పం కడుతూ జిల్లా పరిధిలోని మొత్తం క్వార్ట్జ్ క్వారీలను అనధికారికంగా కైవసం చేసుకున్నారు. ఈ క్రమంలోనే రాయలసీమ ప్రాంతానికి చెందిన ఆ అమాత్యుడి కన్ను ఈ మండలంపై పడింది. తన సైన్యాన్ని దింపి జోగుపల్లి గ్రామ పరిధిలో 2, తలుపూరు గ్రామ పరిధిలో ఒక క్వారీని స్వాధీనం చేసుకున్నారు. ఈ మూడు క్వారీల విస్తీర్ణం సుమారుగా 25 ఎకరాలు ఉంటుంది. ఈ మూడూ అనుమతులు లేని క్వారీలే. సదరు మంత్రి కీలక నాయకుడు కావడంతో అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు.

రెండు నెలల్లో రూ.150 కోట్లు!?

మంత్రి గత రెండు నెలల్లో ఈ మూడు మైన్ల ద్వారా రూ.150 కోట్ల విలువైన తెల్లరాయిని కొల్లగొట్టినట్లు అంచనా. అసలు తెల్లరాయి లీజుదారుల సమాచారం ప్రకారం.. సైదాపురం మండలం జోగుపల్లి, తలుపూరు ప్రాంతాల్లోని మూడు క్వారీల నుంచి రోజుకు 20 లోడ్ల తెల్లరాయి తవ్వి చెన్నైకి తరలిస్తున్నారు. ఒక్కో లారీకి 35 టన్నుల చొప్పున రోజుకు 700 టన్నులు రవాణా చేస్తున్నారు. ఈ క్వారీల్లో లభ్యమయ్యే తెల్లరాయి ధర టన్ను 36 వేల రూపాయలు. ఈ లెక్క ప్రకారం రోజుకు సుమారు 2.50 కోట్ల విలువైన తెల్లరాయిని ప్రభుత్వానికి పైసా పన్ను చెల్లించకుండా తవ్వుకుపోతున్నారు. గత రెండు నెలలుగా ఈ దందా సాగుతున్నట్లు చెబుతున్నారు.

సులభంగా సంపాదన

ఒకప్పుడు కోటి రూపాయలు సంపాదించాలంటే చాలా రోజుల సమయం పట్టేది. ఏదైనా ఒక కాంట్రాక్టు పని చేపట్టాలంటే అర్హత ఉండాలి. టెండర్లు దక్కించుకోవాలి. ఆ తరువాత పెట్టుబడి పెట్టి ఆ పనిని పూర్తి చేయాలి. బిల్లులు చేతికందిన తరువాతే ఎంత లాభం వచ్చిందో తెలుస్తుంది. వంద కోట్ల రూపాయల విలువైన ఓ కాంట్రాక్టు తీసుకుని ఎంత వేగంగా పని చేసినా, ఆ పని పూర్తి అయి బిల్లులు చేతికందడానికి నెలల సమయం పడుతుంది. భారీ పెట్టుబడి పెట్టి, అంతకష్టపడినా 10 శాతం లాభం రావచ్చు. ఇంత కష్టం ఎందుకు సైదాపురం తెల్లరాయి కొల్లగొడితే చాలు తక్కువ ఖర్చుతో, రోజూ కోట్లలో ఆదాయం పొందొచ్చని వైసీపీ పెద్దలు భావించినట్లున్నారు.

ఒకరితో మొదలై..

ఒకరితో మొదలైన సైదాపురం తెల్లరాయి దోపిడీని సలహాదార్లు, ఆ తరువాత ఎమ్మెల్యేలు, ఇప్పుడు మంత్రుల వరకు సాగిస్తున్నారు. కేవలం ఈ ఒక్క మండల పరిధిలోనే మంత్రి వర్గీయులతో సహా మిగిలిన వైసీపీ నాయకులందరూ కలిసి రోజుకు 5 నుంచి 7 కోట్ల రూపాయల విలువైన తెల్లరాయిని కొల్లగొట్టి సొమ్ము చేసుకొంటున్నారు. ప్రతిపక్షాలు, ప్రజలు, నిజమైన క్వారీ లీజుదారులు గుండెలు బాదుకొంటున్నా, నిరసనలు వ్యక్తం చేస్తున్నా దోపిడీకి అడ్డుకట్ట పడటం లేదు. జిల్లా ఉన్నతాధికారులు, మైనింగ్ శాఖ రాష్ట్ర అధికారులు కళ్లకు గంతలు కట్టుకుని, చెవుల్లో పత్తులు పెట్టుకొని చేతులు కట్టుకొని కూర్చున్నారు.

సీఎం జగన్‌ను ప్రతివాదిగా కొనసాగించాల్సిందే!

- ప్రభుత్వ విధాన నిర్ణయాలన్నీ ఆయనవే
- వాటిద్వారా భారీగా లబ్ధి పొందిందీ ఆయనే
- ప్రతివాదిగా తొలగించాలన్న అభ్యర్థన కొట్టివేయండి
- హైకోర్టులో ఎంపీ రఘురామ రిప్లయ్ కౌంటర్
- అది మొన్న రాత్రే అందిందన్న సీఎం తరపు న్యాయవాది
- విచారణ ఎల్లుండికి వాయిదా

అమరావతి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తాను దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంలో ముఖ్యమంత్రి జగన్‌ను ప్రతివాదిగా కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైసీపీ ఎంపీ రఘురామకృష్ణంరాజు హైకోర్టును కోరారు. తన హోదాను దుర్వినియోగం చేసి ఆయన వ్యక్తిగత లబ్ధి పొందారని పేర్కొన్నారు. కీలక విధాన నిర్ణయాలన్నీ ఆయనవేనని, భారీగా లబ్ధి పొందింది కూడా ఆయనేనని.. అందువల్ల తనను ప్రతివాదిగా తొలగించాలన్న అభ్యర్థనను తిరస్కరించాలని విజ్ఞప్తి చేశారు. సీఎం జగన్, ఆయన ఆప్తులకు అనుచిత లబ్ధి చేకూర్చేలా వైసీపీ ప్రభుత్వం రూపొందించిన వివిధ పాలసీలు, తీసుకున్న నిర్ణయాలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని.. ముఖ్యమంత్రి, బంధుగణంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు నిర్వహించాలని కోరుతూ రఘురామకృష్ణంరాజు హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా.. దాని విచారణార్హతపై రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. దీంతో పిల్ విచారణార్హతను తేలుస్తామని ధర్మాసనం పేర్కొంది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. విచారణార్హత పై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. సోమవారం ఈ వ్యాజ్యం విచారణకు రాగా.. రఘురామ తరపు సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు స్పందిస్తూ.. వ్యాజ్యంలో మెజారిటీ ప్రతివాదులు కౌంటర్లు వేశారని.. వాటికి తాము కూడా రిప్లయ్ కౌంటర్ దాఖలు చేశామని తెలిపారు. వాదనలు వినిపించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. జగన్ తరపు న్యాయవాది వివేక్ చంద్రశేఖర్ స్పందిస్తూ.. పిటిషనర్ దాఖలు చేసిన రిప్లయ్ కౌంటర్ తమకు ఆదివారం రాత్రి 10 గంటలకు అందిందని, దానిని పరిశీలించి వాదనలు వినిపించేందుకు సమయం ఇవ్వాలని కోరారు. అందుకు అంగీకరించిన ధర్మాసనం విచారణను గురువారాని(15వ తేదీ)కి వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన ధర్మాసనం ఆదేశాలిచ్చింది. ఆ రోజు సదరు పిల్ విచారణార్హతపై వాదనలు వింటామని స్పష్టం చేసింది.

రఘురామ కౌంటర్‌లో ఏముందంటే..

'రాజకీయ దురుద్దేశంతో పిల్ దాఖలు చేశానన్న ఆరోపణల్లో వాస్తవం లేదు. లోక్‌సభ సభ్యత్వానికి నన్ను అనర్హుడిగా ప్రకటించాలని వైసీపీ.. స్పీకర్‌కు ఫిర్యాదు చేయడం నిజమే. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ నిబంధనలు నాకు వర్తించనందునే స్పీకర్ ఇప్పటివరకు అనర్హతపై నిర్ణయం తీసుకోలేదు. జగన్ నన్ను శత్రువుగా చూస్తున్నారు తప్ప.. నేనెప్పుడూ ఆయన్ను శత్రువుగా చూడలేదు. రాజ్యాంగంలోని అధికరణ 19(1) ప్రకారం అసమ్మతి తెలియపరచడం ప్రాథమిక హక్కు. జగన్మోహన్‌రెడ్డి బెయిల్ రద్దు చేయాలని తెలంగాణ హైకోర్టులో నేను పిటిషన్ దాఖలు చేసింది నిజమే. ఆయన 11 సీబీఐ, 7 ఈడీ కేసుల్లో ప్రథమ నిందితుడిగా ఉన్నారు. ప్రస్తుతం బెయిల్‌పై ఉన్న ఆయన కేసుల విచారణకు హాజరుకావడం లేదు. కేసుల్లో సహచర నిందితులుగా ఉన్న అధికారులు, వ్యక్తులను ప్రస్తుత ప్రభుత్వ పరిపాలనలో భాగస్వాములను చేసి కీలక పదవులు కట్టబెట్టారు. ఇది సాక్షులను ప్రభావితం చేయడం తప్ప మరొకటి కాదు. వాస్తవాలు దాచి పిల్ దాఖలు చేశానన్న ఆరోపణల్లో నిజం లేదు. ప్రస్తుత కేసు విచారణ నిమిత్తం అవసరమైన.. నాపై నమోదైన కేసుల వివరాలను వెల్లడించాను. పిల్ రూల్స్ ప్రకారం పెండింగ్ కేసులన్నిటినీ ప్రస్తావించాల్సిన అవసరం లేదు. ఈ నేపథ్యంలో పిల్ విచారణార్హతపై ప్రాథమిక అభ్యంతరాలు లేవనెత్తుతూ ముఖ్యమంత్రి వేసిన కౌంటర్‌ను కొట్టివేయండి' అని రఘురామ తన రిప్లయ్‌లో కోరారు.

అధికారమే లక్ష్యంగా నేతల కుప్పిగంతులు

- నోటిఫికేషన్‌కు ముందు రోజు పార్టీ మారుతున్నారు: జస్టిస్ ఎన్వీ రమణ



ఎన్వీ రమణ

విజయవాడ(లబ్బీపేట), ఫిబ్రవరి 12: 'నేడు కుప్పిగంతుల రాజకీయాలు బాగా పెరిగిపోయాయి. ప్రస్తుతం చాలా విచారకరమైన రాజకీయాలు నడుస్తున్నాయి' అని మాజీ సీజేఐ ఎన్వీ రమణ అన్నారు. నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రస్తుత రాజకీయాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. 'నాలుగు సంవత్సరాల 11 నెలల రెండు రోజులు ఒక పార్టీలో అధికారంలో ఉంటున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే ఒక్క రోజు ముందు పార్టీ మారి మరలా గెలవబోయే పార్టీలో చేరుతున్నారు. మరలా అధికారం అనుభవించడానికి సిద్ధపడుతున్న దుర్మార్గమైన పరిస్థితి సమాజంలో ఉంది. ప్రజాదరణ, ప్రజామద్దతు లేకపోయినా రాజకీయ పార్టీలు, నేతలు వారిని డబ్బు సంచులతో అక్కున చేర్చుకోవడం దురదృష్టకరం. అధికారమే లక్ష్యంగా కుప్పిగంతులు వేసే నాయకులకు బుద్ధి చెప్పాలి. ముందు ముందు ఎటువంటి పెడదోవలు చూడాలో అని ఆవేదన కలుగుతుంది' అని జస్టిస్ రమణ అన్నారు.

అదుపులోకి రాని అతిసార వ్యాధి

- మరో 35 మంది ఆస్పత్రికి.. ఇద్దరి పరిస్థితి విషమం.. మణిపాల్‌కు తరలింపు
- కలుషిత జలమే కారణం కావొచ్చన్న వైద్య ఆరోగ్య శాఖ
- నిర్ధారణకు ల్యాబ్‌కు శాంపిల్స్ తరలింపు



రోగులను పరామర్శిస్తున్న మంత్రి రజిని, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 12: గుంటూరులో అతిసార వ్యాధి బాధితులు పెరుగుతూనే ఉన్నారు. సోమవారం కూడా 35 మంది బాధితులు జీజీహెచ్‌లో చేరారు. దీంతో ఇప్పటివరకు ఆస్పత్రిలో చేరిన రోగుల సంఖ్య 75కు చేరింది. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడలోని మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. కోలుకున్న 15 మందిని ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. మరోవైపు అతిసారం కేసుల తీవ్రతకు కలుషిత నీరే కారణమని వైద్య ఆరోగ్య అనుమానిస్తోంది. మనిషి మల, మూత్రాలతో కలుషితమైన వ్యర్థ జలాల్లో ఈకోలి బ్యాక్టీరియా దాగి ఉంటుంది. ఈవిధంగా కలుషితమైన నీటిని తాగితే తీవ్రమైన వాంతులు, విరేచనాలతో అతిసార కాటు వేస్తుంది. గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో చికిత్స పొందుతున్న అతిసార బాధితులను సోమవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, వైద్య విద్య సంచాలకులు నరసింహం పరామర్శించారు. అనంతరం కృష్ణబాబు మీడియాతో మాట్లాడుతూ కలుషిత జలాలే అతిసార ప్రబలేందుకు కారణమని భావిస్తున్నట్లు తెలిపారు. దీనిని నిర్ధారించేందుకు రోగుల నుంచి శాంపిల్స్ సేకరించి, పరీక్షల కోసం పంపినట్లు చెప్పారు. మరో 24 గంటల్లో ఈ నివేదిక అందుతుందన్నారు. కాగా, సోమవారం కూడా 35 మంది డయేరియా బాధితులు జీజీహెచ్‌లో చేరారు. దీంతో ఇప్పటివరకు ఆస్పత్రిలో చేరిన రోగుల సంఖ్య 75కు చేరింది. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో మరింత మెరుగైన వైద్యం కోసం విజయవాడ సమీపంలోని మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. కోలుకున్న 15 మందిని ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు.

బాబు బెయిల్ రద్దుపై సుప్రీం విచారణ 26కి వాయిదా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌డెప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆంధ్ర హైకోర్టు మంజూరు చేసిన బెయిల్‌ను రద్దు చేయాలంటూ రాష్ట్రప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ వాయిదాపడింది. ఈ పిటిషన్ సోమవారం జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన ధర్మాసనం ముందుకు వచ్చింది. చంద్రబాబు తరపు సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే హాజరుకాలేకపోవడంతో విచారణ వాయిదా వేయాలని ఆయన తరపున మరో సీనియర్ లాయర్ సిద్ధార్థ లూథ్రా అభ్యర్థించారు. సాధ్యమైనంత త్వరగా విచారణ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ తరపు సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్ కోరారు. అనంతరం ధర్మాసనం విచారణను ఈ నెల 26వ తేదీకి వాయిదా వేసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

కృష్ణలంక సర్వీసురోడ్డుపై ఆక్రమణలు

'కొండ'ంత అండ ప్రజాప్రతినిధులే...!

- మార్జిన్ లైను దాటి మరీ ముందుకు..
- వీఎంసీ, ట్రాఫిక్ పోలీసులకు కనిపించని వైనం
- మంత్రి జోగి ఫిర్యాదు చేసినా స్పందన కరువు
- తూతూమంత్రంగా వచ్చి రెండు బడ్డీలు తీసి పోలీసుల హడావిడి
- అధికారులు 'చేతులు తడపందే' వ్యాపారానికి వీల్లేదు!


సర్వీసురోడ్డులో ఆక్రమణలు

కృష్ణలంక: కృష్ణలంక సర్వీసురోడ్డులో సత్యం హోటల్ సెంటర్ నుంచి ఎం.హోటల్ సెంటర్ వరకు రోడ్డుకిరువైపులా ఆక్రమణదారులతో వాహనచోదకులకు నరకం కనిపిస్తోంది. కొందరు ఉదయం నుంచి రాత్రి వరకు వ్యాపారాలు చేస్తుంటే, మరికొందరు సాయంత్రం నుంచి రాత్రి వరకు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. ప్రతి ఆక్రమణదారుడి వెనుక ఓ ప్రజాప్రతినిధి ఉంటారనేది బహిరంగ రహస్యం. వారే వీరికి 'కొండ'ంత అండ. వీరిని కదిపితే వెంటనే మున్సిపల్, పోలీసు అధికారులు, సిబ్బందికి ఫోన్లు వెళ్లిపోతాయి. దీంతో వారు ఆడిందే ఆట...పాడింది పాట. సర్వీసురోడ్డును అడ్డాగా చేసుకొని మరీ అక్రమ వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో ప్రజలు గుడిగూడటం, అక్కడే తినుబండారాలు తినడం, రోడ్డుపైనే అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపేయడంతో సర్వీసురోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.

మంత్రి ఫిర్యాదు చేసినా స్పందన కరువు

మంత్రి జోగి రమేష్ ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల మధ్య కృష్ణలంక సర్వీసురోడ్డు మీదుగానే తన పోలీసు కాన్వాయ్‌తో వెళ్తుంటారు. సర్వీసురోడ్డులో ఉన్న రద్దీని చూసిన ఆయన కొద్దిరోజుల క్రితం పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే ట్రాఫిక్ పోలీసులు ఒక వ్యాన్‌తో వచ్చి రెండు, మూడు బడ్డీలు అందులో ఎక్కించి మ.మ అనిపించారు. తప్పితే ఆక్రమణలను పూర్తిగా తీయించలేదు.

ఫుడ్ పాయిజన్ అయితే..!

తోపుడు బండ్లపై చేస్తున్న వ్యాపారాలు నూడిల్స్, పానీపూరీ, చికెన్ పకోడీ, చికెన్ బిర్యానీ స్టాల్స్, టిఫిన్ బండ్లు, కర్రీ పాయింట్స్ ఇలా ఒకటేమిటి తినుబండారాలతో చేసే వ్యాపారాలు ఒక్కదానికీ ఫుడ్ లైసెన్సులుండవు. పొరపాటున ఖర్మకాలి వినియోగదారుడికి ఫుడ్ పాయిజన్ అయితే ఇక ఇంతే సంగతులు. దీనికెవరు బాధ్యత వహిస్తారు. ఇలాంటి ప్రమాదమేదైనా జరిగితే కానీ పోలీసులు కానీ, వీఎంసీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు కానీ కళ్లు తెరవరనే విమర్శలు వినిపిస్తున్నాయి.

'సలాం' చేయకుంటే షాపు మూతే..!

స్థానిక ప్రజాప్రతినిధులు సాయంత్రం సమయాల్లో బైక్‌పై తిరుగుతుంటారు. 'వ్యాపారలావాదేవీల్లో మునిగి పొరపాటున వీరిరాకను గుర్తించకపోయినా, సలాం పెట్టకపోయినా, మర్యాదలు చేయకపోయినా' మరునాడు షాపు మూతబడాల్సిందే. 'ప్రొటోకాల్ తెలియదా' అంటూ బక్కప్రాణులపై ప్రతాపం చూపిస్తుంటారు. ఇప్పటికైనా పోలీసులు, మున్సిపల్ అధికారులు ఆయా ఆక్రమణలను తొలగించి వాహనచోదకులకు, పాదచారులకు ఇబ్బంది లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

వీడని ప్రతిష్టంభన

- అవిశ్వాసానికి ఇరువర్గాల గైర్హాజరు
- మరోసారి నోటీసుకు అవకాశం
- 15న డైరెక్టర్ల బోర్డు సమావేశంపైనే అందరి దృష్టి

విజయవాడ-ఆంధ్రజ్యోతి: గాంధీ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంకు వ్యవహారం మరింత ముదురుతోంది. సోమవారం జరగాల్సిన అవిశ్వాస తీర్మాన సమావేశం ఇరువర్గాల గైర్హాజరుతో జరగలేదు. దీంతో నిర్ణీత సమయం వరకు వేచిచూసిన సహకారశాఖ అధికారులు తర్వాత వెళ్లిపోయారు. అధికారులు మరోసారి నోటీసు ఇచ్చే అవకాశం ఉంది. మరోవైపు ఈ నెల 15న డైరెక్టర్ల బోర్డు సమావేశం జరగనుంది. మెజారిటీ డైరెక్టర్లు చైర్మన్‌ను వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఈ సమావేశం ఎలా జరగనుందనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. చైర్మన్ వ్యతిరేక కూటమికి అవసరమైన ఒక్క డైరెక్టర్ బలం లేకపోవడంతో వారు సోమవారం నాటి సమావేశానికి దూరంగా ఉండిపోయారు. అయితే ఇకపై జరిగే సమావేశాల్లో చైర్మన్ వేమూరి వెంకట్రావుకు సహాయ నిరాకరణ చేయాలని అసమ్మతి డైరెక్టర్లు నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా 15న జరిగే బోర్డు సమావేశాన్ని దీనికి వేదికగా ఎంచుకున్నారు. రిజర్వ్ బ్యాంకు అనుమతి లేకుండా విశాఖ గాజువాకలో కొత్త బ్రాంచ్ ఏర్పాటు నిర్ణయాన్ని అజెండాలో చేర్చడం, తీవ్రమైన అభియోగాలు ఎదుర్కొంటున్న సీఈవోపై చర్చకు తామిచ్చిన అంశాన్ని అజెండాలో చేర్చకపోవడంపై వీరు సమావేశంలో తాడోపేడో తేల్చుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. చైర్మన్ వ్యతిరేక వర్గానికి చెందిన ఏడుగురు డైరెక్టర్లు సోమవారం సమావేశమై భవిష్యత్తులో వ్యవహరించాల్సిన విధానంపై చర్చించారు. చైర్మన్ ఏకపక్ష నిర్ణయాలపై గట్టిగా పోరాడాలని నిర్ణయించుకున్నారు. ఖాతాదారులకు రుణాల మంజూరు, షేర్లు, ఉద్యోగుల రుణాలు తదితర అంశాలు మినహా మరే అంశంలోనూ చైర్మన్‌కు సహకరించరాదని ఏకాభిప్రాయానికి వచ్చారు. ఈనెల 15న జరిగే బోర్డు సమావేశంలో పాల్గొని సీఈవో అవినీతిపై చర్చకు గట్టిగా పట్టుబట్టడంతోపాటు చైర్మన్ ప్రవేశపెట్టిన అజెండాను వ్యతిరేకించాలని నిర్ణయించారు.


సుమన్, భానుచందర్‌ను సత్కరిస్తున్న నేతలు

నగరంలో సుమన్, భానుచందర్ సందడి

ఆటోనగర్ (పెనమలూరు), ఫిబ్రవరి 12: సామాజిక సేవా రంగంలో ఇటీవల డాక్టరేట్ పొందిన కలాం బ్యాటరీస్ అధినేత, ఆటో ఎలక్ట్రికల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ అబ్దుల్ కలాంను సీనియర్ కథానాయకులు సుమన్, భానుచందర్ అభినందించారు. సోమవారం ఆటోనగర్ వందడుగుల రోడ్డులోని డాక్టర్ కలాం బ్యాటరీ షోరూంలో వారు ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు. నగరంలో ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొన్న వారు ఆటోనగర్ విచ్చేసి కలాంను అభినందించారు. ఆటోనగర్ వచ్చిన సీనియర్ నటులను డాక్టర్ కలాం సన్మానించారు. ఐలా చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్, డిస్పోజల్ అసోసియేషన్ గౌస్‌ఖాన్, బాజీ షరీఫ్, కొండ, ఖాదర్, వెంకటేశ్వరరెడ్డి, ఆటోనగర్ కోఆపరేటివ్ స్టోర్స్ మాజీ అధ్యక్షుడు కత్తిక శివనాగేశ్వరరావు, జమాక్ అధ్యక్షుడు త్రిపురనేని హనుమాల్ నాగచంద్, జమాక్ గౌరవాధ్యక్షుడు సుంకాని వెంకట త్రినాథ్, ఎఫ్ఐపీ సెక్రటరీ బెవర నాగేశ్వరరావు, బాహుబలేంద్ర కోటేశ్వరరావు, కొమ్మిడి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పేట్రేగిపోతున్న అరాచకాలు

- కృష్ణలంకలో వరుస సంఘటనలతో భీతిల్లుతున్న స్థానికులు

కృష్ణలంక, ఫిబ్రవరి 12: కృష్ణలంకలో ఆకతాయిల అరాచకాలు పేట్రేగిపోతున్నాయి. కొద్దిరోజులుగా వరుస సంఘటనలతో అసలు పోలీసు వ్యవస్థ పనిచేస్తోందా అన్న అనుమానాలు కలుగుతోంది. 15రోజుల క్రితం కృష్ణలంక ఎం హోటల్ వద్ద ఒక బడ్డీకొట్టు యజమానిని అప్పు ఇవ్వనందుకు ఆగ్రహించిన నిందితుడు అతడిపై పెట్రోలు పోసి నిప్పంటించడంతో 4 రోజుల అనంతరం బడ్డీకొట్టు యజమాని మృతిచెందాడు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని పోలీసులు గుర్తించి కేసు నమోదు చేశారు. సిటీ బస్టాండ్ సమీపంలో గంగోత్రి హోటల్ వద్ద వెనుక వస్తున్న ద్విచక్రవాహనదారుడు హారన్ కొట్టడంతో, ముందువెళ్తున్న బైక్ తోలే వ్యక్తి అతడితో ఘర్షణ పడి పొట్టపై బ్లేడుతో కోసేశాడు. ఆదివారం రాత్రి కృష్ణలంక సుబ్బరాయనగర్ నాలుగో లైనులో అర్ధరాత్రి సమయంలో ఆగివున్న ఆటోలో మద్యం సేవించి పడుకున్నారని అడిగినందుకు ఘర్షణపడి ఇరువర్గాల వారు పెద్దగా పోగై ఒకరిపై ఒకరు రాళ్లతో దాడిచేసి అర్ధరాత్రి అరుపులు, కేకలు, రాళ్లదాడులతో బీభత్సం సృష్టించడంతో స్థానికులు భయంతో వణికిపోయారు. కృష్ణలంక హైస్కూల్ రోడ్డులో రాత్రి 7నుంచి అర్ధరాత్రి 12గంటల వరకు షట్టర్లు మూసివున్న షాపు మెట్లపైన కూర్చుని మద్యం సేవించడం, ఒకరినొకరు అరుపులు కేకలతో భయానక వాతావరణం సృష్టించడంతో స్థానికులకు నిద్ర ఉండటం లేదని ఆరోపిస్తున్నారు. హైస్కూల్ రోడ్డులో రాత్రి సమయాల్లో షాపు షట్టర్ వేసి ఉండటం ఆలస్యం, వెంటనే మెట్లపై కూర్చుని మద్యం సేవించడం, పబ్‌జీ ఆడుకోవడం, అరుపులు కేకలతో అలజడి సృష్టించడం ఆకతాయిలకు పరిపాటిగా మారింది. అప్పుడప్పుడు బ్లూకోట్స్ సిబ్బంది వస్తున్నా సైరన్‌తో రావడంతో ఆకతాయిలు అక్కడ నుంచి పక్కకి జారుకొని వారు వెళ్లగానే బళ్లీ మెట్లపై తిష్టవేస్తున్నారు. ఇప్పటికైనా కృష్ణలంక పోలీసులు వీరిపై రాత్రి 7నుంచి 12గంటల వరకు ప్రత్యేక నిఘా పెట్టి స్థానికుల ప్రశాంతతకు అంతరాయం కలిగిస్తున్న వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రిలిమ్స్ వాయిదా వేయండి

- ఏపీపీఎస్సీ చైర్మన్‌కు డీవైఎఫ్ఐ లేఖ

వన్‌టౌన్, ఫిబ్రవరి 12: గ్రూపు-2 ప్రిలిమ్స్ పరీక్షలను 40 రోజుల పాటు వాయిదా వేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) సోమవారం ఏపీపీఎస్సీ (రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్) చైర్మన్‌కు లేఖ రాసింది. ఐదేళ్ల తరువాత గ్రూప్-2 నోటిఫికేషన్‌ను విడుదల చేశారని ఈ నెల 25న పరీక్ష తేదీ ఇవ్వడంతో తగిన సమయం లేదన్నారు. హడావుడి నోటిఫికేషన్‌తో లక్షలాది మంది విద్యార్థులకు తీవ్రనష్టం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో శిక్షణా కేంద్రాలకు వెళ్లకుండా సొంతంగా సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు ఇబ్బంది కలుగుతుందన్నారు. 2016లో నోటిఫికేషన్ జారీ చేసినప్పుడు 108 రోజులు, 2018లో 126 రోజుల వ్యవధి ఇచ్చారన్నారు. తాజా నోటిఫికేషన్‌లో పరీక్ష జరగడానికి కేవలం 69 రోజులు మాత్రమే ఉండడంతో చాలామంది నిరుద్యోగ యువత ఇబ్బందుల పాలవుతారన్నారు. సిలబస్ మార్పులు చేశారని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ స్థాయిలో కఠినంగా, విస్తృతంగా ఉందని, పూర్తిస్థాయిలో ప్రిపేర్ అవ్వడానికి తగిన సమయం ఉండాలని కోరుతున్నారు. 2021లో జాబ్ క్యాలెండర్ ప్రకటించే సమయానికి గ్రూప్-2 పోస్టుల సంఖ్య కేవలం 5 మాత్రమే ఉండగా 2022 మార్చిలో జారీచేసిన జీవోలో 182 పోస్టులు పెరిగాయన్నారు. అయినా గ్రూప్-2 అభ్యర్థుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. కిందటేడాది మరో జీవో ద్వారా పోస్టులు 508కి పెరిగాయన్నారు. ఇప్పటికే చాలామంది ప్రైవేట్ రంగంలో ఉపాధి కోసం వెళ్లిపోయారన్నారు. ఆకస్మికంగా 897 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయడం, ముందుగా తెలియకపోవడంతో చాలామంది అభ్యర్థులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి మరో 40 రోజుల పాటు పరీక్షల నిర్వహణ తేదీని వాయిదా వేయాలని కోరారు. ఈ లేఖపై రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము, రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న సంతకాలు చేశారు.

అధికారుల తీరుకు నిరసనగా

వైసీపీ ప్రజాప్రతినిధుల ఆందోళన

- గుడివాడ రహదారి దిగ్బంధనం

హనుమాన్‌జంక్షన్ రూరల్, ఫిబ్రవరి 12: పెరికీడు గ్రామంలో ప్రజలకు తాగునీరందించే జలజీవన్ మిషన్ పథకాన్ని సరిగా అమలు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్థులతో పాటు సర్పంచ్, వైస్ ఎంపీపీ తదితర ప్రజాప్రతినిధులు ఆందోళన చేపట్టారు. సోమవారం సాయంత్రం రోడ్డుకడ్డుగా జేసీబీ, ట్రాక్టరును నిలిపేసి నిరసన చేపట్టారు. జలజీవన్ పథకం ద్వారా తాగునీరందించేందుకు ఏర్పాటు చేసిన పైపులైను నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో నీరు లీకయి కొంతకాలంగా తాగునీరందక ఇబ్బందులెదుర్కొంటున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో నాలుగంగుళాల పైపులైన్ ఉంటే ఈ పథకం కంట్రాక్టర్ కేవలం రెండంగుళాల పైపు వేయడంతో తాగునీరందడం లేదని సర్పంచ్ జాన్ ప్రకాష్ తెలిపారు. దీనిపై వైస్ ఎంపీపీ పండు రాణితో కలిసి చాలాసార్లు ఆర్‌డబ్ల్యుఎస్ సూపరింటెండెంట్ ఇంజనీర్ దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోకపోవడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తప్పని పరిస్థితుల్లో ప్రధాన రహదారిని దిగ్బంధం చేయాల్సి వచ్చిందని పండు నాగార్జున, నక్కా పవన్, వెలగపల్లి ప్రదీప్ తదితర గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోని వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధులకే సరిగా సమాధానం చెప్పని అధికారులు సామాన్యులకు సేవలందిస్తారా అంటూ ప్రశ్నించారు. అధికారపార్టీ ప్రజాప్రతినిధులే దిగ్బంధనం చేయడంతో రహదారికిరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులెదుర్కొన్నారు. జంక్షన్ ఎస్సై జనార్ధన్ సిబ్బందితో వచ్చి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. సమస్యను పరిష్కరించపోతే ఆందోళన ఉధృతం చేస్తామని గ్రామస్థులు హెచ్చరించారు.

ఇంత అరాచక పాలన ఎప్పుడూ చూడలేదు

- 87ఏళ్ల సాయిబాబు



హనుమాన్‌జంక్షన్ రూరల్, ఫిబ్రవరి 12: రాష్ట్రంలో ఇంత ఆరాచకపాలన, రైతును దోచుకోవడం ఇదివరకెన్నడూ చూడలేదని వేలేరుకు చెందిన 87 ఏళ్ల సాయిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గన్నవరం టీడీపీ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావుకు స్వాగతం పలికేందుకు వచ్చిన ఆయన తన చొక్కాపై టీడీపీ గుర్తును కుట్టించుకుని సోమవారం నిర్వహించిన ర్యాలీలో పాల్గొనడం యువతకు ఉత్సాహాన్నిచ్చింది. ఎమర్జెన్సీ లోనూ ఇలాంటి నీచ,కక్షపూరిత రాజకీయాలను చూడలేదన్నారు. చంద్రబాబుకు రాజకీయాలకంటే రాష్ట్రాభివృద్ధి ప్రధానమన్నారు. నీచ రాజకీయాలను చూసి మనసాగక టీడీపీకి మద్దతుగా ర్యాలీలో పాల్గొనన్నారు.

కారు ఢీకొని ఆటో డ్రైవర్ మృతి

పమిడిముక్కల, ఫిబ్రవరి 12: విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై గోపువానిపాలెం అడ్డరోడ్డు సమీపాన సోమవారం కారు ఢీ కొని ఆటో ట్రాలీ డ్రైవర్ మృతి చెందాడు. పమిడిముక్కల ఎస్సై కుడిపూడి శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం ఆటో ట్రాలీ నడుకుంటూ జీవనం సాగించే విజయవాడ భవానీపురానికి చెందిన కె పున్నయ్య (52) మచిలీపట్నం నుంచి ఆటోట్రాలీలో ఇనుప సామాను లోడుతో విజయవాడ వస్తుండగా తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెంకు చెందిన హరిపినేని జీవన్‌ప్రసాద్ మోపిదేవిలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దర్శనం చేసుకుని కారులో వస్తూ గోపువానిపాలెం రోడ్డు దాటిన తరువాత ముందు వెళుతున్న ఆటోట్రాలీని ఢీకొట్టాడు. దీంతో ఆటో ట్రాలీ డివైడర్‌ను ఢీకొని పున్నయ్య రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నూతన ఆవిష్కరణలు రూపొందించాలి

- ఎమ్మెల్యే మల్లాది విష్ణు



కృష్ణలంక, ఫిబ్రవరి 12: విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని నూతన ఆవిష్కరణల దిశగా అడుగులు వేయాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్ అన్నారు. నగరంలోని లయోలా కళాశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 11వ జిల్లా స్థా యి సైన్స్ ఫెయిర్‌ను ఆయన ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావుతో కలిసి ప్రా రంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యా న్ని వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక, వైద్య రంగాల్లో ఎదురయ్యే సవాళ్లను అధిగమించే శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు దాదాపు 120 పైగా ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఉత్తమ ఆవిష్కరణలు రూపొందించిన విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందిస్తామని విద్యాశాఖ ఉప సంచాలకులు కె.వి.ఎస్.కుమార్ తెలిపారు. డిప్యూటీ మేయర్ ఎ.శైలజారెడ్డి, లయోలా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్, జిల్లా సైన్స్ అధికారి హుస్సేన్, ఎంఈవోలు ఎం.వీరాస్వామి, విజయరామారావు, సోమశేఖర నాయక్, ఎ.సూరిబాబు, విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు, వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కంప్యూటర్ పరీక్ష, ఇంటర్వ్యూల నిర్వహణ

- జిల్లా స్త్రీ శిశు సంక్షేమ, సాధికార అధికారి ఉమాదేవి

కృష్ణలంక, ఫిబ్రవరి 12: జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో జిల్లా బా లల పరిరక్షణ విభాగం, ప్రత్యేక దత్తత ఏజెన్సీ, బాలసదనంలో వివిధ పోస్టుల భర్తీకి గత నవంబర్ 6న ఇచ్చిన నోటిఫికేషన్‌కు అనుగుణంగా మంగళవారం ఉదయం 9గంటలకు కేబీఎన్ కళాశాలలో కంప్యూటర్ టె స్ట్ నిర్వహించనున్నట్టు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమం, సాధికార అధికారి జి. ఉమాదేవి తెలిపారు. ఈ మేరకు అభ్యర్థులకు సమాచారం ఇచ్చినట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షానంతరం కలెక్టరేట్‌లోని డీ ఆర్‌వో కార్యాలయంలో ఇంటర్వ్యూలుంటాయన్నారు. కంప్యూటర్ టెస్ట్ లే నివారు నేరుగా ఉదయం 9గంటలకు డీఆర్‌వో కార్యాలయానికి ఇంట ర్వ్యూలెటర్లను అనుసరించి ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల

సమస్యలు పరిష్కరించండి

ఏపీ విద్యుత్ కార్మిక సంఘాల పోరాట కమిటీ


సంఘీభావం తెలుపుతున్న నేతలు

ధర్నాచౌక్, ఫిబ్రవరి 12: ఏపీ విద్యుత్ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నాయని పలువురు వక్తలు మండిపడ్డారు. విద్యుత్ కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై ఏపీ విద్యుత్ కార్మిక సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నాలుగేళ్ల 9 నెలలుగా కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగుల పరిస్థితి పెనం పై నుంచి పొయ్యిలో పడ్డట్టు తయారయిందన్నారు. తాను అధికారంలోకి వస్తే విద్యుత్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేస్తానని గతంలో ప్రతిపక్షనేతగా సీఎం జగన్ ఇచ్చిన హామీని నమ్మి కార్మికులందరూ గంపగుత్తగా వైసీపీకి ఓటు వేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా కార్మికులందరిని రెగ్యులర్ చేసి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, వేతనాల్లో వ్యత్యాసాన్ని నివారించాలన్నారు. పీస్‌రేటు వర్కర్లు, మీటరు రీడర్లు ఎస్‌పీఎం అండ్ స్టోర్స్ హమాలీలకు కనీస వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్మికుల సమస్యలపై అనేక సార్లు యాజమాన్యం, ప్రభుత్వానికి వినతిపత్రాలు అందించినా తగిన స్పందన లేదన్నారు. ఇప్పటికైనా స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు, ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ చైర్మన్ పి.సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.సుబ్బిరెడ్డి, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి.నాగేశ్వరరావు, కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, యూఈఈయూ అధ్యక్షుడు డి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, ఫిబ్రవరి 12: ఎన్టీఆర్ జిల్లా అభివృద్ధిలో కార్పొరేట్, ఇతర సంస్థలు కార్పొరేట్ సామాజిక బాధ్యత ద్వారా క్రియాశీల భాగస్వామ్యం అందించాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో సీఎస్ఆర్‌పై కలెక్టర్ అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ ఔత్సాహిక యువతకు పరిశ్రమల స్థాపనకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నట్టు కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరక్టర్ బి.సాంబయ్య, సీపీవో వై.శ్రీలత, ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ టి.రాజు, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు, ఉపకార్మిక కమిషనర్ సీహెచ్.ఆశారాణి తదితరులతో పాటు అల్ట్రాటెక్, కేసీపీ, హేమాద్రి సిమెంట్స్ లిమిటెడ్ రామ్‌కో ఇండస్ట్రీస్, బీపీసీఎల్, ఇండియన్ ఆయిల్, హెచ్‌పీఎల్, సహ్యాద్రి ఇండస్ట్రీస్ తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

భ్రూణహత్యలను నివారించాలి

సమాజంలో బాలబాలికల లింగ నిష్పత్తి ఎంతో నిస్పృహకు గురిచేస్తోందని ప్రస్తుతం పురుష సంతాన ప్రాధాన్యత, ఆడపిల్లల పట్ల వివక్షత, మూఢనమ్మకాలు వంటి విషయాలపై అవగాహన కల్పించి ఆడ శిశువుల భ్రూణహత్యలు నివారించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పీసీపీఎన్‌డీటీ చట్టం ఆవశ్యకతపై జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థినీ, విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వం పోటీల్లో ప్రతిభ కనబరిచినవారికి సోమవారం కలెక్టర్ స్పందన సమావేశ మందిరంలో ప్రశంసా పత్రాలు, నగదు బహుమతిని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ వైద్యారోగ్యశాఖ, విద్యాశాఖల సమన్వయంతో సేవ్ గర్ల్ చైల్డ్ అంశంపై విద్యార్థినీ విద్యార్థులకు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం విజేతలకు ప్రశంస పత్రం, మెడల్, నగదు బహుమతులను అందజేశారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎం.సుహాసిని, డీఎల్‌ఏటీవో డాక్టర్ ఉషారాణి, కలెక్టరేట్ పరిపాలన అధికారి నాగలక్ష్మి, హౌసింగ్ పీడీ రజనీ కుమారి, సివిల్ సప్లైస్ డీఎం జి.వెంకటేశ్వర్లు, ఆసుపత్రి సేవలు సమన్వయ అధికారి డాక్టర్ నాయక్, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.


వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల విజేతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

విద్యార్థులు క్రీడాస్ఫూర్తి కలిగి ఉండాలి

- కేబీఎన్ పాలకవర్గ అధ్యక్షుడు శేషయ్య

వన్‌టౌన్, ఫిబ్రవరి 12: విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలని కేబీఎన్ కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు తొమ్మండ్రు శేషయ్య అన్నారు. కృష్ణా వర్సిటీ అంతర్ కళాశాలల రెండ్రోజుల పురుషుల హ్యాండ్‌బాల్ పోటీలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాస్ఫూర్తి ఉన్న విద్యార్థులు అన్నిరంగాల్లో రాణిస్తారన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు, క్రీడా విభాగాధిపతి డీ హేమచంద్రరావు నిర్వహించారు. వర్సిటీ హ్యాండ్‌బాల్ టీమ్‌ను ఎంపికకు సెలక్షన్ కమిటీ సభ్యుడిగా మన్నె స్వామి,రిటైర్డ్ అధ్యాపకుడు బాయన రాములు పాల్గొన్నారు. మైలవరంలోని ఎల్‌హెచ్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీపై 10-2 గోల్స్‌తో నూజివీడు డీఎఆర్ కళాశాల జట్టు విజయం సాధించింది. 2వ నాకౌట్ పోటీలో పీబీ సిద్ధార్థ కాలేజీ బృందంపై 26-8 గోల్స్‌తో కేబీఎన్ కళాశాల జట్టు విజయం సాధించి లీగ్‌లోకి ప్రవేశించారు. ఇక లీగ్‌లో ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టుపై కేబీఎన్ కళాశాల జట్టు 26-6 ఆధిక్యతతో నిలిచింది. నున్న డీఏఆర్ కళాశాలపై వికాస్ వ్యాయామ కళాశాల 19-10 ఆధిక్యతతో నిలిచింది. మంగళవారం మిగతా లీగ్ పోటీలను నిర్వహించిన అనంతరం విజేతలకు బహుమతులు ఇస్తారు.

రేపటి నుంచి మల్లేశ్వరాలయం పునఃప్రారంభం

వన్‌టౌన్, ఫిబ్రవరి 12: ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరాలయం పునఃప్రారంభ కార్యక్రమాలను ఈ నెల 14 నుంచి 18 వరకు నిర్వహిస్తున్నట్టు దేవస్థానం ఒక ప్రకటనలో తెలిపింది. దేవాలయ పునరుద్ధరణ, నూతన ధ్వజస్తంభ సహిత స్వర్ణ శిఖర ప్రాణప్రతిష్ఠ, కుంబాభిషేకాలు బుధవారం నుంచి ప్రారంభమవుతాయి. 18వ తేదీ నుంచి భక్తుల దర్శనాలకు అనుమతిస్తారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

దుర్గగుడిలో నిత్యాన్నదానానికి నగరానికి చెందిన కే సరోజని సోమవారం ఆలయానికి విచ్చేసి అధికారులకు రూ.లక్ష విరాళం అందజేశారు. కోడూరు సురేంద్రనాథ్ బెనర్జీ పేరిట ఈవిరాళాన్ని అందజేశారు. దుర్గమ్మ దర్శనానంతరం దాతకు ఆశీర్వచనం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

రేపు సరస్వతీ దేవి అలంకారం

శ్రీపంచమి సందర్భంగా అమ్మవారి మూలవిరాట్టు, ఉత్సవ మూర్తులు బుధవారం సరస్వతీ దేవి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. విద్యార్థులకు ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ముఖమండపం నుంచి అమ్మవారి ఉచిత దర్శనం ఉంటుందని, అనంతరం పెన్ను, ప్యాకెట్‌సైజు అమ్మ ఫొటో, రక్షా కంకణం, కుంకుమప్రసాదం అందజేస్తారు.

డ్రైవర్ల వ్యతిరేక చట్టాన్ని రద్దు చేయాలి

16న దేశవ్యాప్త కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని పిలుపు



సత్యనారాయణపురం, ఫిబ్రవరి 12: అన్ని రంగాల డ్రైవర్లకు ఉరితాడులా మారిన (106)12 క్రిమినల్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 16న దేశవ్యాప్తంగా చేపట్టిన కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని ఆటో సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నేతలు అన్నారు. దుర్గాపురం బీఆర్‌టీఎస్ రోడ్డులోని నందూరి ప్రసాదరావు భవన్‌లో సోమవారం విజయవాడ ఆటో సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది. తొలుత సంబంధిత కరపత్రాలను ఐక్యకార్యాచరణ నేతలు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కక్షగట్టిందని, ఇప్పటికే మోటారు రంగ కార్మికులు బీజేపీ, వైసీపీ విధానాలతో ఉపాధి కోల్పోయి నిరుద్యోగులుగా మారారన్నారు. ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ కోశాధికారి కె.దుర్గారావు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మునిశంకర్, ఏఐటీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధానకార్యదర్శి గూడేల జనార్ధన్, టీఎన్‌టీయూసీ సెంట్రల్ సిటీ అధ్యక్షుడు గరిమెళ్ల చిన్నా, ఐఎఫ్‌టీయూ ఆటో వర్కర్స్ యూనియన్ నగర ప్రధానకార్యదర్శి ఆర్ కనకారావు, సిటీ ఆటోవర్కర్స్ యూనియన్ నేతలు బి రూబెన్ కుమార్, ఎం.హనుమంతరావు పాల్గొన్నారు.

కొత్త పేటలో చోరీ

- 184 గ్రాముల బంగారం, 2 కేజీల వెండి చోరీ

చిట్టినగర్, ఫిబ్రవరి 12: కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి భారీ చోరీ జరిగింది. రూ.5లక్షల విలువైన బంగారం 184 గ్రాములు, వెండి 2 కేజీలు చోరీకి గురైనట్టు పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక కుమ్మరివీధి 5వ లైన్‌లో ఆర్.నవీన్‌గాంధీ కుటుంబంతో ఉంటున్నాడు. రాజకుమారి థియేటర్ సమీపంలోని ఓ బ్యాంక్‌లో నవీన్ అటెండర్‌గా పనిచేస్తున్నాడు. భార్య ఇద్దరు పిల్లలు. తల్లిదండ్రులు భవానీపురం 4 స్తంభాల సెంటర్‌లో ఉంటారు. ప్రతి ఆదివారం సాయంత్రం నవీన్ కుటుంబంతో సహా తల్లిదండ్రుల వద్దకు వెళ్లి వస్తుంటాడు. ప్రతి ఆదివారంలాగే సాయంత్రం 6గంటలకు నవీన్ ఇంటికి తాళాలు వేసి భార్య ఇద్దరు పిల్లలతో కలిసి తల్లిదండ్రుల వద్దకు వెళ్లాడు. రాత్రి 9గంటలకు తిరిగి వచ్చారు. ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో అనుమానం వచ్చి బెడ్‌రూమ్‌లోకి వెళ్లి చూడగా బట్టలు బయట పడేసి ఉన్నాయి. బీరువా హ్యాండిల్ వంచి తాళం తెరిచి అందులోని రూ.5లక్షలు విలువైన బంగారం, వెండి చోరీకి గురైనట్టు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమచారం అందించారు. కొత్తపేట సీఐ టీ.గణేష్ తన సిబ్బందితో అక్కడకు చేరుకొని క్లూస్ టీంకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలంలో వేలిముద్రలను గుర్తించారు. ఏసీపీ మురళీకృష్ణ ఘటనా స్థలానికి చేరుకొని బాధితులను వివరాలు తెలుసుకున్నారు. 2 నెలల క్రితమే తాను ఇంట్లో దిగినట్టు నవీన్ తెలియజేశాడు. పోలీసులు ఇంటి పరిసరాలు, చుట్టుపక్క సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు.


వేలిముద్రలు పరిశీలిస్తున్న క్లూస్‌టీమ్, ఏసీపీ, సీఐలు



భారత్ కళా మండపం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న వెంకయ్య నాయుడు, కిషన్ రెడ్డి

'సంగీత అకాడమీ' ఏర్పాటు హర్షణీయం

- ఘంటసాల పేరుతో కళా మండప నిర్మాణం ముదావహం
- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మక జాతీయ సంగీత, నాటక అకాడమీ దక్షిణ భారత సాంస్కృతిక కేంద్రాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడం పట్ల తెలుగువాడిగా గర్విస్తున్నానని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ కేంద్రం ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కృషి అభినందనీయమని అన్నారు. అదే విధంగా అమర గాయకుడు ఘంటసాల వేంకటేశ్వరరావు శత జయంతి ఉత్సవాల సందర్భంగా భారత్ కళా మండప నిర్మాణాన్ని తలపెట్టడం గొప్ప కార్యక్రమమని అభివర్ణించారు. సోమవారం మాదాపూర్‌లోని సాంస్కృతిక వనరుల శిక్షణా కేంద్రం ఆవరణలో సంగీత, నాటక కేంద్రానికి ప్రారంభోత్సవం.. భారత్ కళా మండప నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాలు వెంకయ్యనాయుడు, కిషన్‌రెడ్డి చేతుల మీదుగా జరిగాయి. అనంతరం శిల్ప కళావేదికపై వెంకయ్య నాయుడు మాట్లాడారు. రవీంద్రభారతి స్థాయిలో 700 సీట్ల సామర్థ్యం కలిగిన సభా మందిరాన్ని భారత్ కళా మండపంలో కట్టడంతో పాటు దానికి ఘంటసాల పేరు పెట్టడం సంతోషకరమన్నారు. సంగీత, నాటక అకాడమీ ప్రాంతీయ కార్యాలయాన్ని ఇక్కడ ఏర్పాటు చేయడం ద్వారా దక్షిణాది కళలు, సాంస్కృతిక శోభకు నగరం వేదిక అవనుందని కిషన్‌రెడ్డి అన్నారు.

తెలంగాణలో ఉద్యోగ అర్హత వయసు పెంపు

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగాల అర్హత వయసును రెండేళ్లు పెంచారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు (జీవో నంబరు ఎంఎస్-30) జారీ చేశారు. ఈ నిర్ణయంతో జనరల్ కేటగిరీ అభ్యర్థుల ఉద్యోగ అర్హత వయసు 46 ఏళ్లకు పెరిగింది. రిజర్వేషన్ అభ్యర్థులకు ఆయా కేటగిరీల వారీగా గరిష్ఠ అర్హత వయసు అమలు పరచనున్నారు.

తమిళనాడులో మళ్లీ గవర్నర్ X సర్కార్

- అసెంబ్లీలో ప్రసంగాన్ని క్లుప్తంగా ముగించిన గవర్నర్
- ప్రభుత్వం, స్పీకర్‌పై విమర్శలు.. అసెంబ్లీలో రసాభాస

చెన్నై, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తమిళనాడు అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగంపై వివాదం చోటుచేసుకుంది. గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రసంగాన్ని తన ఇష్టానుసారంగా మార్చుకుని చదివిన గవర్నర్ ఆర్ఎన్ రవి.. ఈ ఏడాది ప్రసంగ పాఠాన్ని క్లుప్తంగా చదివి, ఆపై ప్రభుత్వం, స్పీకర్‌పై కొన్ని వ్యాఖ్యలు చేసి కూర్చుండిపోయారు. దీంతో సభ దిగ్భ్రాంతికి లోనైంది. స్పీకర్ అప్పావు మైకు తీసుకుని.. గవర్నర్ ప్రసంగం తమిళ అనువాదాన్ని చదివారు. చివరన ఆయన గవర్నర్‌పై కొన్ని వ్యాఖ్యలు చేశారు. అనంతరం జాతీయ గీతాలాపన ఉంటుందని ప్రకటించారు. అయితే అప్పటి వరకూ అక్కడే కూర్చున్న గవర్నర్.. స్పీకర్ తనపై చేసిన వ్యాఖ్యల గురించి తెలుసుకుని జాతీయ గీతాలాపన ప్రారంభం కాబోతున్న సమయంలో లేచి వెళ్లిపోయారు. అనంతరం మంత్రి దురైమురుగన్ లేచి.. గవర్నర్ ప్రసంగ పాఠాన్ని యథాతథంగా ఆమోదిస్తూ తీర్మానం చేయగా, సభ్యులు మూజువాణి ఓటుతో ఆమోదించారు. అంతేగాక సభలో గవర్నర్, స్పీకర్ చేసిన కొన్ని వ్యాఖ్యల్ని రికార్డుల నుంచి తొలగిస్తూ మరో తీర్మానం చేశారు. కాగా, సభలో జరిగిన వ్యవహారంపై రాజ్‌భవన్ వివరణ ఇచ్చింది. ప్రభుత్వం రూపొందించిన ప్రసంగంలో పలు అవాస్తవాలు, ప్రజలను తప్పుదారి పట్టించే అంశాలు ఉన్నాయన్నాయని పేర్కొంది. అయితే రాజ్‌భవన్ ప్రకటనను తమిళనాడు న్యాయ శాఖ మంత్రి మూర్తి తీవ్రంగా ఖండించారు. గవర్నర్ ప్రసంగంలో ముందుగా ఎలాంటి మార్పులు చేర్పులు సూచించలేదన్నారు. ప్రసంగంలో అసత్యాలున్నాయని గవర్నర్ పేర్కొనడం సమంజసం కాదన్నారు.

ఈపీఎస్ కనీస పింఛన్‌లో మార్పు లేదు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: ఈపీఎస్ ఉద్యోగులకు సంబంధించిన నెలవారీ కనీస పింఛన్ రూ.1000ని రెట్టింపు చేసే ప్రతిపాదనను కేంద్ర ఆర్థిక శాఖ తిరస్కరించింది. ఈ ప్రతిపాదన ప్రకారం రూ.1000గా ఉన్న కనీస పింఛను రూ.2000 కావాల్సి ఉంది. ఈ మేరకు ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్‌వో)కు చెందిన ఉన్నత స్థాయి నిర్ణాయక బోర్డు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్(సీబీటీ) రూ.1000 పింఛనును రూ.2000లకు పెంచాలని ఇటీవల ప్రతిపాదించగా శనివారం ఆర్థిక శాఖ దీనిని తోసిపుచ్చింది. "రిటైర్డ్ ఉద్యోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మేం ఈ ప్రతిపాదన చేశాం. కానీ, ఆర్థిక శాఖ అంగీకరించలేదు" అని సీబీటీ తెలిపింది.

రాజ్యసభకు సోనియా గాంధీ!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ రాజ్యసభకు పోటీ చేయనున్నారంటూ ఆ పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అనారోగ్య కారణాల దృష్ట్యా ఆమె లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయకపోవచ్చని, అందువల్ల ఎగువ సభకు వెళ్లాలని భావిస్తున్నారని సోమవారం ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. రాజ్యసభకు పోటీ చేసే అభ్యర్థుల జాబితాలో ఆమె పేరు ఉండే అవకాశం ఉందని అంటున్నాయి. ఆమె హిమాచల్ ప్రదేశ్ నుంచి గానీ, రాజస్థాన్ నుంచిగానీ పోటీ చేసే అవకాశం ఉంది. ఆమె ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇకపై ఆ స్థానం నుంచి ఆమె కుమార్తె ప్రియాంక పోటీ చేసే సూచనలున్నాయి.

యూపీలో రాహుల్ యాత్ర కుదింపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ జోడో న్యాయ యాత్ర నిడివిని తగ్గించాలని ఆ పార్టీ యోచిస్తున్నట్టు తెలిసింది. దీనికోసం ఉత్తరప్రదేశ్ రూట్‌మ్యాప్ నుంచి పశ్చిమ నియోజకవర్గాలను చాలావరకు మినహాయించినట్టు సమాచారం. 'ఇండియా' భాగస్వామి ఆర్ఎల్‌డీ పార్టీ నేత, మాజీ ప్రధాని చరణ్‌సింగ్ మనవడు జయంత్ చౌదరికి ఈ నియోజకవర్గాల్లో బలం ఉంది. అయితే, ఆయన తన తాతయ్యకు భారత రత్న ప్రకటించిన నేపథ్యంలో ఎన్డీయేలోకి చేరడానికి సన్నాహాలు చేసుకుంటున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ కారణంగానే ఆ రాష్ట్రంలో యాత్ర మార్గాన్ని కుదించినట్టు వస్తున్న వార్తలను కాంగ్రెస్ వర్గాలు ఖండించాయి. ఈ మార్పులకు రెండు కారణాలు ఉన్నట్టు తెలిపాయి. రాహుల్ ఎక్కువమందిని కలిసేందుకు వీలుగా యాత్ర వేగాన్ని తగ్గించడానికే కొన్ని నియోజకవర్గాలను మినహాయించినట్టు ఈ వర్గాలు పేర్కొన్నాయి. అలాగే, యాత్రను వీలైనంత త్వరగా ముగించుకుని లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఎక్కువ సమయం గడపాలనేదీ దీనికొక కారణమని తెలిపాయి. షెడ్యూల్ ప్రకారం వచ్చే నెల 20వ తేదీన ముంబై చేరడంతో యాత్ర ముగియాలి. ఆ రోజు 'ఇండియా' భాగస్వాములతో ముంబైలో భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది.

సెంథిల్ బాలాజీ రాజీనామా?

చెన్నై, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీ తన పదవికి రాజీనామా చేసినట్టు తెలిసింది. విద్యుత్తు శాఖలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని చెప్పి అనేకమంది వద్ద డబ్బులు వసూలు చేసినట్టు గతేడాది ఆరోపణలు రావడంతో ఆయన నివాసం, కార్యాలయాల్లో ఈడీ అధికారులు తనిఖీలు చేశారు. ఆ తర్వాత జూన్ 14న సెంథిల్ బాలాజీని అరెస్టు చేశారు. అప్పటినుంచి ఆయన ఏ శాఖ లేని మంత్రిగా కొనసాగుతున్నారు. ఇదిలా ఉంటే, సెంథిల్ బాలాజీ బెయిల్ పిటిషన్లు ట్రయల్ కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు వరుసగా తిరస్కరణకు గురయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఆయన తన మంత్రి పదవికి రాజీనామా చేసినట్టు తెలిసింది.

టీడీపీ వాళ్లని ఆస్పత్రిలోకి ఎవరు రానిచ్చారు?

- ఆస్పత్రి అధికారులపై దెందులూరు ఎమ్మెల్యే చిందులు



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్య, ఆస్పత్రి గేటు మూసి టీడీపీ కార్యకర్తలను దుర్భాషలాడుతున్న జడ్పీ చైర్మన్ భర్త ఘంటా ప్రసాద్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 12: 'వాళ్లని ఆస్పత్రిలో ఎందుకు చేర్చుకున్నారు. మావాళ్లపై దాడి చేసి ఆస్పత్రికి వస్తే మీరు ఎమ్మెల్సీలు చేస్తారా? అసలు వీళ్లని ఆస్పత్రిలోకి ఎవరు రానిచ్చారు'.. అంటూ దెందులూరు ఎమ్మెల్యే ఆస్పత్రి అధికారులపై దాదాగిరి ప్రదర్శించారు. జడ్పీ చైర్మన్ భర్త ఘంటా ప్రసాద్ సైతం ఆస్పత్రి అధికారులు, సిబ్బందిపై బూతు పురాణంతో చిందులు తొక్కారు. కొప్పాకలో ఆదివారం రాత్రి వైసీపీ శ్రేణులు టీడీపీ నాయకుల ఇళ్లపై పడి విధ్వంసం సృష్టించారు. ఈ దాడిలో టీడీపీకి చెందిన కాటేపల్లి సాంబశివరావు, మరో ముగ్గురు గాయపడి ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. మరోవైపు టీడీపీ వారు తమపై దాడి చేశారంటూ వైసీపీ నాయకులు శబరీనాథ్, రంగారావు కూడా అదే ఆస్పత్రిలో చేరారు. వీరిని పరామర్శించడానికి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి సోమవారం ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ ఆస్పత్రి అధికారులపై ఆగ్రహంతో చిందులు వేశారు. తమ వారిపైనే దాడులు చేసి ఆస్పత్రికి వస్తే ఎందుకు చేర్చుకున్నారంటూ వైద్యులను ప్రశ్నించారు. మరోవైపు టీడీపీ నాయకుడు సాంబశివరావును పరామర్శించడానికి వచ్చిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆస్పత్రి ప్రాంగణంలో మీడియాతో మాట్లాడుతుండగా.. అదే సమయంలో ఆస్పత్రికి వచ్చిన జడ్పీ చైర్మన్ భర్త ఘంటా ప్రసాద్ 'ఇదేమైనా టీడీపీ కార్యాలయమా' అంటూ ఆస్పత్రి సిబ్బందిపై చిందులు తొక్కారు. పరుష పదజాలంతో దుర్భాషలాడడంతో టీడీపీ కార్యకర్తలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళనకు దిగిన టీడీపీ కార్యకర్తలను పోలీసులు అక్కడి నుంచి పంపేశారు.

పిల్లలు బడి మానడమే ఖ్యాతా?

- సర్కారీ బడికి అంతర్జాతీయ ఖ్యాతి అంటూ రోత పత్రిక గొప్పలు
- పట్టుమని పదిమంది విద్యార్థులు విదేశీ సదస్సులకు
- మరి మిగిలిన 39 లక్షల మంది పరిస్థితేంటి?
- మూడేళ్లలో 6లక్షల మంది ప్రైవేటు బడులకు
- అద్భుతంగా తీర్చిదిద్దితే ఎందుకు వీడుతున్నారు?
- టీచర్ పోస్టుల ఖాళీల మాటేంటి?
- నాడు-నేడు ఎందుకు పూర్తిచేయలేదు?



అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మొన్నామధ్య ప్రభుత్వ బడుల్లోని పది మంది విద్యార్థులను ఐక్యరాజ్య సమితికి తీసుకెళ్లారు. తాజాగా ముగ్గురు విద్యార్థులు జపాన్‌లో జరిగిన సైన్స్ ఫెయిర్‌కు వెళ్లొచ్చారు. కచ్చితంగా అది వారి ప్రతిభే. కానీ ఆ మాత్రానికే రాష్ట్రంలోని ప్రభుత్వ బడుల ఖ్యాతి అంతర్జాతీయ స్థాయికి చేరిందట. పట్టుమని పదమూడు మంది విద్యార్థులు విదేశాలు వెళ్లిరాగానే ప్రభుత్వ బడులు అద్భుతంగా మారిపోయాయట. ఇదీ జగన్ సొంత పత్రిక పొగడ్తల వర్షం. అది కూడా విద్యార్థుల ప్రతిభ కంటే, ప్రభుత్వ చర్యల వల్లే ఈ ఘనత సాధ్యమైందంటూ గొప్పగా రాసుకొచ్చింది. రోత పత్రిక చెప్పినట్లుగా ఇదంతా ప్రభుత్వ ఘనతే అయితే ప్రభుత్వ బడుల్లో పిల్లలు ఎందుకు తగ్గిపోతున్నారు? మూడేళ్లలో ఆరు లక్షల మంది పిల్లలు ఎందుకు ప్రైవేటు బాట పట్టారు? ప్రభుత్వ బడులు కార్పొరేట్‌ను తలదన్నేలా ఉంటే తల్లిదండ్రులు కార్పొరేట్ వైపే ఎందుకు చూస్తున్నారు? ప్రభుత్వం వీటికి సమాధానం చెప్పగలదా?

ఉత్తీర్ణత, సాధించిన లక్ష్యాల మాటేమిటి?

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అనేక మంది గతంలోనూ అద్భుత ప్రతిభ చూపించారు. కానీ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే విద్యార్థుల్లో ప్రతిభ పెరిగిందన్నట్టుగా ప్రచారం మొదలైంది. గతేడాది సెప్టెంబరులో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివిన విద్యార్థులు పది మంది ఐక్యరాజ్య సమితి నిర్వహించిన 'అంతర్జాతీయ సుస్థిరాభివృద్ధి, విద్యా సదస్సు'లో పాల్గొన్నారు. ప్రపంచంలోని అన్ని దేశాల నుంచి ప్రతినిధులు, విద్యార్థులు దీనికి హాజరయ్యారు. అందులో భాగంగానే మన విద్యార్థులు కూడా వెళ్లొచ్చారు. అందులో వారు ఎక్కడ ప్రసంగించినట్లు కూడా పాఠశాల విద్యాశాఖ వెల్లడించలేదు. అసలు మొదట వారు ఏ తేదీన పాల్గొన్నారనే విషయాన్ని కూడా గోప్యంగా ఉంచారు. విద్యార్థులు సదస్సుకు వెళ్లే ముందు హడావుడి చేసిన ప్రభుత్వం ఎందుకోగానీ తిరిగొచ్చాక మౌనం వహించింది. వారు అక్కడ ఏం చేశారు? అనే వివరాలు కూడా వెల్లడించలేదు. ఇక ఇప్పుడు జపాన్‌లో జరుగుతున్న సైన్స్ ఫెయిర్‌కు రాష్ట్రం నుంచి ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ముగ్గురు ఇప్పటికే పాల్గొనగా, మరో నలుగురు తర్వాత వెళ్తారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం 39లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. వారిలో కొందరు విదేశాల్లోని సదస్సుల్లో పాల్గొనడంతోనే రాష్ట్రంలో విద్యా వ్యవస్థ మొత్తం మారిపోయినట్లుగా రోత పత్రిక అభివర్ణించింది. అసలు స్థానికంగా విద్యార్థులు సాధించిన లక్ష్యాలు ఏంటి, ఉత్తీర్ణత శాతాలు ఎలా మెరుగుపడ్డాయి, ప్రభుత్వ బడుల్లో పిల్లల సంఖ్య ఎలా ఉంది అనే వివరాలను మాత్రం వదిలేసింది.

6 లక్షల మంది పిల్లలు ఎందుకు తగ్గారు?

సరైన సదుపాయాలు కల్పిస్తే విద్యార్థులు అద్భుతంగా రాణిస్తారని, అందుకోసం జగన్ ప్రభుత్వం అద్భుతాలు సృష్టించిందని రోత పత్రిక రాసింది. వాస్తవానికి నాడు-నేడు పనులు పూర్తిచేయడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైంది. 2021 నాటికి మూడు విడతల్లో మొత్తం 45వేల పాఠశాలల్లో నాడు-నేడు పనులు పూర్తిచేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటివరకూ రెండో విడత పనులు సగం కూడా పూర్తిచేయలేదు. అసలు మూడో విడత ఎప్పుడు ప్రారంభమవుతుందో తెలియని పరిస్థితి. కొత్తగా ఉన్నత పాఠశాలల్లో ప్రారంభించిన హైస్కూల్ ప్లస్‌లలో ల్యాబ్స్ ఊసే లేదు. విద్యార్థులకు సరిపడ టీచర్లు లేరు. అందుకే ప్రభుత్వం ఇప్పుడు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ లోపాలను వదిలేసి అద్భుతంగా మార్చినట్లు జగన్ పత్రిక భజన కథనం వండి వార్చింది. 2021-22లో ప్రభుత్వ బడుల్లో 45,71,051 మంది విద్యార్థులు చదివారు. ప్రస్తుతం ప్రభుత్వ బడుల్లో 39లక్షల మంది విద్యార్థులే ఉన్నారు. నిజంగా ప్రభుత్వ బడుల్లో అద్భుతమైన సదుపాయాలుంటే 6లక్షల మందికి పైగా విద్యార్థులు ఎందుకు తగ్గారో ప్రభుత్వం చెప్పాలి. గత రెండేళ్లుగా ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తూ కేవలం ఆ ఒక్క ట్యాబ్‌తోనే విద్యార్థుల్లో ప్రతిభ అసాధారణంగా పెరిగిపోయినట్లుగా ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. ఎప్పుడో 12ఏళ్ల తర్వాత పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చే ఐబీ సిలబస్ గురించి ఇప్పుడు గొప్పలు చెబుతోంది.

నియంతృత్వం దిశగా దేశం!

- పౌర, మానవహక్కుల సంఘాలకు చెందిన నేతల ఆందోళన.. ఉపా, సీఏఏ రద్దుకు డిమాండ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: నియంతృత్వం దిశగా దేశం అడుగులు వేస్తోందని పౌర, మానవహక్కుల సంఘాలకు చెందిన 100 మందికిపైగా నేతలు, అఖిల భారత సర్వీసుల మాజీ అధికారులు, మీడియా ప్రతినిధులు, విద్యావేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జమ్ము కశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా అధ్యక్షతన శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు 'ప్రజాస్వామ్య సదస్సు' నిర్వహించారు. ఈ సదస్సులో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సల్మాన్ ఖుర్షిద్, మనీష్ తివారీ, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ఎంపీ కపిల్ సిబల్ సహా అనేక మంది పాల్గొన్నారు. కేంద్రం తాజాగా తీసుకువచ్చిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య బిల్లులపై మరోసారి సమీక్షించాలని డిమాండ్ చేశారు. ఇవి.. కేవలం అనుమానంతో వ్యక్తులను అరెస్టు చేసేందుకు, రహదారుల దిగ్బంధం వంటి శాంతియుత నిరసనలను కూడా తీవ్రవాదంగా పరిగణించేందుకు విస్తృత అవకాశం కల్పిస్తున్నాయని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఉపా, జమ్ముకశ్మీర్ పబ్లిక్ సేఫ్టీ యాక్ట్(పీఎస్ఏ) వంటి క్రూరమైన చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాన్ని విమర్శించే వారిని లక్ష్యంగా చేసుకుని మనీలాండరింగ్ చట్టాన్ని ప్రయోగించడం మానుకోవాలన్నారు. 2019 నాటి పౌరసత్వ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

హల్ద్వానీకి అదనపు బలగాలు

- మదర్సా కూల్చిన స్థలంలో పోలీస్‌స్టేషన్: ధామీ

హల్ద్వానీ, ఫిబ్రవరి 12: మదర్సా కూల్చివేత వ్యవహారంతో ఉద్రిక్త వాతావరణం నెలకొన్న ఉత్తరాఖండ్ రాష్ట్రం హల్ద్వానీ పట్టణానికి అదనపు పారామిలటరీ బలగాలను తరలించినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ స్థలంలో అనుమతి లేకుండా మదర్సా నిర్మించారని ఈ నెల 8న స్థానిక మునిసిపల్ అధికారులు దాన్ని కూల్చివేశారు. ఈ సందర్భంగా చెలరేగిన హింసలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఘర్షణలకు కారణమైన వారందరినీ గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. 120 మంది తుపాకుల లైసెన్సులను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. తీవ్ర స్థాయిలో హింసకు కారణమై ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసినందుకు రూ. 2.44కోట్ల నష్ట పరిహారం చెల్లించాల్సిందిగా కోరుతూ ప్రధాన నిందితుడైన అబ్దుల్ మాలిక్‌కు మునిసిపల్ అధికారులు రికవరీ నోటీసు జారీ చేశారు. హల్ద్వానీలో సాధారణ పరిస్థితులు నెలకొనడంతో ఘర్షణలు జరిగిన బన్‌భూల్‌పుర ప్రాంతం మినహా పట్టణంలోని మిగతా చోట్ల కర్ఫ్యూను ఎత్తివేస్తున్నట్టు జిల్లా ఎస్పీ తెలిపారు. కాగా, మదర్సా కూల్చిన స్థలంలో నూతనంగా పోలీస్ స్టేషన్‌ను నిర్మిస్తామని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామీ ప్రకటించారు.

67 ప్రాణాలు తీసి.. ఇద్దరికి విముక్తి!

- రఫాలో నాటకీయంగా విడిపించిన ఇజ్రాయెల్
- ముందుజాగ్రత్తగా అపార్ట్‌మెంట్‌పై భారీ దాడి
- హమా్‌స్‌తో యుద్ధంలో ఇది కేవలం రెండోసారి
- ఇద్దరూ అర్జెంటీనా పౌరసత్వం ఉన్న వ్యక్తులే..!
- అతి దూకుడు వద్దు.. ప్రాణాలను బలిగొనొద్దు
- నెతన్యాహుకు అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఫోన్
- పగలు జర్నలిస్టు.. రాత్రి ఉగ్ర సంస్థ కమాండర్
- అల్ జజీరా విలేకరిపై ఇజ్రాయెల్ ఆరోపణలు

రఫా, ఫిబ్రవరి 12: ఎటూతేలకుండా సాగుతున్న ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంలో సోమవారం తెల్లవారుజామున కీలక పరిణామం జరిగింది. రఫా నగరంలో భారీ సాయుధ పహారాలో ఉన్న అపార్ట్‌మెంట్‌పై దాడికి దిగిన ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడీఎఫ్) తమ పౌరులు ఫెర్నాండో సైమన్ మర్మాన్ (60), లూయిస్ హర్ (70)లను నాటకీయంగా విడిపించుకెళ్లింది. అక్టోబరు నుంచి ఉగ్ర సంస్థ చెరలో ఉన్న వీరికి అర్జెంటీనా పౌరసత్వం కూడా ఉంది. ముందుగా తమ భద్రతా బలగాలకు మద్దతుగా అపార్ట్‌మెంట్ సమీపంలో ఇజ్రాయెల్ భారీఎత్తున వైమానిక దాడులకు దిగింది. ఆ ప్రాంతం అంతటా మంటలు చెలరేగగా.. ఇజ్రాయెల్ దళాలు అపార్ట్‌మెంట్ రెండో అంతస్తు అద్దాలను పగులగొట్టి లోపలకు ప్రవేశించాయి. ఈ క్రమంలో సాయు.ధ ఉగ్రవాదుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. వారిని హతమార్చి మృతదేహాలను రక్షణ కవచంగా వాడుకుంటూ బందీలను బయటకు తీసుకొచ్చాయి. నవంబరులో ఇజ్రాయెల్ ఇలానే తమ మహిళా సైనికురాలిని విడిపించుకెళ్లింది. కాగా, తాజా దాడిలో 67 మంది ప్రాణాలు కోల్పోయారని పాలస్తీనా ఆరోగ్య శాఖ ప్రకటించింది. డజన్లకొద్దీ బాంబులు వేశారని, భవనాల శిథిలాల నుంచి ప్రజలను కాపాడేందుకు చర్యలు ముమ్మరం చేశామని తెలిపింది. రఫాలోని ఆస్పత్రిలోనే 50 పైగా మృతదేహాలు ఉన్నాయని పేర్కొంది. 4 నెలలుగా సాగుతున్న పోరులో ఇప్పటికీ 100 మందిపైగా వ్యక్తులు హమాస్ చెరలో ఉన్నారు. రఫాను హమాస్‌ల చివరి స్థావరంగా ఇజ్రాయెల్ పేర్కొంటోంది. దాడులు తీవ్రం చేస్తామని.. అక్కడినుంచి వెళ్లిపోవాలని ఇటీవల ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రజలను కోరారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత పరిణామం యుద్ధంలో ఆ దేశానిది కాస్త పైచేయి అనేందుకు అవకాశం కల్పించింది. కాగా, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆదివారం నెతన్యాహుకు ఫోన్ చేశారు. ప్రజల ప్రాణాలకు ముప్పులేదని భావించే అత్యంత కచ్చితమైన ప్రణాళిక ఉంటేనే తప్ప రఫాపై దాడులకు దిగొద్దని కటువుగా చెప్పారు.

ఆ జర్నలిస్టు.. హమాస్ ఉగ్రవాది

గాజా నుంచి రోజువారీ యుద్ధం వివరాలు వెల్లడిస్తున్న అల్ జజీరా చానెల్‌కు చెందిన ప్రముఖ జర్నలిస్టు మొహమ్మద్ వాషా హమాస్ (32) ఉగ్రవాది అని ఇజ్రాయెల్ ఆరోపించింది. పగటి వేళ జర్నలిస్టుగా బాధ్యతలు నిర్వరిస్తూ రాత్రిళ్లు ఉగ్ర సంస్థ కమాండర్‌గా వ్యవహరిస్తున్నాడని పేర్కొంది. ఉత్తర గాజాలో తమ దాడుల్లో వాషా ల్యాప్‌టాప్, ఫొటోలు దొరికాయని.. అతడు హమాస్ ట్యాంక్ విధ్వంసక వ్యవస్థలో పనిచేస్తున్నాడని తెలిపింది. వాషా 2022 చివరి నుంచి ఆయుధ తయారీలో పాలుపంచుకుంటున్నాడని పేర్కొంది.

సామాజిక న్యాయానికి చోటేలేదు

- వైసీపీ పాలనలో అది నేతి బీరకాయలో నెయ్యి చందం
- జగన్ ఒంటెద్దు పోకడలు ఎక్కువయ్యాయి
- రాజధాని లేని దౌర్భాగ్య స్థితిలో రాష్ట్రం
- బీసీలకు ఇచ్చిన పదవులన్నీ పవర్‌లేనివే
- ఆత్మగౌరవం కోసం పోరాటం చేయాల్సిన దుస్థితి: ఎమ్మెల్సీ జంగా

గుంటూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) 'ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిత్యం ఉచ్చరించే సామాజిక న్యాయం అనే పదానికి వైసీపీ హయాంలో చోటే లేదు. నేతి బీరకాయలో నెయ్యి ఎంత నిజమో... సీఎం జగన్ సామాజిక న్యాయం అంతే నిజం' అంటూ వైసీపీ ఎమ్మెల్సీ, బీసీ సాధికారిక కమిటీ చైర్మన్‌గా వ్యవహరించిన జంగా కృష్ణమూర్తి యాదవ్ మండిపడ్డారు. కొద్ది రోజులుగా ఆ పార్టీ తీరును నిరసిస్తూ దూరంగా ఉంటున్న జంగా సోమవారం ఓ వీడియో విడుదల చేశారు. ఇది సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఇప్పటి వరకు గురజాల ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తీరుపై మాత్రమే మండిపడుతూ వచ్చిన జంగా... ఈ వీడియోలో నేరుగా సీఎం జగన్‌పైనే తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 'వైసీపీలో జగన్ ఒంటెద్దు పోకడలు ఎక్కువయ్యాయి. రాజధాని లేని దౌర్భాగ్య స్థితిలో మన రాష్ట్రం ఉంది. రాష్ట్ర జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలకు జగన్ హయాంలో సరైన న్యాయం జరగలేదు. నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీలని మాట్లాడుతున్నారే తప్ప వారి మనోభావాలను ఏనాడూ అర్థం చేసుకోలేదు. బీసీలకు తాత్కాలికంగా కొన్ని పదవులు ఇచ్చి, వారికి సామాజిక న్యాయం చేసేశామని గొప్పలు చెప్పుకోవడం తప్ప ఆచరణలో అది నిజం కాదు. రాష్ట్రంలో ఉన్న 131 బీసీ కులాల వార ం ఆనాడు జగన్‌ను నమ్మాం. అతను అధికారంలోకి వచ్చాక వారికి సరైన న్యాయం జరగలేదు. ఇచ్చిన కొద్దిపాటి పదవులు పవర్ లేనివే. రాష్ట్రంలో 56 కులాలకు కార్పొరేషన్లను ఏర్పాటు చేసిన జగన్ ఇప్పటివరకూ ఒక్క చైర్మన్‌ను కూడా కలిసిన దాఖలాల్లేవు. అసలు ఆ కార్పొరేషన్లకు నిధులే లేవు. సామాన్యులు, బడుగూ బలహీన వర్గాలు వారు విదేశీ విద్యను అందుకునేందుకు వీలైన సహాయాన్ని కూడా జగన్ ప్రభుత్వం అందించలేకపోయింది. జగన్ హయాంలో బీసీలకు కనీసం మాట్లాడే హక్కు కూడా లేకుండా పోయింది. జగన్ హయాంలో బీసీలు అనేక అవమానాలకు గురౌతున్నారు. వైసీపీలో బీసీలకు సరైన గౌరవం దక్కక ఎంతోమంది బీసీ నాయకులు దూరం అవుతున్నారు. ఈరోజు బీసీలు సంక్షేమ పథకాల కోసమో, ఆర్థిక వనరుల కోసమో కాదు... ఆత్మగౌరవం కోసం పోరాడాల్సిన దుస్థితి. బీసీలకు పదవులివ్వటం కాదు... వారికి అధికారం కూడా ఇవ్వాలి' అని కృష్ణమూర్తి డిమాండ్ చేశారు.




ప్రమాదంలో నుజ్జయిన బొలెరో వాహనం

వివాహానికి వెళ్లొస్తూ.. తిరిగిరాని లోకాలకు

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం.. 23 మందికి గాయాలు
- శ్రీసత్యసాయి జిల్లాలో ఘోర ప్రమాదం

అగళి, ఫిబ్రవరి 12: పెళ్లి బృందం ప్రయాణిస్తున్న వాహనం లారీని ఢీకొనడంతో ముగ్గురు మృతిచెందగా, 23 మంది గాయపడ్డారు. శ్రీసత్యసాయి జిల్లా అగళి మండలం ఇరిగేపల్లి సమీపాన 544-ఇ జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగింది. రొళ్ల మండలం దాసప్పనపాళ్యం గ్రామానికి చెందిన కరియన్న కుమారుడు మంజునాథ్ పెళ్లి కర్ణాటక రాష్ట్రం శిర నియోజకవర్గంలోని మరిడిగుడ్డలో ఆదివారం జరిగింది. దాసప్పనపాళ్యం నుంచి వరుడి తరపున వాహనాల్లో వివాహానికి హాజరయ్యారు. అదేరోజు రాత్రి వధువు స్వగ్రామమైన ఉచ్చుగిర్నహళ్లిలో భోజనాలు ముగించుకుని, స్వగ్రామానికి బొలెరో వాహనంలో 26 మంది తిరుగు ప్రయాణమయ్యారు. అగళి మండలం ఇరిగేపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న సిమెంటు లారీని బొలెరో వాహనం బలంగా ఢీకొంది. దీంతో వాహనం నుజ్జునుజ్జు కాగా, కాంతరాజు(47), అమ్మాజమ్మ(35), గోవిందప్ప(67) అక్కడికక్కడే మృతిచెందారు. 23 మందికి గాయాలయ్యాయి. వీరిలో 18 మందిని వేర్వేరు ఆస్పత్రులకు తరలించారు. మిగిలిన ఐదుగురికి స్వల్ప గాయాలు కావడంతో ఇళ్ల వద్ద చికిత్స పొందుతున్నారు. పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని, మృతదేహాలను మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.



సంపంగిపుట్టు బ్రిడ్జి వద్ద బోల్తాపడిన సర్వీస్ జీపు

జీపు బోల్తా.. ఇద్దరు గిరిజనులు మృతి

- మరో 11 మందికి గాయాలు

చింతపల్లి, ఫిబ్రవరి 12: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం అన్నవరం పంచాయతీ సంపంగిపుట్టు వద్ద జీపు అదుపుతప్పి బోల్తా పడడంతో ఇద్దరు గిరిజనులు మృతిచెందారు. మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. కుడుముసారి పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల గిరిజనులు సోమవారం అన్నవరం వారపు సంతకు వచ్చారు. సరకులు కొనుగోలు చేసుకుని సాయంత్రం స్వగ్రామాలకు సర్వీసు జీపులో తిరుగు ప్రయాణమయ్యారు. అన్నవరం నుంచి 12 మంది గిరిజనులతో తమ్మంగుల బయలుదేరిన జీపు సంపంగిపుట్టు బ్రిడ్జి మలుపు వద్దకు వచ్చే సరికి అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మెరకలు గ్రామానికి చెందిన జర్త చిన్నమ్మ (60) అక్కడికక్కడే మృతిచెందింది. తీవ్రంగా గాయపడిన మిగిలిన వారిని 108లో లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మెరకలు గ్రామానికి చెందిన వంతల అప్పారావు (55) మృతిచెందాడు. గాయపడిన వారికి లోతుగెడ్డ, కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు లక్ష్మీకాంత్, ఎల్.శివప్రసాద్ ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం పీహెచ్‌సీ అంబులెన్స్, 108 వాహనంలో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కేసీఆర్ ఓడిపోతాడని తెలిసే సాగర్ ఆక్రమణ

- జగన్‌తో లాలూచీ పడినందుకు మాజీ సీఎం క్షమాపణ చెప్పాలి
- తెలంగాణ అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ ఫైర్

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలో కంటే కూడా గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనే తెలంగాణకు ఎక్కువ అన్యాయం జరిగిందని ఆ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఆయన సోమవారం అసెంబ్లీలో ప్రసంగించారు. తెలంగాణలో కేసీఆర్ ఓడిపోతున్నారని తెలిసి.. ఆంధ్ర ముఖ్యమంత్రి జగన్ పోలింగ్‌కు ఒకరోజు ముందు నాగార్జున సాగర్‌పైకి 500 మంది పోలీసులను పంపించారని ఆరోపించారు. నాటి నుంచి నేటి దాకా సాగర్ ఆక్రమణపై కేసీఆర్ ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. దీనిని గుర్తించి.. కేంద్రం డిసెంబరు 1న సీఆర్‌పీఎఫ్ బలగాలను పంపించిందని తెలిపారు. కృష్ణా ప్రాజెక్టులను అప్పగించేదాకా యథాతథ స్థితిని కొనసాగించాలని తెలంగాణ సీఎంవో కార్యదర్శి, నీటిపారుదల శాఖ ఇన్‌చార్జి కార్యదర్శి స్మితా సబర్వాల్ లేఖ రాశారని గుర్తు చేశారు. జనవరి 17న ఢిల్లీలో జరిగిన భేటీలో ప్రాజెక్టులను అప్పగించడానికి తాము అంగీకరించామనే మాటల్లో వాస్తవం లేదని, మినిట్స్‌పై ఎలాంటి సంతకాలు చేయలేదని స్పష్టం చేశారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● మంగళవారం 13 ఫిబ్రవరి 2024

హైదరాబాద్‌లోని డా. బీ.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ(బీఆర్ఏఓయూ)- 2024 జనవరి సెషన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల్లో పలు స్టడీసెంటర్లు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు తమకు అనువైనదాన్ని ఎంచుకోవచ్చు.

అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో అకడమిక్ కోర్సులు

డిగ్రీ

- బీఏ, బీకాం, బీఎస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో కోర్సు వ్యవధి మూడేళ్లు. బీఏ, బీకాం కోర్సులకు ఏదేని గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీలో ప్రవేశానికి ఇంటర్(సైన్స్) గ్రూపు అభ్యర్థులు అర్హులు. ఏపీ/తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ లేదా నేషనల్ ఓపెన్ స్కూల్ నుంచి ఇంటర్ ఉత్తీర్ణులు; పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ మాధ్యమాల్లో ఒకటి ఎంచుకోవాలి.
- బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(బీఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. దీనిని తెలుగు/ఇంగ్లీష్ మాధ్యమంలో చదువుకునే వీలుంది. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు రికార్డు అసిస్టెంట్‌గా ఏడాది అనుభవం లేదా డిప్లొమా/సర్టిఫికెట్ కోర్సు(లైబ్రరీ సైన్స్) పూర్తిచేసినవారు; ప్రొఫెషనల్ డిగ్రీ(లా/ఇంజనీరింగ్/ఫార్మసీ) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. డిగ్రీ స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి.

పీజీ

- ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో కోర్సు వ్యవధి రెండేళ్లు. ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంఏ(జర్నలిజం) ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో; లాంగ్వేజ్ ప్రోగ్రామ్‌లు మినహా అన్నింటినీ తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.
- **ఎంఏ స్పెషలైజేషన్‌లు:** జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, ఉర్దూ.
- **ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు:** మేథమెటిక్స్, అప్లయిడ్ మేథమెటిక్స్, సైకాలజీ, బోటనీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫిజిక్స్, జువాలజీ.
- **అర్హత:** ద్వితీయశ్రేణి మార్కులతో సంబంధిత డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. లాంగ్వేజెస్‌లో ఎంఏ కోర్సుకు డిగ్రీలో సంబంధిత లాంగ్వేజ్‌ని సెకండ్ లాంగ్వేజ్‌గా చదివి ఉండాలి. ఎంకాం కోర్సుకు బీబీఏ/బీబీఎం/బీఏ(కామర్స్) అభ్యర్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ(మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్) కోర్సుకు బీఈ/బీటెక్ అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ సైకాలజీకి ఏదేని డిగ్రీ పాసైతే చాలు.
- మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(ఎంఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. ఇంగ్లీష్ మాధ్యమంలో మాత్రమే ఈ కోర్సు ఉంది. కనీసం 40 శాతం మార్కులతో బీఎల్ఐఎస్సీ పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ డిప్లొమా

- కోర్సు వ్యవధి ఏడాది. ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. చార్టర్డ్ అకౌంటెన్సీ/కాస్ట్ అకౌంటెన్సీ/కంపెనీ సెక్రటరీ కోర్సులు పూర్తిచేసిన వారు కూడా అర్హులే.

డిప్లొమా

- కోర్సు వ్యవధి ఏడాది. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **స్పెషలైజేషన్‌లు:** సైకలాజికల్ కౌన్సెలింగ్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, రైటింగ్ ఫర్ మాస్ మీడియా ఇన్ తెలుగు, హ్యూమన్ రైట్స్, కల్చర్ అండ్ హెరిటేజ్ టూరిజం, ఉమన్ స్టడీస్.
- రైటింగ్ ఫర్ మాస్ మీడియా ఇన్ తెలుగు విభాగానికి మాత్రం ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు మాస్ మీడియాలో కనీసం మూడేళ్ల అనుభవం ఉన్న అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. సైకలాజికల్ కౌన్సెలింగ్ విభాగానికి(డిగ్రీ/ఎంఏ/ఎమ్మెస్సీ)(సైకాలజీ) పూర్తిచేసినవారు మాత్రమే అప్లయ్ చేసుకోవాలి.

సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు

- కోర్సు వ్యవధి ఆర్నెల్లు. విభాగాన్ని అనుసరించి పదోతరగతి/ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులు.
- **విభాగాలు:** ఫుడ్ అండ్ న్యూట్రిషన్, లిటరసీ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, ఎన్‌జీఓస్ మేనేజ్‌మెంట్, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్.
- ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ కోర్సును ఇంగ్లీష్ మాధ్యమంలో, మిగిలినవాటిని తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **వెబ్‌సైట్:** www.braouonline.in



ఆర్‌జీఐపీటీలో ఎంబీఏ

అమేథీలోని రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం టెక్నాలజీ(ఆర్‌జీఐపీటీ)కి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(డీఓఎంఎస్)- ఎంబీఏ, ఎంబీఏ(బిజినెస్ అనలిటిక్స్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. జాతీయ పరీక్ష స్కోర్ ఉన్నవారు, లేనివారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. నిర్దేశిత వెయిటేజీ ప్రకారం ప్రవేశాలు కల్పిస్తారు. పార్ట్ టైం ప్రోగ్రామ్, స్పాన్సర్డ్ కేటగిరీ అడ్మిషన్స్ కూడా ఉన్నాయి.

ఎంబీఏ

స్పెషలైజేషన్‌లు: ఎనర్జీ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్.

అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో పదోతరగతి, ఇంటర్, ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. క్యాట్ 2023/ జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎక్స్ఏటీ) 2024/సీమ్యాట్ 2024/జీమ్యాట్ 2022/జీమ్యాట్ (2023/2024)/మ్యాట్ 2024 అర్హత పొంది ఉండాలి. ఈ అర్హత లేని పక్షంలో పదోతరగతి, ఇంటర్, డిగ్రీ స్థాయుల్లో కనీసం 65 శాతం మార్కులు ఉండాలి.

ఎంబీఏ(బిజినెస్ అనలిటిక్స్)

ఇది మల్టీ డిసిప్లినరీ ప్రోగ్రామ్. ఇందులో అనలిటికల్ టూల్స్, టెక్నిక్స్, మెథడాలజీలకు సంబంధించిన కోర్సులు ఉంటాయి.

అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో పదోతరగతి, ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతోపాటు బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్ ప్రధాన సబ్జెక్టుగా బీఎస్సీ/బీకాం/బీసీఏ/బీఏ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్ 2023/జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎక్స్ఏటీ) 2024/ సీమ్యాట్ 2024/జీమ్యాట్ (2023/2023)/మ్యాట్ 2024 అర్హత పొంది ఉండాలి. ఈ అర్హత లేని పక్షంలో పదోతరగతి, ఇంటర్, డిగ్రీ స్థాయుల్లో కనీసం 65 శాతం మార్కులు ఉండాలి.

ఎంపిక

- నిర్దేశిత జాతీయ పరీక్షలో అభ్యర్థులు సాధించిన స్కోర్‌కు 65 శాతం, అకడమిక్ ప్రతిభకు 20 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకి 10 శాతం, అనుభవానికి 5 శాతం వెయిటేజీ ఇస్తూ ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.
- జాతీయ పరీక్ష అర్హత లేని పక్షంలో అకడమిక్ ప్రతిభకు 85 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకి 10 శాతం, అనుభవానికి 5 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- పార్ట్ టైం ప్రోగ్రామ్‌లో చేరేవారిని, స్పాన్సర్డ్ అభ్యర్థులను జాతీయ పరీక్ష స్కోర్‌నుంచి మినహాయించారు. వీరికి కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి. వీరు సంస్థ నిర్వహించే ఎబిలిటీ టెస్ట్ రాయాల్సి ఉంటుంది. అకడమిక్ ప్రతిభకు 30 శాతం, అనుభవానికి 15 శాతం, రిటెన్ ఎబిలిటీ టెస్ట్‌నకు 40 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకి 15 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు. వీరు పనిచేస్తున్న సంస్థ నుంచి రికమండేషన్ లెటర్, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, లీవ్ అప్రూవల్ లెటర్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.400; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 1
- **పర్సనల్ ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఏప్రిల్ 5న
- **ఆన్‌లైన్ పర్సనల్ ఇంటర్వ్యూలు:** ఏప్రిల్ 8, 9
- **ప్రోగ్రామ్‌నకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఏప్రిల్ 15న
- **అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** ఏప్రిల్ 26
- **తరగతులు ప్రారంభం:** జూలై 29 నుంచి
- **వెబ్‌సైట్:** rgipt.ac.in



ఐరాసలో సంస్కరణలు
అవరోధాలు-పరిష్కారాలు


(నిన్నటి తరువాయి)

భారత్-భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వానికి కృషి

ప్రపంచంలో అత్యధిక జనాభా గల దేశం భారత్. పటిష్ఠ అతిపెద్ద ప్రజాస్వామ్యయుత దేశం. ప్రపంచంలో 5వ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఉంది. ఐక్యరాజ్య సమితి పీస్ కీపింగ్ ఫోర్స్‌లోనూ ఇతర సహాయ దళాల్లోనూ, అనేక ఒప్పందాల్లోనూ భారత్ సుదీర్ఘ భాగస్వామిగా సేవలందిస్తోంది. ఈ నేపథ్యంతోనే భద్రతా మండలిలో శాశ్వత సభ్య హోదాకు కొంతకాలంగా భారత దేశం ప్రయత్నిస్తోంది. భారత్ గతంలో ఎనిమిదిసార్లు భద్రతా మండలిలో తాత్కాలిక సభ్యదేశంగా సేవలందించింది. ఆసియా-పసిఫిక్ కేటగిరీ నుంచి ఎన్నికైనప్పుడు 192కి 184 ఓట్లు సాధించింది. ఆ భారీ గెలుపు భారత్‌కు గల ప్రపంచ దేశాల మద్దతును మరోసారి ప్రతిఫలించింది. అయితే భద్రతా మండలిలో భారత్ శాశ్వత సభ్యత్వానికి పీ-5 దేశాలైన అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్ మద్దతు ప్రకటిస్తున్నప్పటికీ, చైనా అనేకసార్లు మోకాలు అడ్డుపెట్టింది.

భద్రతామండలిలో సంస్కరణల అవసరం

1. భద్రతామండలి ఏర్పాటైన తరవాత కేవలం 1963లో ఒక్కసారే విస్తరించారు. అది కూడా కొత్తగా నాలుగు తాత్కాలిక సభ్యదేశాలకు ఈ విస్తరింపు పరిమితమైంది. శాశ్వత సభ్యదేశాల సంఖ్యలో ఎలాంటి మార్పు లేదు.
2. భద్రతామండలి శాశ్వత సభ్య దేశాలుగా కేవలం కొన్ని ప్రాంతాలకు మాత్రమే ప్రాతినిధ్యం లభించింది. అన్ని ప్రాంతాలకు సమ ప్రాతినిధ్యం లేదు. లాటిన్ అమెరికా, ఆస్ట్రేలియా, ఆఫ్రికా వంటి కొన్ని ఖండాలకు సైతం ప్రాతినిధ్యం దక్కలేదు. అదేవిధంగా ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన భారత్, పీ-5 దేశాలతో అన్నివిధాలా సమఉజ్జీలైన జపాన్, జర్మనీ వంటి దేశాలకూ భద్రతా మండలిలో శాశ్వతస్థానం విస్తరించలేదు.
3. కేవలం రెండో ప్రపంచయుద్ధ విజేతలనే కారణంతో, అణ్వాయుధశక్తి గల దేశాలన్న స్థాయితో మాత్రమే అప్పుడు పీ-5 దేశాలకు శాశ్వత సభ్యత్వం దక్కింది. కానీ ప్రపంచ పరిస్థితుల్లో మార్పులు చోటు చేసుకున్న ఇంత సుదీర్ఘకాలం తరవాత కూడా అధికారం ఆ కొద్ది దేశాల చేతిలోనే కేంద్రీకృతమవడం ఏమంత ప్రజాస్వామికం కాదు. పైగా ఇప్పటికే అవి తమ వీటో పవర్‌ను తమ స్వలాభాలకు, రాజకీయ వ్యూహాత్మక లక్ష్యాల కోసం వినియోగిస్తున్నాయి.
4. భద్రతామండలి విస్తరణ లేకపోవడం, అధికారం కేంద్రీకృతం అవడం వల్ల ప్రపంచవ్యాప్తంగా దీనికి ప్రత్యామ్నాయంగా అనేక దేశాలు కలిసి ఇప్పటికే సైనిక, ఆర్థిక, వ్యూహాత్మక సహకారాల కోసం వివిధ కూటములను ఏర్పాటు చేసుకున్నాయి. ఈ చర్యల ఫలితంగా భద్రతామండలి ప్రాబల్యం క్రమంగా తగ్గిపోయి అది ఒక క్రియాశూన్య సంస్థగా పరిణమించే అవకాశాలు లేకపోలేదు.
5. టెర్రరిజం, సైబర్ భద్రత, ప్రాదేశిక జలాలకు వెలుపల ఉన్న సముద్ర ప్రాంతంపై అజమాయిషీ, వాతావరణ మార్పులపై క్రియా విధానాలు వంటి కొన్ని నేటి ప్రధాన సమస్యలపై పటిష్ఠ విధానాలను అమలుచేయడంలో ఐక్యరాజ్య సమితి భద్రతామండలి విఫలమైంది. అత్యధిక వాతావరణ కాలుష్యానికి కారణమవుతున్న దేశాలు, సముద్రాల్లో వ్యూహాత్మకంగా ఆక్రమణ చేపడుతోన్న దేశాలు, సైబర్ దాడులను ఆయుధాలుగా వినియోగిస్తున్న దేశాలు భద్రతామండలిలో శాశ్వత సభ్యదేశాలుగా ఉండటంతో అవి తమ ప్రయోజనాలకు భంగం కలిగేలా ఎలాంటి సంస్కరణలకూ పూనుకోవడం లేదు. ఇది భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వ విస్తరణ అవసరాన్ని తెలుపుతోంది.



6. చైనా వంటి శాశ్వత సభ్యదేశాలు తమ చేతుల్లో కేంద్రీకృతమైన అధికారాన్ని వదులుకోవడానికి ఇష్టపడటం లేదు. శాశ్వత సభ్యదేశాల విస్తరణను వీటో పవర్‌తో అడ్డుకుంటున్నాయి. అందువల్ల వీటో పవర్‌కు సంబంధించి సైతం కుదింపులు, సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉంది.
7. ఉత్తర-దక్షిణార్ధగోళ భౌగోళికతల పరంగానూ భద్రతామండలి శాశ్వత సభ్యత్వం కేంద్రీకృతంగానే ఉంది. దక్షిణార్ధగోళానికి ఎలాంటి ప్రాతినిధ్యం దక్కడంలేదు.
8. భద్రతామండలి శాశ్వత సభ్యదేశాలు రెండు కూటములుగా(అమెరికా దాని మిత్రదేశాలు వర్సెస్ రష్యా, చైనా)గా మోహరించి పరస్పర వ్యతిరేక ఎజెండాలను ఆశ్రయిస్తున్నాయి. అందువల్ల భద్రతామండలిపరంగా ఎలాంటి సకారాత్మక చర్యలూ పట్టాలకెక్కడంలేదు. ఈ వైరుధ్యాల స్థానంలో సహకారం, సమతౌల్యతలను తీసుకురావడానికి, బాధ్యతాయుత ప్రవర్తనకూ భద్రతామండలి శాశ్వత సభ్యత్వ విస్తరణ, వీటో అధికారాల్లో సంస్కరణ అవసరం.

భారత్‌కు శాశ్వత సభ్యత్వం వల్ల ప్రయోజనాలు

- శాంతి సామరస్యాలు కోరుకొనే భారతదేశం - ఉగ్రవాదం, అక్రమ చొరబాట్లు, అంతర్జాతీయ సముద్ర జలాల భద్రత, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలు, ఇండో పసిఫిక్ ప్రాంతంలో చైనా ఆధిపత్య ధోరణి, కరోనా వైరస్ వంటి జీవాయుధాల సృష్టి, అంతర్జాతీయంగా కమ్ముకుంటున్న యుద్ధ పరిస్థితులు వంటి అనేక సమస్యలపరంగా భద్రతామండలి పటిష్ఠ చర్యలు తీసుకొనేవిధంగా అంతరంగిక ఒత్తిడి తీసుకురావచ్చు.
- భారత్ వంటి తటస్థ దేశం భద్రతామండలి శాశ్వత సభ్యత్వం, వీటో అధికారాలను కలిగి ఉండటం ద్వారా పీ-5 దేశాల నిర్ణయాల్లో ఆశ్రితపక్షపాతం, స్వప్రయోజనాలను నిలువరించవచ్చు.
- భారత్‌కు ప్రాతినిధ్యం దక్కడం ద్వారా ప్రపంచంలో 17.50% ప్రజలకు ప్రాతినిధ్యం దక్కినట్లవుతుంది.
- పాకిస్థాన్, చైనా వంటి సరిహద్దు దేశాల చొరబాట్లను, దుశ్చర్యలను మరింత సమర్థంగా నిలువరించే స్థాయి భారత్‌కు వస్తుంది.
- ఇప్పటికే ఐక్యరాజ్యసమితికి చెందిన అనేక ఒప్పందాల్లో, పీస్ కీపింగ్ మిషన్‌లో భాగస్వామిగా విస్తృత సేవలు అందిస్తున్న భారత్ మానవాళి సంక్షేమానికి వాటిని మరింత విస్తృతంగా చేపట్టవచ్చు.

భారత్ శాశ్వత సభ్యత్వానికి, భద్రతామండలి సంస్కరణలకు గల ప్రతిబంధకాలు

- కాంప్రహెన్సివ్ టెస్ట్ బ్యాన్ ట్రీటీ(సీటీబీటీ), న్యూక్లియర్ నాన్ ప్రొలిఫిరేషన్ ట్రీటీ(ఎన్‌పీటీ) వంటి ఒప్పందాలపై భారత్ సంతకం చేయకపోవడాన్ని చైనా వంటి దేశాలు ఒక సాకుగా చూపడం.
- భద్రతామండలికి సంబంధించి ఏ సంస్కరణలు తీసుకురావాలన్నా యూఎన్ చార్టర్ 'ఆర్టికల్ 108'లో చెప్పినవిధంగా ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను సవరించాల్సి ఉంటుంది. దీని ప్రకారం ఏ సంస్కరణనైనా కనీసం 2/3వ వంతు ఐక్యరాజ్యసమితి

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

సభ్యదేశాలు ఆమోదించాల్సి ఉంటుంది. అదేవిధంగా అన్ని శాశ్వత సభ్యదేశాలూ ఏకగ్రీవంగా ఒప్పుకోవాల్సి ఉంటుంది. ఏ ఒక్క శాశ్వత సభ్యదేశమైనా ఒప్పుకోకుండా వీటో అధికారాన్ని ప్రయోగిస్తే అలాంటి సంస్కరణలు పట్టాలకెక్కవు. కాబట్టి ఈ సంస్కరణలకు పీ-5 దేశాల వీటో అధికారం ప్రధాన అవరోధంగా ఉంది.

- అంతర్జాతీయ వ్యవహారాలు, తీర్మానాలు, ఆంక్షలు, సైనిక చర్యలపరంగా శాశ్వత సభ్యదేశాలు తమకే దత్తం అయిన ప్రత్యేక అధికారాల కట్టడికి, పంపకానికి అంగీకరించడం లేదు.
- తనకు సమ ఉజ్జీగా నిలువ గల భారత్‌కు తనతో సమానంగా శాశ్వత సభ్యదేశ హోదా, తద్వారా వీటో అధికారం లభించడం చైనాకు సుతరామూ ఇష్టంలేక భారత్ ప్రయత్నాలకు గండికొడుతోంది.

భారత్ కింకర్తవ్యం, ముందున్న ప్రత్యామ్నాయాలు

1. భారత్ సభ్యదేశంగా ఉన్న అనేక కూటముల ద్వారా భద్రతామండలి సంస్కరణల ఆవసరాలపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెంచి, ఒత్తిడి తీసుకురావడం.
2. భద్రతామండలి, ఐక్యరాజ్యసమితికి ప్రత్యామ్నాయ ప్రపంచ కూటమి దిశగా ఆలోచనలు చేస్తున్న భారత్ వంటి దేశాలు వాటిని మరింత ముందుకు తీసుకువెళ్లి ఒక సమగ్ర రూపాన్ని ఇవ్వడం. అయితే భద్రతామండలిలో సంస్కరణలు, భారత్‌కు ఇతర ఆశావహ దేశాలకు శాశ్వత సభ్యత్వం లభించడమనేది ప్రస్తుతమున్న అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో అంత సులువైన పనికాదు. శాశ్వత సభ్యదేశాల అనుచిత వర్గ ప్రయోజన చర్యలు, వ్యూహాత్మక ఎత్తుగడలకు అవి భద్రతామండలిలో తమ అధికారాన్ని వినియోగించడం(ఉదాహరణకు ఇజ్రాయెల్- పాలస్తీనా వివాదపరంగా భద్రతా మండలి ఇజ్రాయెల్‌ను నియంత్రిస్తూ చేసిన రిజల్యూషన్స్‌ను అమెరికా 16సార్లు తన వీటో అధకారం ప్రయోగించడం ద్వారా అడ్డుకుంది) ఒకటి. ఇలాంటి చర్యలను ప్రపంచ దృష్టికి విస్తృతంగా తీసుకురావడం ద్వారా, భద్రతామండలి సంస్కరణలపై ఆలోచనలు రేకెత్తి, భారత్‌కు మార్గం సుగమం అవుతుంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్



బీర్బల్ తెలివి


అక్బర్ ఆస్థానంలో బీర్బల్ గొప్పతనం అందరికీ తెలుసు. ఎంతటి క్లిష్టసమస్యలైనా ఇట్టే పరిష్కరించగల మేధావి. ఏదీ కోప్పడకుండా నవ్వుతో సమస్యను విప్పి చెప్పి అందరినీ నవ్వించే తత్వం అతనిది. దీంతో అతనికి అక్బర్ ఆస్థానంలో మంచి పేరుంది. పైగా చక్రవర్తి అక్బర్ కూడా బీర్బల్‌కు మంచి స్నేహితుడు.

ఒక రోజు అక్బర్ కొలువులో ఉండగా కొందరు పర్షియా సైనికులు వచ్చారు. వారు ఓ ఆహ్వానాన్ని తీసుకొచ్చారు. 'బీర్బల్ మా దేశానికి రావాలి' అని అందులో ఉంది. బీర్బల్ కొలువుకు రాలేదు ఇంకా ఆ సమయంలో. సైనికులను పంపించాడు. ఓ సమస్యను ఊరిలో పరిష్కరిస్తున్న బీర్బల్ దగ్గరకు పోయి సైనికులు విషయం చెబుతూనే హుటాహుటిన బయలుదేరాడు. రాజ్యానికి వచ్చిన తర్వాత విషయం చెప్పారు అక్బర్. అతన్ని అభినందించాడు. పర్షియా చక్రవర్తి పిలుపు వచ్చింది.. ఆయన ఎందుకో నిన్ను తీసుకురమ్మన్నాడట.. మాకూ తెలీదు అన్నాడు అక్బర్.




ఆ సైనికులతో మరుసటి రోజు వస్తానని చెప్పాడు బీర్బల్. అనుకున్నట్లే పర్షియా రాజ్యానికి సైనికులతో వెళ్తానే రాచమర్యాదలు అందాయి. అక్కడి సైనికులు వారి రాజు దగ్గరకు తీసుకెళ్తున్నారు. ఇందులో ఏదో కిటుకు ఉందేమో అనుకున్నాడు బీర్బల్. రాజ్యంలోకి కొలువులోకి వెళ్తానే నీలం రంగు దుస్తుల్లో.. అందునా ఎర్రటోపీల్లో ఉన్నారు. సభలో అంతా ఆశీనులై ఉన్నారు. వంద కుర్చీలకు పైగా రాజులంతా ఒకేలా ఉన్నారు. ఇది కలయా? నిజమా? అనుకున్నాడు.ఆ తర్వాత రాజులు కూర్చున్న వారి సింహాసనాలవైపు చూశారు. అవి అచ్చు అన్నీ అలానే ఉన్నాయి. వెంటనే ఓ మంత్రి వచ్చి 'మీరు తెలివైన వారట.. మా రాజును కనుక్కోండి చూద్దాం.. ఈ సభలో' అన్నాడు. 'ఇంతటి మాయా?' అనుకున్నాడు బీర్బల్. సభనంతా తేరిపార చూసి ఓ వ్యక్తి దగ్గరకు వెళ్లాడు. 'జహాపనా.. ప్రణామాలు' అంటూ మూడు సార్లు అన్నాడు. 'మీకెలా తెలుసు' అని చక్రవర్తి అడిగారు. 'తెలిసిపోయింది' అన్నాడు. 'ఇది అసంభవం. అందరం ఒకే దుస్తులు ధరించాం. సింహాసనాలు కూడా ఒకే విధంగా ఉన్నాయి. మీకు ముందే మేము తెలుసా' అన్నాడు అక్కడి చక్రవర్తి. 'ఇది చాలా సులువు జహాపనా. అంతా బావుంది కానీ.. అందరూ మీ వైపు చూస్తున్నారు. మీరే చక్రవర్తినని సులువుగా తెలిసిపోయింది' అన్నాడు. వెంటనే చక్రవర్తి బీర్బల్‌ను అభినందించారు. రాచమర్యాదలతో దగ్గరుండి భోజనానికి తీసుకెళ్లారు. వెయ్యి వరహాలు బహుమతిగా ఇచ్చారు ఆ చక్రవర్తి.

6 తేడాలను గుర్తించండి





సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 228

3		7			6			
8	9		7	1				6
	5			4				
	3	9			5			
		6	4		9	5		
			2			6	3	
				5			8	
5				7	1		4	2
			3			7		5

సుడోకు - 227 సమాధానం

9	7	8	5	2	3	6	1	4
6	2	1	8	7	4	5	3	9
4	5	3	6	9	1	2	8	7
2	8	4	9	6	7	1	5	3
5	6	7	1	3	2	9	4	8
1	3	9	4	5	8	7	2	6
3	9	6	2	8	5	4	7	1
8	1	2	7	4	9	3	6	5
7	4	5	3	1	6	8	9	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.